
# మూసీ

MUSI

• Samputi : 28 • Sanchika : 08 • Pages : 64 • Rs. 20


• June 2025



## కైలాస మందిరము, ఎల్లోరా

Scanned with OKEN Scanner





వ్యవస్థాపకులు
శ్రీ బి.ఎన్.శాస్త్రి

# మూసీ

సాహిత్య
సాంస్కృతిక
చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

సంపుటి : 28 సంచిక : 8
జూన్ - 2025
'విశ్వావసు' జ్యేష్ఠ మాసం

**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
SAGI KAMALAKARA SHARMA

**సహ సంపాదకులు** (ASSOCIATE EDITOR)
డా. దత్తయ్య అట్టెం
Dr. DATTAIAH ATTEM

Printed and Published by
**B. MANOHARI**

*Type Setting at :*
**Kavyasree Graphics**
Ph: 934 797 1177

Printed at : Sri Sai Process
Ph. 27563075

విడిప్రతి : 20/-
సంవత్సర చందా : 200/-
శాశ్వత సభ్యత్వం : 2500/-
(పది సంవత్సరాలు మాత్రమే)

చెక్కులు, డి.డి.లు 'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine) పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : మేనేజర్, మూసీ మాసపత్రిక,
2-2-1109/బికె - ఎల్ఐజి-10,
బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్
- 500 013 .. ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com
website : musimagazine.org

INTERNATIONAL STANDARD SERIAL NUMBER
ISSN 2457-0796

## ఈ సంచికలో ...

### వ్యాసాలు

గ్రంథ పరిష్కరణ - ఆచరించాల్సిన నియమాలు ... డా. టి.ఎస్. వెంకటేశ్ 7
తెలుగు రామాయణములు - అహల్య : తులనాత్మక పరిశీలనము - డా. జి. శ్రీనివాస రావు 13
మాదిగ ఉపకులాలు - సమగ్ర పరిచయం ... డా. పి. హంసమ్మ 17
శ్రీనాథుని ఉద్దండలీల, ఉభయ వాక్ప్రౌఢి : వక్రతా వ్యాపార సమన్వయం ... డా. వేముల శరణ్య 21
యోగ ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్ ... డా. కె. సరితాదేవి 27
తెలుగు సాహిత్య పరిశోధన : శాస్త్రీయ దృక్పథం - ఆవశ్యకత, ఆచరణ ... డా. వెంకటరామయ్య గంపా 30
కైరం భూమదాసు వ్యక్తిత్వం - సాహిత్యం ... డా. వి. స్రవంతి 36
మలుపు తిరిగిన రథచక్రాలు' నవల - తెలంగాణ నగర జీవన చిత్రణ ... పల్లె సతీష్ 39
రామదాసు, బుచ్చిదాసు సంకీర్తనల్లో - తత్త్వం ... డా. మంత్రి శ్రీనివాస్ 43
బతుకు మూలాలను మరువని కవిత్వం 'గూడశాట' ... డా. ఎస్. రఘు 45
నీతి శాస్త్రము - తాళపత్ర గ్రంథము... డా. గంధ్ర లక్ష్మణరావు 48
గురజాడ తీర్చిన - స్త్రీ పాత్రల చైతన్యం ... డా. లక్ష్మణ్ 52

### కవితలు

సిందూర చైతన్యం ... డా. ఒజ్జల శరత్ బాబు - 5; తుకారాం అభంగం ... డా. మంత్రి శ్రీనివాస్ - 6; పిపీలికం ... డా. ఎన్. గోపి - 16; నేను మీ నాన్నను ... డా. మహమ్మద్ హసన్ - 20; కాలగమనం - కవితల జననం ... గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్ - 25; ఇద్దరి పుట్టుక ... ఉదారి నారాయణ - 38; బందీలు ... డా. ముత్యంపేట గంగాధర్ - 56; విజయమో! వీర స్వర్గమో! ... డా. గన్నోజు శ్రీనివాసాచార్య

### సమీక్షలు

తెలంగాణ పల్లె బతుకు ముఖచిత్రం 'బర్కతి' కథలు ... బైరెడ్డి కృష్ణారెడ్డి - 57
అధివాస్తవిక ఛాయలు కమ్ముకున్న 'రెండు ప్రేమల నావ' కవిత్వం ... బండారి రాజ్ కుమార్ - 59

❖ ❖ ❖ ❖ ❖

**ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**

***Printed, Published and Owned by :***
**B. MANOHARI,** 2-2-1109/BK-LIG-10, Bathukamma Kunta, Bagh Amberpet, Hyderabad - 500 013. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad -13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma.** **RNI No. 37723/80**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2025

## సంపాదకీయం







వ్యక్తి శక్తి కావాలి

మనిషి మనీషి కావాలి

మానవుడు
మహనీయుడు కావాలి

ఉన్న స్థానం నుండి
ఉన్నత స్థానానికి చేరాలి

పరిమితుడు
అపరిమితుడు కావాలి

స్థాయి విస్తరించాలి


దైవత్వం మేల్కొనాలి

తనను తాను నిరంతరం
ఉద్ధరించుకోవాలి

అందరికీ ఆదర్శంగా
ఆమృతమూర్తిగా
మారాలి

**నీలో దీపం వెలిగించు**
**నీవే వెలుగై వ్యాపించు**





# భద్రత

భందంతే భద్రం. భది కల్యాణే సుఖేచ – కల్యాణమైనది. కల్యాణ స్వరూపమైనది భద్రత. భద్ర శబ్దం వైదిక సాహిత్యం నుండి మనకు కనిపిస్తుంది. (భద్రం కర్ణేభిః శ్రుణుయామ దేవాః..) దేవతా మూర్తులకు కూడా భద్ర శబ్దం ఉంది. వీరభద్ర, రామభద్ర, భద్రకాళి మొదలైనవి. వీటికి అనుగుణంగా వ్యక్తులు కూడా తమ నామధేయాలకు ముందు వెనుక భద్ర శబ్దాన్ని పెట్టుకోవడం పరిపాటి. భద్రాచలమే మనకు పర్వత స్వరూపంగా దర్శనమిస్తూనే ఉంది.

భద్ర అన్ని వ్యవహారాలకు సంబంధించినదే. అయినా కొన్ని చోట్ల ప్రత్యేకంగా గుర్తింపులోకి వస్తుంది. దీనికి వికృతి లాంటిదే 'పదిలం' అనే శబ్దం. ఇదే 'పైలం'గా మారింది. జాగ్రత్త అని సూచించడానికి 'పైలం' అని నిత్యజీవితంలో ఉపయోగిస్తూనే ఉంటారు. దైవ వ్యవహారాల నుండి వ్యక్తి, సమాజ వ్యవహారాలన్నింటిలోనూ తప్పనిసరి అవసరమైన అంశం ఈ 'భద్రత'.

కనిపిస్తున్న వస్తుజాలం భద్రంగా ఉండాలంటే దానిని నిర్వహించేవానిపై ఆధారపడి ఉంటుంది. కార్ బాగా ఉండాలంటే దాని డ్రైవర్‌పైన ఆధారపడి ఉంటుంది. ఇల్లు బాగా ఉండాలంటే ఇంటిని నిర్వహిస్తున్నవానిపై ఆధారపడి ఉంటుంది. ఆరోగ్య భద్రత కావాలంటే ఆ యా వ్యక్తుల రోగ నిరోధక శక్తిపై ఆధారపడి ఉంటుంది. ఈ శక్తి లేకుంటే దేహారోగ్యం ఇబ్బంది పడినట్లే, గృహారోగ్యం, వాహనారోగ్యాలు కూడా నిర్వహించేవాని లోపాల వల్ల, బలహీనతల వల్ల ఇబ్బంది పడతాయి. నిర్ణయాలు కఠినంగా తీసుకునే నిర్వాహకుని వల్ల తమకు తాము ఉపకరించుకోవడమే కాకుండా పక్కవారికి, సమాజానికి కూడా తప్పనిసరిగా వినియోగపడుతూనే ఉంటారు.

అన్ని అంశాల్లోనూ ప్రస్తుతం 'భద్రత' అనే అంశం ప్రచారంలో ఉన్నా దానిని మనం పెద్దగా పట్టించుకోము. రోడ్డు భద్రత, ఆరోగ్య భద్రత, ఆహార భద్రత వంటి పదాలే ఇందుకు సాక్ష్యం. భద్రత అంతర్గత చైతన్యానికి సంబంధించిన అంశం. మనస్సు చైతన్యంతో కలిసి ఉంటే వ్యక్తికి శక్తి పెరిగి భద్రత లభిస్తుంది. మనస్సు లోకంతో కలిసి ఉంటే మూలం నుండి దూరం కావడం వల్ల శక్తి తగ్గి భద్రత లోపిస్తుంది. నిరంతరం మనకు భద్రతను ఇచ్చే శక్తి వైపు దృష్టి సారించడం వల్లనే జీవన ప్రమాణం పెరుగుతుంది. అటువంటి వారే తాము క్షేమంగా ఉంటూ, లోకక్షేమాన్ని కోరుకుంటూ ఉంటారు. తమకే భద్రత లేని సందర్భంలో మరొకరి క్షేమాన్ని కోరుకునే అవకాశాలే ఉండవు. అందుకే వ్యక్తి చైతన్యం, విశ్వచైతన్యంతో కలిసి ఉండడం కోసం ప్రయత్నిస్తే అన్ని రకాల భద్రతలు సమకూరుతాయి. దూరమైతే అన్నింటికీ దూరమవుతూనే ఉంటారు.

దేహానికి భద్రత ఎటువంటిదో, దేశానికి కూడా భద్రత అవసరమే. దేశభద్రత కూడా అంతర్గత వ్యవహారాలు, బహిర్గత వ్యవహారాలు, నిర్వహించేవానిపై ఆధారపడి ఉంటుంది. నిర్వాహకుడు బలమైన వాడైతే భద్రత ఎప్పటికీ ఉంటుంది. నిర్వాహకుడు బలహీనుడైతే ఆత్మరక్షణకోసం ఎప్పటికీ కష్టపడాల్సి వస్తూనే ఉంటుంది.

భద్రుడు శరీరం, మనస్సుల్లోని రక్షణ వ్యవస్థను పెంచినట్లుగా, దేశాధినేతలు దేశంలోని అంతర్గత, బహిర్గత రక్షణలపై దృష్టి కేంద్రీకరించి రక్షణను పెంచాల్సి ఉంటుంది. దక్షతతో సమస్యలను ఎదిరించి నిలవాల్సి వస్తుంది. లోకానికి మార్గం చెప్పాల్సి ఉంటుంది. మార్గనిర్దేశనం చేయాల్సి వస్తుంది. చైతన్య సహకారం వల్ల దేహం దేవాలయంగా మారుతుంది. అనే చైతన్య సహకారం తీసుకునే దేశ నిర్వాహకుల వల్ల దేశం స్వర్ణమయంగా మారి దుర్భేద్యమవుతుంది. భద్రత అన్ని విషయాల్లో, అన్ని వేళల్లోనూ అవసరమే. భద్రునితో నిరంతరం కలిసి ఉండటమే జీవనం.

ISSN 2457-0796


# సిందూర చైతన్యం



కంఠము గద్గదంబవగ గాత్రము హెూమపు జ్వాలవన్నిటన్
కుంఠన మన్నదే కనము కుత్రలు లేవిట జెప్పి తుచ్ఛమౌ
కంఠములన్ తెగన్నరికి కాకుల వేయగ వైరులెల్లయున్
లుంఠనమయ్యి రీగతిన క్రూరులు పాపులు మీకిదే తగున్!

మీ సంతు పెంపుకై మ్లేచ్ఛబుద్ధులు మీరు
హైందవ వనితల బంధమేల
భూమిన యసురులు భూభక్షకులు మీర
పుణ్య భారతమందు పురుడు లేల
వావివరుసలూను పాడి శూన్యులు మీరు
కారుణ్య మనుజుల కలయికేల?
కల్లకపటముతో ఖలులగుదరు మీరు
వసుధైక భావనా వాసమేల!
వీడు యసహన హింస వేల్పు పేర
భరత భువి యెవ్వరికైన భాగ్యమిచ్చి
నిలిపె లేదంటె కాల్చెను వంశమెల్ల
మరొక కాళీయ మాహిషీ మగువ యగుచు!!



వీరగంధమువారమండి యభీర జాతిది కాదులే
కారుకూతల నోరు లేదు స్వగమ్య మార్గము గీతయే
ధీరలక్షణ మేటివారము దేనికైనను సిద్ధమే
పారు మూకల పోరునందు నవార్థి యుప్పెన శౌర్యమే!




చెండాడుట మా హక్కది
నిండారు విషపు జిహాది నేతల విధమున్
దండుగ సహ నమ్మిక సరి
గుండాడటమన జయమున గ్రుంకెను భరతా!

బెదురు తనమేల! మాకని యెదను చీల్చి
మూల వేరునొకింతను గూలవేసె
జయము భారతీయ జవాను జయము జయము
మనదు నాయక మార్గమే మనకు జయము!

డా. ఒజ్జల శరత్ బాబు
ఫోన్ : 99635 33937

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8 6 హైదరాబాద్ జూన్ : 2025

# మూసీ 'వ్యాస' రచయితలకు సూచనలు

మీ వ్యాసాన్ని వర్డ్ (యునికోడ్), పేజిమేకర్ (అను.7)లో టైప్ చేసి editormusi@gmail.com కు మెయిల్ చేయగలరు.

**వ్యాససంగ్రహం – (Abstract) : (200 పదాలకు మించకుండా)**

1. వ్యాససంగ్రహం : 1) రెండు–మూడు వాక్యాల పరిచయం, 2) వ్యాసరచన ముఖ్యోద్దేశం, 3) పరిశోధన ఊహా ప్రణాళిక, 4) అనుసరించిన పరిశోధన పద్ధతులు, 5) ఆశించే ఫలితాలతో కూడిన ముగింపు
2. Keywords : (కనీసం 5 పదాలు) (ఉదా: భాష, సాహిత్యం, ప్రకియలు, శతకం, నీతులు, విశ్లేషణ, అనువాదం, కవిపేరు, పాత్రచిత్రణ.)

**పూర్తి పరిశోధనవ్యాసం (పేజిమేకర్ ఎ4 సైజ్ లో 4-5 పేజీలకు తగ్గకుండా)**

1. **ఉపోద్ఘాతం :** ఒకటి లేదా రెండు పేరాలలో పరిశోధన వ్యాస ముఖ్య ఉద్దేశాన్ని ఉపోద్ఘాతంగా పేర్కొనాలి. కవి/రచయిత పరిచయం, పరిశోధనాంశానికి సంబంధించిన పరిచయవాక్యాలను వ్రాయవచ్చును. పూర్వపరిశోధనలకు సంబంధించిన అంశాలను సంక్షిప్తంగా చర్చించవచ్చును.
2. **విషయం :** పరిశోధనవిలువలుండాలి. సొంతంగా రాసినదై ఉండాలి. యథాతథంగా పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి గ్రహించకూడదు. కొన్ని విభాగాలుగా విభజించుకుని, ఆయా విభాగాలకు అనుగుణమైన ఉపశీర్షికలు (సైడ్ హెడ్డింగ్స్) పొందుపరచాలి. ఎంచుకున్న పరిశోధన సామగ్రి (పుస్తకాల) నుండి పద్యం, కవిత, గేయం, కీర్తన, కథ, నవల, నాటకభాగాలు మొదలైన ఉల్లేఖాలను (references) అనుకరణ చిహ్నాల (“ ”) తో తప్పక ఉటంకించాలి. ఈ ఉటంకింపుల ప్రక్కనే బ్రాకెట్లో తప్పకుండా వాటికి తగిన సూచికలను సంక్షిప్తాక్షరాలలో పొందుపరచాలి. (ఉదా. ఆం.మ. భార. ఆది, ఆశ్వా. 5ప. 235) పేర్కొన్న ప్రతి పద్యం, కవిత, గేయ, వచన భాగాలను చక్కగా, పరిశోధన ధ్యేయం దృష్ట్యా విశ్లేషించాలి.
3. **ముగింపు :** పరిశోధనలో వెలువడిన ఫలితాలను విశ్లేషణాత్మకంగా 'ముగింపు' అన్న శీర్షిక క్రింద పేర్కొనాలి. కవి ఆత్మీయత, శైలి, ఆకర్షణీయాంశాలు, వెలువడిన క్రొత్త విషయాలు, రచన సామాజిక ప్రయోజనం, భాషాసాహిత్యాలకు పరిపుష్టిని చేకూర్చే కావ్య, వ్యాకరణ, అలంకారాది అంశాలు, ప్రత్యేకతలు మొదలైనవి రెండు–మూడు పేరాలుగా ముగింపులో పేర్కొనవచ్చు.
4. **ఉపయుక్త గ్రంథసూచి :** ముగింపు తరువాత ఆధారగ్రంథాలన్నింటికీ ఉపయుక్తగ్రంథసూచిని తప్పక పొందుపరచాలి. (రచయితపేరు, ఇంటిపేరు. గ్రంథం పేరు, ప్రచురణ సంవత్సరం, ప్రచురణ స్థలం, ప్రచురణసంస్థ) సంకలనగ్రంథాలకు సంపాదకుడి పేరు పేర్కొనాలి. పత్రికావ్యాసాలు, బ్లాగ్, వెబ్సైట్లకు పూర్తివివరాలు తెలపాలి. ఉదా :

1. కమలాకర శర్మ, సాగి. సంపా. **'కదంబం'** (తెలుగు సాహిత్య ప్రక్రియలు – రూపాలు). 2014. హైదరాబాద్ : మూసీ ప్రచురణలు.
2. రఘునాథ శర్మ, శలాక. '**భారత ధ్వని దర్శనము**'. 2000. అనంతపురం : ఆనందవల్లీ గ్రంథమాల.

(సూచనలు పాటించని / పరిశోధనవిలువలు లేని/ పుస్తకాలు, ఇంటర్నెట్ నుండి యథాతథంగా రాసే వ్యాసాలు తిరస్కరించబడతాయి)

## తుకారాం అభంగం

విఠల నామమది సుందరం
విఠల నామమది మధురం
విఠలా నీ దివ్య కీర్తనమును గ్రోలేము
విఠలా నీ మహిమల మైమరిచేము

పడనీయకుమీ మము క్రోధం
బహుబలీయమైనది కామం
కదలనీయదు కరుణజూపదు
కఠిన కఠోరము ఈ మాయాజాలము
విఠలా చేయందింపుము వేగా
విఠలా విడవకు వినతి వినిరమ్మా!

సాలె గూడును అల్లిన సాలె
చిక్కి వశమై శల్యమయినట్లు
చిక్కితి చిక్కటి చీకటి వలలో
వదలదు మోహము కదలదు శోకము
విఠలా పరుగున రమ్మిక బేగా
విఠలా చేతబట్టి నడిపించుమింకా

తుకారాముడు నీ పాదదాసుడు
పలుకుల పదముల పిలుచుచుండగా
ఆత్మనాథ అరుదెంచు నా దరికి
బంధవిమోచన బంధ విముక్తికి
విఠలా వింటివి నా మొరల నింకా
విఠా దులిపేవు మది మదమునింకా




అనువాదం

డా॥ మంత్రి శ్రీనివాస్
ఫోన్ : 83283 33720

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2025

# గ్రంథ పరిష్కరణ - ఆచరించవలసిన నియమాలు

✍ **డా. టి.ఎస్. వెంకటేశ్,** సీనియర్ ప్రాజెక్ట్ ఫెలో, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు.ఫోన్ : 9989233481

తెలుగుసాహిత్యాన్ని తాళపత్ర రాతప్రతులనుండి అచ్చురూపం లోనికి తీసుకువచ్చే క్రమంలో కొనసాగే ప్రక్రియే గ్రంథ పరిష్కరణ. దీనినే ఆంగ్లంలో"Textual Criticism"అని పిలుస్తారు. గ్రంథపరిష్కరణ, గ్రంథసంశోధనలు రెండూ ఇంచుమించు పర్యాయ పదాలే. ఇది కాలక్రమేణ "గ్రంథపరిష్కార విమర్శ" అనే పేరుతోనూ వ్యవహరింపబడుతోంది. పాశ్చాత్యులు అచ్చుయంత్రం కనుగొన్న తర్వాత మన తాళపత్ర గ్రంథాలన్నీ ప్రచురణ బాటపట్టాయి. ఈ ప్రచురణ క్రమంలోనే పరిష్కరణ ఆవశ్యకత మరింత పెరిగింది. మన ప్రాచీన తాళపత్రగ్రంథాలను సేకరించడం ఒక ఎత్తు అయితే వాటిని పరిష్కరించటం మరొక్క ఎత్తు అయ్యింది. ప్రచురించటం కంటే పరిష్కరణ మరింత క్లిష్టమైన ప్రక్రియగా నిరూపితమైంది.



**గ్రంథ పరిష్కరణ :**

గ్రంథ పరిష్కరణ ఏదైనా ఒక గ్రంథానికి సంబంధించినది. **"కవి ఉద్దేశించిన లేక కవిచేత నిర్ణయింపబడిన పాఠాన్ని మనకు ఇంచుమించు యథాతథంగా అందజేయాలన్న భావనతో ఆయా గ్రంథ సంపాదకులుపడ్డ శ్రమను, ఎదుర్కొన్న సమస్యల్ని తెలుపుతూ సూచించే పరిష్కారాన్నే గ్రంథ పరిష్కరణ"**గా చెప్పవచ్చు.అంటే గ్రంథకర్త హృదయానుసారంగా, గ్రంథ రచనకాలానికి మనసును వెళ్ళగొట్టి, ఆనాటి లేఖనరీతులను ఒంటబట్టించుకుని, గ్రంథానికున్న వివిధ ప్రత్యంతరాలను, పాఠాంతరాలను పరిశీలించి కవి హృదయానికి సమీపంగా ఉన్న పాఠాలను కనుగొని మూలగ్రంథం తేటతెల్లమయ్యేటట్లు గ్రంథాన్ని లోపరహితంగా, నిర్దుష్టంగా పఠనయోగ్యంగా తీర్చిదిద్దటాన్నే **"గ్రంథ పరిష్కరణ"** అంటారు. ఈ గ్రంథ పరిష్కరణ మానవుని మేధస్సుకు పదునుపెట్టే అద్భుత నైపుణ్యంగా చెప్పుకోవచ్చు.

**గ్రంథ పరిష్కరణలో ఆచరించవలసిన నియమాలు:**

గ్రంథ పరిష్కరణలో ఎదురయ్యే సమస్యలను అధిగమించటానికి పరిష్కర్తకు అపూర్వమైన ప్రతిభ, వ్యుత్పత్తి అవసరం. సాధారణంగా గ్రంథపరిష్కర్త గ్రంథసంశోధనలో కొన్ని నియమాలను పాటించాల్సి ఉంటుంది. అటువంటి సూత్రాలను గమనిద్దాం.

**1. కఠిన పాఠాన్ని ఎంచుకోవటం :**

ఆధారప్రతిలోని పాఠాన్ని ఉద్దేశపూర్వకంగా లేఖకుడు మార్చే చాలా సందర్భాలలో ఈ సూత్రం వర్తిస్తుంది. లేఖకుడు అలా మార్చటానికి కారణం అర్థాన్ని స్పష్టంగా చెప్పాలన్న అభిలాషే. యాదృచ్ఛికంగా జరిగే స్ఖాలిత్యాలను అలాఉంచితే, ఉద్దేశపూర్వకంగా చేసే మార్పులను సాధారణంగా గుర్తించవచ్చు. అయితే యాదృచ్ఛిక స్ఖాలిత్యాలకు ఈ సూత్రాన్ని అన్వయించటం కుదరదు. ఎందుకంటే యాదృచ్ఛిక పాఠాన్ని మనం గుర్తించగలిగితే అది నిజమైన పాఠంకంటే కఠినంగా కనిపిస్తుంది. అలా కఠినపాఠం కారణంగా ఏర్పడిన విభిన్నరూపాలు ప్రాచీనరూపాలుగాను, వ్యాకరణ దోషభూయిష్టంగాను లేదా లేఖనకాలంలో మాత్రమే ప్రామాణికంగా ఉన్న విశిష్ట ప్రయోగాలుగానూ ఉంటాయి. అటువంటి రూపాలను తొలగించాలన్న కోరికే ఈ విభిన్న రూపాలేర్పడటానికి కారణం అవుతుంది.

**2. లిఖితప్రతుల మధ్య జన్యజనక సంబంధాన్ని గుర్తించటం:**

భిన్న పాఠాంతరాలను పోల్చేటప్పుడు పెద్దవరుసలో ప్రాచీన పాఠ వైవిధ్యాలను, చిన్న వరుసలో ఆధునిక పాఠ వైవిధ్యాలను సూచిస్తారు. ఉదాహరణకు ఇరవై లిఖిత ప్రతులు ఉంటే పాఠాంతరాలను బట్టి తొమ్మిది ప్రతులు ఒకభాగంగా, పదకొండు ప్రతులు వేరొక భాగంగా ఏర్పడతాయి. అంటే తొమ్మిది ప్రతుల మాతృకలో ఒకపాఠం, పదకొండు ప్రతుల మాతృకలో వేరొకపాఠమూ ఉన్నాయని అర్థం. ఈ పాఠాల భిన్నతను అనుసరించి వెనుకకు వెళితే ఆ రెండుశాఖలు ఏ కాలంలో ఏర్పడ్డాయో ఆ కాలానికి మనల్ని తీసుకెళుతాయి. మళ్ళీ ఈ తొమ్మిది ప్రతుల శాఖలో వేరొకచోట ఒక పాఠానికి నాలుగు ప్రతులు సూచిస్తే వేరొకపాఠాన్ని ఐదుప్రతులు సూచించాయని అనుకుందాం. అప్పుడు ఈ రెండుశాఖలు పదకొండు ప్రతులున్న శాఖకు భిన్నంగా ఉంటాయి. అంటే ఈ రెండు ఉపశాఖల సన్నిహిత మాతృకలు తొమ్మిదింటి సమాన మాతృకలనుండి వేరు పడ్డాయని ఈ అంశం తెలియజేస్తుంది. ఈ విధంగా సంశోధనాత్మక గ్రంథ నిర్మాణంలో ఉపయోగపడ్డ లిఖితప్రతుల వంశవృక్షాన్ని తయారు చేయటంలో చిన్న పెద్దశాఖలను గుర్తించుట ఈ జన్యజనక సంబంధ విషయాన్ని గుర్తించటానికి చేసే ప్రయత్నంగా ఉపకరిస్తుంది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2025

**3. గ్రంథ యథార్థభాగం కాకపోయినా దాని అవశేషాన్నయినా యథాతథంగా ఉంచటం :**

పాఠపరిష్కరణలో సందిగ్ధపాఠాల విషయం వచ్చినప్పుడు నిర్ణయం తీసుకునే సందర్భంలో లభ్యమైన సాక్ష్యాధారాల బలంతో ఒక్కొక్కసారి సందిగ్ధంగానే తిరస్కరించటం జరుగుతుంది. తిరస్కరించిన వాటికి బదులుగా అంగీకరించిన పాఠాలతోపాటు గ్రంథంలో చూపడం జరుగుతుంది. కానీ అది సముచితం కాదు. గ్రంథ యదార్థపాఠం కాకపోయినా దాని అవశేషాన్నయినా యథాతథంగా ఉంచటంమేలు. ఎందుకంటే సందిగ్ధపాఠం ప్రతిపాదించిన సవరణకంటే మాతృకకు సన్నిహితమై ఉండి ఉండవచ్చు. అది భవిష్యత్ పరిష్కర్తకు కూడా ఉపయోగకరంగా ఉంటుంది.

**4. శిథిల భాగాలనలాగే ఉంచటంకంటే తాత్కాలిక పూరణలు మేలు :** సంశోధనాత్మక గ్రంథసేకరణద్వారా సంపాదితమైన పాఠం సందేహాస్పదమైతే, అప్పుడు ఆ రచయిత రాసి ఉండని ఏదో ఒక విషయానికంటే అతను రాసి ఉంటాడనే విషయాన్ని ప్రదర్శించటం మేలు. ఉదాహరణకు మహాభారత విషయంలో ఔత్తరాహిక దాక్షిణాత్య ప్రతులలో కనిపించే భిన్న పాఠాంతరాలకు అంతస్సంభావ్యత, బాహ్యసంభావ్యతలు రెండూ సమానంగా ఉన్నప్పుడు సుక్తంకర్ ఔత్తరాహిక పాఠాలనే ఎంచుకున్నాడు. ఎందుకంటే అవి ప్రక్షిప్తాలు లేనిస్థితిలో ఉన్నాయని గమనించి వానిని తాత్కాలిక పూరణలుగా స్వీకరించాడు. అంతస్సంభావ్యత, బాహ్యసంభావ్యతను సంతృప్తి పరుస్తూ సందేహాస్పదమైన సాంప్రదాయిక పాఠాన్ని ఔచిత్యభరితంగా సరిదిద్దటానికి ఎంతైనా అవకాశం ఉంది. మన ఊహ సంభావ్యంగా ఉన్నప్పుడు అంతస్సంభావ్యతను మాత్రమే ఆధారం చేసుకుని చూపిన రచయిత దాన్ని రాసి ఉండటానికి అవకాశం ఉంది కానీ రాయక పోవటానికి అవకాశం చాలా తక్కువ. ఇలాంటి సందర్భాలలో ఉభయ సంభావ్యతలు సమానంగా అటువైపు మొగ్గు చూపకపోయినా సాంప్రదాయిక దుష్టపాఠంకంటే తాత్కాలిక పూరణగానైనా సరే సవరణకు ప్రాధాన్యతనివ్వాలి.

**5. అసాధుపాఠమైనా సరే! గ్రంథకర్త చేసినదైతే అలాగే ఉంచాలి:**

సంశోధనకర్తకు గ్రంథకర్తచేసిన దోషాలు ఏవి? లేఖకుడు చేసినవేవి? వాటిలో ఉంచవలసినవేవి? తొలగించవలసినవేవి? అనేదే పెద్ద సమస్య. ఈ విషయంలో సార్వత్రికమైన నియమాలను చెప్పటం అంత సులభంకాదు. ఒక్కొక్క పాఠాంతరాన్ని దాని ప్రత్యేకతను బట్టి నిర్ణయించవలసి ఉంటుంది. మూలకర్త రచించిన ప్రతి లభించని పక్షంలో లేఖకుడు అసంకల్పితంగా చేసిన దోషాలేవో? రచయిత చేసిన దోషాలేవో వేరుచేసి చెప్పలేం. ప్రతి రచయిత ఏవో కొన్ని సందర్భాలలో తప్ప తన గ్రంథానికి సాధారణంగా లేఖకుడయ్యే ఉంటాడు. ఒక గ్రంథానికి ఏ దోషాలులేని ప్రాచీనప్రతి లభిస్తే పరిష్కర్తకు లేఖకదోషాల్ని గుర్తించటం సులభం అవుతుంది. పరిష్కర్త అపపాఠంగా గుర్తించిన భాగం రచయితే చేసి ఉండవచ్చు. అలాంటి సందర్భంలో పరిష్కర్త దానిని తొలగించటానికి వీలులేదు. దోషాన్ని ఎంత తక్కువగా సవరించవచ్చునన్నదే ప్రధానం. దోషాన్ని అనేక రీతులుగా సవరించటానికి వీలున్నట్లయితే ఆ అసాధురూపాన్ని యథాతథంగా అలాగే ఉంచాలి.

ఒకే మాతృకనుండి పుట్టిన లిఖితప్రతుల పరంపరలో ఒకటికంటే ఎక్కువశాఖలు కూడ ఏర్పడవచ్చు. ఈ భిన్నశాఖలు కొన్నిసార్లు మూలపాఠాలను, మరికొన్ని సార్లు మూలానికి భిన్నమైన పాఠాలను గ్రహించి ఉంటాయి. ఈ అన్ని శాఖలకు సమ్మతమైన పాఠమేమంటే అది మూలపాఠం. అయితే మొట్టమొదటగా ఏర్పడిన శాఖలో దొరికే పాఠాంతరాలలో ఒక్కటి మాత్రమే మూలపాఠమై, తక్కినవి భిన్న పాఠాంతరాలుగా ఏర్పడి భిన్నశాఖల్లో రూపాంతరాలను సంతరించు కొని ఉంటాయి. ఈ ఒక్కొక్క శాఖ పరంపరాగత లేఖనంలో అనేక ఉపశాఖలుగా విడిపోతాయి. అయితే మూలం అనే మాట మొట్టమొదటగా వేరుపడిన శాఖలోని భిన్నపాఠాలకు మాత్రమే వర్తిస్తూ ఉంటుంది.

ఈ పరంపరాగత లేఖనచరిత్రను గమనిస్తే లిఖితప్రతులలోని ఒకశాఖ గ్రంథమూల భాగాన్ని కొంత, మూలభాగానికి భిన్నమైన భాగాన్ని కొంత అందజేస్తున్నది. ప్రధానమాతృకతో పోల్చినప్పుడు మూలేతరభాగం ఉపమాతృకతో పోల్చినప్పుడు మూలభాగం అవుతుంది. ఈ రెండింటితో పోల్చినప్పుడు మిగిలినభాగం మూలేతర మవుతుంది. ఇలా ఉపమాతృకకు సంబంధించిన మూలం, ప్రధానమాతృకకు సంబంధించిన మూలేతరమైన భాగంలోని పాఠాల మధ్యగల సంబంధాన్ని ద్వితీయశ్రేణి సంబంధంగా చెప్పవచ్చు. ప్రధానమాతృకకు తరువాతి కాలంలోని ఒక సమాన మాతృకనుండి రెండు పాఠశాఖలు పూర్తిగాగానీ, పాక్షికంగాగానీ పుట్టి పెరిగి ఉంటే వాటికీ సమాన మాతృకకు ఉన్న సంబంధం ద్వితీయశ్రేణి సంబంధమే. ఇలా పాఠశాఖల మౌళిక ద్వితీయశ్రేణి రూపసంబంధాల మధ్యగల భేదం లిఖితప్రతుల జన్యజనక సంబంధాన్ని సూచిస్తుంది. ఇది మాతృకపాఠాన్ని లేదా పరంపరాగత పాఠాన్ని పునరుద్ధరించటంలో ఉపకరిస్తుంది. అంతేకాకుండ విభిన్నపాఠాల మధ్య ఉన్న సంబంధం మౌళికమా? ద్వితీయశ్రేణికి సంబంధించినదా? అనే వివేచనను కలిగిస్తుంది.

మనం పరిష్కరించే పరిష్కర్త పరిశీలనలోఉన్న పాఠశాఖలను ముఖ్యంగా కనిపించేవి? ప్రత్యేకంగా కనిపించేవి? తోసివేయలేనంత సంఖ్యలోఉంటే వాటిని మాతృకలోని విలక్షణ పద్ధతులని కాని, అనేకశాఖల్లో సమానంగా కనిపించే ప్రక్షిప్తాలు లేదా లోపాలనిగానీ నిర్ణయించటానికి వీలులేకుండా ద్వితీయశ్రేణీ సంబంధ నిరూపణకు ప్రమాణమవుతాయి. ప్రక్షిప్తాలు ఎంత ఎక్కువగా ఉంటే ప్రతులమధ్య సంబంధం అంతఎక్కువ అవుతుంది ఎందుకంటే ఏ ఇద్దరు పరిష్కర్తలు

గ్రంథంలో నిర్దిష్టస్థానాల్లో ఒకేవిధంగా చేర్చటమో? వదిలి వేయటమో? చేయరు కాబట్టి. ఈ పాఠశాఖలుకూడ ఒకే సంప్రదాయం నుంచి వచ్చినట్లుగా తెలియజెప్పే ప్రమాణాలు దొరకాలి.

ఈ ద్వితీయశ్రేణీరూప పాఠాల పరస్పర సంబంధం పాఠమిశ్రణం కంటే భిన్నమైనది. ఒక గ్రంథానికి సంబంధించిన భిన్నపాఠాలను పరిశీలించేటప్పుడు వ్యాప్తినిబట్టి విస్తృతపాఠము, సంగ్రహపాఠమని రెండు రకాలుగా పరిశీలిస్తారు. ఈ రెండింటికీ మధ్యేమార్గంలోకూడ కొన్ని పాఠాలు కనిపిస్తాయి. అయితే విస్తృతపాఠాన్ని ఆధునికమైనదని, సంగ్రహపాఠాన్ని ప్రాచీనమైనదని గ్రంథ సంశోధనలో పరిగణిస్తారు. వాస్తవానికి ఉద్దేశపూర్వకంగా చేసిన లోపాలు, యాదృచ్ఛికంగా చేసిన లోపాలు, ప్రక్షిప్తాలు లేని పాఠశాఖలు కనిపించవు. శాఖల్లో భేదమే తప్ప ఏ లోపాలూలేని శుద్ధప్రతి దొరకదు అయినప్పటికీ విస్తృత పాఠాలను, సంగ్రహపాఠాలను ఆధారం చేసుకుని ఆయాపాఠాలలోని లోపాలను, ప్రక్షిప్తాలను గుర్తించవచ్చు.

**సంశోధిత ప్రతి (లేదా) శుద్ధప్రతిని సిద్ధం చేసే విధానం:**

ఒక గ్రంథపరిష్కర్త తాను పరిష్కరించాలనుకొన్న గ్రంథానికి సంబంధించి లభించే లిఖితప్రతులన్నింటినీ సంపాదించటం మొట్టమొదటి కర్తవ్యం. అలా సంపాదించటం కష్టమైతే కనీసం వాటి నకళ్ళనైనా సంపాదించాలి. ఒకవేళ నకళ్ళను జిరాక్స్, మైక్రోఫిల్మ్‌ల వంటి వాటితో కాకుండా చేతిరాతతో సిద్ధంచేసిన పక్షంలో పరిష్కర్త తానే స్వయంగా మూలప్రతితో పోల్చి లేఖకుని అలవాట్లవల్ల లేఖన సందర్భంలో వచ్చిన దోషాలను గమనించి సరిచేయాలి. దీనితో పాఠాంతర పరిశీలన ప్రారంభమవుతుంది. క్రమంగా లిఖితప్రతుల నిశిత అధ్యయనం, వాటి ప్రత్యేకతలు గమనించటం, ఆనువంశిక సంబంధాన్ని నిర్ణయించటం, వాటి ప్రామాణ్య తారతమ్యాల్ని విశ్లేషించటం సంశోధనాత్మక పాఠ సంప్రదాయ రచన సాధ్యమైన చోటల్లా మూలపాఠాన్ని పునరుద్ధరించటం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

పరిష్కరణకు ఉపయోగించిన సాధనసంపత్తిని వివరించే ఉపోద్ఘాతంతో పరిష్కరణ ప్రారంభమవుతుంది. ఆ తరువాత లిఖితప్రతుల సాధారణ సమాచారాన్ని అంటే లభ్యమైన లిఖితప్రతుల సంఖ్య, తన సంశోధనకు యథార్థంగా పరీక్షించిన ప్రతులసంఖ్య, పాక్షికంగా గానీ సంపూర్ణంగాగానీ సరిపోల్చిన ప్రతుల సంఖ్య, సరిపోల్చటానికి ఆ కొన్ని ప్రతులనే ఎన్నుకునేందుకుగల కారణాలు మొదలైనవి. లభ్యమయ్యే లిఖితప్రతుల నకళ్ళనుతప్ప స్వతంత్ర ప్రతులనన్నింటినీ సంశోధన కార్యక్రమంలో ఉపయోగించుకోవాలి. తన పరిష్కరణకు అవసరమైన సాధనసంపత్తిని ఎంచుకునే విషయంలో ప్రభావం చూపిన అన్ని అంశాలను ఈ సాధారణ సమాచారంలో పేర్కొనాల్సి ఉంటుంది. ఆ తరువాత పరిష్కర్త తన పాఠాంతర పరిశీలనను ఆధారంగా చేసుకుని లిఖితప్రతులను పాఠ సంప్రదాయాలుగాను, పాఠసేకరణగాను వర్గీకరించి సంగ్రహంగా



సూచించాలి. ఈ వర్గీకరణకు అనుగుణంగా సాధనసంపత్తిని, తానుపయోగించుకున్న లిఖితప్రతుల పట్టికను ఇవ్వాలి. ఒక్కొక్క సంప్రదాయానికి, శాఖకు సంబంధించి ఒక్కొక్క పట్టిక వేరువేరుగా ఉంటుంది. ఆ పట్టికలో ఒక్కొక్క లిఖితప్రతికి ఒక్కొక్క సంకేతాన్ని ఏర్పాటు చేసుకుని తన సంశోధన సామగ్రిలో వాటిని సూచిస్తూ పాఠాలను ఉదాహరిస్తాడు. అంతేకాకుండా అవి ఏ ప్రాంతానికి చెందినవో, ఏ గ్రంథాలయంలో ఉన్నాయో? వాటి వరుస సంఖ్యలేవో? వాటి తేదీలేవో? లభించిన మేరకు వివరిస్తాడు.

లిఖిత ప్రతులకు సంకేతాలను ఏర్పాటు చేసేటప్పుడు ఇష్టం వచ్చినట్లు గుర్తులు వాడకూడదు. సంశోధన సామగ్రిలో ఒక ప్రతి ఏ వర్గానికి చెందుతుందో ఆ స్వభావాన్ని సూచించే సంకేతం దానికుండాలి. అలాసూచించే సంకేతం లిఖితప్రతి తయారు చేయబడిన ప్రాంతాన్ని సూచించవచ్చు. ఒక గ్రంథం అనేక లిపులలో ఉంటే లిపి సంజ్ఞను సంకేతంగా వాడవచ్చు. ఒకే లిపిలోగానీ, ఒకే ప్రదేశంలోగానీ అనేక ప్రతులున్నట్లయితే సంకేతాక్షర అథోభాగంలో అంకెలతో విభిన్నంగా సూచించవచ్చు. ఇటువంటి సందర్భాన్నే 'ఎస్.ఎమ్.కత్రే' వివరిస్తూ ఇలా చెప్తాడు. "ఈ పద్ధతిలో $G_1$, $G_2$, $G_3$....$G_r$ అనే దానిలో సంకేతం లిపి సూచకమైతే, గ్రంథలిపిలో 'r' సంఖ్యగల లిఖితప్రతులను అది సూచిస్తుంది. అలాకాక ప్రాంత సూచకమైతే, 'గ్వాలియర్'నుండి వచ్చిన 'r' సంఖ్యగల లిఖితప్రతులను సూచిస్తుంది. లిఖితప్రతుల దోషస్థాయిని సూచించేవిధంగా ఆరోహణ క్రమంలో అంకెలను ఉపయోగించి, తద్వారా అక్షర సంకేతాల సంఖ్యల సమ్మేళనాన్ని మరింత అర్థపూర్ణంగా చేయవచ్చు. ఈ పద్ధతిలో $G_1$, $G_2$ ప్రతికంటే ఉత్తమంగానూ $G_2$, $G_3$ ప్రతికంటే ఉత్తమంగానూ అలాగే తరువాత ప్రతులూ ఉండటం గమనించవచ్చు.

ఇలా పైపట్టికలో ఇచ్చిన లిఖితప్రతుల ద్వారా సమగ్ర వివరణ ప్రారంభమవుతుంది. ఈ వివరణలో సంకేతాక్షరం, ఉపలబ్ధప్రాంతం, గ్రంథాలయం, గ్రంథ క్రమసంఖ్య, పుటసంఖ్య, ఒక్కొక్క పుటలోని పంక్తుల సంఖ్య, ఒక్కొక్క పంక్తిలోని అక్షరాల సంఖ్య, దేని మీద రాయబడిందో ఆ వస్తువు యొక్క లేఖనరీతి ప్రస్తావనకు వస్తాయి. ఈ బాహ్య వర్ణనలో లిఖితప్రతికి సంబంధించిన సాధుపాఠ విశేషాలు,

ఆ ప్రతి స్వభావము, పరిస్థితి, మార్జిన్లలో ఏమైనా రాసి ఉండటం, పంక్తుల మధ్యలో సవరణలు, పుటసంఖ్యలు వేయటంలో పాటించిన పద్ధతి, విభాగాల సంఖ్య, ఖాళీలవంటి అంశాలన్నీ చోటు చేసుకుంటాయి. గ్రంథం యొక్క ఆద్యంతాల్ని కూడ తప్పకుండా ఇవ్వాలి. మధ్యలోనే ఆశ్వాసాంత భాగాలు, పరంపరాగత లేఖన చరిత్రకు సంబంధించి ఏవైనా విషయాలు చెప్పగలిగితే చెప్పాలి. ఈ సందర్భంలోనే ఆప్రతి రాయటానికి ప్రేరకుడైన పోషకుని వివరాలు, లేఖకునిపేరు, ఆ ప్రతి సిద్ధమైన ప్రాంతం, కాలంవంటి వాటిని చెప్పాలి. లిఖితప్రతికి శీర్షికలేవైనా ఉంటే వాటిని సూచించాలి. లేఖనరీతిని సూచించేటప్పుడు అది ఒక్క చేతిమీదనే సాగిందా? లేదా అనేక చేతులు కలిసాయా? అనే విషయాన్ని తెలియజెప్పాలి. మార్జిన్లలో పంక్తుల మధ్యఉన్న మార్పులు చేర్పుల విషయంలో ఎన్నిచేతులు మారాయో? తెలియజేయాలి. తన సంశోధనకు ఉపయోగించకుండా పరిహరించిన లిఖితప్రతులను పేర్కొని, అలా వాటిని పరిహరించటానికిగల కారణాలను తెలపాలి. లిఖితప్రతులను పాక్షికంగా పోల్చిచూసిన సందర్భాలలో ఎక్కడినుండి ఎక్కడివరకు పోల్చిచూడడం జరిగిందో, ఆ భాగాలను ఒక్కొక్క లిఖితప్రతుల సమగ్ర సమాచారంలో తప్పక సూచించాలి.

ఈ సమగ్ర సమాచారాన్ని వివిధ లిఖితప్రతులలో ప్రారంభంలో కాని మధ్యలోకాని లేఖకుడు కొంత సమాచారాన్ని రాసి పెట్టే ఉంటాడు. వాస్తవానికి గ్రంథంలో విషయానికీ దానికీ సంబంధం ఏమీ ఉండదు. అయినప్పటికీ దానికి కొంత చారిత్రక విలువ ఉంటుంది. అందుచేత దానిని తప్పనిసరిగా ఈ సమగ్ర సమాచారంగా ప్రస్తావించాలి. పరిష్కర్త వివిధ లిఖితప్రతులతో పోల్చిన వివరాలను ఇచ్చేటప్పుడు వాటిని ఒక పట్టికగా ఇవ్వాలి. దానివలన సంశోధనలసామగ్రిని అధ్యయనం చేసేటప్పుడు ఆ సమాచారాన్ని పాఠకుడు సులభంగా అవగాహన చేసుకోగలుగుతాడు. లిఖితప్రతుల సమాచారం తర్వాత లభించిన గ్రంథాల అధ్యయనానికి ఉపయోగపడే ప్రాచీన వ్యాఖ్యానాల సంగ్రహీకరణలు, అనుసరణలు, సంకలనాల వంటి సాక్ష్యాధారాల సమాచారాన్ని వివరంగా అందించాలి. ఆ తరువాత లిఖితప్రతుల పరస్పర సంబంధాన్ని వీలైతే ఒక వంశవృక్షరూపంలో చెప్పాలి. లభించే లిఖితప్రతుల ఆధారంతో లభించని లిఖితప్రతులను కొన్నింటిని ఊహించటానికి అవకాశం ఉంది. లిఖితప్రతుల కాలాన్ని ఊహించిగానీ, సాక్ష్యాధారాలున్నప్పుడు కచ్చితంగాగానీ పరిష్కర్త తప్పకుండా సూచించాలి. కాలాన్ని సూచించటానికి సంకేతాక్షరానికి పైభాగంలో సంఖ్యారూపంలో చెపుతారు. ఉదాహరణకు M12 ఇందులోని M ప్రతికి సంకేతం అయితే 12 శతాబ్దాన్ని సూచిస్తుంది. ఆ తర్వాత లిఖితప్రతిలోని పాఠసంప్రదాయాలను, వాటి శాఖలను సమీక్షించాలి. పాఠభేదాలను వర్గీకరించి జనాదరణ పొందిన పాఠానికీ, మూలపాఠానికీ పాఠాలను ఉపోద్ఘాతంలో సూచించాలి.

పాఠ సంప్రదాయాల వివరణ తర్వాత విభిన్న లిఖితప్రతులను విశ్లేషిస్తూ వాటి పరస్పర సంబంధాలను, ప్రత్యేకతలను అంచనావేస్తూ వివరిస్తాడు. పాఠసంప్రదాయాలను గురించి వివరించే సందర్భంలో పరిష్కర్తయొక్క మహత్తర పరిశోధనశక్తి తెలిసేటట్లుగా ఉండాలి. ప్రతులలోని పాఠశాఖలను ఒకే మాతృకకు చెందినదో? కాదో? తగిన ఆధారాలతో సిద్ధాంతీకరించాలి. ఆ తరువాత గ్రంథ పునర్నిర్మాణంలో తాను పాటించిన సంశోధన నియమాలను తన ముందున్న సామగ్రిని దృష్టిలో పెట్టుకొని చెప్పవలసి ఉంటుంది. అంటే తాను పరిష్కరించే గ్రంథానికి గ్రంథ పరిష్కరణ సూత్రాలను అన్వయించడం మాత్రమే. ప్రసిద్ధమైన గ్రంథ పరిష్కరణ సూత్రాలకు భిన్నంగా ఇతర సూత్రాలను పాటిస్తే అలా పాటించదానికిగల కారణాన్ని, తన సాధన సామగ్రి వివరాలను తప్పని సరిగా సూచించాలి. తానుపయోగించిన లిఖిత ప్రతులను పరిష్కరించడంలో తాననుసరించిన పద్ధతులనుకూడ చెప్పాలి. తాను సిద్ధంచేసిన ప్రతిలోని పాఠాలను తన ఊహా ప్రమేయంతో సవరించి ఉంటే తన ఊహకు పెట్టుకొన్న ప్రమేయాలను తెలియజేయాలి. సుదీర్ఘమైన ప్రక్షిప్తాలేవైనా ఉంటే ఉపోద్ఘాతంలో వాటిని చర్చించాలి. వాటిని గ్రంథంలో చేర్చకపోవటానికి గల కారణాల్ని కూడా చెప్పగలగాలి. లఘు ప్రక్షిప్తాల్ని గురించి విశేషంగా చర్చించవలసిన పనిలేదు.

పరిష్కర్త తాను పరిష్కరించిన గ్రంథానికి ఇతర పరిష్కరణలేవైనా ఉంటే వాటిని గురించి తప్పనిసరిగా చర్చించాలి. తానుపయోగించిన సామగ్రిదృష్టితో వాటి పరిమితులను సూచించాలి. అంటే తాను వాటిని పక్షపాత రహితంగా విలువకట్టాలి. పరిష్కర్త తాను పరిష్కరించే గ్రంథ రచయితకు సంబంధించిన వివరాలను, అతని సాహిత్య ప్రతిభను, ప్రత్యేకతను, శైలిని, రచయిత పేర్కొనే ఇతర ఆధారాల ప్రస్తావనను మనకు తెలిసినవి, తెలియని వాటినన్నింటినీ శ్రమించి సేకరించాలి. గ్రంథంలో కనిపించే ఇతర గ్రంథాలు, వాటి కర్తలపేర్లు, రాజులు, రాజవంశాలవంటి వాటిని గుర్తించి ఉపోద్ఘాతంలో పేర్కొనాలి. తాను పరిష్కరించే గ్రంథం అంతకుముందే వ్యాఖ్యానించబడిఉంటే పరిష్కర్త ఆ వ్యాఖ్యాత సంగ్రహ చరిత్రను తెలియజేస్తూ గ్రంథ అవగాహన కోసం ఆ వ్యాఖ్యానాలకు విలువకట్టాలి. అంతేకాక సాహిత్యదృష్టితో నిర్దిష్ట సాహితీశాఖకు గ్రంథకర్త చేసిన సేవ, అందులో అతనిస్థానం, అతనిఆలోచన, అభివ్యక్తి రీతులను ప్రభావితం చేసిన అంశాలు, తదనంతరయుగం మీద అతని ప్రభావం వీటన్నంటినీ గూర్చి పరిష్కర్త సంగ్రహంగా, విమర్శనాత్మకంగా సమాచారాన్ని అందిస్తూ సమీక్షచేయాలి.

సంశోధిత గ్రంథాలను ముద్రించేటప్పుడు తాను అంగీకరించిన పాఠాలకు, తిరస్కరించిన పాఠాలకు, అంగీకరించటానికి సందిగ్ధంగా ఉన్న పాఠాలకు, తిరస్కరించటానికి సందిగ్ధంగా ఉన్న పాఠాలకు పాఠించిన సంకేతాల పట్టికను విధిగా సూచించాలి. లిఖిత ప్రతుల

లోని ముఖ్య పాఠాంతరాలన్నింటినీ సంశోధనసామగ్రిలో పేర్కొనవసిందే. దీనివలన తర్వాత పరిష్కర్తలకు, విమర్శక పాఠకులకు సంశోధనసామగ్రి అందుబాటులో ఉంటుంది. అదేవిధంగా గ్రంథం కిందిభాగంలో సూచించవలసిన అంశాలు ప్రధానంగా నాలుగున్నాయి. 1) ఆధారప్రతికి ఇతర లిఖితప్రతులకు మధ్య ఉన్న అన్ని పాఠభేదాలు అంటే అవి గ్రంథభాగంలోకి స్వీకరించినవికాక మిగిలినవి 2) లేఖన దోషాలతో పాటు తిరస్కృత పాఠాంతరాలు ఇవి గ్రంథ నిర్మాణంలో ఉపయోగించేవి కావు కానీ పాఠకులకు చేసిన పరిశ్రమ తెలియజేయటం కోసం ఉపకరిస్తుంది. 3) పరస్పరంగాగానీ ప్రధాన పాఠాలతో గానీ పొందని ఉప పాఠాంతరాలు 4) పెక్కు ప్రతులలో సమానంగా ఉన్నపాఠాలు ఒక్కొక్క లిఖితప్రతిలో గానీ, లిఖితప్రతుల సముదాయంలో గానీ చిన్నప్రక్షిప్తాలు ఉంటే వానిని సంశోధన సూచికలలో చేర్చి చూపాలి. పెద్ద ప్రక్షిప్తాలను అనుబంధాలలో చూపించాలి. అధిక పాఠాలేవైనా ఉంటే సంశోధన సామగ్రిలోని అథస్సూచికలలో సూచించాలి.

పరిష్కర్త తయారుచేసే అనుబంధాల సూచికలో ఈ కింది అంశాలను చేర్చవలసి ఉంటుంది.

అవి 1) తన గ్రంథంలోని పద్యభాగానికి చెందిన అన్ని పాదాలను సూచికగా ఇవ్వటం. ఆ పాదాలు నిర్మిత గ్రంథభాగంలోనివి కావచ్చు లేదా 'సంశోధక సామగ్రి'లోనివి కావచ్చు లేదా సుదీర్ఘ ప్రక్షిప్తాల రూపంలో నున్న అనుబంధంలోనివైనా కావచ్చు.

2) సమగ్ర పదసూచిక ఇవ్వటం. అది సాధ్యంకాకపోతే ముఖ్య పదసూచికనైనా ఇవ్వటం.

3) గ్రంథంలోనూ, సంశోధన సామగ్రిలోనూ ఉపయుక్తాలైన పదాల సూచికనివ్వటం. వాటిలో ఒకటిరెండు పదాలకు మాత్రం సన్నివేశ సూచన చేయటం.

4) సమగ్ర నామధేయ సూచికతోబాటు గ్రంథసంబంధి చారిత్రక-భౌగోళిక సమాచారమంతా అందజేయటం. తరువాత తాను పరిష్కరించే గ్రంథానికి సంబంధించిన ముద్రిత పరిష్కరణలన్నింటినీ సంగ్రహించిన పట్టిక ఉండాలి. ఇతర గ్రంథాలలో సదృశపాఠ భాగాలున్నట్లయితే పరిష్కర్త వాటిని ప్రత్యేక అనుబంధంగా ఇచ్చి ఆ సాదృశ్యాన్ని చూపాలి.

కొందరు ఈ సాధనసామగ్రినంతా అదే పుటలో వెనువెంటనే అంటే పుటలోని పై సగభాగంలో నిర్మిత గ్రంథాన్ని, క్రింది సగభాగంలో సాధనసామగ్రిని ఇవ్వటం మేలని భావిస్తారు. కొందరు పాఠాంతరాలు అనే పేరుతో సంపుటం చివర అందజేస్తారు. కేవలం పాఠాంతర ప్రదర్శనకంటే సంశోధన సామగ్రికి సంబంధించిన పాండిత్యం కొంత భిన్నంగా ఉంటుంది. గ్రంథం ముద్రించబడ్డ పుటలోనే దాని నిర్మాణానికి సంబంధించిన సామగ్రిఉండటం ఎంతో సహాయకారిగా ఉంటుంది.

గ్రంథకర్త రాసిన లిఖిత ప్రతికి, దాని ప్రతిబింబానికీ మధ్య ఎక్కువ కాలవ్యవధి లేకుండ ఆ ప్రతిబింబంగా భాసించే ప్రతే, తక్కిన లిఖితప్రతున్నింటికంటే ఉత్తమమైనదని భావించినప్పుడు అందులోని లేఖకదోషాలను సవరించి, ఇతర ప్రతులలోని పాఠాంతరాలను గుర్తించి దానిని కనీసమార్పులతో ముద్రించడమే ఉత్తమమైన మార్గం. కొన్ని లఘుకృతుల విషయంలో లభ్యలిఖిత ప్రతులు రెండు మూడింటికంటే ఎక్కువ ఉండవు. ఇటువంటి సందర్భాలలో సంశోధిత గ్రంథసేకరణ సమస్య చాలా సులభమవుతుంది. ఉత్తమ లిఖితప్రతిని ప్రమాణంగా స్వీకరించి, మిగిలిన ప్రతుల సాయంతో దాని ప్రమాణపాఠాలను సూచించవచ్చు. పాఠసంప్రదాయాలు భిన్నంగా ఉంటే వంశవృక్షంద్వారానే సంశోధిత గ్రంథాన్ని సిద్ధం చేయవలసి ఉంటుంది.

ఒకే ఒక్క రాతప్రతి లభించినప్పుడు పాఠాంతరాల పరిశీలనకు అవకాశం ఉండదు. తెలుగులో నన్నెచోడుని కుమారసంభవం అటువంటి గ్రంథం. అలా ఒక్కప్రతి మాత్రమే దొరికినప్పుడు అందులోని పాఠదోషాలకు శుద్ధపాఠాలను ఊహించి ఇవ్వవలసిందే తప్ప వాటిని శాస్త్రీయంగా, వంశవృక్ష పద్ధతిలో తైపారువేయటానికి అవకాశం ఉండదు. వీలైనంతవరకు ఊహాత్మక పాఠాలను సూచిస్తూ ఉన్నదున్నట్లుగా ముద్రించటమే పరిష్కర్తకు సాధ్యమవుతుంది. ఇటువంటి ప్రతులలోని స్ఖాలిత్యాలను దిద్దటం కుదురుతుంది కానీ పాఠ పరిష్కరణ కష్టసాధ్యమైన విషయం. ఇలా గ్రంథ పరిష్కరణలో పరిష్కర్త ప్రయాణం చేయవలసి ఉంటుంది.

**ఆధార గ్రంథాలు :**

1) గ్రంథ పరిష్కరణ విధానాలు - సంపా. ఆచార్య చిత్రాజు గోవిందరాజులు, జ్యోత్స్న పబ్లికేషన్స్, తిరుపతి, 2008

2) ఉభయభారతి - ఆచార్య రవ్వా శ్రీహరి, వరరుచి పబ్లికేషన్స్, హైదరాబాద్, 2015

3) భారతీయ గ్రంథ పరిష్కరణ ప్రవేశిక-మూలం. ఎస్.ఎమ్.కత్రే, తెలుగుఅనువాదం-ఆచార్య బూదాటి వేంకటేశ్వర్లు, ద్రావిడ విశ్వ విద్యాలయ ప్రచురణ, 2012

4) గ్రంథపరిష్కరణ శాస్త్రం-ఆచార్య ఆర్వీయస్ సుందరం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాచ్యపరిశోధన సంస్థ ప్రచురణ, హైదరాబాద్,2008

5) శ్రీరంగాచార్య వ్యాసం-ఆధునిక సాహిత్య విమర్శరీతులు, సంపా.డా.లక్ష్మణ చక్రవర్తి, హైదరాబాద్

6) An Itroduction to Indian Textual Criticism-S.M Katre, Deccan College and Research Centre, Puna 1942.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8 (12) హైదరాబాద్ జూన్ : 2025

## లేఖ

ఈ నెల మూసీలో శ్రీవల్లీ రాధికా గారు రాసిన **"రామాయణ విష వృక్షం"**పై వచ్చిన విమర్శనా వ్యాసం చదివి ఇది రాస్తున్నాను. ఈ వ్యాసంలో ఆమె ప్రధానంగా చెప్పింది : రాజ్యంపై హక్కు భరతుడిదే అయినా అది అల్ప విషయమేననీ, రాముడికి చెందడమే న్యాయం అనీ, కాబట్టి, రాముడి తప్పు గానీ, దశరథుడి తప్పు గానీ, వాల్మీకి తప్పు గానీ లేదని అంటున్నారు. కానీ, అసలు సంగతి ఏమిటి?

దశరథుడు, కైకను వివాహమాడే సందర్భంలో కైక తండ్రికి **"కైకకు పుట్టిన సంతానికే రాజ్యం ఇస్తా"**నని వాగ్దానం చేసాడు. అలా వాగ్దానం చేసాడు కాబట్టే, భరతుడు ఊర్లో లేని సమయంలో, హఠాత్తుగా ముహూర్తం పెట్టి రాముడికి పట్టాభిషేకం చెయ్యడానికి ప్రయత్నించాడు. అంతగా భయపడాల్సిన అవసరం ఎందుకు వచ్చింది? ఎక్కడ భరతుడు గానీ, కైక గానీ ఆటంకపరుస్తారేమోననే భయం చేతనే కదా?

శ్రీవల్లి గారు యేమని అంటున్నారంటే... **"ఇక్ష్వాకు వంశంలో జేష్ఠ్య పుత్రుడే రాజు కావడం ఆనవాయితి. అయితే కైకను పెళ్లి చేసుకునే నాటికి కౌసల్యాదులకు సంతానం కలగలేదు కనుక ఒక వేళ వివాహం అయిన వెంటనే కైకకు సంతానం కలిగితే ఆ సంతానానికి రాజ్యం ఇస్తానని దశరథుడు అని ఉండవచ్చు... ఎప్పుడైతే కైకకు సంతానం కలగలేదో, పట్టమహిషి కౌసల్యకు మొదట సంతానం కలిగిందో అప్పుడు ఆ మాట దానంతట అదే వీగిపోయింది, ప్రాముఖ్యత లేని విషయంగా అయిపోతుంది"** అని శ్రీవల్లి గారి వాదన. కానీ, ఈ వాదన తర్కానికి నిలవదు. ఎలా అంటే, అసలు నిజానికి పిల్లలు నలుగురూ ఒకేసారి పాయసం తాగడం వలన పుట్టారు.

శ్రీవల్లి గారు అన్నట్లు **"ఎప్పుడైతే కైకకు సంతానం కలగలేదో, పట్టమహిషి కౌసల్యకు సంతానం కలిగిందో ... "** అన్నంత వ్యవధి లేదు. అయితే అందరి కన్నా పెద్ద రాముడే.

కైకను పెళ్ళిచేసుకునే సమయానికి అసలు దశరథుడికి పిల్లలు లేరు. అప్పటికే ఇద్దరు భార్యలు ఉన్నారు (ఇంకా ఎక్కువ మందే అనుకోండి) కైకను పెళ్లి చేసుకున్న తరువాత మిగతా ఇద్దరిలో ఎవరికైనా పిల్లలు పుడితే వాళ్ళకే రాజ్యం వెళ్ళిపోతుందని కైక తండ్రికి తెలుసు. అందుకే తన మనమడికే రాజ్యం రావాలని షరతు పెట్టాడు. దానికి దశరథుడు అంగీకరించాడు కూడా. దాన్ని అల్ప విషయంగా, ప్రాముఖ్యత లేని విషయంగా ఎంత మసిబూసి మారేడు కాయను చేసినా అది నిజం కాకపోదు. నిజం అనేది ఎంత చిన్నది అయినా దాని బలం దానికి ఉంటుంది. అంత ప్రాధాన్యత కలిగిన విషయాన్ని దాచేసి రాముడికి రాజ్యం ఇవ్వాలనుకోవడం దశరథుడి తప్పు. హక్కు లేని రాజ్యాన్ని తీసుకోవడానికి సిద్ధపడిన రాముడిదీ తప్పే. అంతేకాదు. అసలు హక్కే లేనపుడు చెప్పులు ఇవ్వడమూ తప్పే.

**"కైకను పెళ్లి చేసుకున్న వెంటనే కైకకు సంతానం కలిగినట్టయితే ఆ సంతానానికే రాజ్యం ఇస్తానని దశరథుడు అని ఉండవచ్చు"** అని అంటున్నారు శ్రీవల్లి గారు. ఇక్కడ 'ఉండవచ్చు' అని సందేహం వచ్చే పదాన్ని శ్రీవల్లి గారు ఎందుకు వాడారు? దశరథుడు కైకను పెళ్లి చేసుకునే సందర్భంలో కైకకు పుట్టిన సంతానానికే రాజ్యం ఇస్తానని చాలా స్పష్టంగా వాగ్దానం చేసాడు కదా! అది వాల్మీకి రామాయణం లోనూ, రామాయణ విషవృక్షం లోనూ వున్నది కదా! మరి 'ఉండవచ్చు' అనే పదం ఎందుకు వాడారు? ఎందుకంటే, ఈ రెండూ చదవని పాఠకులు ఏం అనుకుంటారంటే, అసలు వాగ్దానమే అస్పష్టమైనప్పుడు రాముడికి రాజ్యం రావడంలో అడ్డు ఏమీ ఉండదు. అప్పుడు రాముడికి అన్యాయం జరిగిందని నిర్ణయానికి వచ్చేస్తారు. రాముడు అమాయకుడు అయిపోతాడు. ఇంకా శ్రీవల్లి గారు అన్నట్లు **"కైకకు పెళ్లి అయిన వెంటనే సంతానం కలిగితే..."** ఒకవేళ అదే జరిగితే అప్పుడు భరతుడే పెద్ద కొడుకు అవుతాడు. అప్పుడు గొడవేముంది? పెద్దకొడుకు ప్లస్ వాగ్దానం రెండూ కలిసిపోతాయి. ఆలా జరగలేదు.

**"దశరథుడు, భరతుడిని శంకించడం అనేది భరతుడిని హక్కుకి ప్రమాణమేమీ కాదు. ప్రమాదం హక్కు ఉన్న వాడి వైపు నుంచే రాదు. ఆ హక్కు వున్నా లేకపోయినా రాజ్యం కావాలనుకునే ఎవరి నుంచైనా వస్తుంది"**

అంటే ప్రమాదాలు శత్రు రాజుల నుంచి వస్తుంటాయి కదా! అలాంటిదే భరతుడి హక్కు కూడా. అని భరతుడి హక్కుని సాధారణీకరించేసి, వాగ్దానాలనూ, వరాలనూ పక్కన పెట్టేయడమే.

**వి. వెంకట్రావు**

**ఫోన్ : 9247235401**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2025

# తెలుగు రామాయణములు – అహల్య : తులనాత్మక పరిశీలనము

**డా. జి. శ్రీనివాసరావు,** అసోసియేట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, తారా ప్రభుత్వ కళాశాల (స్వ), సంగారెడ్డి.
ఫోన్ : 98480 20646

**1. వ్యాస సంగ్రహము :**

మానవ జాతిని ధర్మ మార్గమున నడిపించే గ్రంథరాజములలో రామాయణము విశిష్టమైనది. తెలుగున వెలసిన రంగనాథ రామాయణము, భాస్కర రామాయణము, మొల్ల రామాయణము, రామాభ్యుదయము, శ్రీమద్రామాయణ కల్పవృక్షము వంటి తెలుగు రామాయణములలో "అహల్య" వ్యక్తిత్వాన్ని ఎంత వైవిధ్యంగా తీర్చిదిద్దారో చూపడం ఈ వ్యాసం ముఖ్యోద్దేశం. ఈ వ్యాసంలో తులనాత్మక మరియు విశ్లేషణాత్మక పరిశోధన పద్ధతులు అనుసరింప బడినాయి. కవిదర్శనము తన కవిత్వ సృష్టికి కారణమవుతుంది. కావున వేర్వేరు తెలుగు కవులు "అహల్య" ను ఎలా తీర్చిదిద్దారో ఈ వ్యాసంలో విశ్లేషింపబడుతుంది. మహాకావ్య కథా నిర్మాణంలో చిన్నకథలను మణిపూసల వలె ఏర్చికూర్చి రామాయణ అనర్ఘ మహారత్నమాలను తయారు చేసిన కవుల కథన వైశిష్ట్యాన్ని సహృదయ పాఠకులు హృదయంగమం చేసుకుంటారు.

**2. కీలక పదాలు :** తెలుగు రామాయణములు, అహల్య పాత్రచిత్రణ, ఔచితీమంతమైన తీర్పులు, కవిదర్శనం, కథాకథనం.

**3. ఉపోద్ఘాతము :** భారతీయులెక్కువగా ఆదరించు గ్రంథములలో రామాయణ మొకటి. రంగనాథ రామాయణము మొదలు నేటి వరకు వివిధ కాలములలో వివిధ ప్రక్రియలలో అసంఖ్యాకముగా రామాయణములు రచింపబడినవి. రామాయణములోని స్త్రీ పాత్రలలో పాఠకునికి అత్యంత కుతూహలము కలిగించు వాటిలో "అహల్య" ఒకటి. వాల్మీకి రామాయణము, అధ్యాత్మ రామాయణము, రంగనాథ రామాయణము, భాస్కర రామాయణము, మొల్ల రామాయణము, రామాభ్యుదయము, శ్రీమద్రామాయణ కల్పవృక్షములలో "అహల్య" వ్యక్తిత్వమును తీర్చిదిద్దిన తీరు ఎలా వైవిధ్యభరితంగా ఉన్నదో ఆ వ్యాసములో చర్చించడం జరుగుతుంది.

బాలకాండలో విశ్వామిత్రుని వెంట, లక్ష్మణసమేతంగా వెళ్ళునప్పుడు శ్రీరామునికి తారసపడిన స్త్రీమూర్తులు ముగ్గురు. వారు వరుసగా తాటక, అహల్య, సీతాదేవి. తాటక తమో గుణానికి, అహల్య రజోగుణానికి, సీతాదేవి సత్త్వగుణానికి ప్రతీకలు. శ్రీరాముడు తాటకను సంహరించాడు. అహల్యను సంస్కరించాడు, సీతాదేవిని స్వీకరించాడు. ప్రతి మానవుడు తమోగుణాన్ని తొలగించుకొని, రజోగుణాన్ని సంస్కరించుకొని, సత్త్వగుణాన్ని స్వీకరించాలని మనకు రామాయణం బోధిస్తుంది.



**4. విషయ వివరణ:**

శ్రీరామకథకు మూలము, ప్రమాణము వాల్మీకిమహర్షి ప్రణీతమైన సంస్కృత రామాయణమే. తెలుగున వెలసిన రామాయణములు అనుసరించినది వాల్మీకి రామాయణాన్నే అయినప్పటికీ అవాల్మీకము లైన అంశములెన్నియో చేరినవి. తెలుగు రామాయణములలో "అహల్య" వ్యక్తిత్వమును తీర్చిదిద్దుటకు మన తెలుగు కవులుచేసిన మార్పులు, చేర్పులు చూసే ముందు వాల్మీకి రామాయణములో "అహల్య" పాత్రను చూద్దాం.

**i. వాల్మీకి రామాయణము – అహల్య**

ఇంద్రుడు 'అహల్య'ను సంగమింపకోరి గౌతమముని లేని సమయంలో గౌతముని రూపము ధరించి వచ్చి అహల్యతో తన కోరిక తెలుపగా, వచ్చినవాడు ఇంద్రుడని తన తపశ్శక్తిచే గుర్తించిన అహల్య **"నా దాంపత్య జీవనమున నేను సంతుష్టురాలను నీవు ఇచ్చటి నుండి వెంటనే వెళ్ళుము, నీ, నా గౌరవములు నిలుపుము"** అనెను. అపుడు పర్ణశాల నుండి బయటికి వస్తున్న ఇంద్రున్ని గౌతముడు **"నా రూపము ధరించి అనుచితముగా ప్రవర్తించితివి కావున నీవు విగత వృషణుడవు అయ్యెదవు"** అని శపించి తరువాత అహల్యను **"వేలకొలది సంవత్సరములు నీవు అన్నపానాదులు లేక వాయు భక్షణతో భస్మశాయినివై, ఎవ్వరికి కనపడకుండా ఈ ఆశ్రమములోనే పడి యుండెదవు"** అని శపించి శ్రీరాముడు **"ఈ వనమునకు వచ్చినపుడు నీవు పవిత్రురాలివై నిజస్వరూపము పొందెదవు"** అని శాప విమోచనము అనుగ్రహించెను.

**ii. అధ్యాత్మ రామాయణము – అహల్య**

వేదవ్యాస మహర్షి విరచితమైన బ్రహ్మాండ పురాణములో అధ్యాత్మ రామాయణము ఉంది.

గౌతమ మహర్షి తపస్సు చేసుకుంటూ ఉంటాడు. బ్రహ్మ మెచ్చి తన కూతురు అహల్యనిచ్చి పెళ్ళి చేస్తాడు. అహల్యను మోహించిన ఇంద్రుడు గౌతముని రూపంలో వచ్చి మోసంతో అహల్యను అనుభవిస్తాడు. బయటినుండి వస్తున్న గౌతముడు ఇంద్రున్ని ప్రశ్నించగా **"తాను ఇంద్రుడనని, కామవశుడనై, దోషకార్యంలో పాల్గొన్నా"**నని చెప్పగా గౌతముడు **"యోని అపేక్షుడవై చేసిన నేరానికి నీ దేహం వేయి యోనులతో నిండుగాక"** అని శపించి, అహల్య చూచి **"శీలాన్ని పోగొట్టుకొన్న నీవు శిలగా మారుతావు. అనేక సంవత్సరములు నిరాహారివై, శ్రీరాముని ధ్యానిస్తూ ఉండు"** అని శపించి, నీ శిలారూపంపైన శ్రీరాముడు తన పాదం మోపినపుడు నీకు శాపవిముక్తి కలుగుతుందని తెలిపాడు.

**iii. రంగనాథరామాయణము – అహల్య**

రంగనాథరామాయణములో గోనబుద్ధారెడ్డి సృష్టించిన అవాల్మీకాంశాలు మిక్కుటముగానే ఉన్నాయి. అవి చూద్దాం.

ఇంద్రుడు గౌతమాశ్రమానికి రావడానికి గల కారణము ఏమిటంటే గౌతముని తపస్సు భంగముచేయడానికి ఎలాగైనా అతనికి కోపం తెప్పించడం ద్వారా తపోభంగము చేయాలని ఇది అవాల్మీకం. మరియొక కల్పన – ఇంద్రుడు :

**"కుక్కుటంబైపోయి కుటజంబుసేరి**
**కొక్కొరొకోయని కూయ...."**

**– రంగనాథ రామాయణము (పుట.44)**

ఇంద్రుడు కోడిపుంజుగా మారి కొక్కొరొకోయని కూశాడు. కోడి కూత విని గౌతముడు నిజానుష్ఠానమునకు పోయాడు. అప్పుడు ఇంద్రుడు గౌతముని రూపము ధరించి అహల్య వద్దకు వచ్చి "నీ తోడి భోగేచ్ఛ కలదని" తెలుపగా అహల్య వచ్చినవాడు ఇంద్రుడని తెలిసి –

**"జలజాక్షి తన పర్ణశాలలోపలికి**
**బలభేది గొనిపోయి పరగక్రీడించె"**

**– రంగనాథ రామాయణము(పుట.44)**

ఇది మరియొక అవాల్మీకము, వాల్మీకి రామాయణములో వచ్చినవాడు ఇంద్రుడని తెలుసుకొన్న అహల్య వెళ్ళిపొమ్మని, గౌరవము నిల్పమని అంటుంది. కాని రంగనాథ రామాయణములో గౌతముని రూపంలో వచ్చినవాడు ఇంద్రుడని తెలిసి కూడా అతనితో క్రీడించిన దని గోనబుద్ధారెడ్డి కల్పించడం జరిగింది. అహల్య రజోగుణ స్వభావి. కావున ఇంద్రుడితో తన వాంఛ తీర్చుకొన్నదని చెప్పబడింది. గోనబుద్ధారెడ్డి అహల్య వ్యక్తిత్వము వాల్మీకి అహల్య వ్యక్తిత్వము కన్న దిగజారినది. వాల్మీకి గౌతముడు అహల్య ఏ తప్పు చేయకపోయినా శపించాడు. గోనబుద్ధారెడ్డి గౌతముడు అహల్య తప్పు చేసిందని తెలిసి శపించాడు.

**"అదరి గౌతముడహల్యాదేవి జూచి**
**పడతి పాషాణమై పడియుండు మీవు**
**కరముగ్రమగునెండ గాలిపెంధూళి**
**పొరలుచునెందును బొడగానబడక"**

**– రంగనాథరామాయణము (పుట:44)**

తెలుగువారికి బాగా తెలిసినది అహల్య రాయిగా మారినదని. తెలుగులో ఈ కల్పన మొదట చేసినది గోన బుద్ధారెడ్డి. ఇది వాల్మీకి రామాయణములో లేదు. దీనికి మూలము అధ్యాత్మ రామాయణములో ఉంది.

**"ఇనకులాధీశ్వరుడీత్రోవవచ్చు**
**తొలగిపోవక నిన్ను ద్రొక్కిన జాలు**
**జలజలోచననీదు శాపంబుదీఱు"**

**–రంగనాథరామాయణము(పుట.44)**

ఇది గోనబుద్ధారెడ్డి అహల్యను తీర్చిదిద్దిన తీరు.

**iv. భాస్కర రామాయణము – అహల్య**

భాస్కర రామాయణములో కూడా వాల్మీకి రామాయణములో ఉన్నట్లు కాకుండా రంగనాథ రామాయణములో ఉన్నట్లే కన్పించును.

గౌతముని వేషంలో వచ్చిన ఇంద్రుడు మోహితుడై అహల్యతో–

**"మార సుఖ క్రీడ తనుపు మక్కువతోడన్"**– భాస్కరరామాయణము (503.పుట.51)

**"అనుడునహల్యయింద్రుడు ప్రియంబున గౌతమవేషియైనవా**
**డని మదిలోనెఱింగి ముదమందగ నిక్కదరమ్ము గ్రక్కునన్**
**మనసిజు నమ్ములందునిసె మానము చిక్కిన మన్మథుండవై**
**ననురతి చాతురింగవిసి నన్నును నిన్నును గావునాతడున్"**

– భాస్కరరామాయణము (504.పుట.51)

వచ్చినవాడు ఇంద్రుడని తెలిసి అహల్య రమ్మని పిలిచిందని భాస్కర రామాయణ కర్త తెలిపాడు. గౌతముడు అహల్యకిచ్చిన శాపము రంగనాథ రామాయణములో వలె "పాషాణమై" పోవునట్లే ఉండెను.

**v. మొల్లరామాయణము – అహల్య**

మొల్లరామాయణములో మొల్ల అహల్య గురించి రెండు కంద పద్యాలు, ఒక వృత్త పద్యములో చెప్పెను.

**"పదనై, యొప్పిదమై, కదు**
**గదులుచు బంగారుపూదె కరగిన రీతిన్**
**మెదలుచు, లావణ్య స్థితి**
**సుదతిగ జూపట్టి నిలిచె సుర చిర లీలన్"**

– మొల్ల రామాయణము. 63 (పుట:67)

శ్రీరాముని పాద రజము సోకగానే బంగారు తీగలాగా అందంగా మారిందని చెప్పింది. కవయిత్రి మొల్ల, రాముని పాదధూళి మహిమయే మొల్ల చెప్పింది కాని అహల్య వృత్తాంతము చెప్పలేదు.కారణం ఒక మహిళగా మరలా ఆమె వృత్తాంతము చెప్పడం ఎందుకనుకున్నదో ఏమో, కనీసం 'అహల్య' పేరు కూడా లేదు. ఇంద్రుడి ప్రస్తావన అసలే లేదు. విశ్వామిత్రుని కూడా "ముదితాపసి", "మునివల్లభుడు" అన్నదే కాని విశ్వామిత్రుడనమాట ఈ సందర్భములో వాడకపోవడం చూడవచ్చు.

### vi. రామాభ్యుదయము – అహల్య

అయ్యలరాజు రామభద్రుడు తన రామాభ్యుదయ కావ్యంలో అహల్య వృత్తాంతమును కేవలము మూడు పద్యములలోనే పూర్తి చేసెను. దీనిలో అహల్య పూర్వ వృత్తాంతమును వర్ణింపక శ్రీరాముడి పాద ధూళి మహిమనే తెలిపెను.

**"శిల చిగురుబోడియై యుల్లసిల నొనర్చి**
**యెత్తిపోయిన గౌతము నిల్లు నిలిపె**
**నడుగుకెందమ్మి కమ్మపుప్పొడిన యింక**
**నేమని నుతింపవచ్చు శ్రీరామమహిమ"**

**– రామాభ్యుదయము. 57. పుట: 61**

### vii. శ్రీమద్రామాయణ కల్పవృక్షము – అహల్య

సకలోహసనాథమైన విశ్వనాథ రామాయణములో అహల్యను దిద్దితీర్చిన తీరు అద్భుతము. అహల్య కథ సున్నితమైనది. గౌతముడు తపస్వి. అహల్యలతాంగి. అహల్య రజోగుణ స్వభావురాలు. ఆమెలోని మోహమును వేలయేండ్లు బిగ్గపట్టినది. అవకాశం రాగానే మోహం కమ్ముకుంది. ఆ అవకాశము ఇంద్రుని రూపంలో వచ్చింది. ఇంద్రుడు గౌతమ వేషధారియై అహల్య కొరకు వచ్చాడు. అహల్య గుర్తించి **"పో! ముని చూచిన నీకు నాకును మతింత ప్రాణాంతక మా"**నని చెప్పింది. ఇంద్రుడు కామార్తుడు, ప్రాధేయ పడ్డాడు.**"అదనా ఇది కోడి కూసిందా"** అన్నది అహల్య. అప్పుడు ఇంద్రుడే కోడియై కూసెను. గౌతముడు బయటకు వెళ్ళెను. మాసిన అద్దంలో ప్రతిబింబమువలె ఆ చీకటిలో గౌతమునికి ఇంద్రుడు కనపడ్డాడు. అంతే గౌతముడు ఇద్దరినీ శపించాడు. ఇక్కడ వాల్మీకి విశ్వనాథల అహల్య ఇంద్రునితో సుఖాలనుభవించలేదు. కేవలము మానసిక, వాచిక సంసర్గమే కాని వేరు కాదు. విశ్వనాథ అహల్యను ఉదాత్తముగా చూపించెను. గౌతముడు ఇంద్రుని శపించిన తీరు అవాల్మీకము. వాల్మీకి గౌతముడు "అవృషణుడ" వగుమని శపించగా, విశ్వనాథ గౌతముడు

**"దేని జూచి యీ వికృతపు జేత దేనిగని వెక్కిలి పట్టెదొ దాని రూపముల్**
**వికృతముగాగ దేహమున వేయిధరింపుము నిత్యదర్శివై"**

–శ్రీమద్రామాయణకల్పవృక్షము. 532 పుట. 144

ఇక్కడ అధ్యాత్మరామాయణానుసరణము కన్పిస్తుంది.

విశ్వనాథ గౌతముడు అహల్యను **"ఒక ఊయివి కమ్ము"** అని శపించెను. ఇది అవాల్మీకమే అయిననూ, రంగనాథ రామాయణము ననుసరించెనని చెప్పవచ్చు. ఈ సందర్భంలో ఊయి తిరిగి అహల్యగా మారు పద్యము పరమ రమణీయము–

**సీ. ప్రభుమేనిపైగాలి పై వచ్చినంతనే పాషాణ మొకటికి స్పర్శవచ్చె**
**ప్రభుకాలిసవ్వడి ప్రాంతమైనంతనే శిలకొక్క దానికి జెవులుగలిగె**
**ప్రభుమేనినెత్తావి పరిమళించినతోన యశ్మంబు ఘ్రాణేంద్రియంబు జెందె**
**ప్రభునీలరత్నతోరణమంజులాంగంబు గనవచ్చి ఊతికి గనులు గలిగె**

**ఆ. ఆ ప్రభుండు వచ్చి యాతిథ్యమును**
**స్వీకరించినంత నుపలహృదయవీధి**
**నుపనిషద్వితాన మొలికి శ్రీరామ**
**భద్రాభిరామమూర్తి యగుచు దోచె. 554 (పుట. 147)**

శ్రీరాముని పాద ధూళి సోకినంతనే అహల్యలో లేశమాత్రంగా ఉన్న రజోగుణము పూర్తిగా సంస్కరింపబడి, సత్త్వగుణ సంపన్నురాలుగా మారింది. రాముని పద ధూళి మహిమ అలాంటిది.

**ఉపసంహారము :** ఎంత చదివినా తనివి తీరని వాటిలో రామాయణ, భారత, భాగవతములు మొదట చెప్పుకోదగినవి. మానవజాతి ఆవిర్భవించినప్పటి నుండి ఒక ధర్మమార్గంలో మానవుని నడిపించడంలో ఇవి కీలకపాత్ర పోషించుచున్నది. ఎన్నియుగాలు గడిచినా, ఎన్ని తరాలు మారినా, నదులు పర్వతములున్నంత వరకు మానవ జాతికి చుక్కాని అనదగినది రామాయణము. భారతీయ వివాహ వ్యవస్థ విశిష్టతను తెలియజెప్పుకథ అహల్య వృత్తాంతము. రజోగుణము నుండి సత్త్వగుణమునకు మారమని మానవజాతికి ఈ కథ ఉద్బోధిస్తుంది.

**ఉపయుక్త గ్రంథ సూచి**

1. భాస్కరుడు, హుళక్కి. భాస్కరరామాయణము

2. బుద్ధభూపతి, గోన. 1989. రంగనాథ రామాయణము. హైదరాబాదు, తెలుగు విశ్వవిద్యాలయము.

3. మొల్ల, ఆతుకూరి. 2013. మొల్ల రామాయణము. విజయవాడ: ఎమెస్కో బుక్స్.

4. రామభద్రుడు, అయ్యలరాజు. 1917. రామాభ్యుదయము. చెన్నపురి : వావిళ్ళ రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్.

5. వాల్మీకి, 2022. శ్రీమద్రామాయణము (వచనము) (పన్నెండవ ముద్రణ) గోరఖ్‌పూర్, గీతాప్రెస్.

6. సత్యనారాయణ, విశ్వనాథ. 2011. శ్రీమద్రామాయణ కల్పవృక్షము. (బాలకాండము) (ఎనిమిదవ ముద్రణ) విజయవాడ : శ్రీ విశ్వనాథ పబ్లికేషన్స్.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2025

# పిపీలకం




**డా. ఎన్. గోపి**

ఫోన్ : 93910 28496



పొద్దున్నే
టీపాయి మీద
సెల్ ఫోన్‌లో పాట వింటున్నాను
కిటికీలోంచి
చల్లటి గాలి మెలికలు తిరిగిపోత
వీస్తుంది.

ఎక్కడినుంచో
ఓ చీమ ప్రత్యక్షమైంది.
గుంపు నుంచి వీడిపోయి
ఒంటిరిగా తిరుగుతున్నట్టుంది
నా చూపు
పాటలోంచి చీమవైపు మళ్ళింది
పాటకోసమే ఆగినట్టుంది
ఇంతకూ చీమకు చెవులుంటాయా!



ఇంత చిన్న శరీరంలో
ఎంత పెద్ద ప్రపంచముందో!
చిట్టించి చూసే
చిన్నాతి చిన్న కళ్ళల్లో
పారవశ్యం కాబోలు!
'అబీ నా జావో చోడ్ కర్' గీతం
పరిసరాలను భావాశబలితం చేసింది
పాట ముగిసింది
మనసు తడిసింది
చూస్తే చీమలేదు
పాటను మోసుకుంటూ
ఎటో వెళ్ళిపోయింది
అన్నట్టూ
చీమ కూడా పాడుతుందా!



# మాదిగ ఉపకులాలు – సమగ్ర పరిచయం

**డా. పి. హంసమ్మ**, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు, వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, ఫోన్ : 7730047278

తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన ఘనత తెలంగాణా ప్రాంతానికి ఉంది. సాహితీ ప్రక్రియల విషయానికొస్తే తెలంగాణేతర ప్రాంతాలలో వచ్చిన సాహితీ ప్రక్రియలన్నీ ఈ ప్రాంతంలోనూ వెల్లివిరిశాయి. జీవన సమరంలో సాహిత్యం, గుండె చప్పుడులో పాట, ఆలోచనల్లో సృజనాత్మకత, పరసంస్కృతి ఉక్కు పిడికిల్లో చిక్కిన తెలుగు సంస్కృతిని పునరుజ్జీవించి చేయడానికి ఇక్కడి వారికి సాహిత్య ప్రక్రియలే ఉపకరణాలయ్యాయి. యక్షగానాలు, జానపద కళా రూపాలు (వందువారి భాగవతం, బైండ్లవారి జమడిక కథలు, నులక చందయ్య కులం వారి జాంబ పురాణ ప్రవచనాలు, చెక్క భజనలు, తందనాన రామాయణ, భారతాలు) జనం గుండెల్లోకి దూసుకెళ్ళి వారిని స్వభాష, స్వసంస్కృతిని పరిరక్షించుకునే చైతన్యానికి పురికొల్పాయి. ప్రధానంగా ఈ ప్రాంతంలో స్త్రీలు సంస్కృతి పరిరక్షణలో పురుషులతో సమానంగా తమ శక్తిని నిరూపించుకున్నారు.

జానపద సాహిత్యంలో **"మాదిగ ఉపకులాలు– సమగ్ర పరిచయం"** అనే అంశం ప్రత్యేకమైంది. సినిమాలు, టీ.వి.లు లేని కాలంలో మాదిగ ఉపకులాల వారి కళారూపాలు ఒక వెలుగు వెలిగాయి. అంతేకాకుండా, గ్రామీణ ప్రజలకు ఎంతో ఆనందాన్ని అందించాయి. ఎవరు ఎంత నిరాదరణ చూపినా, అవహేళన చేసినా గ్రామీణ ప్రజల హృదయాలమాటున దాగి, వారి స్వచ్ఛమైన ప్రేమను అనుభవిస్తూ జీవిస్తూ, నర్తిస్తూ ఈ కళారూపాలు కాలంతో కలిసి నడిచాయి. నేటికీ పల్లెలతోపాటు కొంతమేరకు ఇవి జీవించి ఉండడం హర్షించదగ్గ విశేషం.

అయితే, వ్యవస్థలో వచ్చిన మార్పులు జానపద విజ్ఞానంలో ఎంతో వికాసాన్ని తీసుకువచ్చినప్పటికీ కులాల పరంగా పరిశీలించినప్పుడు మిగిలిన కులాల మాట అటుంచితే ప్రధానంగా మాదిగ ఆశ్రిత కులాలు, వాటికి సంబంధించిన వృత్తి గాయకులు, వారి ప్రదర్శనలకు (కళారూపాలకు) ఆదరణ తగ్గుతూ వచ్చింది. ఇది గమనించకుండా ఉంటే దాదాపు ఈ కళారూపాలన్నీ కనుమరుగయ్యే స్థితిలో ఉండేవి. అంతేకాకుండా అమూల్యమైన మాదిగ ఉపకులాల సంస్కృతి మరుగునపడే అవకాశమూ లేకపోలేదు. గొప్ప వినోదాన్ని, విజ్ఞానాన్ని, సందేశాన్ని అందించే మాదిగ ఉపకులాలైన డక్కలి వారి కళారూపం, చిందువారి భాగవతం, బైండ్లవారి జముడిక కథలు, నులక చందయ్య కులం వారి జాంబ పురాణ ప్రవచనాలు ఇవి భావితరాలకు గతకాలపు గుర్తులుగా నిలిచిపోతున్న ఈ తరుణంలో వాటిని కనీస మాత్రమైనా తెలుసుకోవాలి, వాటిని రక్షించుకోవాలి.

మాదిగలను ఆశ్రయించి జీవించే ఆరు ఆశ్రిత కులాల గురించి వాటి కళారూపాల గురించి ప్రధానంగా సాహిత్య నేపథ్యంలో మాష్టికులం వారికి (మాదిగ ఉప కులాలలో ఒకటి) కళారూపం లేనందున కేవలం నాలుగు ఉపకులాల కళారూపాల సాహిత్యాన్ని గురించి ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది. ఈ నాలుగు మాదిగ ఉపకులాల సాహిత్యం ఎంతో విస్తృత పరిధి కలిగి ఉంది.

తెలంగాణ ప్రాంతాన్ని పరిధిగా గమనిస్తే ప్రత్యేకంగా కొన్ని ప్రాంతాలలో సమగ్ర సమాచారం లభిస్తున్నది. ఈ నేపథ్యంలో బీబీనగర్ ప్రాంతంలో కె. గోపయ్య వద్ద



**'బైండ్ల కులాల'** సాహిత్యం, రంగారెడ్డి జిల్లా మహేశ్వరం వద్ద కనకయ్య బృందంవారిచే **'నులక చందయ్య'**ల జాంబ పురాణ విషయం లభిస్తున్నది.

ఇంకా బాణాల రామయ్య బృందం, నష్కల్, వరంగల్ వారినుండి **'డక్కలివారి'** సాహిత్యాన్ని సేకరించగలిగాను. అలాగే **'చిందు భాగవత'** కళారూపాన్ని గజ్వేల్ : ఏసోబు, వరంగల్: గడ్డం స్వామి, భువనగిరి, నల్లగొండ: లంకె సైదులు, నిజామాబాద్: సావిత్రి, నిజామాబాద్, సత్తమ్మగారి నుండి సమాచారం లభిస్తున్నది. ఈ చిందుకులాల వారి సాహిత్యంలో ప్రాధాన్యత వహించింది **'గయోపాఖ్యానం, మాయాసుభద్ర విలాసం, మైరావణ చరిత్ర, భీమార్జున గర్వభంగం, ప్రహ్లాద చరిత్ర, రామాంజనేయ యుద్ధం'** మొదలైనవి.

**'కులవృత్తికి సాటిరారు గువ్వలచెన్నా'** అన్న మకుటంలోని కులం దాని తాలూకు ప్రకటితమైన సత్యంచిన్నవాడే మనసులో నాటుకుంది.

ఎవరూ ప్రత్యేకంగా ఈ కులంలో పుట్టాలని అనుకుని పుట్టరు కాని పుట్టిన తరువాతనే ఆ కులవ్యక్తులుగా గుర్తింపు పొందుతారు. ఇది జగమెరిగిన సత్యం అందులోనూ భారతీయ సమాజం మాత్రమే ఎరిగిన సత్యం ఎందుకంటే, ప్రపంచంలో ఎక్కడాలేని కుల ఆవరణం ఈ దేశ సమాజంలో వేళ్ళూనింది. కులాలు ఉండటం తప్పు



గాకున్నా ఆ కులంలోని మనుషులపట్ల నిరాదరణ, చులకనభావం కలిగి వుండడం అనేది ఏమాత్రం వాంఛనీయం గాదు.

ఈ విధమైన అసమానతలుగాని, వివక్షగాని సమాజాభివృద్ధికి అవరోధం అవుతాయి. అయితే కొన్ని సందర్భాల్లో అసమానతలు, వివక్షలు ఎదుర్కొన్న వారిలో పట్టుదలను రేకెత్తిస్తాయి. అలాంటి సమయంలో తమ అస్తిత్వం చాటుకోవడానికి కొంత పోరాట బాట పట్టవచ్చు. మరొక కోణంలో ఎదుగుదలకు మార్గాలను చూపే చదువు, ఆర్థికాభివృద్ధి మొదలైన విషయాలలో అవమానాలెదుర్కొంటున్న కులాలలో ఒక తరం కొత్త ఆలోచనలతో ముందుకు ఆదుగు వేయవచ్చు.

నిజానికి విద్య సమాజంలో ఎవ్వరికైనా వారి జీవితాలలో మార్పు తెస్తుంది. ఈ విధమైన ఆలోచనతో విద్యను లక్ష్యంగా అవరోధాలెదుర్కొంటూ పట్టుదలతో సాగిన ఈ ప్రయత్నంలో ఎంతో విస్తృతమైన పరిశీలనాత్మక, పరిశోధనాత్మక విషయాలలో ప్రత్యేక శ్రద్ధ కనపరచడం జరిగింది. జానపద ఆహార్య ప్రక్రియలైన బుర్రకథ, ఒగ్గుకథ, చిందు భాగోతం వంటి వాటిని ప్రత్యక్షంగా చూసిన కారణంగా వాటిని గురించి తెలుసుకోవాలన్న కుతూహలం పెరుగుతూ వచ్చింది.

నా చదువుతోపాటు వీటిని గురించిన విషయాలకు ప్రాధాన్యత నిస్తూ నాకు తెలిసినవాళ్ళని, కొన్ని సందర్భాలలో కళాకారులను కలిసి ఆసక్తిగా విషయాలు అడిగి తెలుసుకోవడం జరిగింది. సమాజంలో దళితులపట్ల చూపే నిరాదరణ, అవహేళనలు పత్రికలద్వారా గమనించిన విషయాలు నన్ను నేను చైతన్యపరచుకునే నేపథ్యంలో మాదిగ కుల సాహిత్యం లభ్యమయ్యేవరకూ వ్యక్తుల ద్వారా, గ్రంథాలయాలను దర్శించి గ్రంథాల సేకరణ ద్వారా ఒక ప్రత్యేక కోణంలో ఈ వ్యాసాన్ని రాస్తున్నాను.

మాదిగ సాహిత్యంలో ప్రాధాన్యత వహించిన కథ, నవల, నాటకం, కవిత్వం, స్త్రీవాద, దళితవాదంలో స్త్రీలద్వారా నిర్మితమైన సాహిత్యాన్ని అధ్యయనంచేసి ఈ సందర్భంలో మాదిగ కులానికి సంబంధించి కులోత్పత్తి గాథలు, మాదిగల ఇంటిపేర్లు, వారి వృత్తులు, కళలకు సంబంధించిన విషయాధ్యయనం చేస్తూ తెలంగాణ ప్రాంతంలోని మాదిగల సామాజిక జీవితంలోని అనేక అంశాలను వివరణాత్మకంగా అధ్యయనం చేశాను. ప్రధానంగా మాదిగజాతిలో విద్య, ఉపాధి, సంస్కారాలు తదితర అంశాలను కూడా అధ్యయనం చేశాను, విషయ సమాచారం సేకరిస్తున్న తరుణంలో మాదిగ కులంపై ఆధారపడిన ఉపకులాల (వీటినే ఆశ్రిత కులాలంటారు) గురించి ప్రత్యేక అధ్యయనం చేశాను.

మాదిగ ఉపకులాల సమాచారం కొరకు వివిధ ప్రాంతాలు, ఆశ్రిత కుల సాహిత్య సంబంధ గ్రంథాలను సేకరించాను. మాదిగ ఉపకులాన్ని మాదిగలను ఆశ్రయించి జీవిస్తున్నవే. అప్పటివరకు కుల పురాణాలగురించి లోతైన అవగాహనలేదు కానీ, వ్యాప్తంలోవున్న పురాణాలు, వ్యాస ప్రణీతం గురించిన అవగాహన ఉంది ఈ కారణంగా మాదిగ ఉపకులాల జీవిత వాతావరణాన్ని ప్రభావితం చేసిన సంస్కృతిని అధ్యయనం చేశాను. ప్రధానంగా మాదిగలను ఆశ్రయించి జీవించే ఉపకులాలు ఉన్నాయి. అవి డక్కలి, బైండ్ల, చిందు, నులక చందయ్యలు, బుడిగెజంగాలు, మాష్టివారిని, వారి కళల అధ్యయనం నేపథ్యంలో అనేక ప్రాంతాలను సందర్శించాను. ఎందరో వ్యక్తులను కలిసి చర్చించాను, తరువాత ఒక ప్రణాళిక ప్రకారంగా పరిశోధనాత్మకంగా అధ్యయనం చేపట్టిన తరుణంలో ముందుగా మాదిగ కులం పుట్టు పూర్వోత్తరాలు, విషయసేకరణ చేశాను. ఆది జాంబవుడు, మాతంగ మహర్షి కథనాలను సేకరించాను.

మాదిగ ఆశ్రిత కులాల ఉత్పత్తి గాథలను కూడా సేకరించి అధ్యయనం చేస్తున్న తరుణంలో మాదిగ ఉపకులాలు, మాదిగ కులం వారిని త్యాగం (దీనినే మిరాశి అంటారు) అడగడం అన్న విషయం దృష్టికొచ్చింది. దానికి సంబంధించిన మూలాలను వెతికే ప్రయత్నంలో రచయితలను, అధ్యాపకులను, ఆచార్యులను సంప్రదించాను. అలాగే ఆచార్య పులికొండ సుబ్బాచారి, ఆచార్య చింతల యాదయ్య, ఆచార్య ఎన్. ఆర్. వెంకటేశం. ఆచార్య ఆర్వీఎస్ సుందరం, పుస్తకాల అధ్యయనం ద్వారా 'మిరాశి' త్యాగం గురించిన విషయం లభించింది.

అసలు 'మిరాశి' లేదా 'త్యాగం' అంటే మాదిగ కులం లేదా ఆ కులంలోని ఉపకులాల వాడు ప్రదర్శించే కళాప్రదర్శనల ద్వారా తెలుస్తుంది. ఉదాహరణకు చిందు భాగోతం వారు చిందు యక్షగానం ప్రదర్శన మాదిగ కులంవారిని వారి పోషణ నిమిత్తం నగదు. బియ్యం అడగడాన్ని త్యాగం అని లేదా మిరాశి అని అంటారు.

మాదిగ ఉపకులాలవారు త్యాగం అడుగుతూ కళా ప్రదర్శనలిస్తూ సంవత్సరంలో 8 నెలలు గ్రామాలు తిరిగి త్యాగం రాబడ్డారు. ఇది అన్ని కులాలలోను అగ్ర కులాలకన్నా దిగువన ఉన్న కులాలలో సర్వసాధారణ విషయం అని నాకు అవగతమైంది.

భారతీయ సమాజంలో కులం అనేది ఒక ప్రత్యేక స్థానంగా పరిగణింప బడుతోంది మాదిగలు ఆదిమజాతులై ఉండి కూడా అస్పృశ్యులుగా సమాజంలో ముద్రవేయబడి అణచివేతలను సహిస్తూ

వారికి కలిగిన శక్తితో అందుబాటులో ఉన్న వృత్తులను చేసుకుంటూ జీవనయాత్ర సాగిస్తున్నారు జీవనం కొరకు రక్తాన్ని చెమటగా మార్చి ధారపోసి ఉత్కృష్టమైన జాతిగా మాదిగజాతి ప్రఖ్యాతమయ్యింది.

మాదిగజాతి మూలాలను పరిశీలిస్తే ప్రధానంగా జాంబవంతులు గాను, మాతంగులుగాను, చర్మకారులుగాను, అరుంధతీయులుగాను పిలువబడుతున్నారు.

కులం అనేది ఈ దేశ సమాజానికి పరిమితమైన ఒకానొక సాంఘిక వ్యవస్థ. అయితే, కులానికే ప్రాధాన్యత ఉన్నప్పుడు కులానికీ, వృత్తికీ ఉండే సంబంధం సాంప్రదాయకంగా కొనసాగుతూ వచ్చింది ఒక కులం వారి సాంప్రదాయకమైన వృత్తిని చేయటం ఇంకా కొనసాగుతూనే ఉంది. వీటికి అనేక చారిత్రక ఆధారాలు కూడ కనిపిస్తాయి. అలాగే ఆ కులాన్ని ఆశ్రయించుకున్న కులాలు (వీటినే అశ్రితకులాలుగా పేర్కొనడం జరిగింది) తమ ఉనికిని చాటుకోవడం కూడా కనిపిస్తుంది. ఈ ఆశ్రిత కులాలు, ఆ కులాల కున్న వృత్తి స్వభావాన్ని ఆశ్రయించుకొని, వాటికి సంబంధించిన పురాణ కథలను పాడుతూ పోషించే దాతలనుండి తమ జీవనానికి కావలసిన వస్తూత్పత్తిని పొందడంవల్ల ఈ అశ్రితకులాలు ప్రధానంగా మాదిగ కులంలో ఉపకులాలుగా చేర్చబడ్డాయి.

ఆశ్రితకులాలు అనేవి మిగతా అన్ని కులాలతో ఎప్పుడూ విభేదించలేదు. ఇవి కూడా సమాజంలో గుర్తింపుపొందిన కులాలుగానే ప్రసిద్ధమౌతున్నాయి. ఎటొచ్చీ ఈ కులాలకు ఆశ్రితత్వం అనేది జోడించబడడం వల్ల ఇది అక్రితకులాలు అవుతున్నాయి. ప్రధానంగా ఈ కులవర్గాలు వ్యవసాయం, వృత్తి, వ్యాపారం, కళా ప్రదర్శన, హస్తకళలు మొదలైనవన్నీ కులవృత్తులుగా పేర్కొనడం

ఆశ్రిత కులాలకు వాటిని పోషించే దాతృకులాలకు ఉన్న సంబంధం కూడా ఒక సామాజిక వ్యవస్థగా చెప్పుకోవచ్చు. ప్రధానంగా ఆశ్రిత వ్యవస్థలలో నియతాశ్రయం, మిరాశి హక్కులు, కాలనియతి అనేవి ప్రాధాన్యత వహిస్తాయి. ఆశ్రిత కులవ్యవస్థ ఈనాడు ఉపకుల వ్యవస్థగా పిలువబడుతోంది. అయితే, ఒకనాడు ప్రధానంగా మాదిగ ఉపకులాలలో పేర్కొనబడిన చిందు, డక్కుల, బుడిగెజంగాలు, బైండ్లు, మాస్టి, మోచి అనేవి కథాగానాన్ని ప్రధానంగా తమను ఎవరైతే పోషిస్తున్నారో వారి సామాజిక స్థితి ఉన్నతం కావడానికి దాతల వంశకీర్తిని పురాణాల ద్వారా ఉన్నతం చేయడానికి ఈ కుల పురాణ ప్రక్రియను నిర్వహించడం జరుగుతోంది.

ఈ కుల పురాణాలు కులాల్లోని న్యూనతాభావాన్ని తొలగించే ఆత్మ చైతన్యాన్ని ఆశ్రితకులాల వారు కుల పురాణాల ద్వారా ప్రచారం చేస్తున్నారు. ఈ విధానం శతాబ్దాలుగా మౌళికరూపంలో కొనసాగుతూనే ఉన్నాయి. ఈ కుల పురాణాల నేపథ్యంలో వాటిని తెలియజేసే ఆశ్రితకులాలవారు ప్రధానంగా దాతృకులంలోని చారిత్రక పురుషులను వారికి సంబంధించిన కథలను ప్రదర్శిస్తున్నారు. ఈ



కుల పురాణం ప్రదర్శించడంలో దాతల వృత్తిని, ఉనికిని గౌరవించే విధానం కనిపిస్తుంది. మాదిగల్లో చిందులవారు తెలియజేసే జాంబ పురాణ వృత్తులను గురించి తెలియజేస్తుంది.

మాదిగలకు సంబంధించి అనేక ఉపకులాలు ఉన్నప్పటికీ ముఖ్యంగా ఆరు ఉపకులాలు 1. చిందు 2. డక్కలి 3. బైండ్ల 4. మాస్ట 5. బుడిగె జంగాలు 6. నులకచందయ్యలు మొదలైన ఆశ్రిత కులాలు. ఆయా ఉపకులాల్లోనివారు కూడా వారి సంస్కృతికి దూరమై తిరిగి వాటిని వెతుక్కోవలసిన అవసరం ఏర్పడింది. సాహిత్యపరంగా పరిశీలిస్తే, ఆశ్రితకులాల ప్రసక్తి శుకసప్తతి, హంసవింశతివంటి కావ్యాల్లో కనిపిస్తుంది.

మాదిగలకు ఆశ్రితులైన బవనీల ప్రసక్తి క్రీడాభిరామంలో కనిపిస్తుంది. దీనివల్ల బవనీల ఆశ్రిత సంప్రదాయం క్రీడాభిరామం కాలం నాటికే ఉందనే విషయం స్పష్టమౌతోంది. మరో సాహిత్య ఆధారం అడిదము సూరకవి తన రామలింగేశ శతకంలో అన్యాపదేశంగా తెలియజేశాడు.

ఆశ్రిత కుల పురాణాలు ఆ ఆశ్రిత గాయకులచేత ప్రచారంలోకి వస్తున్నవి లిఖిత సాహిత్య సంప్రదాయంలోకి ప్రవేశించడం ఇటీవల పరిణామంగా చెప్పుకోవచ్చు. ఈ కుల కథలు, పురాణ కథలు ఎక్కువభాగం మౌఖికంగా ఆశ్రిత గాయకుల వద్ద గేయంగానూ, వచన కథగానూ రెండు మిశ్రితమైన రూపలలో కనిపిస్తున్నాయి. నిజానికి కులం కథ ఒక పవిత్ర కథ. దీనిని అశ్రితకులాలవారు దైవంగా భావిస్తారు. ఎందుకంటే, ఆ కథలు కల్పితం కానివని, ఆ కులాలు స్పష్టంగా నమ్మిన కారణంగా వీటికి ఆ స్థాయి లభించింది.

తెలుగులో 1990వ దశకం నుండే దళిత సాహిత్యం మీద పరిశోధనలు మొదలైనాయి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 'తెలుగునవల – అస్పృశ్యత' పై సాగిన పరిశోధనలో దళిత సాహిత్య పరిశోధన ఊపందుకుంది తర్వాత ఊదరి నారాయణ 'తెలుగు దళిత సాహిత్యం–పరిశీలన (ఉవి) కె లక్ష్మీనారాయణ తెలుగు దళిత కథ', ఆ తర్వాత డా. గడ్డం మోహన్ రావు 'చిందువారి సాహిత్యం'పై పరిశోధన చేశారు.

దళిత కవిత్వం, కథలకు భిన్నంగా, మాదిగ ఉపకులాల సాహిత్యంపై పరిశోధనలు జరగలేదు. మాదిగ ఉపకులాల సంస్కృతి, సాహిత్యాన్ని చారిత్రక దృష్టి నుండి పరిశీలించాలి. ఆధిపత్య సంస్కృతికి భిన్నమైన సంస్కృతి మాదిగలది. ప్రత్యామ్నాయ సంస్కృతి అని ప్రధాన స్రవంతి విమర్శకులు అంగీకరించారు. సంస్కృతి, సాహిత్య రంగాలను సుసంపన్నం చేసిన మాదిగ సాహిత్యాన్ని దళిత సాహిత్యంలో అంతర్భాగంగా విమర్శకులు గుర్తిస్తున్నారు.

నాకు జానపద సాహిత్యంపై ఉన్న ఆసక్తి కారణంగా ప్రధానంగా మాదిగలను ఆశ్రయించి జీవించే ఉపకులాలు వాటికి సంబంధించిన కళారూపాలను, ఆ మాదిగ ఉప కులాలలోని సాహితీ కర్తలను తెలియజేసే ప్రయత్నంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకున్నాను. కేవలం తెలంగాణా ప్రాంతానికే పరిమితం చేయడం జరిగింది. ఎందుకంటే ఈ ప్రాంతంలో చిందు, డక్కలి కళారూపాలు ఎక్కువగా ప్రదర్శిత మవుతున్నాయి. ఈ కారణంగా మాదిగ ఉపకులాల సాహిత్యాన్ని, ప్రదర్శనా సాహిత్యాన్ని ఒక ప్రత్యేక అధ్యయనం చేసే నేపథ్యంలో కొంతవరకైనా వారి గురించిన సమాచారం గ్రంథస్థం చేయడమే నా లక్ష్యం.

మాదిగ ఉపకులాల కళారూపాలను, వారి సాహిత్యాన్ని ఒక ప్రత్యేక అధ్యయనకోణంగా చర్చించడం జరిగింది. ఉదాహరణకు మాదిగ ఉప కులాలవారు చెప్పే జాంబపురాణం కథాగానంలోను, ప్రదర్శనలోను కొంత వ్యత్యాసాలు చోటుచేసుకుంటాయి. డక్కలివారు జాంబపురాణాన్ని అష్టాదశ పురాణాలకు సమాంతర పురాణంగా తెలియజేసారు. అంతేకాకుండా మాదిగ ఉప కులాల సాహిత్యం అతి ప్రాచీనమైనదని, బ్రహ్మాండ ఆవిర్భావంలో తొలిపురుషుడు జాంబవంతుడే.

ఈ మాదిగ ఉపకులాల సాహిత్య విజ్ఞానం వారి పూర్వీకుల నుండి సంక్రమించినప్పటికీ అది సార్వజనీనతను, సార్వకాలీనతను కలిగివుంది. వర్తమానంలోని మాదిగ ఉప కులాలవారు తమ పూర్వీకుల విజ్ఞాన భాండాగారాన్ని అనేక కారణాల వల్ల దూరంచేసుకుంటున్నారు. అందుకనే ఈ విషయాన్ని గమనించి ముందుతరాలవారికి ఒక నిధిగా అందించే ప్రయత్నంలో ఈ వ్యాసం.

వ్యాస రచనలో భాగంగా నేను అనేక ప్రాంతాలను పర్యటించి మాదిగ ఉపకులాలవారి సాహిత్యం, జీవనవిధానం, ముద్రిత లిఖిత కథలు, వారి సాంస్కృతికత ఈ విధంగా అనేక అంశాలు వారి నుండి సమాచారం సేకరించాను.

# నేను మీ నాన్నను...!

**డా. మహమ్మద్ హసన్**
ఫోన్ : 9908059234

నేను మీ నాన్నను
నా కలల్ని త్యాగం చేసుకుని
మీ కలలను సాకారం చేశాను
నేను ఆత్మను ఎవరైతే ప్రళయం సృష్టించారో...!
మీరు సుఖాలను పొంది
నాకు ప్రతిగా ఏమిచ్చారు..?
బహుమతిగా ఇచ్చిందేమిటి...?
నాకు చూయించండి నా ఇల్లు ఎక్కడ...?
వినండి నా ప్రియ తనుజులారా...
నా కథను,గాధను
ఎప్పుడైనా అడిగారా...?
“నాన్న “ఎటు వెళ్లింది మీ “రంగుల బాల్యం” అని...?
గుర్తుంచుకోండి మీరు లేని ప్రపంచాన్ని నేను ఊహించలేదు...!
నా “యవ్వనం” మొత్తాన్ని మీ “క్షేమం” కోసమే ధారపోశాను.
మీరు యవ్వనంలో నేను వృద్ధాప్యంలో..!
చూస్తుండగానే రోజులు గడిచి మృత్యువుకు దగ్గరగా..!
నాకు చూయించండి నా ఇల్లు ఎక్కడ..?
నేను మీ నాన్నను
నా కలల్ని దూరం చేసుకుని
మీ కలల్ని సాకారం చేశాను....



ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8 21 హైదరాబాద్ జూన్ : 2025

# శ్రీనాథుని ఉద్దండలీల, ఉభయవాక్ప్రౌఢి : వక్రతా వ్యాపార సమన్వయం

**డా. వేముల శరణ్య,** తెలుగు అధ్యాపకురాలు, తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఆర్మూర్.
ఫోన్ : 9493613830

**వ్యాస సంగ్రహం**

ప్రతి కవికి ఒక శైలి ఉంటుంది. కావ్య రచనలో వైవిధ్యం ఉంటుంది. ప్రత్యేకమైన ముద్ర ఉంటుంది. అయితే విలక్షణమైన ముద్రతో సహృదయులను గెల్చుకొని, తమ కావ్యాలు చిరకాలం ఉండేలా ఉత్కృష్టమైన రచనలు చేసే కవులు కొందరే ఉంటారు. అటువంటి ఉత్కృష్టమైన కవులలో 'కవి సార్వభౌముడైన' శ్రీనాథుడు ఒకడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. శ్రీనాథుడు తన కవితా రీతులను చెప్పే క్రమంలో పూర్వ కవుల కవితా గుణాలు తనలో ఉన్నాయని **"వచియింతు వేములవాడ భీమన భంగి"** అనే పద్యంలో వేములవాడ భీమన ఉద్దండలీల, నన్నయ ఉభయవాక్ప్రౌఢిని ప్రస్తావించాడు . శ్రీనాథుని కవితా మార్గం గూర్చి పండిత లోకంలో పలు రకాల చర్చలు జరిగాయి. శ్రీనాథుడు కుంతకుని వక్రోక్తి మార్గాన్ని అనుసరించాడనే విషయాన్ని తెలియజేస్తూ, ఆ సిద్ధాంతంలోనే ఉద్దండలీల, ఉభయవాక్ప్రౌఢి అంతర్భవిస్తాయని నిరూపించటమే ఈ పత్ర ముఖ్యఉద్దేశ్యం.

**కీలకపదాలు :** ప్రవేశిక, శ్రీనాథుని కవితాగుణాలు, వక్రతా భేదాలు, ఉద్దండలీల, ఉభయవాక్ప్రౌఢి.

**పరిచయం**

శ్రీనాథ కవిసార్వభౌముని కవితామార్గం అనితర సాధ్యం. చిరస్మరణీయం. మధురమధు సంభరితం. అతని కవితా శైలి గొప్పదనాన్ని కలిగి ఉంది. ఎంతోమంది కవులు, విమర్శకులు శ్రీనాథుని కవితా మార్గ చర్చ చేసారు. తమవైన అభిప్రాయాలను వెల్లడించారు. శబ్దార్థ సౌష్టవంతో కూడిన అతని రచన తర్వాత కవులకు అనుసరణీయమైంది. అది శ్రీనాథుని రచనామార్గ వైశిష్ట్యంగా చెప్పవచ్చు. **"శ్రీనాథ కవితా మార్గాన్ని గురిచి ముఖ్యంగా మూడు వాదాలు పండితలోకంలో ప్రచారంలో ఉన్నాయి. 1) అతడు రీతిని ఆదరించినంతగా రసమును పోషించలేదని, 2) అతని కవిత వక్రోక్తి జీవితం సాగించినదని, 3) అతడు రసానికి ఉచితమైన రీతిని ప్రవర్తింపజేయడంలో అందె వైచిన చేయి అని"**
(జి.వి.ఎస్. 2012. పుట. 107).

శ్రీనాథుని రచన అయిన భీమఖండంలో తన కవితా మార్గం గూర్చి శ్రీనాథుడే స్వయంగా **'హరచుడా హరిణాంక వక్రత కాలంతర స్ఫురచ్చండికా పరిశోద్గాఢ పయోధర స్ఫుటతటీ పర్యంత కాఠిన్యము నన్'** అంటూ వక్రోక్తిని, కాఠిన్యాన్ని, సరసత్వాన్ని సూచించాడు. అలాగే సుకవి స్తుతి సందర్భంలో శ్రీనాథుడు తన పూర్వకవులైన నన్నయ, తిక్కన, ఎఱ్ఱన కవులమార్గాన్ని, సంస్కృతకవులను అనుసరిస్తానని చెప్పాడు.

**వచియింతు వేములవాడ భీమన భంగి,**
**ఉద్దండలీలనొక్కొక్కమాటు**
**భాషింతు నన్నయభట్టు మార్గంబున నుభయ**



**వాక్ప్రౌడి నొక్కొక్కమాటు**
**వాక్రంతు తిక్కయజ్వప్రకారము రసాభ్యుచిత**
**బంధముగ నొక్కొక్కమాటు**
**పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరునిఠేవ**
**సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు**
**నైషధాది మహాప్రబంధములు పెక్కు**
**చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ**
**యిప్పుడు చెప్పఁదొడంగిన యీ ప్రబంధ**
**మంకితము సేయు వీరభద్రయ్య పేర**
(కాశీఖండం. పీఠిక 18 పద్యం)

వేములవాడ భీమనలో ఉన్న ఉద్దండత, నన్నయలో గల తెలుగు, సంస్కృత భాషల్లోని ఉభయ వాక్ప్రౌఢి, సందర్భానుసారంగా ఉపయోగించే తిక్కన రసాభ్యుచితబంధం, ఎఱ్ఱన సూక్తివైచిత్రి నీ లోపల ఉన్నాయి. ఎంతో మంచి కావ్యాలను రాసిన నీవు వీరభద్రా రెడ్డికి ఈ కాశీఖండం అనే ప్రబంధాన్ని అంకితం ఇవ్వు అని వేమారెడ్డి అడిగినట్లుగా తన కవితా మార్గం గురించి తానే చెప్పుకున్నాడు. ఈ నాలుగు కవితా లక్షణాలను కొంత సునిశితంగా పరిశీలించవలసిన అవసరం ఉంది. శ్రీనాథుని కవితా మార్గ నిర్ధారణకు

వీటన్నింటిని పరిశీలించడం తప్పనిసరి. కాబట్టి వేములవాడ భీమన ఉద్దండలీల, నన్నయ ఉభయ వాక్ప్రౌఢి, తిక్కన రసాభ్యుచితబంధం, ఎర్రన సూక్తి వైచిత్రి అంటే అర్థవివరణ చేసి వాటిని పరిశీలన చేయవలసి ఉంది. అప్పుడే శ్రీనాథుని రచనలలో విశిష్టత తెలుస్తుంది. పూర్వ పరిశోధకుల అభిప్రాయాలని అనుసరిస్తూ, శ్రీనాథుని కృతులను ఆధారం చేసుకొని కవి అసలైన కవితా మార్గం ఏమిటో నిర్ధారణ చేయవలసిన అవసరం ఉంది. పూర్వ పరిశోధనలు కొంత వరకు వక్రోక్తిని చర్చించాయి, కానీ పూర్తిగా ఈ వక్రోక్తి కోణంలోనే సిద్ధాంత సమన్వయం చేయలేదు. సంస్కృత ఆలంకారికుడైన కుంతకుని వక్రోక్తి సిద్ధాంతాన్ని శ్రీనాథుడు అనుసరించాడని, తను చెప్పిన కవితా గుణాలతో పాటుగా ఉద్దండలీల, ఉభయవాక్ప్రౌఢి కుంతకుని వక్రోక్తిలో అంతర్భవిస్తాయని నేను భావిస్తున్నాను.

**కుంతకుని వక్రోక్తి సిద్ధాంత భేదాలు**

కుంతకుడు 'వక్రోక్తి జీవితం' అనే గ్రంథంలో ప్రధానంగా ఆరు రకాల వక్రతలను తెలిపాడు. మొదటి ఉన్మేషంలో కావ్యం అంటే ఏంటో తెలిపి, ఎలా ఉండాలో వివరిస్తూ ఆరు రకాల వక్రతల పేర్లు తెలిపాడు. రెండవ ఉన్మేషంలో వర్ణవిన్యాస వక్రత ప్రతిపాదనతో ప్రారంభమయి పద పూర్వార్ధ, పద పరార్ధ వక్రతలని తెలిపి వాటికి అనేక భేదాలను తెలిపాడు. మూడవ ఉన్మేషంలో వాక్య వక్రత, నాల్గవ ఉన్మేషంలో ప్రకరణ వక్రత, ప్రబంధ వక్రతలను తెలిపాడు.

**ప్రధానంగా ఆరు రకాల వక్రతలు**

1) వర్ణ విన్యాస వక్రత 2) పదపూర్వార్ధ వక్రత

3) పద పరార్ధ వక్రత 4) వాక్య వక్రత

5) ప్రకరణ వక్రత 6) ప్రబంధ వక్రత

**వర్ణ విన్యాస వక్రత**

ఈ ఆరురకాల వక్రతల్లో మొదటిది వర్ణ విన్యాస వక్రత. ఇందులో ఆరు రకాల అంతర్విభజనలు ఉన్నాయి. వర్ణవిన్యాస వక్రతలోని 'వర్ణం' అనే పదం అచ్చుకు సంబంధించినది కాదు. హల్లుకు చెందినదని బాలానందిని వ్యాఖ్యానంతో 'వక్రోక్తి జీవితంలో' వివరించిన "ప్రసిద్ధి ననుసరించి, ఇచట వర్ణ శబ్దమునకు వ్యంజనము (హల్లు) అని యర్థము" (రామచంద్రుడు, పుల్లెల. 2007.పుట. 158) అని చెప్పారు.

**"ఏకోద్వౌ బహవో వర్ణాబధ్యమానాః పునః పునః**
**స్వల్పాన్తరా స్త్రిథా సోక్తా వర్ణవిన్యాస వక్రతా"**

**(వక్రోక్తిజీవితం. 2-1)**

ఒకటి లేదా, రెండు లేదా అంతకంటె అధికమైన వర్ణాలు తక్కువ వ్యవధానంతో మాటిమాటికి కూర్చబడితే అది మూడు విధాలైన వర్ణవిన్యాస వక్రతగా చెప్పబడింది.

వర్ణాలు పదే పదే ఆవృత్తమయ్యే శబ్ద సౌందర్యాన్ని కుంతకుడు వర్ణవిన్యాస వక్రతగా తెలిపాడు. దానినే ఇతర ఆలంకారికులు శబ్దాలంకారంగా తెలిపారు.

వర్ణవిన్యాస వక్రతను ప్రధానంగా మూడు రకాలుగా చెప్పాడు.

1) ఏకవర్ణ పునరావృత్తి 2) ద్వివర్ణ పునరావృత్తి 3) బహువర్ణ పునరావృత్తి.

వీటితోపాటు మరో మూడు రకాల వక్రతలను తెలుపుతూ

**"వర్గాన్తయోగినః స్పర్శా ద్వియుక్తాస్తలనాదయః**
**శిష్టాశ్చరాది సంయుక్తాః ప్రస్తుతౌచిత్య శోభినః"**

**(వక్రోక్తిజీవితం. 2-2)**

వర్గ పంచమాక్షరాలతో కూడిన స్పర్శ వర్ణాలు 'క'కారం మొదలుకొని 'మ'కారం వరకు పునరావృత్తం కావటం, త, ల, న మొదలైనవి ద్విరుక్తాలుగా రావటం, అలాగే రేఫాది సంయుక్తాక్షర ములు రావటం వలన శోభ కలగటం కూడా వక్రతగా తెలిపాడు. మరో మూడు రకాల వర్ణవిన్యాస వక్రతలను ఈ కారికలో వివరించాడు.

1) స్పర్శాలు వర్గపంచమాక్షరాలతో కలిసి రావటం.

2) ద్విరుక్తములైన త, ల, న వర్ణాలు పునరావృత్తం కావటం.

3) రేఫాది సంయుక్త వర్ణాలు ఆవృత్తం కావటం.

ఇలా వర్ణవిన్యాస వక్రత ఆరు విధాలు. ఇవన్నీ శబ్ద సంబంధమైనవి.

**ఉద్దండలీల**

శ్రీనాథుడు వేములవాడ భీమన రచనల్లోని ఉద్దండలీల తన కవిత్వంలో కనిపిస్తుందని చెప్పాడు. అసలు ఉద్దండలీల అంటే ఏమిటి? దాన్ని ఏ అర్థంలో శ్రీనాథుడు స్వీకరించాడనే విషయాన్ని ముందు తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. 'ఉద్దండ' అనే పదానికి జన వ్యవహారంలో విజృంభించు అనే అర్థం ఉంది. ఇవి కాకుండా **"ఎత్తబడిన కర్రగలది, పైకి లేచినకాడగలది, ప్రచండమైనది, భయంకర మైనది, ఉత్కటము, ఎక్కువైనది, పొడువైనది, ఉన్నత మగుదండము, అతిశయించు, విజృంభించు"** (1979.పుట.586) అనే అర్థాలున్నట్లు శ్రీ సూర్యరాయాంధ్ర నిఘంటువుల్లో అర్థాలు పేర్కొన్నారు.

**'భీమన ఉద్దండలీల'** అనేది శబ్దానికి సంబంధించినట్టిది. శబ్ద ప్రయోగంలో ఉద్దండత అనేది ఉచ్చారణలో కనిపిస్తుంది. దీని శబ్ద వక్రత, వర్ణవిన్యాస వక్రతగా కూడా చెప్పవచ్చు. శ్రీనాథుని భావనలో ఉద్దండత కాఠిన్యంగా, శబ్ద ప్రౌఢిమగా చెప్పవచ్చు. ఇక్కడ అతిశయించడం, శబ్ద విజృంభణ చేయడం, ఎడతెరిపి లేని సమాస భూయిష్ఠ పదాలను వాడటం అని గ్రహించాలి. శ్రీనాథుని పద్యాల్లోని ఉద్దండలీల ఏ విధంగా వక్రోక్తిలో అంతర్భవిస్తుందో చూద్దాం.

ఉద్దండలీల – వర్ణవిన్యాస వక్రత సమన్వయము

"ఆడెందాండవ మార్భటీ పటహలీలాటోప విస్ఫూర్జిత
క్రీడాడంబర ముల్లసిల్ల గరళగ్రీవుండు జూటాటవీ
క్రోడా ఘాట కరోటి కోటర కుటీ కోటీలురత్సింధు వీ
చీ డోలా పటలీ పరిస్ఫుటతం స్ఫీత ధ్వని ప్రౌఢిమన్"
(భీమఖండం. 148 పద్యం)

మహాశివుడు తాండవము చేసే సందర్భంలోనిది ఈ పద్యం. అడవిలో ఉన్న గంగాదేవి ఆ తాండవ వేగానికి అటు ఇటు కొట్టుకుంటున్నది. శివుని మెడలోని కపాల మాలికలు కదులుతూ ధ్వనిస్తున్నాయి. ప్రమథుల వాద్యాలు బిగ్గరగా మోగుతున్నాయి. శివుని తాండవానికి గొప్ప ధ్వని ఉద్భవించిందని చెప్పే పద్యం. ఇందులో 'ట' అనేక మార్లు ఆవృత్తమై పద్యానికి నాద సౌష్ఠవాన్ని తెచ్చి పెట్టింది. నిజంగా శివుని తాండవ ధ్వనిని తలపించేలా చేసింది ఈ 'ట' కార శబ్దమేమో అన్నట్లుగా ఉంది. అనేకమార్లు ఒకే అక్షరం ఆవృత్తం కావటం వల్ల పద్య సౌందర్యం ఏర్పడింది. శ్రీనాథుడు తన కవిత్వంలో వేములవాడ భీమన ఉద్దండలీల ఉంటుందని చెప్పిన విధంగానే ఈ పద్యం విజృంభణతో ఉద్ధతత్వాన్ని కలిగి ఉన్నది. ఉద్దండతకు చెందిన పద్యం ఏకవర్ణ పునరావృత్తి వల్ల పదసౌందర్యాన్ని పొందింది కనుక ఇది వక్రతలో అంతర్భవించిందని చెప్పవచ్చు.

"ధాటీఘోటక రత్న ఘట్టనమిళద్ద్రాఘిష్ఠ కళ్యాణ ఘం
టాటంకార విలుంఠలుంఠిమహోన్మత్తాహిత క్షోణిభృ
త్కోటీరాంకితకుంభినీ ధర సముత్కూటాటవీఝూటక
ర్ణాటాంధ్రాధిప! సాంపరాయని తెలుంగా! నీకు బ్రహ్మాయువౌ"
(చాటుపద్యమణిమంజరి, ప్రథమభాగం. 295 పద్యం)

తెలుగు రాయని శౌర్య ప్రతాపాలను పొగుడుతూ రాయని జాతి అశ్వాలు శత్రుసైన్యపు అశ్వాల మీద దూకినపుడు వాటి జీనులు ఒకదానితో ఒకటి రాసుకొని శబ్దం విపరీతంగా వచ్చిందని, ఘంటా టంకార పదాలను వాడాడు. శత్రువర్గం తలలు తెగి వారి అరణాల్లో దొర్లాయి అంతటి శౌర్య ప్రతాపం నీది. నీకు దీర్ఘాయుష్షు కలగాలని చెప్పిన పద్యం ఇది. ఇందులో 'ధా'టీఘోటక, ఘంటాటంకార, భృత్కోటీ, సముత్కూటాటవీ, ఝూటకర్ణాలు పదాల్లో పలుమార్లు 'ట' కారం ఆవృత్తం కావటం రాజు యుద్ధరంగాన్ని తలపించింది. ఏకవర్ణావృత్తం నాద సౌష్టవాన్ని ఇచ్చింది. ఉద్దండతను కూడా ఈ అక్షరాలే తెలిపాయా అన్నట్లనిపించింది. 'ట'వర్ణంతోపాటు సంయుక్తాక్షర పదప్రయోగం కూడా పద్య సౌందర్యాన్ని పెంచింది. ఇది కూడా వర్ణవిన్యాస అంతర్భావమే.

ద్రాఘిష్ఠ కఠిన దంష్ట్రా దండ సంఘట్ట
కటుఘోర కిటకిటాత్కార మగుచుఁ
జటుల ఝుంఝూమరు ఝంపా పరంపరా
సన్నిభ ఘ్రాణ నిశ్వాస మగుచు
వికలతారకచంద్ర విభ్రాంతి భీషణ,
స్ఫార చక్షుర్ద్వయీభయదమగుచు
నిటల వీథి విటంక నిర్భర భ్రూకుటి
నటనక్రియాటోప పటహమగుచుఁ
గీ. గాల మృత్యువు శాణ చక్రమునఁ బట్టి
చికిలి చేసిన యడిదంబుఁ జేతఁ దాల్చి
జేగుతించిన మొగముతోఁ జిత్త జారి
ప్రమథ వర్గంబుఁ దాఁకె నాగ్రహమెలర్ప.
(శివరాత్రిమాహాత్మ్యం 4-78 పద్యం)




సుకుమారున్ని యమభటులు తీసుకెళ్ళే సందర్భంలో శివ ప్రమథ గణాలు అడ్డుకున్నారు. ఆ సమయంలో వారి యుద్ధ సన్నద్ధతను తెలిపింది ఈ పద్యం. కర్ణకఠోరమైన శబ్దం చేస్తూ, ఝుంఝూమారుతం లాంటి నిశ్వాసాలని విడుస్తూ, భయంకరంగా కనుగ్రుడ్లను తిప్పుతూ భయపెడుతూ, నుదుటన కనుబొమ్మలు నాట్యం ఆడుతుండగా కోపంతో ముఖం ఎర్రబడింది. అప్పుడు యమభటులని అడ్డుకున్నా రనే విషయాన్ని శ్రీనాథుడు రేఫాది సంయుక్త వర్ణాలతో సంస్కృత భూయిష్ట సమాసాలతో ఉద్దండతతో పద్యాన్ని రాసాడు. ద్రాఘిష్ఠ కఠిన, దంష్ట్రా, చంద్రవిభ్రాంతి, సన్నిభ ఘ్రాణ నిశ్వాస, క్రియాటోప, నిర్భర భ్రూకటి పదాలను వాడటం మూలాన ప్రమథుల ఆవేశాన్ని ఈ పదాలే చెపుతున్నాయా అని అనిపిస్తుంది. వారి క్రోధాన్ని పదాల్లోని పరుషత్వం రేఫాది సంయుక్త వర్ణాలు తెలియజేసాయి. దీనిని వేములవాడ భీమన ఉద్దండత చెప్పవచ్చు. ఈ ఉద్దండత సంయుక్త ద్విత్వవర్ణాల వల్ల చేకూరుతుంది. శ్రీనాథుడు చెప్పిన భీమన కవితా మార్గం కుంతకుని వక్రోక్తిలోని భాగమైన వర్ణవిన్యాస వక్రతలో భాగం అయింది.

"నలినప్రోద్భవసూతి కన్గొనియె వింధ్య క్షోణిభృత్కందరా
బలవద్గండ శిలాభిఘాత విలురత్పాథస్తరంగచ్ఛటా
సల సంరంభం విజృంభమాణపటు ఝంకారస్ఫుటాంతర్మదన్
గలనాతత్పర భక్తలోక పరిక్షాశర్మదన్ నర్మదన్"
(కాశీఖండం 1-94 పద్యం)




ఇక్కడ వింధ్య పర్వత ప్రాంతంలో గుహలు, పెద్దగండ శిలలు ఉండగా వాటికి నర్మదా ప్రవాహం తగిలి పొరలి పడుతున్నాయి అని ఆ గండశిలలు పడటంతో నదిలో అలజడులతో ఝుంకార ధ్వని కలిగిందని వర్ణించబడింది. నదీ ప్రవాహ ఉధృతిని ఈ రేఫాది సంయుక్త వర్ణాలే తెలుపుతున్నాయా? అనిపించేలా కవి శబ్ద ప్రయోగం చేసాడు. ప్రోద్భవ, క్షోణిభృత్కుందర, బలవద్గండ, విజృంభ, ఝుంకార స్ఫుటాంతర, పరీక్షాశర్మదన్, నర్మదన్ అనే పదాలు నదీ తరంగ గతమైన విజృంభణను తెలుపుతూ ఆ భావానికి ప్రాణం పోసేలా ఉన్నాయి. ఇది సంయుక్త పదగత వక్రత వేములవాడ భీమన కవి ఉద్దండతకు కూడా తార్కాణంగా చెప్పవచ్చు.

**ఉభయ వాక్ప్రౌఢి**

శ్రీనాథుడు నన్నయ కవితా గుణంగా చెప్పిన ఉభయ వాక్ప్రౌఢి అక్షరరమ్యతలో భాగమని చెప్పాలి. ప్రౌఢి అనే పదానికి చాలా అర్థాలున్నాయి. సందర్భానుసారంగా దానికిగల అర్థాన్ని గ్రహించాల్సి ఉంటుంది. నన్నయది కర్ణపేయమైన శైలి అని చెప్తారు. పద్యం వినగానే చెవులకు ఇంపుగా అనిపిస్తుంది. శబ్దగాంభీర్యాన్ని, అలాగే శబ్దరమణీయతను కలిగి ఉంటుంది. 'ఉభయ' అనే పదం సంస్కృతం, తెలుగు భాషల గురించి చెప్తుంది. నన్నయ 'మార్గ' కవితను వాడాడని, తర్వాత వచ్చిన శైవ కవులు జానుతెనుగు, దేశీమార్గం అనే పదాలను వాడుతూ దేశీ కవిత్వం చెప్పారనే ఉద్దేశ్యంతో కూడా నన్నయది ఉభయకవిత్వం అన్నారు. ఇక్కడ మార్గ కవిత్వం సంస్కృత పద భూయిష్ఠమైనదిగా చెప్పుకోవాలి. అటు సంస్కృత పదాలను, ఇటు తెలుగు పదాలను వాడిన ఉభయ 'వాక్ప్రౌఢి'గల కవిగా శ్రీనాథుడు ఇక్కడ చెప్పడం జరిగింది, ఉభయ పదానికి అర్థం ఇక్కడ ఇదే. సంస్కృత పద భూయిష్ఠాలైన సమాసాలను, తెలుగు పదాలను వాడుతూ ఉభయ వాక్ప్రౌఢి పద్యాన్ని చూద్దాం.

**ఉభయ వాక్ప్రౌఢి – వర్ణవిన్యాస వక్రత సమన్వయము**

**పంపా విరూపాక్ష బహుజటాజూటికా**
**రగ్వధ ప్రసవ సౌరభ్యములకు**
**తుంగభద్రా సముత్తుంగ వీచీఘటా**
**గంభీర ఘుమఘుమారంభములకు**
**కళసాపుర ప్రాంత కదళీవనాంతర,**
**ద్రాక్షలతాఫలస్తబకములకు**
**కర్ణాటకామినీ కర్ణహాటకరత్న,**
**తాటంకయుగధాళధళ్యములకు**
**గీ. నిర్నిబంధ నిబంధమై నెనయు కవిత**
**తెలుఁగునను సంస్కృతంబునఁ బలుకనేర్తు**
**ప్రౌఢదేవేంద్రరాయ భూపాలవరుని**
**సమ్ముఖంబున దయఁజూడు ముమ్మసుకవి.**
**(చాటుపద్యమణిమంజరి, ప్రథమభాగం 374 పద్యం)**

ప్రౌఢదేవరాయల ఆస్థానానికి నన్ను తీసుకొని పోయి పరిచయం చేయి. పంపాతీర్థంలో ఉన్న విరూపాక్షుని జాటాజూటంలో అలంకరించబడ్డ పూలవాసనలకు, తుంగభద్ర అలల ఘుమఘుమ ధ్వనులకు, కళసాపురంలోని అరటి, ద్రాక్ష గుత్తులకు, కర్ణాట స్త్రీల కమ్మల బంగారుమయమైన ప్రకాశించే కాంతులకు సరిపోయే కవిత్వాన్ని తెలుగు సంస్కృతంలో చెపుతానని ముమ్మకవితో శ్రీనాథుడు అన్నట్లు ఈ పద్య భావం. ఇందులో ధ్వని హృదయంగమంగా ఉంటుంది. జటాజూట, తుంగ, సముత్తుంగ, ఘుమ ఘుమ, కర్ణాట, కర్ణహాటక, ధాళధళ్యం ఇవి ద్వివర్ణ పునరావృత్తిగా చెప్పవచ్చు. శ్రీనాథునికి పాండితీ ప్రకర్షకు శబ్దంపై గల పట్టుకి ఈ పద్యం ఉదాహరణ.

నన్నయ ఉభయవాక్ప్రౌఢి అన్నాడు కవి. సంస్కృత, తెలుగు భాషాపదాల చేరిక ఈ పద్యంలో చూడవచ్చు. ఇందులో ఉభయ వాక్ప్రౌఢి ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

**అర్ణోరాశిపరీత భూభవన మధ్యస్వర్ణఖండంబు సం**
**పూర్ణైశ్వర్య సమృద్ధిఁగాశిఁ గృతపాపుండైనఁదత్పట్టణా**
**భ్యర్ణ క్షోణుల నైదుక్రోశములఁ బ్రాణాంతంబునన్ మర్త్యుఁడా**
**కర్ణింపండు కృతాంతవాహ మహిషగ్రైవేయఘంటాధ్వనుల్**
**(కాశీఖండం 5–27 పద్యం)**

కాశీ పట్టణ విశిష్టతను తెలుపుతూ సమస్తమైన భూమి మధ్యలో స్వర్ణ ఖండమని పిలువబడే, ఐశ్వర్య సమృద్ధిగల ఆ కాశీ పట్టణ ప్రాంత భూముల్లో ఐదుక్రోసులవరకు యముని మహిష కంఠఘంటలు మ్రోగవని తెలిపాడు. అంటే కాశీ పట్టణ ప్రాంత నివాస జనులకు యమలోకం ప్రాప్తించదని వర్ణించాడు. ఇక్కడ అర్ణోరాశి, స్వర్ణఖండం, సంపూర్ణైశ్వర్యం, కృతపాపుడు, అభ్యర్ణక్షోణులు, ప్రాణాంతమునన్, మహిష గ్రైవేయ లాంటి రేఫాది

సంయుక్త పదాలను వాడటం చేత కాశీ ఔన్నత్యాన్ని పొగడటంతో పాటు, యమలోక భయానక మహిష ఘంట ధ్వనులను సూచించి నట్లయ్యింది. సముచిత వర్ణ ప్రయోగం భావానికి తగింది. ఇది కూడా రేఫాది సంయుక్త వర్ణగత వక్రతగా చెప్పవచ్చు.

**ఉపసంహారం**

కుంతకుని వక్రోక్తి భేదాల్లో మొదటి వక్రతాభేదం వర్ణవిన్యాస వక్రతను శ్రీనాథుని రచనల్లో చూపించడమైంది. ఈ ఉదాహరణలు పరిశీలించిన మీదట శ్రీనాథుడు చెప్పినట్లుగానే వేములవాడ భీమన ఉద్దండలీల, నన్నయ ఉభయ వాక్ప్రౌఢి రెండు కూడా ద్విత్వయుక్త సంయుక్త కఠిన సమాస భూయిష్ఠ రచనలుగా తోస్తున్నాయి. ఓజోగుణ సంబంధ రచనగా ఈ రెండు లక్షణాలను చెప్పవచ్చు. ముఖ్యంగా ఉద్దండలీలను ఉభయ వాక్ప్రౌఢి కుంతకుడు చెప్పిన వర్ణ విన్యాస వక్రతల్లోని అంతర్భేదాల్లో ఈ రెండు లక్షణాలు ఉన్నాయని సహేతుకంగా నిరూపించడమైంది. కుంతకుని వర్ణ విన్యాసంలో ఉభయ వాక్ప్రౌఢి, ఉద్దండలీల ఉన్నాయని స్పష్టమయ్యింది. కనుక శ్రీనాథుడు కుంతకుని వక్రోక్తి సిద్ధాంతాన్ని అనుసరించాడని చెప్పడానికి ఎలాంటి సంశయం లేదని పెద్దలు చెప్పినట్లే మళ్ళీ నేను కూడా చెప్పటానికి సందేహించటం లేదు. అక్షర సంబంధియైన చమత్కారం, నాద సౌష్ఠవం, శబ్దాలంకార ప్రయోగమే వర్ణ విన్యాస వక్రత ఆ పేరులోనే విన్యాస పదం ఉంది. కనుక అక్షరాల విన్యాసం వల్ల కలిగే సౌందర్యంగా భావించవచ్చు. శ్రీనాథుడు తాను చెప్పుకున్నట్లే ఉద్దండలీల, ఉభయ వాక్ప్రౌఢి తన రచనలో ఉన్నాయి. అవి రెండు కూడా వర్ణవిన్యాస వక్రతలో అంతర్భవించాయని తెలియజేస్తున్నాను.

**ఉపయుక్తగ్రంథసూచి**

1. ప్రభాకరశాస్త్రి, వేటూరి. (2013). చాటుపద్యమణిమంజరి (మొదటి భాగం )తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

2. సుబ్రహ్మణ్యం, జి.వి. (2012). సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు. హైదరాబాదు: తెలుగు అకాడమీ.

3. మృత్యుంజయరావు, జొన్నలగడ్డ (1995) శివరాత్రి మాహాత్మ్యం (చంద్రికావ్యాఖ్యానసహితం) హైదరాబాద్. తెలుగు విశ్వవిద్యాలయం.

4. లక్ష్మీనారాయణ, గుండవరపు. (1997). శ్రీనాథ మహాకవి విరచిత భీమేశ్వర పురాణము (దక్షిణ కాశికా వ్యాఖ్యానం). గుంటూరు: ఫాలాక్ష ప్రచురణ.

5. శరభేశ్వర శర్మ, మల్లంపల్లి.(2012). శ్రీనాథ విరచిత కాశీఖండం (మణికర్ణికా వ్యాఖ్యాన సహితము). హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

6. శ్రీరామచంద్రుడు, పుల్లెల. (2007). కుంతకుని వక్రోక్తి జీవితం (బాలానందిని వ్యాఖ్యతో). న్యూఢిల్లీ: సాహిత్య అకాడమీ.

# కాలగమనం – కవితల జననం

**గుండ్లపల్లి రాజేంద్ర ప్రసాద్**

**ఫోన్ : 917791 5285**

కాలచక్రం పరుగెడుతుంది
జీవనకాలం తరిగిపోతుంది
కాలం కరిగిపోతుంది
జ్ఞాపకం మిగిలిపోతుంది

గతం తిరిగిరాకున్నది
వర్తమానం ఆగిపోకున్నది
ఆరాటం ఆగకున్నది
పోరాటం తప్పకున్నది

జగన్నాటకం చూడమంటుంది
జీవితగమనం సాగించమంటుంది
కవనోత్సాహం తగ్గిపోకున్నది
కైతారచనాంగం కొనసాగించమంటుంది

మరణం వెంటపడుతున్నది
కవనం విడిచిపెట్టకున్నది
మెప్పులు పొందమంటుంది
మదులను దోచమంటుంది

నాలుకల్లో నానమంటుంది
తలల్లో నిలిచిపొమ్మంటుంది
కవితలవానను కురిపించమంటుంది
కవననదులను పారించమంటుంది

కయితాపుష్పాలు పూయించమంటుంది
సాహిత్యసౌరభాలు వెదజల్లమంటుంది
సూర్యోదయం రోజూ జరుగుతుంది
కవితోదయం నిత్యమూ అవుతుంది






ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8 (26) హైదరాబాద్ జూన్ : 2025

## ఆదిత్య హృదయ మహిమ

**"ఆదిత్యః సవితా సూర్యః ఖగః పూషా గభస్తిమాన్**
**సువర్ణ సదృశో భాను ర్హిరణ్యరేతా దివాకరః"**

ఇందులో ఆదిత్యుడు, సవిత, సూర్యుడు, ఖగుడు, పూష, గభస్తిమంతుడు, సువర్ణసదృశుడు, భానువు, హిరణ్య రేతసుడు, దివాకరుడు అని పది నామాలు ఉన్నాయి.

(గత సంచిక తరువాయి)


**16. శంభుః :** శం సుఖం భవత్యస్మాదితి శంభుః, శం ప్రాప్తవానితి శంభుః – అని రెండు వ్యుత్పత్తులు ఈ శబ్దానికి ఉన్నాయి. సుఖం ఇతని వలన కలుగుతుంది అని ఒక నిర్వచనం. పరమానందమును పొందినవారు అని మరియొక నిర్వచనం. రెండవ వ్యుత్పత్తి పరమానందమే అయినవాడు అని తెలియజేస్తుండగా మొదటి వ్యుత్పత్తి అటువంటి పరమానందాన్ని సర్వులకు పరమ వాత్సల్యంతో కలుగజేస్తున్నవాడు అని చెబుతున్నది. ఇటువంటి అనన్య సాధ్యమైన మహా ప్రయోజనాన్ని కలిగిస్తున్నవాడు కనుక ఆదిత్యుడు సర్వజనారాధ్యుడు


కొందఱు హేతువాదులు ఇక్కడ ఆ పని చేస్తున్నదానికి దాఖలాలు ఏమిటి? అని అడుగుతారు. ఆదిత్యారాధన నిరంతరమూ చేస్తున్న ఆస్తికులు అది పొందుతూనే ఉన్నారు. ఆరాధన చేసి ప్రయోజనం పొందటం హేతువాదుల కర్తవ్యం. ఒక్క చిన్న మాట. "మంత్రాలకు చింతకాయలు రాలతాయా?" అంటారు 'బుద్ధిమంతులు. దీనికి రెండు సమాధానాలు. 1. చింతకాయలు రాలటానికి మంత్రాలు అక్కరలేదు. చేతిలో ఒక పొడువాటి కర్ర. ఒడుపుగా పట్టుకునే నేర్పు ఉంటే చాలు. 2. అలాకాదు మంత్రాల తోనే రాలాలి అంటే మంత్రాన్ని ఆశ్రయించి, మంత్రసిద్ధి పొంది ప్రయోజనాన్ని అందుకోవాలి. అంతేకాని ఊరకే నోరుపారవేసుకోగూడదు.

**17. త్వష్టా :** వడ్రంగివాడు అని దీనికి సామాన్యార్థం. బాడిత మొదలైన సాధనాలతో కొయ్యలను కావలసిన విధంగా రూపొందించే వాడు. సూర్య భగవానుడు కూడా సృష్టిలోని సమస్త పదార్థాలను ఏదేది ఏయే ప్రమాణంలో ఉండాలో దానినని ఆయా ప్రయాణంలో రూపొందిస్తాడు. అలా చేయటం ఒక శిల్పం. అది గొప్పగా గలవాడు శిల్పి. ఆదిత్యుడు విశ్వాన్నంతా ఆ విధంగా రూపొందిస్తూ శిల్పి అయిన త్వష్టగా మనకు దర్శనమిస్తున్నాడు.

(సశేషం)(ఆచార్య శలాక రఘునాథ శర్మగారి 'ఆదిత్య హృదయం' నుండి)

## సత్సంగం





### సద్బోధ

అన్నింటికీ కర్త ఈశ్వరుడే..! గొడ్డలి కట్టెలను కొడుతుంది. అది గొడ్డలి గొప్పతనం కాదు! కలం గొప్ప గ్రంథాలను రాస్తుంది. అది కలం గొప్పతనం కాదు!! మనం గొప్ప గొప్ప పనులు చేస్తాం. అది మన గొప్పతనం కాదు...!!!

అన్నింటికీ కర్త అయిన ఈశ్వరునిదే ఆ గొప్పతనం! మనం కేవలం నిమిత్త మాత్రులం. ఈశ్వరుని చేతిలో పనిముట్లం. అని భావిస్తూ సర్వకర్మలను, కర్మ ఫలాలను ఈశ్వరుని యందు వదిలి భక్తుడు నిశ్చింతుడై యుండాలి.

ఒకరోజు ... కాశీ వెళ్ళే ట్రైను కదిలింది. ఆదరాబాదరాగా పరుగెత్తుకుంటూ ఒక పల్లెటూరి వ్యక్తి రెండు పెట్టెలు నెత్తిమీద పెట్టుకొని ఎలాగో శ్రమపడి రైలు ఎక్కాడు.. అతడు రొప్పుతూఊ రోజుతూ, చెమటలు పట్టి ఉన్నాడు. అటూ ఇటూ చూచి ఒక చోట సీటు ఉంటే కూర్చున్నాడు. కూర్చొని తాను తెచ్చిన పెట్టెలను తన తలపై ఉంచుకొని ప్రయాణం చేస్తున్నాడు.

ప్రక్కన కూర్చున్న వ్యక్తి ఈ పల్లెటూరు ఆసామిని అడుగుతున్నాడు. "అయ్యా! ఆ పెట్టెలను ఎందుకు నెత్తిమీద పెట్టుకొని మోస్తున్నావు..? నీ సీటు క్రింద పెట్టుకోవచ్చు గదా..!" అన్నాడు.

దానికా పల్లెటూరి ఆసామి అంటున్నాడు.. "బాబూ! నేను నాకే టికెట్టు తీసుకున్నాను. వీటిని రైలు మోస్తుందో మోయలేదో తెలియదు గదా... అందుకే నేనే మోస్తున్నాను!" అని అన్నాడట.

దానికా వ్యక్తి అతడి అమాయకత్వానికి నవ్వి.. "నాయనా! నిన్నూ, నీ పెట్టెలను అన్నింటినీ ఆ రైలే మోస్తుంది. నీవు నెత్తిమీద పెట్టుకున్నా వాటి బరువును రైలే మోయాలి. ఎందుకు అనవసరంగా నెత్తిన పెట్టుకొని హైరాన పడతావు. క్రిద పెట్టుకో ... ఏం ఫరవాలేదు!" అన్నాడు.

అలాగే ... అన్ని భారాలు మోసేవాడు ఆ ఈశ్వరుడు అనవసరంగా అహంకారాన్ని నెత్తిన పెట్టుకొని అన్నీ నేనే మోస్తున్నానని భ్రమ పడుతూ ఉండరాదు. అన్నీ నావల్లనే జరుగుతున్నవని అనుకోరాదు. ఇదంతా ఒట్టి అహంకారం. ఈ అహంకారాన్ని వదిలితేనే భగవంతుని సాన్నిధ్యం లభించేది. కనుక కర్మలన్నింటినీ ఈశ్వరుని యందే విడిచిపెట్టాలి. అంటే .. ఈశ్వరుని స్మరిస్తూ కర్మలు ప్రారంభించు. ఈశ్వరుని స్మరిస్తూనే కర్మలను కొనసాగించు ... ఈశ్వరుని స్మరణతోనే కర్మలను ముగించు ...

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2025

# యోగ ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్

**డా. కె. సరితాదేవి,** యోగ ఇన్‌స్ట్రక్టర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, ఫోన్ : 9490993379

భారతీయ సంప్రదాయంలో అనేక రకాలైన ఉత్సవాలను ఒక నిర్దిష్టమైన తిథినాడు, నిర్దిష్టమైన ఉత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్నది. అదే క్రమంలో ప్రస్తుతం జరుపుకుంటున్న ఉత్సవం అంతర్జాతీయ యోగ దినోత్సవం.

భారత ప్రధాని అయిన శ్రీ నరేంద్ర మోడీ గారు సెప్టెంబర్ 17, 2024న ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో భారతీయ సనాతన సంప్రదాయంలోని యోగ మూలాలను, దాని ప్రాముఖ్యతను, ప్రయోజనాలను వివరిస్తూ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవాలని ప్రతిపాదించగా అనేక దేశాలు మద్దతు పలకడంతో 2014 డిసెంబర్ 11న జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవం జరుపుకోవాలని అధికారికంగా ప్రకటించింది. భూమిపై ఉత్తరార్ధగోళంలో సంవత్సరంలో వేసవికాలంలో అతి పొడవైన రోజైనటువంటి నిర్దిష్టమైన రోజు ఈ జూన్ 21. అందువలన 2015 వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని ఒక ప్రత్యేకమైన ఇతివృత్తంతో ప్రపంచ దేశాలన్నీ జరుపుకుంటున్నాయి.

ఒక దశాబ్దాన్ని పూర్తిచేసుకుని 11 వ సంవత్సరంలో ఒక నూతన ఇతివృత్తంతో ఈ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకుంటున్నాం. అందులో భాగంగా ఈ సంవత్సరం ఇతివృత్తం **యోగా ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్.** ఇది కేవలం వ్యక్తి యొక్క శారీరిక మానసిక శ్రేయస్సును పెంపొందించడమే కాకుండా ఆరోగ్యకరమైన సుస్థిరమైన పర్యావరణాన్ని భూమిపై ప్రోత్సహించడంలో యోగా యొక్క ప్రాముఖ్యతను తెలుపుతుంది. ఈ భూమిపై నివసించే చరాచర జీవరాసుల మనుగడను పర్యావరణ స్థిరత్వాన్ని వ్యక్తిగత శ్రేయస్సుకు మధ్య లోతైన సంబంధాన్ని వెలుగులోకి తెస్తుంది. ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తమకు మరియు తాము నివసించే భూమికి ఆరోగ్యకరమైన జీవితాన్ని అందించడానికి యోగాను ఒక మార్గంగా స్వీకరించమని పిలుపునిస్తుంది.

అరిస్టాటిల్ చెప్పినట్లుగా మనిషి అనే వాడు ఒక సంఘ జీవి. మ్యాన్ ఈజ్ ఎ సోషల్ బీయింగ్ బిఫోర్ హ్యూమన్ బీయింగ్. ఒక వ్యక్తి శ్రేయస్సు సమాజ శ్రేయస్సు అని, ఆ సమాజ శ్రేయస్సు సమస్త జీవులను వనరులను పర్యావరణాన్ని కలిగి ఉన్న భూమి శ్రేయస్సు అని వివరించబడుతుంది. శరీరము, మనస్సుపై స్వయం నియంత్రణ లేని సాధకుడు పతంజలి మహర్షి అందించిన అష్టాంగ యోగమును అనుసరించి తన లక్ష్యాలను సాధించగలడు. శరీరము వివిధ అంగాలను కలిగి ఉండి కలిసి ఒకటిగా ఎలా పని చేయుచున్నదో




అదేవిధంగా అష్టాంగ యోగము ఎనిమిది అంగాలు కలిగి ఉండి కలిసి పనిచేయుచున్నది. సాధారణంగా సమాజంలో యోగా అంటే ఆసనములు, ప్రాణాయామం, ధ్యానము అనే సాధారణ అభిప్రాయము చాలామందికి కలదు. కానీ అవి పతంజలి మహర్షి అందించిన అష్టాంగ యోగంలో మొదటి అంగములు కావు. పతంజలి మహర్షి అందించిన అష్టాంగ యోగంలోని అంగములు వరుసుగా యమములు, నియమములు, ఆసనములు, ప్రాణాయామము, ప్రత్యాహారం, ధారణ, ధ్యానము మరియు సమాధి.

**యమములు :** యమములు అనగా వ్యక్తి శ్రేయస్సుకి కాక సమాజ శ్రేయస్సు కూడా ఉపయోగపడేవి. అవి అహింస, సత్యము, అస్తేయము, అపరిగ్రహము, బ్రహ్మచర్యం.

1. అహింస త్రికరణశుద్ధిగా అనగా మనసు చేతకాని మాట చేతకాని క్రియల చేతకాని ఎవరిని కానీ ఏ జీవిని కానీ హింసించకుండా ఉండటం. ఇందులో లోఅర్థం ఏమిటంటే సర్వ ప్రాణుల యందు ప్రేమతో మెలగడం. అట్లు ఉండడం వలన అందరూ మనవారే అనే భావంతో ప్రజలందరూ కలిసిమెలిసి జీవించగలుగుతారు.

2. సత్యము మనోవాక్కాయ కర్మలతో ఏకత్వం కలిగి ఉండి సర్వభూత హితమగు సత్యమునే పలుకవలెను. అందులోను కొన్ని నిబంధనలు కలవు. అవి ప్రియమైన సత్యమునే పలకవలెను. అప్రియమైన సత్యమును పలుకురాదు. ప్రియమైనను అసత్యమును పలకరాదు. ఈ సత్యవాక్ పరిపాలన వలన ప్రజలలో ప్రతి ఒక్కరికి ఇతరుల పట్ల నమ్మకం కలుగుతుంది.

3. అస్తేయము ఇతరుల ద్రవ్యమును శరీరము చేతకాని మనసు చేతకాని గ్రహింపరాదు, కోరుకోరాదు. ఇది పాటించుటవలన ఇతరులను దోచుకోవాలనే ఆలోచన రాదు. ఇతరుల పట్ల ఈర్ష్య అసూయ భావాలు కలుగ నేరవు.




4. అపరిగ్రహము అనగా దేనిని ఉచితంగా తీసుకోకుండా ఉ ండుట. దీనిని పాటించడం ద్వారా మనిషి తన తన కష్టం పై ఆధారపడి జీవిస్తాడు. తద్వారా నవ సమాజ నిర్మాణం నిర్మించగలుగుతాం.

5. బ్రహ్మచర్యము బ్రహ్మమునందు నిత్యం చరిస్తూ ఉండడమే బ్రహ్మచర్యము. దీనికి ప్రాథమిక దశగా నియమ విరుద్ధంగా స్త్రీ పురుషులు మనో వాక్కాయములచే కామక్రీడలు చేయరాదు. వివాహ బంధములో ఉన్న స్త్రీ పురుషులు తమ జీవిత భాగస్వామిని తప్ప ఇతర స్త్రీలను తల్లితోనూ పురుషులను తండ్రి సమానంగానూ భావించవలెను. ఇలా ఉండుటవలన సమాజంలో ప్రస్తుతం మనం చూస్తున్న ఎన్నో అరాచకాలు నిరోధింపబడతాయి.

నియమములు అనేవి వ్యక్తి యొక్క శ్రేయస్సు కొరకు చేయునవి. అవి వరుసగా శౌచము, సంతోషము, తపస్సు, స్వాధ్యాయము మరియు ఈశ్వర ప్రణిధానము.

1. శౌచము హితముగా మితముగా నియమముగా భుజింపదగిన వాటిని భుజిస్తూ ఉదరాన్ని పోషింపవలెను. వివిధ క్రియల ద్వారా అంతర శరీరమును శుభ్రపరుచుట అంతర శౌచము, స్నానాదుల చేత బాహ్య శరీరమును శుభ్రపరుచుట బాహ్య శౌచము అందురు. అంత:శౌచము, బాహ్య శౌచము రెంటిని పాటించుట ద్వారా మనుషులు స్వచ్ఛమైన వారిగా జీవించగలుగుతారు. తద్వారా శాంతి నెలకొంటుంది.

2. సంతోషము ఉన్నదానితో తృప్తిపడి జీవించుట, శరీర పోషణ, అవసరములకు తగినంత మాత్రమే సంపాదించుకొనుట, తనకంటే ఇతరులకు ఎక్కువగా ఉన్న వాటిని కోరుకొనకుండుట. ఇది మానసిక ఆరోగ్యముతో పాటు ప్రజలందరిలో చక్కని సంఘీభావం పెంపొందించుటలో సహకరిస్తుంది.

3. తపస్సు మానవ జీవనంలో ఎదుర్కొనే ద్వంద్వములు అయినటువంటి సుఖదుఃఖములను, ఆకలి దప్పులను, శీతోష్ణస్థితులను సహించుట, అభ్యసించుటయే తపస్సు. తద్వారా శారీరక, మానసిక, సాంఘిక దృఢత్వం నెలకొంటుంది.

4. స్వాధ్యాయము – స్వ అధ్యయనము అనగా తన గురించి తాను అధ్యయనం చేసుకోవడం. మరో అర్థం ఏమిటంటే స్వ అంటే మంచి, అధ్యాయము అంటే తెలుసుకొనుట. తన ప్రవర్తనను తాను ఎరుకతో అభ్యసనం చేయడమే కాకుండా మంచి విషయాలను గ్రహించుట ద్వారా తనలో శాంతి నెలకొంటుంది. తద్వారా ప్రపంచశాంతి ఏర్పడుతుంది.

5. ఈశ్వర ప్రణిధానము ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని సర్వకాల సర్వావస్థలలో సదా స్మరిస్తూ సర్వ కర్మలను సదా అతనికి సమర్పించుటయే ఈశ్వర ప్రవిధానము. అట్లు జీవించుటవలన ప్రతి పని ధర్మబద్ధంగా చేయాలి అనే సంకల్పంతో చేస్తాం. ప్రపంచమంతా ధర్మంతో నడుస్తుంది.

యమములు అభ్యసన చేయడం ద్వారా సమాజంలో హింసను దూరం చేసుకోగలము. అలాగే భూమిపై గల సర్వజీవుల యందు దయ, కరుణ కలిగి ఉండి వాటి మనుగడకు కృషి చేయగలము. సత్యం పలకడం ద్వారా నిజాయితీని నమ్మకాన్ని పెంపొందించుకో గలము. స్వీయ నియంత్రణ కలిగి ఉండి సర్వకాల సర్వావస్థలో సకల ప్రాణుల అభివృద్ధికి సహకరించగలము. అట్లే నియమములను పాటించడం ద్వారా వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోగలము. దానివల్ల ప్రకృతి బాగుపడుతుంది. మానసిక శారీరక దృఢత్వం పెంపొందించుకోవడం వలన తనకున్న దానిలో సంతృప్తి కలిగి ఉండి ఇతరులకు తన కంటే ఎక్కువగా ఉ న్న వాటిని పొందటం కోసం పోరాడటం, ఇతరులను ప్రకృతిని విధ్వంసం చేయరు. తన గూర్చి తాను తెలుసుకొని సమతుల్యమైన సుస్థిరమైన భావనను కలిగి ఉండి భగవంతుని పట్ల సదా భక్తి సమర్పణ భావనతో కలిగి ఉన్నట్లయితే మనిషి నైతిక విలువలు పెంపొంది స్వార్థాన్ని విడనాడి తనే కాక తాను నివసించే సమాజం, ఆ సమాజం నివసించే భూమి, చరాచర జీవులు వనరుల రక్షణకై, అభివృద్ధికి తరతరాలు ముందుకు నడవడానికి పాటుపడుతాయి. తద్వారా వసుధైక కుటుంబం విలసిల్లుతుంది.

అష్టాంగ యోగంలోని యమనియమముల తరువాత చెప్పబడిన అంగములైనటువంటి ఆసనములు ప్రాణాయామములు చేయడం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మరియు దృఢత్వాన్ని, శక్తిని పొంది సంపూర్ణ ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ పొందగలుగుతారు. తత్ఫలితంగా ప్రపంచం అంతా సంపూర్ణ ఆరోగ్యమయమై ఉంటుంది. పై నాలుగు అంగములను మన జీవనశైలిలో మిళితం చేసుకోవడం ద్వారా **'యోగ ఫర్ వన్ ఎర్త్ వన్ హెల్త్'** అనే ఈ సంవత్సరపు యోగా ఇతివృత్తం సాధించగలుగుతాం. అందమైన ఆనందకరమైన ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని నెలకొల్పగలుగుతాం.

❖ ❖ ❖ ❖ ❖

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8 (29) హైదరాబాద్ జూన్ : 2025

# తెలుగు సాహిత్య పరిశోధన : శాస్త్రీయ దృక్పథం – ఆవశ్యకత, ఆచరణ

**ఆచార్య వెంకటరామయ్య గంపా,** భారతీయ భాషలు మరియు అధ్యయన శాఖ, ఢిల్లీవిశ్వవిద్యాలయం.
ఫోన్ : 9958607789

తెలుగు సాహిత్యంలో పరిశోధనల సంఖ్య ఎంత విస్తృతంగా పెరుగుతుందో, ప్రామాణికత అంతే స్థాయిలో తగ్గుతుంది. ఇందుకు కారణాలు చాలా ఉన్నాయి. అన్ని విశ్వవిద్యాలయాల వారికి అంగీకారయోగ్యమైన, కాలానుగుణమైన మార్పులతో కూడిన ఆమోద యోగ్యమైన 'తెలుగు పరిశోధన పద్ధతులు' పై పుస్తకాలు కొన్ని ఉన్నప్పటికీ, వాటిని విశ్వవిద్యాలయాల వారు పూర్తిస్థాయిలో అనుసరించడం లేదు. దానితో తెలుగు పరిశోధనల మధ్య అనేక వ్యత్యాసాలు కనిపిస్తున్నాయి. ఇతర భాషలలో మాత్రం ఎప్పటికప్పుడు పరిశోధన పద్ధతులలో మార్పులు జరుగుతున్నాయి. కొన్ని సంస్థల వారు చేస్తున్న చేర్పులను చాలావరకు ఇతర భాషలవారు అంగీకరిస్తున్నారు కాని తెలుగులో అది జరగడం లేదు. ఇదివరకు తెలుగులో వచ్చిన పుస్తకాలలో ఉన్న సమాచారంతో పాటు ఆంగ్లంలో వస్తున్న మార్పులను గమనిస్తూ మనం ఇప్పుడు కొత్తగా పరిశోధన పద్ధతులను నిర్మించుకోవాల్సిన అవసరం ఉన్నది. దానికోసం మూసీ మాసపత్రిక తనవంతు బాధ్యతగా ఒక ప్రయత్నాన్ని మొదలుపెట్టింది. ప్రతి వ్యాసాన్ని పాఠకులు చదివిన వెంటనే ఇంకేమైనా మార్పులు, చేర్పులు అవసరం అనుకుంటే మాకు తెలియజేయ మనవి. **చర్చను కూడా స్వాగతిస్తున్నాం.** – సంపాదకులు.

విశ్వవిద్యాలయాలలో పరిశోధన చేసే విద్యార్థుల కోసం యూజీసీ 'పరిశోధన మరియు ప్రచురణ నైతిక ప్రవర్తన' (Research and Publication Ethics) అనే ఒక కోర్సును తప్పనిసరి చేసింది. ఈ కోర్సులో **'శాస్త్రీయ పరిశోధన'** (Scientific Research) అనే ఒక ముఖ్యమైన భాగం ఉంది. ఆంగ్లంలో ఉన్న పరిశోధనా పద్ధతుల పుస్తకాల్లో 'శాస్త్రీయ పరిశోధన' గురించి ప్రత్యేకంగా అధ్యాయాలు ఉన్నాయి. కానీ తెలుగులో లభించే పరిశోధనా పద్ధతుల పుస్తకాల్లో మాత్రం శాస్త్రీయ పరిశోధన గురించి వివరాలు తక్కువగా ఉన్నాయి. సాహిత్య పరిశోధన అనేది సైన్స్ లేదా సోషల్ సైన్స్ పరిశోధనల కంటే వేరుగా ఉంటుంది. అయినప్పటికీ, సాహిత్య పరిశోధనలో కూడా శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించవచ్చని కొందరు ఆంగ్ల పరిశోధకులు వివరించారు. తెలుగులో శాస్త్రీయ పరిశోధన గురించి చాలా తక్కువ మంది విమర్శకులు చర్చించారు. రాచపాళెం చంద్రశేఖర్ రెడ్డి, హెచ్.ఎస్.బ్రహ్మానంద రాసిన **'సాహిత్య పరిశోధనా సూత్రాలు'** అనే పుస్తకంలో సైన్స్ పరిశోధనలకు, సాహిత్య పరిశోధనలకు మధ్య ఉన్న తేడాలను వివరించారు. మిగిలిన పరిశోధనా పద్ధతుల పుస్తకాల్లో ఈ విషయం గురించి తగినంత సమాచారం లేదని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

**'శాస్త్రీయత'** అనేది కేవలం భౌతిక, రసాయన శాస్త్రాల వంటి విజ్ఞాన శాస్త్రాలకు మాత్రమే పరిమితం కాదు. ఏదైనా విషయాన్ని ఒక నిర్దిష్టమైన పద్ధతిలో, క్రమబద్ధంగా అధ్యయనం చేయడాన్ని ఇది సూచిస్తుంది. ఇందులో ఒక విషయాన్ని నిశితంగా పరిశీలించడం, దాని గురించి ఒక ప్రాథమిక ఆలోచనను రూపొందించడం, సంబంధిత సమాచారాన్ని వివిధ వనరుల నుండి సేకరించడం, సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం, తార్కికమైన, ఆధారాలతో కూడిన నిర్ణయాలకు చేరుకోవడం వంటి ముఖ్యమైనదశలు ఉంటాయి.

### సామాన్య విజ్ఞానంలో శాస్త్రీయ పరిశోధన పద్ధతి: అవలోకనం

సామాన్య విజ్ఞానం (సైన్స్)లో శాస్త్రీయ పరిశోధన పద్ధతిని వివరించే అనేక ప్రామాణిక గ్రంథాలు ఆంగ్లంలో అందుబాటులో ఉన్నాయి. ఉదాహరణకు, కె. ప్రతాపన్ రచించిన 'Research Methodology for Scientific Research' అనే గ్రంథం శాస్త్రీయ పరిశోధన ప్రాముఖ్యతను, విధానాలను వివరిస్తుంది. ప్రతాపన్ ప్రకారం, శాస్త్రీయ పరిశోధన అనేది 'విజ్ఞానాన్ని' పెంపొందించ డానికి, సమాజంలోని వివిధ సమస్యలకు పరిష్కారాలను కనుగొనడానికి ఉపయోగపడే ఒక క్రమబద్ధమైన ప్రక్రియ. విజ్ఞానం అంటే సహజ ప్రపంచం గురించిన వాస్తవ సమాచారాన్ని సేకరించే ఒక వ్యవస్థీకృత ప్రయత్నం. ఈ ప్రయత్నం పరిశీలన, ప్రయోగం, తార్కిక విశ్లేషణల పునాదిపై ఆధారపడి ఉంటుంది. ప్రతాపన్ విజ్ఞానాన్ని ప్రాథమిక విజ్ఞానం (Pure Science), అనువర్తిత విజ్ఞానం (Applied Science) అని రెండు రకాలుగా వర్గీకరించారు. ప్రాథమిక విజ్ఞానం సహజ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడంపై ప్రధానంగా దృష్టి పెడుతుంది. (ఉదాహరణకు, న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతం). అనువర్తిత విజ్ఞానం, ప్రాథమిక విజ్ఞానం ద్వారా పొందిన జ్ఞానాన్ని ఆచరణాత్మక సమస్యల పరిష్కారానికి వినియోగిస్తుంది (ఉదాహరణకు, కొత్త వ్యాధులకు మందులను అభివృద్ధి చేయడం). విజ్ఞానం అనేది క్రమబద్ధమైనది, తార్కికమైనది, అనుభవపూర్వకమైన వాస్తవికతపై ఆధారపడి ఉంటుంది. పరిశోధన అనేది కొత్త జ్ఞానాన్ని అన్వేషించే ఒక పద్ధతి. ఇది ఒక సమస్యను గుర్తించడం, ఒక ఊహాజనిత ప్రతిపాదనను (Hypothesis) రూపొందించడం, సంబంధిత సమాచారాన్ని సేకరించడం, సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం, చివరకు నిర్ధారణలకు చేరుకోవడం వంటి నిర్దిష్టమైన దశలను కలిగి ఉంటుంది. విజ్ఞానశాస్త్ర తత్వశాస్త్రం (Philosophy

of Science) పరిశోధనకు ఒక బలమైన పునాదిని అందిస్తుంది. ఇందులో ముఖ్యంగా ప్రేరణాత్మక విధానం (Induction) – నిర్దిష్ట పరిశీలనల నుండి సాధారణ సూత్రాలను రూపొందించడం (ఉదాహరణకు, అనేకసార్లు సూర్యుడు తూర్పున ఉదయించడాన్ని పరిశీలించి, సూర్యుడు ఎల్లప్పుడూ తూర్పునే ఉదయిస్తాడని ఒక సాధారణ సూత్రాన్ని ఏర్పరచడం); నిగమనాత్మక విధానం (Deduction) – సాధారణ సూత్రాల నుండి నిర్దిష్టమైన ముగింపులకు చేరుకోవడం (ఉదాహరణకు, 'అన్ని పక్షులు గుడ్లు పెడతాయి, ఇది ఒక పక్షి కాబట్టి ఇది కూడా గుడ్డు పెడుతుంది'). ఇంకా, రూఢివాదం/ దృగ్గోచరవాదం (Positivism) – కేవలం గమనించగల వాస్తవాలపై ఆధారపడి జ్ఞానాన్ని నిర్మించడంబీ తప్పు అని నిరూపించే వాదం (Falsificationism) – కార్ల్ పాపర్ ప్రతిపాదించిన ఈ సిద్ధాంతం ప్రకారం, ఒక శాస్త్రీయ పరికల్పనను పరీక్షించి అది తప్పు అని నిరూపించగలిగితేనే అది అభివృద్ధి చెందుతుంది; ఉత్తర–రూఢివాదం/ దృగ్గోచరవాదం (Post-Positivism) – జ్ఞానం సంపూర్ణమైన సత్యం కాదని, అది సాపేక్షమైనదని వాదిస్తుంది; సాపేక్షవాదం (Relativism) – జ్ఞానం సాంస్కృతిక, సామాజిక పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని నమ్ముతుంది; వాస్తవికవాదం (Realism) – మనస్సుతో సంబంధం లేకుండా స్వతంత్రంగా ఒక వాస్తవ ప్రపంచం ఉందని నమ్ముతుంది. ఈ వివిధ తాత్విక దృక్పథాలు పరిశోధకులకు వారి అధ్యయన విధానాన్ని ఎంచుకోవడంలో సహాయపడతాయి. పైన చర్చించిన అంశాలు ప్రధానంగా భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల వంటి వాటికి వర్తిస్తాయి. శాస్త్రీయ పద్ధతిలో ఒక విషయాన్ని గమనించడం, దాని గురించి ఒక ఆలోచనకు రావడం (పరికల్పన), దానిని ప్రయోగాల ద్వారా పరీక్షించడం, సేకరించిన సమాచారాన్ని విశ్లేషించడం, ఒక తార్కికమైన నిర్ధారణకు రావడం వంటి ప్రాథమిక సూత్రాలు సామాన్య విజ్ఞాన పరిశోధనలో శాస్త్రీయ విధానాన్ని అర్థం చేసుకోవడానికి చాలా ఉపయోగకరంగా ఉంటాయి.

### సాహిత్య పరిశోధనలో శాస్త్రీయత ప్రాముఖ్యత

ఈ శాస్త్రీయ నియమాలు సాహిత్యం వంటి మానవీయ శాస్త్రాలకు ఏ విధంగా వర్తిస్తాయి? అనేది ఒక ముఖ్యమైన ప్రశ్న. ఆచార్య ముదిగొండ వీరభద్రయ్య రచించిన **'విమర్శ : మౌలిక లక్షణాలు'** అనే గ్రంథంలోని **'సాహిత్య విమర్శ – శాస్త్ర ప్రతిపత్తి'** అనే అధ్యాయంలో ఈ అంశంపై విస్తృతమైన చర్చ జరిగింది. వారు పలువురు ఆంగ్ల విమర్శకుల అభిప్రాయాలను క్రోడీకరించి, సాహిత్య విమర్శ కూడా ఒక రకమైన శాస్త్రమేనని అభిప్రాయపడ్డారు. సాహిత్య విమర్శను 'శాస్త్రంగా' పరిగణించవచ్చా అనే ప్రశ్నకు సంబంధించిన చారిత్రక నేపథ్యాన్ని, వివిధ వాదనలను వారు విశ్లేషించారు. ఇతర శాస్త్రాలతో పోలిస్తే సాహిత్య విమర్శకు ఉండే ప్రత్యేకతలు, అది ఎదుర్కొనే సవాళ్లు, దాని స్వంత శాస్త్రీయతను ఎలా నిర్వచించవచ్చో వారు వివరించారు. తెలుగు సాహిత్య పరిశోధనలో శాస్త్రీయ పద్ధతిని అవలంబించడం అనేక విధాలుగా ఉపయోగపడుతుంది. ఇది పరిశోధనకు ఒక క్రమబద్ధమైన విధానాన్ని అందిస్తుంది, తద్వారా విశ్వసనీయమైన, ప్రామాణికమైన ఫలితాలను పొందవచ్చు. సాహిత్య పరిశోధనలో శాస్త్రీయ పద్ధతి కొన్ని ముఖ్యమైన లక్షణాలను కలిగి ఉంటుంది:

**క్రమబద్ధత :** సమాచార సేకరణ (మూల గ్రంథాల పఠనం, చారిత్రక, సాంస్కృతిక నేపథ్య పరిశోధన), విశ్లేషణ (వివిధ సాహిత్య విమర్శ సిద్ధాంతాలను ఉపయోగించి), నిర్ధారణ (పరిశోధన ప్రశ్నలకు సమాధానాలను రూపొందించడం లేదా ఒక నిర్దిష్ట వాదనను సమర్థించడం) వంటి క్రమబద్ధమైన విధానాన్ని అనుసరించడం. ఉదాహరణకు, **'తెలుగు నవలల్లో దళిత పాత్రల చిత్రీకరణ'** అనే అంశంపై పరిశోధన చేసేటప్పుడు, పరిశోధకుడు మొదట సంబంధిత నవలలను చదవాలి, ఆ తరువాత దళిత సాహిత్యం, సామాజిక చరిత్ర గురించి అధ్యయనం చేయాలి, వివిధ విమర్శనాత్మక దృక్పథాల నుండి విశ్లేషించాలి. చివరకు తన పరిశోధన ఫలితాలను క్రమబద్ధంగా సమర్పించాలి.

**తార్కికత :** పరిశోధన తీర్మానాలకు స్పష్టమైన, సహేతుకమైన ఆధారాలను అందించడం. పరిశీలించిన సాహిత్య రచనల నుండి ఉదాహరణలను, ఇతర సంబంధిత సమాచారాన్ని ఉపయోగించి వాదనలను నిర్మించడం. ఉదాహరణకు, **'గురజాడ అప్పారావు కవిత్వంలో సంఘ సంస్కరణ దృక్పథం'** అనే అంశంపై పరిశోధన చేసేటప్పుడు, పరిశోధకుడు గురజాడ కవితల నుండి నిర్దిష్ట పంక్తులను ఉటంకిస్తూ, వాటిని అప్పటి సామాజిక పరిస్థితులతో పోల్చి తన వాదనను సమర్థించాలి. అందుకోసం సామాజిక శాస్త్రాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి.

**స్పష్టత** : పరిశోధనలో ఉపయోగించే పదజాలం, నిర్వచనాలు, చేసే వాదనలు స్పష్టంగా, నిర్దుష్టంగా ఉండాలి. అస్పష్టమైన భాష లేదా నిర్వచనాలు పరిశోధన విశ్వసనీయతను తగ్గిస్తాయి. ఉదాహరణకు, ఒక పరిశోధకుడు 'ఆధునికత' అనే పదాన్ని ఉపయోగిస్తే, ఆ పదం ద్వారా అతను ఏమి అర్థం చేసుకున్నాడో స్పష్టంగా నిర్వచించాలి.

**పరిశీలన** : సాహిత్య రచనను జాగ్రత్తగా, వివరంగా పరిశీలించడం, దాని అంతర్గత నిర్మాణాన్ని, భాషా శైలిని, ఇతర ముఖ్యమైన అంశాలను గుర్తించడం. ఉదాహరణకు, ఒక కవిత భాషా శైలిని విశ్లేషించేటప్పుడు, పరిశోధకుడు ఉపయోగించిన అలంకారాలు, పదాల ఎంపిక, వాక్య నిర్మాణాన్ని నిశితంగా పరిశీలించాలి.

**సామాన్య లక్షణాల గుర్తింపు** : ఒకే రకమైన సాహిత్య రచనలలో లేదా ఒకే రచయిత వివిధ రచనలలో పునరావృతమయ్యే లక్షణాలను

గుర్తించడం, వాటిని విశ్లేషించడం. ఉదాహరణకు, శ్రీ శ్రీ కవిత్వంలో విప్లవాత్మక భావాలు తరచుగా కనిపిస్తాయి. ఒక పరిశోధకుడు అతని వివిధ కవితలలో ఈ లక్షణాన్ని గుర్తించి, దాని ప్రాముఖ్యతను విశ్లేషించవచ్చు.

ఆధునిక కాలంలో, ముఖ్యంగా 20వ శతాబ్దం నుండి సాహిత్యంలో శాస్త్రీయత ప్రాముఖ్యత పెరిగింది. అంతకు ముందు, సాహిత్య విమర్శ ఎక్కువగా వ్యక్తిగత అభిప్రాయాలు, సౌందర్యాత్మక విలువలు, రచయితల జీవిత చరిత్రల చుట్టూ తిరిగేది. కానీ 19వ శతాబ్దం చివరలో, 20వ శతాబ్దం మొదట్లో భాషాశాస్త్రం, మనస్తత్వశాస్త్రం, సామాజిక శాస్త్రం వంటి రంగాలలో అభివృద్ధి చెందిన శాస్త్రీయ పద్ధతులు సాహిత్య అధ్యయనాలపై గణనీయమైన ప్రభావం చూపాయి. ప్రస్తుతం, డిజిటల్ మానవీయ శాస్త్రాలు (Digital Humanities), కంప్యూటేషనల్ లిటరేచర్ (Computational Literature) వంటి నూతన పద్ధతుల రాకతో, సాహిత్య గ్రంథాలను పద్ధతిగా, డేటా ఆధారంగా విశ్లేషించే అవకాశం లభించింది. ఉదాహరణకు, ఒక రచయిత ఏ తరహా పదాలను ఎక్కువగా ఉపయోగిస్తాడు, వారి రచనలలోని ప్రధాన ఇతివృత్తాలు ఏమిటి లేదా వివిధ పాత్రల మధ్య సంబంధాలు ఎలా ఉన్నాయి వంటి ప్రశ్నలను గణాంక విశ్లేషణ ద్వారా తెలుసుకోవచ్చు. ఇది కేవలం వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేయడం కాకుండా, కచ్చితమైన ఆధారాలతో మన వాదనలను సమర్థించడానికి సహాయపడుతుంది. సాహిత్య పరిశోధనలో శాస్త్రీయతను ఉపయోగించడం వల్ల, పరిశోధన విశ్వసనీయంగా, ప్రామాణికంగా ఉంటుంది, తద్వారా బలమైన వాదనలు చేయవచ్చు. ఇది సాహిత్య అధ్యయనాలను కేవలం కళను ఆస్వాదించడం నుండి ఒక క్రమబద్ధమైన జ్ఞానంగా మారుస్తుంది.

**శాస్త్రీయ పరిశోధన ముఖ్య లక్షణాలు**

**1. లక్ష్యాత్మకత** (Objectivity): శాస్త్రీయ పద్ధతిలో పరిశోధకుడు తన వ్యక్తిగత భావాలు, నమ్మకాలు, పక్షపాతాలను పక్కనబెట్టి, కేవలం ప్రాథమిక, ద్వితీయ మూలాధారాల ఆధారంగా మాత్రమే విశ్లేషణ చేస్తాడు. తెలుగు సాహిత్య పరిశోధనలో, ఒక పరిశోధకుడు ఒక నిర్దిష్ట రచయితను లేదా రచనను అభిమానించవచ్చు, కానీ ఆ అభిమానం వారి విశ్లేషణను ప్రభావితం చేయకూడదు. ఉదాహరణకు, విశ్వనాథ సత్యనారాయణ, గుర్రం జాషువా మొదలైన వారి కవిత్వాన్ని విశ్లేషించేటప్పుడు, పరిశోధకుడు వారి పాండిత్యాన్ని మెచ్చుకుంటూనే, వారి రచనలలోని సామాజిక దృక్పథాన్ని, వాస్తవాన్ని నిష్పాక్షికంగా అంచనా వేయాలి.

**2. నిష్పాక్షికత** (Impartiality): శాస్త్రీయ పరిశోధనలో సానుకూల, ప్రతికూల అంశాలను సమానంగా పరిశీలిస్తారు. ఒక సాహిత్య రచనలో ఉన్న సామాజిక సందేశాన్ని విశ్లేషించేటప్పుడు,



పరిశోధకుడు ఆ సందేశం సానుకూల, ప్రతికూల ప్రభావాలను రెండింటినీ చర్చించాలి. కేవలం ఒక కోణాన్ని మాత్రమే చూపించడం వలన పరిశోధన సమగ్రంగా ఉండదు. ఉదాహరణకు, కందుకూరి వీరేశలింగం పంతులు గారి సంస్కరణోద్యమాన్ని విశ్లేషించేటప్పుడు, పరిశోధకుడు అతని ప్రయత్నాల విజయాలను, పరిమితులను రెండింటినీ పరిశీలించాలి.

**3. క్రమబద్ధమైన విధానం** (Systematic Approach): శాస్త్రీయ పరిశోధనకు ఒక నిర్దిష్టమైన క్రమ పద్ధతి ఉంటుంది:

**సమస్య గుర్తింపు** (Problem Identification): పరిశోధన చేయవలసిన అంశాన్ని స్పష్టంగా నిర్వచించడం. ఉదాహరణకు, 'తెలుగు కథానికల్లో సామాజిక వర్గీకరణ: విశ్లేషణ.'

**ఊహా ప్రతిపాదన ఏర్పరుచుకోవడం** (Hypothesis Formulation): పరిశోధన ప్రశ్నకు ఒక తాత్కాలిక సమాధానాన్ని ప్రతిపాదించడం. ఉదాహరణకు, 'ఆధునిక తెలుగు కథానికలు క్షీణిస్తున్న మానవ సంబంధాలను ప్రతిబింబిస్తున్నాయి.'

**సమాచార సేకరణ** (Data Collection): పరిశోధనకు అవసరమైన సమాచారాన్ని సేకరించడం (మూల కథానికలు, విమర్శనాత్మక వ్యాసాలు, మొదలైనవి).

**సమాచార విశ్లేషణ** (Data Analysis): సేకరించిన సమాచారాన్ని విమర్శనాత్మకంగా పరిశీలించడం, విశ్లేషించడం.

**నిర్ధారణలు** (Conclusions & Findings): విశ్లేషణ ఫలితాల ఆధారంగా నిర్ధారణలకు రావడం, పరిశోధన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడం.

**ప్రామాణికత, విశ్వసనీయత** (Validity & Reliability): పరిశోధన ఫలితాలు నిజమైనవిగా ఉండాలి. ఇతర పరిశోధకులు అదే పద్ధతిని ఉపయోగించి పరిశీలిస్తే అదే ఫలితాలను పొందగలగాలి.

**4. నిరూపణ/ధృవీకరణ** (Verification/Validation): శాస్త్రీయ పరిశోధనలో ప్రతిపాదించిన సిద్ధాంతాలు, వచ్చిన నిర్ధారణలు ఇతరులు తిరిగి పరీక్షించి ధృవీకరించడానికి వీలుగా ఉండాలి. ఉదాహరణకు, ఒక పరిశోధకుడు 'ఒక నిర్దిష్ట రచయిత రచనలలో ఒక ప్రత్యేకమైన శైలి కనిపిస్తుంది' అని వాదిస్తే, ఇతర పరిశోధకులు కూడా అదే రచనలను విశ్లేషించి ఆ వాదనను ధృవీకరించగలగాలి. కానీ కొన్ని సందర్భాలలో భిన్నమైన ఫలితాలు వచ్చినప్పుడు అందుకుగల కారణాలను హేతుబద్ధంగా నిరూపించాలి.

**5. సాధారణీకరణ** (Generalization): శాస్త్రీయ పరిశోధన ఫలితాలు ఒక నిర్దిష్ట సందర్భానికి మాత్రమే పరిమితం కాకుండా, ఇతర సంబంధిత సందర్భాలకు కూడా వర్తించేలా ఉండాలి. ఉదాహరణకు, 'తెలుగులో స్త్రీవాద నవలల్లో స్త్రీ పాత్రల స్వభావం' అనే పరిశోధన ఫలితాలు ఇతర భారతీయ భాషల్లోని స్త్రీవాద నవలలకు కూడా కొంతవరకు వర్తించవచ్చు.

**6. పునరావృతం** (Replicability) : ఒక పరిశోధకుడు ఉపయోగించిన పద్ధతిని మరొక పరిశోధకుడు లేదా బృందం అనుసరించినప్పటికీ, ఫలితాలు సారూప్యంగా ఉండాలి. ఇది శాస్త్రీయ పరిశోధనలో ఒక ముఖ్యమైన అంశం. ఉదాహరణకు, ఒక నిర్దిష్ట పదజాల విశ్లేషణ పద్ధతిని ఉపయోగించి ఒక రచయిత శైలిని అధ్యయనం చేస్తే, మరొక పరిశోధకుడు కూడా అదే పద్ధతిని ఉపయోగించి అదే ఫలితాలను పొందగలగాలి. దీని కోసం ఉపయోగించిన పద్ధతులు, కొలమానాలను స్పష్టంగా డాక్యుమెంట్ చేయడం చాలా ముఖ్యం.

**శాస్త్రీయ పరిశోధన ప్రయోజనాలు**

**1. విశ్వసనీయత** (Credibility): శాస్త్రీయ పద్ధతిని అనుసరించడం వలన పరిశోధనకు విశ్వసనీయత లభిస్తుంది. వ్యక్తిగత అభిప్రాయాలకు బదులుగా, మూలాధారాలు, తార్కిక విశ్లేషణల ఆధారంగా రూపొందించబడిన ఫలితాలను ఇతరులు కూడా ధృవీకరించగలరు. ఉదాహరణకు, 'తెలుగు సినిమా పాటల్లో స్త్రీల ప్రాతినిధ్యం' అనే అంశంపై ఒక పరిశోధన గణాంకాలు, ఇంటర్వ్యూలు సినిమా దృశ్యాల విశ్లేషణ ద్వారా సమర్థించబడితే, ఆ ఫలితాలను నమ్మవచ్చు.

**2. ప్రామాణికత** (Validity): శాస్త్రీయ పద్ధతిని అనుసరించడం వలన పరిశోధన నిర్ధారణలు ప్రామాణికమైన మూలాధారాలతో అనుసంధానించబడి ఉంటాయి. ఉదాహరణకు, 'ప్రాచీన తెలుగు సాహిత్యంలో ప్రకృతి వర్ణన' అనే అంశంపై పరిశోధన చేసేటప్పుడు, పరిశోధకుడు నేరుగా ప్రాచీన కావ్యాల నుండి ఉదాహరణలను ఉటంకిస్తూ తన వాదనను సమర్థించాలి.

**3. లోతైన అవగాహన** (In-depth Understanding): శాస్త్రీయ పద్ధతులు గుణాత్మక, పరిమాణాత్మక విశ్లేషణ పద్ధతులను సమన్వయం చేయడానికి అవకాశం కల్పిస్తాయి. ఉదాహరణకు: ఒక రచయిత భాషా శైలిని అర్థం చేసుకోవడానికి ఆధునిక కాలంలో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని, పరిమాణాత్మక పద్ధతులను ఉపయోగించవచ్చు. భాషాశాస్త్ర విభాగాలలో కావాల్సిన పరికరాలు ఉన్నాయి. ఒక సాహిత్యంలోని పాత్రల మానసిక స్థితిని విశ్లేషించడానికి భావోద్వేగ విశ్లేషణ (Sentiment Analysis ) ఉపయోగపడుతుంది. సాహిత్యంలోని వివిధ అంశాల మధ్య సంబంధాలను అధ్యయనం చేయడానికి ఇంటర్ డిసిప్లినరీ పరిశోధనా పద్ధతులు ఉపయోగపడతాయి. ఈ పద్ధతులు కేవలం ఉపరితల విశ్లేషణ కాకుండా, లోతైన అవగాహనను అందిస్తాయి. ఉదాహరణకు, 'దిగంబర కవుల రచనలు : సామాజిక విమర్శ' అనే అంశంపై పరిశోధన చేసేటప్పుడు, పరిశోధకుడు దిగంబర కవుల రచనల భాషను, అప్పటి సామాజిక పరిస్థితులను, విమర్శనాత్మక దృక్పథాన్ని లోతుగా అధ్యయనం చేయవచ్చు.

**4. పారదర్శకత** (Transparency) & **జవాబుదారీతనం** (Accountability): శాస్త్రీయ పరిశోధనలో ఉపయోగించిన పద్ధతులు స్పష్టంగా వివరించబడి ఉంటాయి, కాబట్టి ఇతర పరిశోధకులు ఆ పద్ధతులను పరిశీలించి, అవసరమైతే విమర్శించవచ్చు. ఇది పరిశోధనలో పారదర్శకతను, జవాబుదారీతనాన్ని పెంచుతుంది. ఉదాహరణకు, ఒక పరిశోధకుడు ఒక నిర్దిష్ట విశ్లేషణ పద్ధతిని ఉపయోగిస్తే, ఆ పద్ధతి వివరాలను తన నివేదికలో స్పష్టంగా పేర్కొనాలి, తద్వారా ఇతరులు దానిని అర్థం చేసుకోగలరు. ఉదాహరణకు పరిశోధనలో ఉపయోగించిన ప్రాథమిక మరియు ద్వితీయ శ్రేణి మూలాలన్నింటినీ (పుస్తకాలు, వ్యాసాలు, శాసనాలు మొదలైనవి) స్పష్టంగా ఉదహరించాలి. ప్రతి వాదనకు లేదా సమాచారానికి ఆధారమైన మూలాన్ని నిర్దిష్టంగా ఫుట్‌నోట్స్ లేదా ఎండ్‌నోట్స్‌లో పేర్కొనాలి. ఇది ఇతర పరిశోధకులకు ఆ సమాచారాన్ని ధృవీకరించడానికి లేదా మరింత లోతుగా అధ్యయనం చేయడానికి సహాయపడుతుంది. విశ్లేషణ హేతుబద్ధతను వివరించాలి. రచనలను విశ్లేషించేటప్పుడు, పరిశోధకుడు తన విశ్లేషణకు దారితీసిన తార్కిక క్రమాన్ని మరియు కారణాలను స్పష్టంగా వివరించాలి. ఒక నిర్దిష్ట కవి లేదా రచయిత పనిని ఒక ప్రత్యేక కోణంలో అర్థం చేసుకున్నట్లయితే, ఆ అవగాహనకు గల సమర్థనను తెలియజేయాలి.

**5. సాహిత్య పరిశోధనకు ప్రామాణిక దిశ** (Standardization): తెలుగు సాహిత్య పరిశోధనలో అనేక విభిన్న విధానాలు ఉన్నాయి. శాస్త్రీయ పద్ధతులు ఈ విధానాలను నిర్దిష్ట ప్రమాణాలతో అనుసంధానిస్తాయి, తద్వారా పరిశోధన నాణ్యతను మెరుగుపరచవచ్చు. ఉదాహరణకు, 'ఆధునిక తెలుగు కవిత్వంలో

భావచిత్రణ' అనే అంశంపై పరిశోధన చేసేటప్పుడు, శాస్త్రీయ పద్ధతులు భావచిత్రణను విశ్లేషించడానికి ఒక ప్రామాణికమైన చట్రాన్ని అందించగలవు.

**6. జ్ఞానాభివృద్ధి** (Knowledge Advancement): శాస్త్రీయ పద్ధతిని అనుసరించి చేసిన పరిశోధన ఫలితాలు భవిష్యత్తులో జరిగే పరిశోధనలకు పునాదిగా ఉపయోగపడతాయి. ఇది సాహిత్య రంగంలో కొత్త జ్ఞానాన్ని సృష్టించడానికి, ఉన్న జ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి సహాయపడుతుంది. ఉదాహరణకు, ఒక పరిశోధకుడు ఒక నిర్దిష్ట సాహిత్య ఉద్యమం లక్షణాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తే, ఆ విశ్లేషణ భవిష్యత్తులో ఆ ఉద్యమంపై జరిగే పరిశోధనలకు ఒక ప్రామాణికమైన ప్రారంభ బిందువుగా ఉపయోగపడుతుంది.

శాస్త్రీయ పరిశోధన ఎదుర్కొనే సవాళ్లు శాస్త్రీయ పద్ధతులను అనుసరించడం అనేక ప్రయోజనాలను కలిగి ఉన్నప్పటికీ, సాహిత్య పరిశోధనలో కొన్ని ప్రత్యేకమైన సవాళ్లు ఎదురవుతాయి:

**1. ఆత్మాశ్రయత్వం** (Subjectivity) **ప్రభావం:** సాహిత్య పరిశోధన అనేది పరిశోధకుల వ్యక్తిగత అనుభవాలతో ముడిపడి ఉంటుంది. ఒకే రచన వేర్వేరు పరిశోధకులకు వేర్వేరు అనుభూతులను కలిగించవచ్చు. ఈ ఆత్మాశ్రయతను పూర్తిగా తొలగించడం చాలా కష్టం. ఉదాహరణకు, ఒక విషాద కావ్యం ఒక పరిశోధకుడిని తీవ్రంగా కలచివేయవచ్చు, మరొకరిపై అంతగా ప్రభావం చూపకపోవచ్చు. ఈ వ్యక్తిగత స్పందనలను శాస్త్రీయంగా కొలవడం ఒక సవాలు. తెలుగులో, ఒకే కవి రెండు వేర్వేరు కవితలను విశ్లేషించేటప్పుడు, పరిశోధకుల వ్యక్తిగత అభిప్రాయాలు విశ్లేషణను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

**2. బహుళార్థకత** (Multiplicity of Meanings): సాహిత్య రచనలు తరచుగా అనేక అర్థాలను కలిగి ఉంటాయి. ఒక పదం, ఒక వాక్యం లేదా ఒక మొత్తం రచన వివిధ స్థాయిలలో అర్థాన్నివ్వగలదు. శాస్త్రీయ పద్ధతులు స్పష్టమైన నిర్వచనాలు, కొలమానాలను కోరుతాయి, కానీ సాహిత్యంలో ఈ బహుళార్థకతను తగ్గించడం లేదా ఒకే అర్థానికి పరిమితం చేయడం దాని గొప్పతనాన్ని తగ్గించినట్లు అవుతుంది. ఉదాహరణకు, ఒక ప్రతీకాత్మక కవిత లేదా రచనలోని ఒక పాత్రను ఒకే ఒక్క దృక్పథంలో చూడటం కష్టం. తెలుగులో, నన్నయ మహాభారతంలోని ఒక పద్యం అనేక రకాల వ్యాఖ్యానాలకు అవకాశం కలిగి ఉంటుంది. ఒక పాత్రను భిన్న దృక్పథాలతో విశ్లేషించవచ్చు.

**3. సాంఘిక, సాంస్కృతిక నేపథ్యం ప్రాముఖ్యత:** ప్రతి సాహిత్య రచన ఒక నిర్దిష్ట సాంఘిక, సాంస్కృతిక సందర్భంలో సృష్టించబడుతుంది. ఈ నేపథ్యాన్ని విస్మరించి కేవలం శాస్త్రీయ కొలమానాలతో విశ్లేషించడం సరైనది కాదు. ఉదాహరణకు, 19వ శతాబ్దపు తెలుగు




నవలలను అప్పటి సామాజిక పరిస్థితులను పరిగణనలోకి తీసుకోకుండా విశ్లేషించడం అసంపూర్ణంగా ఉంటుంది.

**4. నిర్వచనాల అస్పష్టత – తప్పుడు ఖచ్చితత్వం:** సాహిత్య విశ్లేషణలో ఉపయోగించే అనేక పదాలకు ఖచ్చితమైన నిర్వచనాలు ఉండకపోవచ్చు. శాస్త్రీయ పద్ధతులు ఖచ్చితమైన కొలమానాలను కోరుతాయి, కానీ కొన్నిసార్లు సాహిత్యంలోని సూక్ష్మమైన అంశాలను సంఖ్యాపరంగా కొలవడానికి ప్రయత్నించడం తప్పుడు ఖచ్చితత్వానికి దారితీయవచ్చు. ఉదాహరణకు, ఒక కవితలోని 'అందాన్ని' లేదా ఒక పాత్ర 'నైతికతను' సంఖ్యాపరంగా కొలవడం కష్టం.

**5. సాంకేతిక పరిమితులు :** డిజిటల్ మానవీయ శాస్త్రాలు, కంప్యూటేషనల్ లిటరేచర్ వంటి ఆధునిక పద్ధతులు సాహిత్య విశ్లేషణకు కొత్త అవకాశాలను అందిస్తున్నప్పటికీ, వాటికి కొన్ని పరిమితులు ఉన్నాయి. ఉదాహరణకు, సహజ భాషా ప్రాసెసింగ్ (NLP) సాధనాలు కొన్నిసార్లు భాష సూక్ష్మ నైపుణ్యాలను, సాంస్కృతిక సందర్భాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేకపోవచ్చు. తెలుగు భాషకు సంబంధించిన NLP సాధనాలు ఇంకా అభివృద్ధి చెందుతున్న దశలో ఉన్నాయి.


**6. వనరుల కొరత :** తెలుగులో శాస్త్రీయ పరిశోధనా పద్ధతులను వివరించే సమగ్రమైన గ్రంథాలు తక్కువగా ఉన్నాయి. అలాగే, శాస్త్రీయ విమర్శ సూత్రాలను వివరించే ఆంగ్ల గ్రంథాలు కూడా తెలుగులో అందుబాటులో లేకపోవడం ఒక సవాలు.

**7. సమయం, శ్రమ :** శాస్త్రీయ పద్ధతులను ఉపయోగించి సాహిత్య పరిశోధన చేయడం ఎక్కువ సమయం, శ్రమతో కూడుకున్నది. ఇది విస్తృతమైన సాహిత్య సమీక్ష, మూల గ్రంథాల అధ్యయనం, కొన్నిసార్లు గణాంక విశ్లేషణ వంటి వాటిని కలిగి ఉంటుంది.

### తెలుగు పరిశోధనలో ఉత్తమ శాస్త్రీయ పరిశోధన గ్రంథాలు

తెలుగులో చాలా గ్రంథాలు శాస్త్రీయ పరిశోధన పద్ధతిని అనుసరించి రచించారు. వ్యాస పరిమితి కారణంగా ఇక్కడ రెండు గ్రంథాలను మాత్రమే పేర్కొనడం జరిగింది.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8 (34) హైదరాబాద్ జూన్ : 2025



**ఉద్యమ దర్శనము–ముదిగొండ శివప్రసాద్**

ముదిగొండ శివప్రసాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం వారికి డాక్టరేటు పట్టా కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథము **'ఉద్యమ దర్శనము'** (ఆధునికాంధ్ర కవిత్వముపై వివిధ ఉద్యమముల ప్రభావము). ఇది శాస్త్రీయ పరిశోధనకు ఉపయోగపడే లక్షణాలను కలిగి ఉన్న గ్రంథం. ఇది తత్వశాస్త్ర, సామాజిక, సాంస్కృతిక మార్పులను విశ్లేషిస్తూ ఒక ఉద్యమాన్ని శాస్త్రీయంగా పరిశీలించే ప్రయత్నం చేసింది.

ఈ పుస్తకంలో ఉద్యమాల చరిత్రను, అవి ఎలా మొదలయ్యాయో చాలా వివరంగా విశ్లేషించారు. ఉద్యమాలు ఎప్పుడు మొదలయ్యాయో వరుసగా చూస్తూ, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక కారణాలను ఆధారాలుగా పరిశీలించడం శాస్త్రీయ పరిశోధనకు దగ్గరగా ఉంది.

ఈ పుస్తకంలో ప్రాచీన గ్రంథాలలోని సమాచారం, చరిత్ర, ఇప్పటి పత్రికల్లోని వ్యాసాలు వంటి వివిధ ఆధారాలను ఉపయోగించి విశ్లేషణ చేశారు. ఇది శాస్త్రీయ పరిశోధనలో ముఖ్యమైన 'మూలాల' ప్రాధాన్యతను చూపిస్తుంది.

'ఉద్యమ దర్శనం' అనే పేరు ఉద్యమాల గురించి ఒక పెద్ద ఆలోచనను సూచిస్తున్నప్పటికీ, పుస్తకంలో మాత్రం ఒక ప్రత్యేకమైన సామాజిక ఉద్యమంపై దృష్టి పెట్టి అధ్యయనం చేశారు. ఇది శాస్త్రీయ పరిశోధనలో అవసరమైన **'స్పష్టమైన అంశంపై దృష్టి పెట్టడం'**కు ఉదాహరణ.

పరిశోధనలాగే, ఈ పుస్తకంలోని అధ్యాయాలు ఒక క్రమ పద్ధతిలో ఉన్నాయి. మొదట నేపథ్యం, తర్వాత ఉద్యమాల లక్షణాలు, వాటికి కారణాలు... ఇలా రచయిత ఒక శాస్త్రీయమైన క్రమాన్ని అనుసరించారు.

పరిశోధన గ్రంథంలో సాంఘిక శాస్త్రాల్లో ఉన్నట్లుగా ఉద్యమాలపై మార్క్సిజం, సాంస్కృతిక సిద్ధాంతాలు, జాతీయత వంటి భావాల ప్రభావం ఎలా ఉందో రచయిత విశ్లేషించారు. ఇది పరిశోధన లోతును పెంచుతుంది.

పుస్తకంలోని ఆలోచనలు కేవలం గతంలోని విశ్లేషణ మాత్రమే కాకుండా, ఇప్పటి సామాజిక సమస్యల గురించి కూడా దృష్టిని సారిస్తాయి. ఇది పరిశోధనలో ఉన్నత స్థాయి పరిణితిని చూపిస్తుంది.

పరిశోధకుడు చెప్పే విధానం, ఉదాహరణలు ఎంచుకోవడం, విషయాలను నిర్ధారించడం – ఇవన్నీ లోతైన పరిశోధన నైపుణ్యాలను తెలియజేస్తాయి. ఇవి ఒక మంచి శాస్త్రీయ అధ్యయనానికి గుర్తులు.

వేర్వేరు ఉద్యమాలను పోల్చి విశ్లేషించడం వల్ల, వివిధ విభాగాల్లో తేడాలు, పోలికలు స్పష్టంగా కనిపిస్తాయి. ఇది పరిశోధనకు ఒక కొత్త కోణాన్ని ఇస్తుంది.

పుస్తకంలో చరిత్ర, రాజనీతి శాస్త్రం, సామాజిక శాస్త్రం, సాహిత్యం అన్నీ కలిపి చూడగలగడం, వివిధ శాస్త్రాల అనుసంధానానికి ఉదాహరణ.

**ఆంధ్ర మహాభారత శైలీ పరిశీలనం – పరిమి రామనరసింహం**

మరొక గ్రంథం పరిమి రామనరసింహం రచించిన 'ఆంధ్ర మహాభారత శైలీ పరిశీలనం'. ఇది విశ్వవిద్యాలయం వారికి సమర్పించిన సిద్ధాంత గ్రంథం కాదు. కానీ ఈ గ్రంథం తెలుగులో శాస్త్రీయ పరిశోధనకు ఒక మంచి ఉదాహరణ. ఈ పరిశోధన గ్రంథం ఆంధ్ర మహాభారతంలోని భాషాంశాలను శాస్త్రీయంగా విశ్లేషించింది. తెలుగు విశ్వవిద్యాలయం వారు 1990–91 సంవత్సరానికి గాను ప్రాచీనాంధ్ర సాహిత్య విభాగంలో **'ఆంధ్ర మహాభారతం–భాషాశాస్త్ర విశ్లేషణ'** అనే శీర్షికన నిర్వహించిన పరిశోధన గ్రంథ రచన పోటీలో ఉత్తమ బహుమతి పొందిన గ్రంథం. రచయిత ఈ గ్రంథంలో శాస్త్రీయ పరిశోధనా విధానం అవలంబించారు. అధ్యయన పరిధి, అధ్యయన పరిమితులు, ప్రాథమిక ఆధారాలు, రెఫరెన్సులు... ఇలా ప్రతి అంశాన్ని పరిశోధన పద్ధతిని పాటించడంతో పాటు ప్రతి విషయాన్ని తర్కబద్ధంగా వివరించారు రచయిత. ఒక పోటీకి రచించిన గ్రంథం విశ్వవిద్యాలయాలకు సమర్పించే సిద్ధాంత గ్రంథాలలో అనుసరించే శాస్త్రీయ పద్ధతిని అవలంబించడం అనేది పేర్కొనదగిన విషయం. ఆంధ్ర మహాభారతంలోని భాషాంశాలను భాషాశాస్త్ర పద్ధతుల ద్వారా విశ్లేషించడం, భాషా నిర్మాణం, శైలి, పదజాలం వంటి అంశాలను శాస్త్రీయంగా పరిశీలించారు. భాషా విశ్లేషణలో గణాంక శాస్త్ర పద్ధతులను కూడా ఉపయోగించారు. పదాల ఫ్రీక్వెన్సీ, వాక్యాల నిర్మాణం వంటి అంశాలను గణాంకాల ద్వారా విశ్లేషించారు. నన్నయ, తిక్కన, ఎర్రనల సంభాషణలను విశ్లేషించి, వారి శైలీ భేదాలను గుర్తించారు. సంభాషణల ద్వారా పాత్రల మనస్తత్వ విశ్లేషణ కూడా చేశారు. ఛందస్సు, పదాల కూర్పు, శైలి వంటి అంశాల ద్వారా పద్యాలను విశ్లేషించారు. నన్నయ, తిక్కన, ఎర్రనల పద్య శైలిని పోల్చి చూశారు. తెలుగులో ఆంధ్ర మహాభారతం భాషా శైలిని శాస్త్రీయంగా విశ్లేషించిన మొట్టమొదటి గ్రంథాలలో ఇది ఒకటి. తెలుగు భాషా పరిశోధనలో కొత్త కోణాలను శాస్త్రీయ పద్ధతిలో ఆవిష్కరించింది.

**ముగింపు:**

శాస్త్రీయ పరిశోధనా పద్ధతులు నిస్సందేహంగా సాహిత్య అధ్యయనానికి ఒక విలువైన దృక్పథాన్ని అందిస్తాయి. అవి పరిశోధనకు క్రమబద్ధత, విశ్వసనీయత, ప్రామాణికతను చేకూరుస్తాయి. లోతైన విశ్లేషణ జ్ఞానాభివృద్ధికి తోడ్పడతాయి. అయితే, సాహిత్యంలోని స్వాభావికమైన ఆత్మాశ్రయత్వం, బహుళార్థకత, సాంస్కృతిక సందర్భాల ప్రాముఖ్యత వంటి ప్రత్యేకమైన సవాళ్లను గుర్తించాలి. సాహిత్య పరిశోధనలో శాస్త్రీయ పద్ధతులను అన్వయించే టప్పుడు, ఈ సవాళ్లను పరిగణనలోకి తీసుకోవడం, సందర్భోచితమైన విధానాలను అభివృద్ధి చేయడం చాలా ముఖ్యం. శాస్త్రీయ పద్ధతులను అనుసరించడానికి విశ్వవిద్యాలయాలలో ఒక క్రమబద్ధమైన ప్రణాళికను రూపొందించాల్సిన అవసరం ఉంది.



**ఉపయోగించుకున్న పుస్తకాలు**

**తెలుగు**

ముదిగొండ, శివప్రసాద్. ఉద్యమ దర్శనము (ఆధునికాంధ్ర కవిత్వముపై వివిధ ఉద్యమముల ప్రభావము). హైదరాబాద్: రస గంగోత్రి ప్రచురణలు, 1990.

ముదిగొండ, వీరభద్రయ్య. విమర్శ, కళాతత్త్వ శాస్త్రాలు. హైదరాబాద్: తెలుగు అకాడమి, 2012.

రాచపాళెం, చంద్రశేఖర్ రెడ్డి మరియు హెచ్. ఎస్., బ్రహ్మానంద. సాహిత్య పరిశోధనా సూత్రాలు. హైదరాబాద్: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1997.

రామనరసింహం, పరిమి. ఆంధ్ర మహాభారత శైలీ పరిశీలనం. హైదరాబాద్: పరావాక్ ప్రచురణలు, 1996.

**ఆంగ్లం**

Prathapan, K. *Research Methodology for Scientific Research*. New Delhi: I.K. International Pvt. Ltd., 2019.

❖ ❖ ❖ ❖ ❖

## 'కదంబం'

**(తెలుగు సాహిత్య ప్రక్రియలు - రూపాలు)**

**మూసీ మాసపత్రిక ప్రచురించిన ప్రత్యేక గ్రంథం**

**ప్రాచీన, అధునాతన, జానపద ప్రక్రియలన్నింటిపై ప్రత్యేక వ్యాసాలు**

(పురాణం, ఇతిహాసం, కావ్యం మొదలైన ప్రక్రియలు మొదలు నానీలు, హైకూల వరకు 82 సాహిత్య ప్రక్రియలపై ప్రముఖ సాహితీవేత్తల కలాల నుండి జాలువారిన ప్రత్యేకాంశాల సమాహారం. పోటీ పరీక్షలకు, కళాశాలలకు, వ్యక్తిగతంగా అందరికీ వినియోగపడే ఉత్తమ గ్రంథం **'కదంబం'.**

**440 పేజీలతో వెలువడిన ఈ గ్రంథం వెల రూ. 350/-**

## ఆలోకనం

**(తెలంగాణ 31 జిల్లాల చరిత్ర సాహిత్య సాంస్కృతిక సమాచారం)**

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా మూసీ మాసపత్రిక ప్రత్యేకంగా సంకలనం చేసిన గ్రంథం ఆలోకనం.

తెలంగాణ 31 జిల్లాలకు సంబంధించిన విలువైన సమాచార సూచిక ఇది.

330 పేజీల ఈ గ్రంథం విలువైన రంగు చిత్రాలతో కూడుకుని ఉన్న విశేష గ్రంథం.

అన్ని రకాల కాంపిటీషన్ పరీక్షలకు కూడా వినియోగపడే సమగ్ర సమాచార దర్పణం.

**మూసీ కార్యాలయంలో దీనిని పొందదలచిన వారికి కేవలం 300/- (అసలు 500/-) కు మాత్రమే అందిస్తున్నాం. సంప్రదించండి.**

# కైరం భూమదాసు వ్యక్తిత్వం – సాహిత్యం

✍ డా. వి. స్రవంతి, తెలుగు అధ్యాపకురాలు, తెలంగాణ సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల, జగద్గిరిగుట్ట. ఫోన్ : 9505916391

**వ్యాస సంగ్రహం :** తెలంగాణలో వందల సంఖ్యలో దాసకవులున్నారు. ఒక్కొక్కరిది ఒక్కో శైలి,మార్గం ఎంచుకున్న సంప్రదాయం, చెప్పిన పద్ధతి ఏదైనా వారందరి బోధ ఒక్కటే. కులం, మతం, జాతి, వర్ణం అనే తారతమ్యాలు లేకుండా జీవించిన పరమ భక్తులు, జ్ఞాన బోధలు, తత్వవేత్తలు, మహనీయులు. వారిలో కైరం భూమదాసు (పురుషోత్తమ దాసు) ఒకరు. నేటి సాహితీవేత్తలలో కూడా చాలా కొద్దిమందికే తెలిసిన భూమదాసు సమాజంలో ఒకడిగా జీవిస్తూ, సంసార బాధ్యతలు నిర్వర్తిస్తూనే, ఎన్నో అవరోధాలను దాటుతూ విశిష్టాద్వైతాన్ని స్వీకరించి ఊరూరా ప్రచారం చేసిన గొప్ప హరిదాసుడు, కృష్ణ ప్రియుడు, వాగ్గేయకారుడు.వీరి వ్యక్తిత్వం, సాహిత్యం ఈ వ్యాసం ద్వారా పరిచయం చేస్తున్నాను.

Keywords : కైరం భూమదాసు, వ్యక్తిత్వం, సాహిత్యం, కీర్తన, పద్యం, సమాజం.

**ఉపోద్ఘాతం :** తెలంగాణలో విస్తృతమైన సంకీర్తన సాహిత్యం ఉందని భాస్కరయోగి పాలమూరు జిల్లా సంకీర్తన సాహిత్యం ఒక పరిశోధన లో, తెలంగాణ పద సంకీర్తనలు అనే పుస్తకం ద్వారా వెల్లడి చేశారు. ఎందరో కీర్తనాకారులను పరిచయం చేశారు. ఈ గ్రంథాల మార్గంలో పయనిస్తూ నేను తెలంగాణ దాసకవులందరినీ ఒక దగ్గరకు చేర్చే ప్రయత్నం చేశాను. అందులో భాగంగానే కైరం భూమదాసు గురించి వేముల పెరుమాళ్ళు గారు పరిష్కరించిన వరకవి కైరం భూమదాసు కృతులు అనే గ్రంథం ద్వారా అతని కీర్తనలను, జీవితాన్ని కొంత అర్థం చేసుకుని ఈ వ్యాసం ద్వారా అతనిని గూర్చి విశ్లేషణాత్మకంగా వివరించదలిచాను.

**వ్యాసాంశం :** వరంగల్ ప్రాంతంలో జన్మించి గొప్ప సంకీర్తన కారుడుగా పేరుగాంచిన కైరం భూమదాసు గారి వ్యక్తిత్వం అలాగే సాహిత్యాన్ని పరిచయం చేయదలిచాను.

భూమదాసు 19వ శతాబ్దంనకు చెందిన వాగ్గేయకారుడు. ఈయన రాజమల్లు, లింగమ్మ దంపతులకు జన్మించారు. గౌడ కులస్తుడు కావడం వల్ల పుట్టుకతో అతనికి పెట్టిన పేరు భీమగౌడు. రామానుజ మతం స్వీకరించిన తర్వాత అతని పేరు భూమదాసుగా మార్చుకున్నాడు. కవిత్వం రాయడం మొదలు పెట్టినతర్వాత తన కలానికి పురుషోత్తముడు (కలం పేరు) అని పేరు పెట్టుకున్నాడు. దాదాపు వందేళ్ల క్రితం చదువుకోవడానికి ఎటువంటి అవకాశంలేని సమయంలో అతను చదువుకునేందుకు చాల కష్టపడ్డాడట. ఇటుకపొడి చల్లిన పలక మీద అక్షరాలు దిద్దేవాడు భూమదాసు. కవిత్వం రాయడం అలవాటు అయిన తర్వాత తను వృత్తిరీత్యా తాటికల్లు గీసేవాడు కనుక కల్లు తీసేప్పుడు లోట్ల మీద బొగ్గుతోను, బలపంతోను గీస్తుండేవాడు. గీతకార్మికుడైన భూమగౌడ్ కేశవపట్నం శేషమఠం వారినుండి రామానుజ మతాన్నిస్వీకరించి దాసుడయ్యాడు.

విశిష్టాద్వైత మతస్థాపకుడు రామానుజాచార్యులను గురువుగా భావించి వారిపైన ఎన్నో కీర్తనలను రచించారు. భూమదాసు వారి మిత్రుడైన తిరునగరి నరసింహదాసు గారిచేత “మదన చరిత్రము” అనే నాటకం రాయించి దానికి కృత భర్త అయ్యారు. భూమదాసు ప్రత్యేకమైన వ్యక్తిత్వం గలవారు. వైష్ణవాన్నీబాగా వంటబట్టించుకున్న వారు. వీరు ఇంటికి ఎవరు వచ్చిన శంఖు,చక్రాలను కాల్చి, వచ్చిన అతిధి భుజాలకి వారికి కూడా తెలియకుండానే అచ్చు వేసేవారు. తన జీవితాన్ని ఎంతో ఆదర్శంగా మలచుకున్నారు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడిన ఈ దాసకవి తన జీవితాంతం కొన్ని లక్షణాలను ఆచరించాడు.

**దాసు ఆచరించిన కొన్ని లక్షణాలు :**

1. అంటరానితనాన్నిఅతను నిరసించాడు.
2. అత్యంత సరళమైన జీవితాన్ని గడిపాడు.
3. ఆయుర్వేద చికిత్స వైద్యుడిగా, ఔషధకుడిగా తన జీవితకాలం పేదలకు సేవలందించారు.

**దాసు జీవితకాలం చేసిన పనులు:**

1, వైష్ణవ ప్రచారం.

2.వైద్యం చేయడం

3.కవిత్వం చెప్పడం.

భూమదాసు కాలినడకన తెలంగాణ ప్రాంతమంతా తిరిగాడు దానికి గల లక్ష్యాలు వైష్ణవ మతప్రచారం, శిష్య బృందాన్ని పెంచుకోవడం, సాహిత్యకారులను కలిసి సాహిత్య ప్రకర్షను పెంచుకోవడం.

దాసు తాను రాసిన విష్ణు కీర్తనలను పాడతూ ఊరురా ప్రచారం చేసుకుంటూ తన లక్ష్యసాధనకై ముందుకు సాగాడు. అంతేకాక ఇతని కీర్తనలు కొందరు మాలదాసర్లు విని ముగ్ధులయ్యారు. హరిదాసులు, బిక్షాటకులు గ్రామగ్రామాన తిరిగి కైరం భూమదాసు సాహిత్య వ్యాప్తి కి కృషి చేసారు అంటే వారి సాహిత్యం, భాష హరిదాస కులస్తులను, భిక్షాటకులను ఎంతగానో ఆకర్షించింది. అదేవిధంగా వాటిని ప్రచారం చేయడానికి కూడా తగిన భాష ఉండటం వల్ల దాసు సాహిత్యం జనబాహుళ్యంలోకి తొందరగా వెళ్ళింది. నాడు వైష్ణవమత ప్రచారానికి దాసు గారి కీర్తనలు ఎంతో దోహదపడ్డాయి.

నిరంతరం భగవంతుడిని గుర్తు చేసుకోనుటకు, స్మరించుటకు వీలుగా లేదా అనువుగా తాను వాడే అన్నివస్తువులకు వ్యవసాయ, సామాగ్రికి వైష్ణవనామాలే పెట్టుకున్నాడు. తన పొలానికి వెంకటేశ్వర దరి అని అలాగే గోనె తాళ్లకి జగన్నాథం అని పిలుచుకునేవారట. వారి సాహిత్య అంశాలని పరిశీలిస్తే ఎక్కువగ వారు రాసిన కీర్తనలలో సమాజం ఒక వస్తువు. అంతర్లీనంగా కృష్ణ భక్తి మరో వస్తువుగా ఉ ంటుంది. వీటితోపాటు అమలిన శృంగారాన్ని సుతిమెత్తగ తన కృతుల్లో రాయడం ఇతని ప్రత్యేకత.

**ఒక కీర్తన:**

**నా కొంగు వీడరా గోపాల అంటూ సాగె కీర్తనలో**

**చ: "పాకము గాలేదు పదియేండ్ల బాలను**

**ముసి ముసి నగవులు గుసగుసలు వద్దు**

**రసికత్వమున పళ్ళ రసము ద్రావణముద్దు**

**కాసులెందుకు నాకు సుకుమార**

**రాసిరిచే పెరిమవిడిచే తరమ"** (క్షైరం భూమదాసు, వరకవి క్షైరం భూమదాసు కృతులు, పుట 5, 3వ చరణం)

వీరి రచనల్లో శృంగార భావనను వ్యక్తం చేసేవే కాక చక్కని భజన కీర్తనలు కన్పిస్తాయి. ఇది ఆనాటి జానపదులను ఎంతగానో ఆకర్షించటం వల్ల ఈనాటికి అతని కీర్తనలు అక్కడక్కడ జానపదుల నోళ్ళలో వినిపించడం విశేషం. ఇతని కీర్తనల్లో వేడుకోవడం ప్రధానం.

అడుగుదాటి కదలనివ్వను ! అనే కీర్తనలో -

**"రేపు మాపని జరిపితేనూ**

**ఆపు జేసేటివాడగాను**

**ప్రాపునీవని నమ్మి కొలిచిన**

**పాపములనే బాపి దయతో**

**తేప తేపకునీ మొగమిటు**

**చూపకున్న నోర్వ సుమ్మీ"** (క్షైరం భూమదాసు, వరకవి క్షైరం భూమదాసు కృతులు.పుట 21)

తేపతేపకు నీ మోమును చూపించక పోతే నేను తట్టుకోలేను అంటూ చక్కని తెలంగాణా పదజాలాన్ని వాడుతూ భగవంతుణ్ని వేడుకుంటాడు. ఈ దాసుగారు రామాయణాన్ని, మహాభారతాన్ని తేలికయిన పదబంధాలతో పామరులకు సైతం అర్థం అయ్యే భాషలో రాసి వారికి భగవత్ భక్తి రసాన్ని చవిచూపించారు.

అలాగే బలశాలి భీమసేనా అనే ఒక కీర్తనను చుస్తే వారి సరళశైలి అర్థం అవుతుంది.

**"పాండుతనయులమయ్యి మనమూ**

**రాజ్యము విడచి పదమూడు సంవత్సరములూ**

**ఎండవానలకోర్చివిరాట్రాజింటిలోయుండి**

**కీచకునితో యుద్ధము చేసితి మీ"** (వరకవి క్షైరం భూమదాసు కృతులు, పుట 23, 4వచరణం)

ఈ కీర్తనలో మహాభారత కథను జానపదులు పాడుకునే విధంగా రచించారు. పాండవులలో ఒకడిగా భావించి కృష్ణుడితో పంతమాడ వద్దని అతను అన్ని విధాల మనల్ని రక్షిస్తాడని చెబుతున్నట్టు సాగుతుంది. కీర్తనలో అంతర్గతంగా ఆ కృష్ణ నామస్మరణ చేస్తాడు దాసు.

భూమదాసు సాహిత్యంలో కీర్తనలు ఒకటే కాక రకరకాల కీర్తన ప్రక్రియలు కనిపిస్తాయి. కృష్ణచెలియలు, తిరునాములు, జానపదాలు, బొడ్డెమ్మపాటలు, ఉయ్యాలపాటలు, చాటు పద్యాలు, మంజరీ ద్విపద శతకం, మంగళహారతులు, సామెతలు, జాతీయాలు, నైజాం రాజ్యంలో తురకల పెత్తనం, పటేల్ బెదిరింపులకు నిరసనగా హిందుస్తానీ గజల్ ఇలా ఎన్నో ప్రక్రియలను తన సాహిత్యం ద్వారా ఒకవైపు భక్తి మరోవైపు సామాజిక స్పృహతో ఎన్నో రాసారు. తాను రాసిన కృతులలో కుచ్చేల దంపతుల సంవాదం గోపికృష్ణ సంవాదం ప్రముఖంగా కనిపిస్తాయి. అలాగే దేవతా స్తుతి, వినాయక స్తుతి, సరస్వతీ స్తుతి, గురు స్తుతి చేసిన తర్వాత ఆ హరి కీర్తనం చేస్తాడు.

భాషలో చక్కటి ప్రయోగం చేస్తూ దాసు రచించినఒక చాటుపద్యం

**"అంటక తానెంత తిరుగా**

**అంటేటప్పటికియంటు యానుభవముంటే**

**అంటే భాగ్యమేవుంటే**

**ఇంటికి తాజోచ్చి వచ్చు నీదరగాలై"** ( క్షైరం భూమదాసు, వరకవి క్షైరం భూమదాసు కృతులు, పుట 68)

వృత్త్యనుప్రాసలో టకారం పునరామృతం. చక్కటి భావం అలాగే అతనికి పదాలపై అభిరుచిని, భాషపై పట్టును తెలియజేస్తుంది. అంతేకాక ఆనాటి అగ్రకులాల పెత్తనాన్ని నిరసిస్తూ కులం కంటే గుణమే గొప్పదని అదే సద్గుణమని చాటి చెప్పిన ఒక పద్యం-

**"పాప వర్తనుండు బాపనుడైతెమీ**

**నిజము శూద్రుకన్న నీచతముడు**

**సద్గురుడైనట్టి చండాలుడేమేలు**

**కులము కన్న మిన్న గుణము భూమా"** (క్షైరం భూమదాసు, వరకవి క్షైరం భూమదాసు కృతులు, పుట 67)

భూమదాసు వంద సీస పద్యాలు గల ఒక శతకం కూడా రచించారు. అందులో తనను తాను దాసానుదాసుడుగా చెప్పుకున్న పద్యం

**"నీదు దాసాను దాసాది దాస దాస**

**దాస పరులకు దండములు చేసినాడు**

**గజమునకు మోక్షమిచ్చిన ఖగపతింద్ర**

**రాజ రాజేంద్ర రావికల్ రామచంద్ర"** (క్షైరం భూమదాసు, వరకవి క్షైరం భూమదాసు కృతులు, పుట 84)

భూమదాసు సాహిత్యాన్ని ఎంతలా తన జీవనవిధానంలో భాగంగా మార్చుకున్నాడో అని చెప్పుకోవడానికి ఒక ఉదాహరణ-

దాసు వృత్తిలో భాగమయిన కల్లు తీసే తాటి చెట్లకు కూడా అందమైన పేర్లు పెట్టుకోవడం గమనించవచ్చు.

**దాసు తాటి చెట్టుకు పెట్టుకున్న పేర్లు**

**గొల్లభామ / ఉగాది / ద్రౌపది / కైలసుందరి / రాజహంస / ధర్మరాజు / రాములవారు / గుణవంతురాలు / కైకేయి / అయ్యోధ / సంధ్యావళి / చిత్రగంధి / సుభద్ర / శూర్పణఖ / గౌండ్లచిన్ని / భవాని....**

ఈ పేర్లను బట్టి తాను ఒక చెట్టుని ఎంతలా ప్రేమించే వాడో, వాటిని తనలో ఎంతగా మమైకం చేసుకున్నాడో అర్థం అవుతుంది. ఇది అతనిలోని సమదృష్టి తత్వం బోధపరుస్తుంది.

రామానుజ మత ప్రభావంతో వీరు ఉడయవరదాసునీ, వారెవరో నీగాననైతి, రామానుజ నిన్నే నమ్మితి, శ్రీమతే రామానుజాయ నమః! లాంటి 24 తిరునామాలు రచించారు.

భగవంతునిపట్ల ధ్యాస లేని కొందరు కులస్తులు భూమదాసు ని సంపాదనలేని వాడని, కవిత్వం, భక్తి మీద ఎంతకాలం కొనసాగగలవని ఎత్తి పొడిచినప్పుడు దాసు గారు చెప్పిన పద్యం–

**"గుడి,యడవి, సుయ్యి తెర్లగు**
**వడినీళ్లను చెరువుదెగును వ్యర్థమగు ధనమ్**
**ఘడియలో ప్రాణాలు వెడలు**
**చెడనిది కవనంబు నీదు చెలిమియురామ!"** ( కైరం భూమదాసు, వరకవి కైరం భూమదాసు కృతులు, పుట 68)

చివరగా పుష్య పూర్ణిమ రోజున తను మరణిస్తూ కూడా ఒక ఆటవెలది పద్యాన్ని కుండపై రాశారు

**"మాతపితరు లత్త మామ గురువు బంధు**
**లాలి నాస్తి పాస్తి నాప్తసుతుల**
**కొడుకు మనుమల నెడ విడచి వచ్చు చునుంటి**
**రావికంటినున్న రామసామి"** ( కైరం భూమదాసు, వరకవి కైరం భూమదాసు కృతులు, పుట 67)

జీవితంలో ఎంత దారిద్ర్యం ఏర్పడినా కృంగిపోక తన కవిత్వం ద్వారా మత ప్రచారం చేస్తూ, నాటి నిజాం పాలనలోని భూస్వాముల దౌర్జన్యాలను చూసి కృంగిపోయారు. అంతేకాకుండా తిరుగుబాటు వైపు పయనించారు. భక్తి, సమాజ శ్రేయస్సును జత చేర్చి తన కవిత్వాన్ని మలిచాడు దాసు.

**ముగింపు :** భగవంతునికి చేరువవ్వడమే కాక సాహిత్యాన్ని ఎంతగానో ప్రేమించిన వాడు, సమాజానికి దగ్గర అయిన వాడు, కొందరు స్వార్థపరుల చేత బాధింపబడినవాడు సమాజంలోని అసమానతలను చూసి చలించినవాడు, తన సాహిత్యంతో నిలదీసిన వాడు. తన ధిక్కార స్వరాన్ని వినిపించిన వాడు, పరమ భక్తుడు, ఆ హరి పాదదాసుడు కైరం భూమదాసు గారు. వ్యక్తిత్వం,సాహిత్యం రెండు కూడా ఒక ప్రత్యేకమైన సృజన కల్గి ఉండడం వల్ల దాసుగారు వరకవిగా ఖ్యాతిగడించారు. భగవంతునకు ప్రియదాసుడిగా తనను తాను మార్చుకున్న గొప్ప భక్తుడు, ప్రతిభాశాలి, సాహిత్యకారుడు అన్నింటికీ మించి ప్రజలపాలివాడుగా పేరెన్నికగన్నాడు. ఎప్పుడో 150 ఏళ్ల క్రితం జీవించిన దాసు జీవనం నేటికీ ఆదర్శప్రాయమైనది.

**ఉపయుక్త గ్రంథాలు**

1. పెరుమాళ్ళు వేముల (పరిష్కర్త), వరకవి కైరం భూమదాసు కృతులు, వేముల పెరుమాళ్ళు షష్టిపూర్తి సన్మాన సంఘం, వెస్ట్ మారేడ్పల్లి, సికింద్రాబాద్, 2002.

2. స్రవంతి ఉండేటి , తెలంగాణ దాస సాహిత్యం, అముద్రిత గ్రంథం.

## ఇద్దరి పుట్టుక

**ఉదారి నారాయణ**
**ఫోన్ : 9441413666**

రెండాకుల కండ్లతో అది
రెండు కండ్లతో నేను
ఒక్క రోజే లోకాన్ని చూసినమట
నేను పుట్టిన వార్త వాడంతా
తెల్లారి రాకెట్పొగలా సాగి పోయింది
అగర్బత్తిల వాసనయింది

దాని పుట్టుక సంగతి / పిట్ట గోడైనా దాటలేదు
దశలు దశలుగా నా ఎదుగుదల సంబరాలు
రంగు రంగుల వెలుగులు
వెదజల్లినట్లు / అది ఒక్కతె
పురుగు నుంచి పుత్రునుంచి
ఒంటినే ఆయుధంగా మలుచుకొని
బతుకు పోరాటం చేస్తున్నది

నా పాదాలకు మట్టి అంటకుంటా
ఏ విషపు గాలి సోక కుండా
ఇంటిల్లిపాదీ గస్తీ
నా తానం నీళ్లు పీల్చుతూ అది
నన్ను దాటేసినా
ఆటలకు దాని కొమ్మలభుజాలిచ్చింది
దాని వీపుపై ఎగిరినా
ఒక్క చుక్కా దుఃఖించలేదు
నన్ను అమ్మా, నాన్న, అన్నా అనే
కంచెలు కాపలా కాస్తూ
ఐదు ముళ్ళు పెంచారు
తన దేహాన్ని
మనుషులకు గొడుగుగై
ఆకలికి అన్నమై దూపకు నీళ్లయి
అన్ని జీవులకూ ఇల్లయి
త్యాగానికి చిరునామా అయ్యింది
మాటలచ్చిన నాకంటే
గొప్పగా బతికింది
నేనిప్పటికీ
సొంత అస్తిత్వం లేని మనిషిగానే
దాన్ని చూసి ఇప్పుడైనా
మనిషిగా అడుగులేస్తా.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2025

# 'మలుపు తిరిగిన రథచక్రాలు' నవల – తెలంగాణ నగర జీవన చిత్రణ

పల్లె సతీష్, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఫోన్ : 9010953659

**"మలుపు తిరిగిన రథచక్రాలు"** నవల రచయిత్రి ముదిగంటి సుజాతా రెడ్డి. ఈమె కథ, నవల, యాత్రా కథలు, సాహిత్య విమర్శ, సాహిత్య చరిత్ర వంటి గ్రంథాలు రాసిన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎన్నో గ్రంథాలకు సంపాదకత్వం వహించింది. ఈమె రచించిన ఎన్నో కథలు, సాహిత్య వ్యాసాలు వివిధ పత్రికల్లో ప్రచురింపబడ్డాయి. ఈమె రచనలలో తెలంగాణ భాష, తెలంగాణ జీవితాన్ని, రైతుల, సామాన్య జనుల జీవితాలు, చిత్రమైన జీవితాలను చిత్రించింది. తెలంగాణ సాయుధ పోరాటాన్ని, చారిత్రక సామాజిక నేపథ్యంలో తెలంగాణ సాహిత్యచరిత్రను వెలువరించింది. **'రస చర్చ– ఆధునికత'** అనే గ్రంథంలో రస సిద్ధాంతాన్ని నవలకు కూడా వర్తింపజేయవచ్చు నని ప్రతిపాదించింది. ఈమె రచించిన **'మలుపు తిరిగిన రథచక్రాలు'** నవలలో నిజాం సంస్థానం పరిధిలో ఉన్న భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు ప్రజలను పీడించడం, సాధారణ ప్రజలు సాయుధులై గడీలను కూలగొట్టడం వంటి విముక్త పోరాటాన్ని తెలుపుతూనే హైదరాబాద్ నగర విశేషాలను తెలియజేసింది. నగర జీవితంను వర్ణించిన నవల ఇది.

### మలుపు తిరిగిన రథచక్రాలు నవలలోని పాత్రలు

రామచంద్ర రావు– ఇందూరు గడి భూస్వామి; భువనేశ్వరి– రామచంద్రరావు భార్య; శ్రీధర్ –రామచంద్రరావు పెద్ద కొడుకు; మహేంద్ర– రామచంద్రారావు చిన్న కొడుకు; సరళ– రామచంద్ర రావు కూతురు; లక్ష్మీదేవి– ఇందూరు దొర రామచంద్రరావు చెల్లెలు; ఈమె భర్త ప్రతాప్ కు ఆడబాప మాలతికి పుట్టిన వాడే మురళి దాసు/ దాసు; ప్రతాప్ –లక్ష్మీదేవి భర్త/ రామచంద్రరావు బావ/ మురళీదాసు దాసుకు తండ్రి; మాలతి – ఇందూరు గడిలో ఆడబాప/ మురళీదాసు తల్లి; కిష్టయ్య– ఆడబాప మాలతి భర్త; మురళి దాసు– సరళ భర్త/ ఇందూరు గడిలో ఆడబాప మాలతి కొడుకు; ఆశాలత–సరళ కూతురు; కుమార్– ఆశాలత భర్త; బేబీ ఆశాలత కూతురు; మల్లారెడ్డి– ఇందూరులో పోలీసు పటేలు; వెంకటయ్య– ఇందూరులో షావుకారు; సీనయ్య– ఇందూరులో కరణం; కమలమ్మ ఇందూరు గడిలో ఆడబాప లచ్చి ఆడ బాబా వంటలు బాగా వండుతుంది. రంగి వెంకమ్మ పద్మమ్మ ఆడబాపలు; కస్తూరి –సరళ మంచి చెడ్డలు చూసే ఆడ పాప; శేఖర్ –కస్తూరి కొడుకు; ఉష– శేఖర్ భార్య; లక్ష్మీ– కస్తూరి కూతురు; ప్రొఫెసర్ నాయర్– లక్ష్మికి కాబోయే భర్త; నర్సయ్య– ఇందూరు గడిలో లెక్కలు రాసే గుమస్తా; కమ్మరి వీరాచారి– వైద్యుడు; రమేష్ –ఈ నవల కథానాయకుడు/ విప్లవ దళానికి నాయకుడు; ప్రభాకర్ – రమేష్ కు మిత్రుడు/ ఇందూరులో గ్రంథాలయాన్ని నిర్వహించాడు, కామ్రేడ్ చంద్రారెడ్డి/ చంద్రం–విప్లవకారుడు, కామ్రేడ్ సాయిలు, పుల్లయ్య–విప్లవకారులు, రంగారావు–అన్నారం దేశ్ ముఖ్, సంయుక్త –రంగారావు భార్య, రాజేశ్వరి – రంగారావు చిన్నక్క (రంగారావుకు ముగ్గురు అక్కలు), కొమరయ్య– రంగారావు భూమిని కౌలుకి చేసే రైతు, రాజమ్మ– కొమరయ్య భార్య, వినాయక జోషి– హైదరాబాదులో సరలకు ఇంటి ఓనర్, డాక్టర్ రమేష్ చందర్ –హైదరాబాదులో మంచి వైద్యం చేస్తాడని పేరున్న డాక్టర్, రమణమ్మ –హైదరాబాదులో సరళకు పనిమనిషి, చంద్రన్–మురళి దాసు పి.ఏ.



### మలుపు తిరిగిన రథచక్రాలు నవల కథాంశం :

తెలంగాణలోని నిజాంరాజ్యం ఏలుబడిలో ఉన్న గడీలు, సంస్థానాలలో ఇందూరు గడి, అన్నారం గడీల మధ్య జరిగిన పరిణామాలు. ఈ గడీలలో భూస్వాములు దేశ్ ముఖ్‌లు ప్రజలను హింసిస్తూ, తీవ్రమైన దోపిడీలు చేసేవారు. రజాకారులను, పోలీసులను అడ్డం పెట్టుకొని భూస్వాములు దేశ్ ముఖ్‌ల దోపిడీలను విప్లవకారులు అడ్డుకోవడానికి ప్రజల్లో చైతన్యం తెచ్చి ఇందూరు భూస్వామి రామచంద్రరావు, అన్నారం దేశ్ ముఖ్ రంగారావు లను చంపేసి గడిలను ప్రజలు లూటీ చేస్తారు. ఈ పరిణామం ఫలితంగా ఇందూరు దొర భార్య– భువనేశ్వరి దేవి, కూతురు– సరళ, ఆడబాప– కస్తూరి లను, విప్లవ నాయకుడు రమేష్ హైదరాబాదు నగరానికి తీసుకొస్తాడు. ఇక్కడ ఇందూరులో గ్రంథాలయం నిర్వహించి నటువంటి ప్రభాకర్ వీరి కుటుంబానికి సహాయంగా ఉంటాడు. వీరి జీవితం ఈ నగరంలోనే జీవించి, వారి తనువులు ఇక్కడే చాలిస్తారు. సాయుధ పోరాటం నేపథ్యం ఉన్న ఈ నవల కథానాయకుడు విప్లవ పంథాలో ఉండి, ప్రజలకు అండగా ఉంటూ ఉన్న అతని జీవితం సరళ మనుమరాలు బేబీ సంరక్షణ బాధ్యతలతో ఉద్యమం

నుండి జనజీవన స్రవంతివైపు మలుపు తిరిగింది కాబట్టి, ఈ నవలకు మలుపు తిరిగిన రథచక్రాలు అనే పేరు వచ్చింది. ఈ నవలా తెలంగాణ ప్రజల చరిత్ర గతినే మలుపు తిప్పిన ఆనాటి ప్రజల సాయుధ పోరాటాన్ని ప్రధాన కథగా చిత్రించింది. ముదిగంటి సుజాత రెడ్డి ఈ నవలను చారిత్రాత్మక సాయుధ పోరాటం చరిత్రను చెబుతూనే ఒకవైపు రమేష్ – కథానాయకుడు, సరళ – కథానాయకల మధ్య అమలిన శృంగార అనుభూతులను దండలో దారంలా అల్లింది. ఈ నవలను చదువుతున్నప్పుడు చివరివరకు ఉత్కంఠంగా సాగుతుంది తెలంగాణ విప్లవ చరిత్రలో సామాజిక జీవనాన్ని ప్రతిబింబిస్తూనే, హైదరాబాదు నగర జీవితాలను కూడా చిత్రించింది. ముఖ్యంగా దొరల గడుల్లో మానసిక శారీరక దోపిడీలకు గురవుతూ, పెళ్లిళ్లు లేకుండా లైంగిక దోపిడీకి గురయ్యి, గర్భం దాల్చి పసికందులను కని వారికి అసలు తండ్రెవరో కూడా తెలియజేయ లేని స్థితిలో ఉండే ఆడబాపల దైన్యాన్ని చక్కగా చిత్రీకరించింది.

**ఇందూరు గడిలో ఆడబాపల జీవితం :**

రామచంద్రరావు గడిలో కమలమ్మ అనే ఆడబాప గర్భవతి అయి పురిటి నొప్పులతో కనలేక ఇబ్బంది పడుతుంటే ఆమె దీనస్థితిని చూసి సంరక్షించే బదులు ఆమెను ఒక గదిలో వేస్తే ఎవరు చూసే దిక్కు లేక పిండం బయటపడక ముందే ప్రాణాలు విడిచింది. ఇందూరు ప్రాంతంలో కరువు తాండవించినప్పుడు పేదరికంతో ఉన్న ఒక మహిళను మానెడు జొన్నలకు దొర భార్య భువనేశ్వరి కొంటుంది. ఆమెతో జీవితాంతం గడిలో దాస్యం చేయించుకుంది. ఆమెను శారీరకంగా మానసికంగా ఇబ్బందులకు గురి చేశారు. దొరకు ఆడబాపకు కలిగిన కూతురు కస్తూరి ని సైతం పనిమనిషిగా మార్చి తమ పనులను చేయించుకునేవారు. ఇందూరు గడిని ప్రజలందరూ కొల్లగొట్టి ఎవరికి అందింది వారు దోచుకెళ్లారు. అలాంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ కూడా కస్తూరి అనే ఆడబాప దొర భార్య భువనేశ్వరి, కూతురు సరళ దేవిలకు అండగా నిలిచింది. వీరితో బాటే హైదరాబాద్ నగరానికి వచ్చి అక్కడ వారికి సేవలు చేస్తూ చేదోడువాదోడుగా ఉంది. వారి జీవితాలు అంతం అయ్యేవరకు వారికీ సేవలు చేసింది. అడబాపల జీవితం అత్యంత దయనీయంగా ఉండేది. వీరి జీవితాలు బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా గడిలోనే పుట్టి, గడిలోనే పెరిగి, తమ జీవితాలను మొత్తం ధారపోసి సేవలు చేస్తూ అంతమయ్యేవి. ఎన్ని అవాంతరాలు ఎదురైనా వీరి దీనగాథను వినే వారు ఎవరు ఉండేవారు కాదు. (ముదిగంటి సుజాతా రెడ్డి – మలుపు తిరిగిన రథచక్రాలు పుట సంఖ్య 12)

**హైదరాబాద్ నగర ప్రస్తావన**

ఇందూరు గడి దొర రామచంద్రరావు జల్సాలు చేయడానికి హైదరాబాద్ నగరానికి వచ్చి తన జీవితాన్ని సరదాగా గడపడం కోసం కొన్ని రోజులు ఇక్కడే ఉండేవారు. అదేవిధంగా అన్నారం దేశ్ ముఖ్ కూడా హైదరాబాదు నగరంలో విలాస జీవితం గడపడానికి బంగాళా కట్టించుకొని సరదాలు చేసేవారు. వీరిద్దరు కూడా గ్రామాలలో ప్రజలను దోచుకోవాలని ఆలోచన వచ్చినప్పుడల్లా హైదరాబాద్ నగరం నుంచి కొంతమంది గూండాలను తమ వెంట తీసుకొని వెళ్లేవారు. వారు ఆయా గ్రామాలలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ వారి ధన, మాన, ప్రాణాలను దోచి భూస్వాములకు, దేశ్‌ముఖ్‌లకు కొమ్ముకాస్తూ వారు కూడా విలాసంగా తమ జీవితాన్ని జీవించేవారు. గ్రామాలలో వీరి అఘాయిత్యాలు ఎక్కువ అవడంతో గ్రామస్థులు, విప్లవకారులు వీరి గడీలపై దాడికి దిగారు . ప్రజలు చేసిన పోరాటం వలన ఇందూరు దొర రామచంద్రరావు, అతని చిన్నకొడుకు మహేంద్రలను వీరు చంపేశారు. దొర రామచంద్రారావు మరణంతో ఒంటరి వారైనా దొర భార్య భువనేశ్వరి కూతురు సరళాదేవి వారికి సేవ చేసే ఆడబాప కస్తూరిలను విప్లవ నాయకుడైన రమేష్ హైదరాబాదుకు వెళ్లే రైలు ఎక్కించి వారిని హైదరాబాద్ నగరానికి చేరుస్తాడు. ఈ నగరంలో వారికి సహాయకుడిగా ఇందూరులో గ్రంథాలయ నిర్వాహకుడుగా విధులు నిర్వర్తించిన రమేష్ ప్రాణ స్నేహితుడు ప్రభాకర్ వీరికి అండగా ఉంటాడు.

**హైదరాబాదు నగరంలో స్వాతంత్రోద్యమం**

ఈ నవల కథానాయకుడు రమేష్, అతని బాల్యమిత్రుడు ప్రభాకర్ పల్లెటూరు నుంచి హైదరాబాద్‌కు ఉన్నత విద్య అభ్యసించడం కోసమని వచ్చారు. ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించడం కోసం కళాశాలలో చేరారు. హాస్టల్లో ఉండుకుంటూ చదువు కొనసాగిస్తున్న వీరి జీవితంపై హైదరాబాదు రాజ్యంలో జరుగుతున్న స్వాతంత్రోద్యమం ప్రభావం వీరిని బాగా ఆకర్షించింది. ఉద్యమ ప్రభావం వల్ల హాస్టళ్లను మూసివేశారు వీరితో పాటు హైదరాబాదులో విద్యనభ్యసిస్తున్న మిగతా విద్యార్థులు అందరూ తమ సొంత ఊర్లకు వెళ్లిపోయినప్పటికీ వీరు మాత్రం హైదరాబాదు నగరంలోనే ఉంటూ పలు కార్యక్రమాల్లో పాల్గొంటూ సామాజిక సమస్యల పైన పూర్తి స్థాయిలో అవగాహన తెచ్చుకున్నారు. (ముదిగంటి సుజాత రెడ్డి– మలుపు తిరిగిన రథచక్రాలు పుట సంఖ్య 38)

**హైదరాబాదు నగరంలో వందేమాతర ఉద్యమం:**

నిజాం ప్రభుత్వం హైదరాబాద్ రాజ్యంలో వందేమాతరం గేయాన్ని పాడవద్దని ఉత్తర్వులు జారీచేసింది. కానీ ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులందరూ తమ హాస్టల్లో వందేమాతరం గేయం పాడారు నిజాం ప్రభుత్వం ఉత్తర్వులను లెక్కచేయకుండా వందేమాతర గేయాన్ని పాడడం వారు మానుకోలేదు. దీనితో అధికారులు విద్యార్థుల పట్ల కోపోద్రిక్తులైనారు. తక్షణమే వారు ఉంటున్న హాస్టల్లను మూసి వేయించి తమ సొంత గ్రామాలకు వెళ్ళవలసిందిగా హాస్టల్లో నోటీసులు అంటించారు. చాలామంది విద్యార్థులు తమ ఇళ్లకు

వెళ్లిపోయారు. కానీ రమేష్ మాత్రం తన ఊరికి వెళ్లకుండా మహాసభ కార్యకర్తగా పరిచేశాడు. ఆ కార్యకలాపాలతో సంతృప్తి కలగలేదని కామ్రేడ్ అసోసియేషన్ తో సంబంధం ఏర్పరచుకున్నాడు. ప్రజలు భూస్వాముల వలన ఎదుర్కొంటున్న వెట్టిచాకిరి సమస్య నుండి ప్రజలను విముక్తి చేయించడం వీరి ప్రధాన ఆశయం. దీని కోసం గెరిల్లా పోరాట పద్ధతిని ఎంచుకొని పోరాటానికి దిగారు. (పుట సంఖ్య -38)

**నిజాం రాజ్యంలో గ్రంథాలయోద్యమం :**

ప్రభాకర్ ఇందూరు గ్రామంలో గ్రంథాలయ నిర్వాహకుడు. ఇందూరు గడిలో గ్రంథాలయం నిర్వహిస్తూ, రాత్రి పూట ప్రజలను విద్యావంతులను చేయాలని అనేకమైన సభలు నిర్వహించి అందులో భూస్వాముల, దేశ్‌ముఖ్‌లు ప్రజలను ఎన్ని రకాలుగా దోపిడీ చేసేవారో అవగాహన కల్పిస్తూ ప్రజల్ని నిరంతరం చైతన్యవంతులను చేసేవాడు. గ్రంథాలయం మాటున దాగి ఉన్న ఈ ప్రజా ఉద్యమ పోరాట పంథాను పసిగట్టిన పోలీసులు తెలుసుకొని ఇతిన్ని బంధించి ఖైదు చేయడానికి పోలీసులు, దొర-మనుషులు చంపాలని చూస్తే హైదరాబాద్ నగరానికి వచ్చి ఇక్కడ గ్రంథాలయంలో తన సేవలను అందిస్తాడు. హైదరాబాద్ నగరంలో సరళ, కస్తూరీ, భువనేశ్వరి లకు ఉండడానికి అద్దె ఇంటిని చూపించి వారికి అన్ని వసతులు కల్పించి చివరివరకు వారికి అండగా నిలబడ్డాడు. (పుట సంఖ్య 41)

ప్రభాకర్ గ్రంథాలయ ఉద్యోగిగా ఉంటూనే మహారాష్ట్ర వెళ్ళి న్యాయవిద్య అభ్యసించి న్యాయవాదిగా మారి హైదరాబాద్ నగరం లో సొంతంగా ఇల్లు కొనుక్కొని కస్తూరిని పెండ్లి చేసుకొని ఇక్కడే తన జీవితాన్ని ప్రారంభించాడు. తన పిల్లలు, సరళ పిల్లలు అందరూ కూడా గొప్ప విద్యావంతులవుతారు.

**హైదరాబాద్ నగరంలో అద్దె ఇండ్లలో జీవితాలు:**

ఇందూరు గ్రంథాలయ నిర్వాహకుడుగా ఉన్న ప్రభాకర్ హైదరాబాద్‌కి మాకాం మార్చాడు. తన మిత్రుడు రమేష్ ఆదేశానుసారం సరళ, కస్తూరి, భువనేశ్వరీ లకోసం హైదరాబాద్ లో మూసినదిని ఆనుకొని ఉన్న చాదర్ఘాట్ ప్రాంతంలో వీరికి ఉ ండడానికి ఒక అద్దె ఇంటిని చూసాడు. ఇన్నిరోజులు సరళ ఇందూరు గడిలో విశాలమైన భవంతిలో నివసించి దర్జాగా బ్రతికింది. కానీ ఇక్కడ నగర జీవనం లో హైదరాబాద్‌లో మేడ పైన పెంకుటింట్లో ఉండాల్సి వచ్చింది. ఆమేడ ఎప్పుడో కట్టినది. కిరాయిల కోసం చిన్న చిన్న అర్రలను కట్టారు. ఇంటి ఎదురుగా విశాల ప్రాంగణంలో ఒకవైపు వీధి కుళాయి ఉంది. నీటి సమస్య అధికంగా ఉండేది. మున్సిపాలిటీ ప్రతి రోజు ప్రొద్దున్నే నీళ్ళు వదిలినపుడే నీటిని పట్టుకొని భద్రపర్చుకొని వాడుకోవాలి. ఈవిధంగా వేకువ జామునే నీటిని పట్టుకోవడానికి అక్కడికి ఆడవారు, పిల్లలు బిందెలు బకెట్లు పట్కొని వచ్చి నీటిని పట్టుకొని వాడుకుంటారు.

హైదరాబాద్ నగరంలో నీటి సమస్య కొన్ని ప్రాంతాలలో భాగానే ఉండేది. సరళ అంతకు ముందు ఒకసారి బంధువుల బంధువుల పెండ్లి కోసం హైద్రాబాదు వచ్చినపుడు వారి బంధువుల మేడలో ఉన్నది. అక్కడ స్విచ్ వేస్తే వెలిగే పెట్రోమాక్స్ బల్బులు ఉన్నాయి. కానీ! ప్రస్తుతం సరళ వాళ్లు ఉంటున్న అద్దె ఇంట్లో అలాంటి సౌకర్యాలు ఏమీ కనిపించలేదు. చిన్న గదులలో నిరంతరం చీకటి ఉండేది. ఎప్పుడూ కిరోసిన్తో వెలుగే గ్యాస్ బుడ్డి వెలుగులో ఉండాల్సి వచ్చేది. పిండి కొద్ది రొట్టె అన్నట్లుగా, పైసలకొద్దీ అద్దె ఇంటి సౌకర్యాలు లభించేవి. (పుట సంఖ్య 105)

**హైదరాబాద్ నగర ప్రజల భాష:**

హైదరాబాదు నగరం ఉత్తర భారతదేశానికి, దక్షిణ భారతదేశ్యానికి మధ్య వారధిగా ఉండేది. అందువలననే ఈ నగరం భిన్న సంస్కృతు లకు నిలయంగా మారింది. భారతదేశ నలుమూలలలో ఎక్కడ నుంచి వచ్చిన వారికే నా ఇక్కడ బ్రతుకుతెరువు లభించేది. ఇక్కడి ప్రజలు నిత్యావసరాల కోసం వీధిలో ఒకచోటకు చేరినప్పుడు వారిలో మరాఠి, కన్నడం, హిందీ, ఉర్దూ, భాషల్లో మాట్లాడటం చూసి సరళకు విచిత్రంగా అనిపించింది పడటం సరళకు విచిత్రంగా అనిపించింది. (పుట సంఖ్య 105)

**హైదరాబాద్ నగరంలో జట్కా వాళ్ళు, రిక్షా వాళ్ళ జీవితం :**

సరళ వాళ్ళు నాంపల్లి రైల్వేస్టేషన్ దిగగానే జట్కావాళ్ళు. రిక్షావారు వీళ్ల చుట్టూ ముట్టారు. వీరికి నగరం నలుమూలలు బాగా తెలుసు ప్రజలను క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరుస్తూ డబ్బులు సంపాదించుకొని వారి కుటుంబాలను పోషించుకుంటూ తమ జీవనాన్ని హైదరాబాద్ నగరంలో కొనసాగిస్తారు. (పుట సంఖ్య 106)

సరళ హైదరాబాద్‌కు వచ్చినప్పుడల్లా రైల్వే స్టేషను నుంచి వారి బంధువుల ఇండ్లకు కారులోనే వెళ్ళేది.కానీ! ప్రస్తుతం ఆమె సర్వం కోల్పోయింది, కాబట్టి జట్కాబండిలో వెళ్తూ ఒకవైపు బాధగా, మరోవైపు సంతోషపడింది. కొత్త అనుభూతిని అనుభవించింది. జట్కా తోలే వ్యక్తి తెలుగు, ఉర్దూ భాషలు మాట్లాడుతున్నాడు. సరళ వాళ్లు ఆ జట్కావానికి తాము ఎక్కడికి వెళ్లాలో ఒక చీటీ పైన రాసి ఉన్న చిరునావ(పత్తా) ను ఇచ్చారు. జట్కా అతను వారు ఇచ్చిన చిరునామా కి తీసుకెళ్లి దిగబెట్టాడు. హైదరాబాద్ నగరంలో అంతకుముందు రోజు జరిగిన హిందూ, ముస్లిం గొడవల గురించి సరళ వాళ్ళకు చెప్పాడు. ఎన్నో హత్యలు జరిగి గతరాత్రి నగరంలో జరిగిన గొడవలను క్షుణ్ణంగా వివరించాడు. కొందరు రిక్షావారు, జట్కానారు నగరానికి కొత్తగా వచ్చేవాళ్ళను డబ్బుకోసం మోసం చేస్తారని వివరించాడు. ఇది నేటికాలంలో కూడా ఇంకా కొనసాగుతుంది. (పుట సంఖ్య 108).

**సరళ చూసిన హైదరాబాద్ నగర ప్రజలు :**

తెల్లవారు జామున హైదరాబాద్ లోని నాంపల్లి రైల్వే స్టేషనులో దిగిన సరళ కుటుంబం జట్కాలో మూసినది మీదున్న నయాపూల్ దాటి చాదర్‌ఘాట్ వైపుకు వెళ్ళున్నారు. తెల్లవారుజాము కాబట్టి హైదరాబాద్ నగర వీథులు చాలా ప్రశాంతంగా ఉన్నాయి. నగర వీథులకు ఇరువైపులా ఉన్న దుకాణాలు ఇంకా తెరవలేదు. సైకిల్ చక్రాలతో వున్న బండ్ల మీద కూరగాయలు అమ్మేవాళ్ళు కనబడ్డారు. అక్కడక్కడ చాయ్‌లు అమ్మే చిన్నకొట్లు తెరిచి వున్నాయి. శ్రమజీవులు కాబట్టే వీరు వేకువ జాముననే నగరంలో వారి జీవన పోరాటాన్ని మొదలుపెట్టారు. (పుట సంఖ్య109)

**హైదరాబాద్ నగర ప్రజల ఆహారపు అలవాట్లు :**

గ్రామాలతో పోలిస్తే నగరంలో నివసించే ప్రజల వేషభాషలు, ఆహారపు అలవాట్లు చాలా భిన్నంగా ఉంటాయి.

సరళ, భువనేశ్వరీ గతంలో హైదరాబాద్ నగరంలోని తమ బంధువుల ఇండ్లకు వచ్చినపుడు తమకు ఉదయాన్నే త్రాగడానికి చాయ్‌లు, అందులో ముంచుకొని తినడానికి డబల్ రొట్టెలు ఇచ్చారు. సరళకు ఈ ఆహారపు అలవాటు కొత్తేమీ కాదు. కానీ! వీళ్ళ అడబాప కస్తూరికి మాత్రం ఇవి తెలియవు కాబట్టే వింతగా చూసింది. అక్కడ చాయ్ అమ్మేవాడు తయారు చేసిన చాయ్ అంత బాగా లేదు. వ్యాపారం కోసం తయారు చేసాడు కాబట్టే వీరికి అది అంతగా రుచించలేదు. తరువాత కొన్నిరోజులు గడిచిన తర్వాత కస్తూరికి చాయ్ ఎలా చేయాలో ప్రభాకర్ నేర్పించాడు. దానితో వీరు బయట దుకాణానికి వెళ్లి పాలు, తెచ్చుకొని స్వంతంగా తయారు చేసుకున్నారు. హైదరాబాద్ నగరంలో ప్రజలకు కావాల్సిన అన్ని ఆహార పదార్థాలు తయారు చేసి బయట దుకాణాల్లో అమ్మకానికి సిద్ధంగా ఉంచేవారు. ప్రజలు వారికీ కావాల్సిన ఆహారాన్ని కొనుక్కొని తినేవారు. కొందరేమో వారే తయారు చేసుకొనే వారు. సర్వం కోల్పోయి హైదరాబాద్ నగరానికి వచ్చిన సరళ కు ఇరుకుగదుల్లో జీవితం ఇక్కడ ప్రతిదీ డబ్బులిచ్చి కొనుక్కోవడం అలవాటయ్యింది. వీరికి వంటసామాను, సరుకులు బయటికెళ్లి ప్రభాకర్ కొని తెచ్చి ఇచ్చాడు. సరళకు ఇందూరు గడిలో ఉన్నన్ని రోజులు రాని భోగం అనుభవించింది. చిటికెస్తే చుట్టూ అడబాపలు వచ్చి క్షణంలో కావాల్సినవి అన్నీ సమకూర్చేవారు. కానీ వారి పరిస్థితి ఉన్నపళంగా తలక్రిందులయ్యింది. ఈ హైదరాబాద్ నగరం లో ప్రతి పని వీరే చేసుకోవాలి. (పుట సంఖ్య 111)

**ఖమ్మం నగర సరిహద్దుల్లో కొత్త గూడెం లో కార్మికుల పోరాటం:**

కార్మికులు నిరంతరం ఎంతో శ్రమిస్తే కానీ వారి శ్రమ ఫలితం అందరికి సొంతం అవుతుంది. కానీ కార్మికుల జీవితాలు వారి శ్రమకు తగిన ఫలితం, గుర్తింపు దొరకనప్పుడు వారు ఉద్యమ పంథాను ఎంచుకొని ఉద్యమించి వారి హక్కులను పొందుతారు. అందువలన కొత్తగూడెం ఫ్యాక్టరీలో పని చేసే కార్మికులు, రైల్వే పని వారున్నారు. వీరంతా ఒక సంఘంగా ఏర్పడి తమ హక్కుల కోసం పోరాడుతున్నారు. వాళ్ళు చాలా అధ్వాన్నమైన తమ పరిస్థితులను బాగు పర్చుకోవడానికి ప్రస్తుతం తాము ఉన్న పరిస్థితులను ఎదిరించి పోరాడుతున్నారు. (పుట సఖ్య 116 )

**హైదరాబాద్ నగరంలో మత కల్లోలాలు:**

హైదరాబాద్ నగరంలో మత చాందసవాదులు భిన్న మతాల మధ్య మనస్పర్థలు లేవదీసి హిందూ, ముస్లింల మధ్య అంతః కలహాలను సృష్టించి నగర ప్రజల మధ్య అలజడులు లేవనెత్తి కొన్ని శక్తులు నిరంతరం పని చేసేవి. సాయుధులైన నిజాం మద్దతు దారులు అమాయకపు ప్రజల మీద నిరంతరం దాడులుచేస్తూ వారిని భయ భ్రాంతులకు గురిచేస్తూ, వారి ధన, మాన, ప్రాణాలకు తీవ్రమైన నష్టం కలిగించేవారు. నిజాంరాజ్యం లో వీరు చేసే అన్ని దాష్టీకాలకు పోలీసు వారి మద్దతు సంపూర్ణంగా ఉండేది. ఆ బలం తోనే వీరంతా ఈ కల్లోలాలు రేపుతుండేవారు (పుట సఖ్య 116)

**వరంగల్ నగరంలో మత కలహలు, కల్లోలాలు, కొట్లాటలు :**

నిజాం రాజ్యం హైదరాబాద్ నగరం లో భాగంగా ఉన్న వరంగల్ ప్రాంతంలో కూడా మత కల్లోలాలు వ్యాపించాయి. ఇక్కడ కూడా వాటి ప్రభావం పుంజుకుంది. అందులో భాగంగానే వరంగల్‌లో పేద ప్రజలకు వైద్య సహాయం చేస్తున్నాడన్న నెపంతో నారాయణరెడ్డి అనే డాక్టరును హత్య చేశారు. ఈ వార్త విని వరంగల్ పట్టణమంతా అట్టుడికి పోయింది. నిజాంకు మద్దతు ఇచ్చేవాళ్ళు అలజడులను కొట్లాటలను, హత్యలను పల్లెటూళ్ళు నుంచి పట్నందాన వ్యాపింప జేశారు. (పుట సంఖ్య 117)

**హైదరాబాద్ నగరంలో మతమార్పిడి వ్యవస్థ :**

రజాకార్లు నిజాం రాజ్యంలో అంతదా ప్రజలను మసించడం చేస్తూ ఉన్నారు. హైదరాబాద్ నుంచి పల్లె టూర్యవరకు జనాన్ని మీ వెట్టి చాకిరీని మానిపిస్తాం, బంజరు భూములకు పట్టాలు చేయిస్తాం అని ప్రజలను మభ్యపెట్టి చాలా మంది ప్రజలను ‘తురక మతం లోకి మార్చారు. అనేక దౌర్జన్యాలకు పాల్పడ్డారు. ప్రభాకర్ హైదరాబాద్ నగరానికి వచ్చినపుడు మతమార్పిడికి గురైన వారి అభిప్రాయాలను కనుక్కోని ఆర్య సమాజం నుండి ఒక పండితుణ్ణి తీస్కొని వచ్చి మత మార్పిడికి గురైన ప్రజలకు హిందూమతం లోకి మార్చివేసి శుద్ధి ఉద్యమం ద్వారా శుద్ధి చేయించారు. రజాకార్ల పన్నాగాలను వారు పన్నే వ్యూహాలను విఫలం చేసి వారి కుట్రలను నిలువరించగలిగారు. వ్యూహాన్ని విజయవంతం కానివ్వకుండా నిలువరించారు. (పుట సంఖ్య 118).

**ఉస్మానియా విశ్వ విద్యాలయంలో డ్రస్ కోడ్ :**

ఉన్నత చదువులు చదవాలని పల్లెటూరు వాతావరణం నుంచి వచ్చిన విద్యార్థులు విశ్వ విద్యాలయం లోని కళాశాల కు సాంప్రదాయ దుస్తులు ధరించి వచ్చేవారు. ఇదే సంవత్సరం కళాశాలలో విద్యార్థులందరూ సూటు వేసుకోవాలి లేదా పైజామా, షేర్వాని వేసుకోని తలమీద టోపి పెట్టుకోవానే నియమం పెట్టారు. ఈ నిబంధనలు విద్యార్థుల స్వేచ్ఛకు ఆటంకంగా మారింది. పాశ్చాత్యుల వేషధారణ అయిన సూటు, ముసల్మాన్ల బట్టలు ఎందుకు వేసుకోవాలని విద్యార్థులంతా పెద్ద ఎత్తున సమ్మె చేశారు. ఇది నిజాం నిరంకుశ పాలనకు నిలువెత్తు నిదర్శనం. (పుట సంఖ్య 119).

కానీ విద్యార్థినుల వస్త్రధారణ గురించిన ప్రసక్తి చెప్పబడలేదు.

**ఉస్మానియా విశ్వవిద్యాలయంలో వందేమాతర ఉద్యమం :**

నిజాం రాజ్యంలో ఎక్కడ కూడా 'వందేమాతరం గేయం' పాడకూడదని నిజాంప్రభుత్వం పెద్ద ఎత్తున ఉత్తర్వులు జారీ చేసింది. కానీ! నిజాం ప్రభువు విశ్వవిద్యాలయ విద్యార్థులకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డ్రస్ కోడ్ సూటు, పైజామా, షేర్వానీ వేసుకొని తల పైన టోపీ పెటుకోవాలన్న నిబంధనలను విధించారు. దీనికి నిరసగా విద్యార్థులు 'బి' హాస్టల్లో విద్యార్థులు పొద్దున, సాయంత్రం జరిగే ప్రార్థనల్లో వందేమాతర గేయం పాడడం మొదలు పెట్టారు. అధికారులు వందేమాతర గేయం పాడొద్దని ఆంక్షలు పెట్టారు. విశ్వవిద్యాలయం నుంచి గౌలిగూడ విద్యార్థులు నినాదాలు చేస్తూ ఊరేగింపుగా వెళ్లారు. పెద్ద ఎత్తున నిరసనలను చేశారు. అదే రోజు సాయంకాలం ఒక పెద్ద బహిరంగ సభను నిర్వహించారు. ఆ బహిరంగ సభలో విద్యార్థులుగా రమేశ్, ప్రభాకర్లు కూడా హాజరయ్యారు. ఈ పర్యవసానాల ఫలితంగా హైదరాబాదు రాష్ట్రం అంతటా మొత్తం విద్యా సంస్థలను (పాఠశాలలు, కళాశాలలకు) మూసివేశారు. (పుట సంఖ్య 119)

**హైదరాబాద్ నగరంలో రజాకార్ల దురాగతాలు :**

నిజాంరాజ్యంలో రజాకార్ల దురాగతాలు రోజురోజుకీ పెరుగుతున్నాయి. తత్ఫలితంగా హిందూ, ముస్లింల మధ్య కొట్లాటలు పెరగడం, మతమార్పిడి విధానం వంటి గొడవలల్లో ప్రజలు ఎవ్వరూ కూడా బయట తిరగడానికే భయపడ్డారు, రోడ్లన్ని నిర్మానుష్యంగా మారాయి. నిజాంకు స్థానిక పోలీసులతో పాటు, బ్రిటిష్ వారు కూడా ఎన్నో రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. ముఖ్యంగా చెప్పాలంటే డబ్బు, ఆయుధాలు సమకూర్చడంలో నిజాం కు సహాయం చేస్తున్నారు. నిజాం కూడా అంతే రెట్టించిన ఉత్సాహంతో రజాకార్లకు అన్ని విధాల సహాయ సహకారాలను అందిస్తున్నాడు. హైదరాబాద్ రాష్ట్రం భారత యూనియన్లో కలిసే అవకాశం ఉ ండబట్టే ఈ అల్లర్లను సృష్టిస్తూ ప్రజలను అనునిత్యం భయ భ్రాంతులకు గురి చేసేవారు. (పుట సంఖ్య 130)

**హైదరాబాద్ నగరంలో రక్షక వ్యవస్థ :**

నిజాం రాష్ట్రంలో రజాకార్లు, విప్లవకారుల వల్ల ప్రజలు నిరంతరం భయాందళనలకు గురయ్యేవారు. హైదరాబాద్ నగరంలోకి ఎవరు ప్రవేశించాలన్నా నగరం వైపు వచ్చే ప్రతి బస్సును పొలిమేరల్లోనే ప్రతిబస్సును తనిఖీ చేసి నగరంలోకి పంపేవారు. అందువల్లనే రమేశ్ మారువేషంలో గొల్లవానిగా వచ్చాడు. ఎవరి మీదనైనా అనుమానం కలిగితే హైదరాబాద్ నగరానికి వచ్చే సరిహద్దుల్లో వద్దే వారిని ఆపేసి వారిని పూర్తిగా తనిఖీ చేసి అన్ని కోణాలలో వారిని ప్రశ్నించి అందుకు తగిన కారణం ఉంటేనే వారిని హైదరాబాద్ నగరం లోపలికి అనుమతించేవారు. వారికి ఏమాత్రం అనుమానం వచ్చినా గాని, వారు అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం వారి నుంచి రానట్లయితే తక్షణమే వారిని అరెస్టు చేసి జైలుకు తరలిస్తారు. (పుట సంఖ్య141)

**హైదరాబాద్ నగరంలో నిరుద్యోగ సమస్యలు :**

నిజాం రాజు వ్యవహరించే ఫ్యూడల్ వ్యవస్థ వలన హైదరాబాద్ నగరంలో చదువుకున్న యువతకు సరైన ఉపాధి, ఉద్యోగాలు దొరకడం కష్టంగా మారింది. దీనివలన చదువుకున్న యువతరం నిజాం ఫ్యూడల్ వ్యవస్థకు వ్యతిరేకంగా ఆయుధాలు పట్టి సాయుధ పోరాటాలకు పూనుకున్నారు. యువకులు సమాజాన్ని ప్రక్షాళన చేయాలని కళాశాలల్లో తమ చదువులను, భవిష్యత్తును పణంగా పెట్టి ఉద్యమ కారులై విప్లవ పంథాలో నడిచారు రమేష్, ప్రభాకర్ అనే ఈ ఇద్దరు స్నేహితులు కూడా తమ జీవితం చివరి ఘుడియల వరకు పోరాడినారు. (పుట సంఖ్య 162)

**ముగింపు :** ముదిగంటి సుజాతారెడ్డి మలుపు తిరిగిన రథచక్రాలు నవలను తెలంగాణ సంప్రదాయ బతుకమ్మ పండుగ తో ప్రారంభమయ్యి రమేశ్ ఉద్యమ పంథాను వదిలి సరళ మనుమరాలు బేబీ సంరక్షణ బాధ్యతలు చేపట్టడంతో ముగుస్తుంది. ఈ నవల విషాదాంతం. హైదరాబాద్ నగరంలో ప్రజల జీవన విధానాన్ని హైదరాబాద్ నగర ప్రజల జీవితాన్ని చిత్రించింది. ఈ నవలలో ప్రధాన కథ విప్లప పంథాలో నడుపుతూనే రమేష్ సరళల మధ్య అమలిన శృంగారంతో కూడిన ప్రేమకథ ఉత్కంఠంగా నడిచింది. నవల చివరి వరకు కూడా రమేష్ సరళ జంట కలుస్తుందా విడిపోతారా అని సందేహం తో ఉత్కంఠతను రేకెత్తిస్తుంది. సరళ, భువనేశ్వరి, కస్తూరి, ప్రభాకర్ బ్రతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరాన్ని చేరుకున్నాక వారి జీవిత పయనంలో ఎన్నో పరిణామాలు చోటు చేసుకుంటాయి. ఇందూరు గడిలో మొదలైన నవల హైదరాబాద్ నగరంలో ముగుస్తుంది. ఈ నవలలో సందర్భానుసారంగా సామెతలు, నవరసాలను చొప్పించి రసాత్మకంగా రచించింది.

❖ ❖ ❖ ❖ ❖

# రామదాసు, బుచ్చిదాసు సంకీర్తనల్లో – తత్త్వం

✍ డా. మంత్రి శ్రీనివాస్, ఫోన్ : 832 833 3720

తెలంగాణ సమాజం అనాదిగా భజన, సంకీర్తన, కీర్తన సంప్రదాయాన్ని అనుసరించి అనాదిగా తన సాంస్కృతిక పతాకాన్ని ఎగురువేస్తున్నది. వాగ్గేయకారులు, సాధువులు, భక్త కవులు వెలువరించిన కీర్తనలను అమూల్యమైన వారసత్వంగా పరిరక్షించుకుంటున్నది. తరతరాలుగా వస్తున్న అధ్యాత్మిక తత్త్వాన్ని, భగవంతుని అస్తిత్వాన్ని, ప్రజల జీవితాలను ప్రభావితం చేసిన భక్తులు, వారి కవనంలో పురుడుపోసుకున్న సంకీర్తనలలో తమ బ్రతుకులకు అర్థాన్ని వెతుక్కుంటూ తన్మయతను పొందుతున్నది.

దైవాన్ని ఇలకు దింపి అక్షరాలలో ఆయనను బంధించిన వాగ్గేయకారులు ఎందరో జన్మించిన ఈ నేలలో నరహరి కృష్ణమాచార్యులు, భద్రాచల రామదాసు, రాకమచర్ల వెంకటదాసు, వేపూరు హనుమద్దాసు, తూము నరసింహదాసు, మన్నెంకొండ హనుమద్దాసు, ఉప్పరిపల్లి కృష్ణదాసు, పసుల కొండదాసు, దున్న ఇద్దాసు, చెన్నదాసు, ఈగ బుచ్చిదాసు మొదలైన ప్రముఖులు లోకప్రసిద్ధి గాంచారు. వీరిలో భద్రాచల రామదాసు ప్రభావం మిగితా కవులందరి మీద ఉండడం విశేషం. ఈ క్రమంలో రామదాసు– ఈగ బుచ్చిదాసులు వెలువరించిన సంకీర్తన, శతక సాహిత్యంలో తత్త్వాల సారూప్యతను పరిచయం చేసుకుందాం.

రామదాసు తెలంగాణ వాగ్గేయకారుల వరుసలో ముందు వరుసలో ఉంటే బుచ్చిదాసు ఆఖరి వరుసలో ఉంటారు. రామదాసు భద్రగిరి మీద వెలసిన రామభద్రుడి మీద సంకీర్తనలు రాస్తే, బుచ్చిదాసు యాదగిరిగుట్ట మీద వెలసిన పంచ నారసింహుని మీద సంకీర్తనలు వెలువరించి ధన్యుడయ్యాడు. ఇరువురు హరిభక్తులే. ఈ ఇరువురి మధ్య అనేకచోట్ల సామీప్యతలు దర్శనమిస్తాయి. అందులో అపారమైన తత్త్వ సంపద చోటు చేసుకుంది. రామదాసు సంకీర్తనం చేస్తేనే భద్రగిరి రాముని తలుపులు తెరుచుకునేవి. బుచ్చిదాసు పాడితేనే యాదగిరి వాసుని ద్వారాలు తెరుచుకునేవి. ఇద్దరు మనసా, వాచా, కర్మణా భగవద్భక్తమయ్యారు. వారి సాహిత్యం గమనిస్తే అందులో మానవునికి అందించే అధ్యాత్మిక మార్పు, సత్యాసత్యాల వివేచన, జీవ కారుణ్యం, మానవీయ విలువలు, దైవం ఉనికి, అరిషడ్వర్గ విముక్తికి మార్గంతో పాటు గురుశిష్య సంవాద రూపంలో లోకానికి ప్రబోధం కనబడతాయి.

తత్త్వం అన్నది భారతదేశం వాహికగా సమస్త ప్రపంచానికి అందింది. వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, అరణ్యకాలు, పురాణాలు, ఇతిహాసాలు, జైన, బౌద్ధ గ్రంథాలతో పాటు అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత, వీరశైవ, చైతన్యాది, వారికారి సంప్రదాయాలు మొదలైనవి జీవన తత్త్వాన్ని సమస్త లోక కళ్యాణానికి అందించాయి. 'తత్' అంటే అందరిలో ఉన్న పరమాత్మ, 'త్వం' అంటే నీవు అని అర్థం. ఈ రెండు కలిసి తత్త్వమసి సిద్ధాంతానికి బీజాలు వేశాయి. జీవాత్మకు పరమాత్మకు బేధం లేదు. జీవాత్మ పరమాత్మ అంశమే. మాయ పొరచేత కప్పబడి అరిషడ్వర్గ ప్రేరితమైన మనస్సనే గాలం చేత మనిషి ఇరుక్కుపోయి తననుతాను జన్మల చక్రంలో నెట్టేసుకుంటాడు. అలాంటి మానవుడిని ఒడ్డుకు లాగడానికి సంకీర్తన కారులు తమదైన ప్రయత్నాన్ని చేశారు. అందులో తెలంగాణలో రామదాసు మొదటివాడు. అతనిని అనుసరించిన వాడు బుచ్చిదాసు.

రామదాసు తన సంకీర్తనంలో ...

**"వదిలిపోదాము చాలా దయయుంచండి యిక**
**మరలి జన్మకు రాము మదిలో నుంచండి..."**

అన్న కీర్తనలో...

"సోహంబని యెడి కత్తి చేగొని అట్టే
మోహ పాశముల నెల్ల మొదటనే ద్రుంచి

ఈషాణ త్రయములెల్ల ఇలలోనే డించి సం
తోష సాగరంబునందే సంచరించును

తారక మంత్రఔషధ ధారాలు గ్రోలి ఏపు
మీరగాను మోక్షపదవి హెచ్చుగను గాంచి

ఆరు కమలముల మీద అద్భుతమైన సహ
స్రార కమలమందు జేరి సంతసించును

చక్కని భద్రాద్రిరామ స్వామి కృపను పెం
పెక్కిన రామదాసులని పేరు గాంచినారము..."

అంటాడు. 'సోహం' అనగా 'తానే పరబ్రహ్మ' అని అర్థం. శ్వాసమీద ధ్యాసపెడుతూ సమస్త వికారాలను నియంత్రించి తనలో దాగున్న పరమాత్మలోకి లీనమవ్వడాన్ని సోహం సూచిస్తుంది. 'స' అంటే పరమాత్మ. 'అహం' అంటే నేను అని అర్థం. 'అహం బ్రహ్మాస్మి' అనే భావనకు మరోరూపమే సోహం అన్నది. "సారిది నాత్మలోన సోహంభావన యయితే/ సరియును దేవపూజలు చెల్లవు" అంటాడు తాళ్ళపాక అన్నమయ్య. తనను తాను ఎరిగిన వాడికి సమస్తంలో భగవంతుడు దర్శనమిస్తాడు. ఆ భగవంతునిలో తనను చూస్తాడు. సాధకుడు– భగవంతుడు అన్న తేడా ఉండదు. అతడే ఇతడు. ఇతడే అతడు. అతడే అన్నీ రూపాలలో నాటకమాడుతున్నాడు అని అర్థమవుతుంది.

'సోహం' అనే మంత్రాన్ని జపిస్తూ తననుతాను జయించిన వాడికి అసలు సత్యం బోధపడుతుంది. మానవుడు ఆ దిశగా ప్రయాణం చేయాలని రామదాసు చెబుతాడు. అలాగే ఈషణ త్రయములనే ప్రాపంచిక మోహాల నుండి బయటపడాలని చెబుతూ భార్యా, బిడ్డలు, ధనం అనేబడే ఈ త్రికోణ జాలం ఒక భ్రమ అని మాయవశం నుండి బయటపడాలని ఇందుకు రామమంత్రం ఒక్కటే తరుణోపాయమని అది సాధకుడికి కుండలీని యోగాన్ని కలిగించి ముక్తిని ప్రసాదిస్తుందని అంటాడు.

అలాగే బుచ్చిదాసు నరసింహ స్వామిని స్మరిస్తూ రాసిన కీర్తన...

**"సోహం మంత్రం సోహం మంత్రం సోహం మంత్రం**
**హం సోహం మంత్రం సాహజ అమరస్కా సాంకృతారకముల నెల్ల**
**మహా సోదన తెలియ పరసీ/ మనసు స్థిరము చేసే**
**సూర్యచంద్ర నాదులను సూక్ష్మముగను తెలుసుకుంటూ**
**గురువుచేత బూచరిలో గుప్తమగునన్న మంత్రము**
**యిరువది యొక వెయ్యాను ఆరునూర్ల జెపము జేసి**
**తత్త్వబోధన జేసిన పరమా వైరాగ్య మంత్రము..."**

అంటూ సోహం మంత్రాన్ని జపిస్తూ నిజం తెలుసుకొని మనస్సును స్థిరం చేసుకోవాలని పిలుపు నిస్తాడు. ఇడ పింగళ నాడులనబడే సూర్యచంద్ర నాడుల అస్తిత్వాన్ని అర్థం చేసుకుంటూ, హంస జపాన్ని (శ్వాసజపం) అనుసరిస్తూ సాధకుడు యోగమార్గం ద్వారా తన మూలాన్ని తెలుసుకోవాలని ప్రబోధం చేస్తాడు. గురువు చేత అందుకున్న మంతాన్ని జపిస్తూ భ్రుకుటిలో ధ్యానాన్ని నిలిపి సంఖ్యానియమాన్ని పాటిస్తూ స్థిరచిత్తంతో ధ్యానించిన పరమాత్మ దర్శనంతో పాటు తానెవరో తెలియిపోతుందని అంటాడు. ఇరువురు కీర్తనాంతంలో కవిముద్రను ప్రకటించడం చూస్తాం. ఉత్తరభారత సంప్రదాయాన్ని అనుసరిస్తూ కవిముద్ర వేయడం అనేది తెలంగాణ వాగ్గేయకారులలో చూడవచ్చు. కబీరు సంప్రదాయం నుండి ఈ కవిముద్ర వ్యాప్తిచెందిదిగా చెప్పవచ్చు.

మరొక చోట...

**'అయ్యయ్యో నే నేరనైతి ఆది నారాయణుని తెలియనైతి..."** అనే కీర్తనలో రామదాసు...

**"మోస మేమని తలచియుండు దోస / వాసనల తగిలి తేమందు ఆశా**

**పాశములను అరసి బ్రోచి ముందు /వాసిగ వైరాగ్య వాసన గననైతి..."**

అంటూ తన పశ్చాత్తాపాన్ని ప్రకటిస్తూ సాధారణ మానవుడి వలే ఆత్మ నివేదనం చేస్తాడు. ఈ సం కీర్తనలో మానవుడిని వాసనలు ఎలా కట్టి పడేస్తాయో ఎరుకపరుస్తాడు రామదాసు. కామం, క్రోధం, మదం, మత్సరం, లోభం, మోహం అనునవే కాక సాంసారికమైన



అనేక విషయాల వెంట ఆసక్తి కలిగి మనిషి ఎలా పతనానికి చేరుకుంటాడో సంక్షిప్తంగా వివరిస్తాడు. ఆశ అన్నది వ్యక్తిలో ప్రయాసకు దారితీసి ఆది తీరనప్పుడు క్రోధపు వలలో చిక్కుకొని విచక్షణను కోల్పోయిన ఎందరో మనకు ఈ సందర్భంగా జ్ఞాపకం వస్తారు. అందుకే జీవితం అంటే నీటిమీద బుడగ అని తెలుసుకొని వైరాగ్య భావనతో రాజయోగిగా భగవదర్పితంలో జీవనాన్ని సాగించాలని రామదాసు అంటాడు. ఈ తీరుగానే బుచ్చిదాసు...


**"యెంత మూర్ఖపు మనసు వినుడీ/ యేమని తెల్పుదును గనుడీ**
**యింతనైన హరిని దలువక/ చింతలల్లా జిక్కబోతది**
**నీతిశాస్త్రము జెప్పబోతది / పాతకములో బడను బోతది**
**కోతి గుణముల మాననంటది/దాతను మది మరిచి యుంటది**
**యిందు యెవ్వరు చూడనంటది/చిందు బొందూలాడు చుంటది**
**మందు యిక నాకేమీ అంటది /మంద గుణములు మరువనంటది..."**

అంటూ తన కీర్తనలో మనిషిని పరోక్షంగా ప్రతిబింబిస్తాడు. మనిషి మనసు ఎంతో చంచలమైనది. దాని వేగం గాలికంటే వేయిరెట్లు అధికం. అది మానవ జన్మ ప్రయోజనం తెలుసుకోక విషయ వాసనల వెంట పరుగులు పెడుతూ, లోకం మాయలో పరి భ్రమిస్తూ ఉంటుంది. దాని మాయలో పడ్డ మానవుడు అహంకారం, అభిమానం అనబడే ఉచ్చులో చిక్కి తననుతాను ఘనుడుగా భావిస్తూ నీతులు చెబుతాడు కానీ తన అసలును అర్థం చేసుకోవడానికి ప్రయత్నం చేయడు. తనకు మంచిని చేసిన వారిని మరిచి వారికే అపకారం చేయడానికి ముందుకువస్తాడు. అటువంటి మానవులలో మార్పు రావాలని పిలుపునిస్తాడు బుచ్చిదాసు.

**"పావన రామ నామ సుధా రస / పానము జేసేదెన్నటికో**
**సేవించియు శ్రీహరి పాదంబులు / చిత్తమునుంచే దెన్నటికో"**

అను కీర్తనలో...

**"దాసులగని సంతోషమమున తన / దాసోహమ్మును టెన్నటికో**
**భూసుతకు సునాటి ప్రాణప్రదంబగు / పురుషోత్తము గనుటెన్నటికో**
**చంచల గుణములు మాని సదా ని / శ్చలమతి నుండేదెన్నటికో**
**పంచ తత్త్వములు తారక నామము పఠియించుట నా కెన్నటికో..."**



అంటూ రామదాసు తన విన్నపాన్ని రాములవారి పాదలముందు పెడతాడు. తన వేడుకోలులో భక్తుని తత్త్వాన్ని అతడు భగవంతుని చేరుటకు చూపు ఉత్సుకతను వ్యక్తపరుస్తాడు. దాసోహం భావన నవవిధ భక్తుల్లో ఒకటి. భక్తుడు దైవానికి దాసుడయి అతనిలో దాగున్న చంచల గుణాల మీద అదుపు సాధించి నిశ్చల మతితో పరమాత్మకు దగ్గరవ్వాలి అని భక్తుని తత్త్వాన్ని ఎరుక పరుస్తాడు. అదే తీరుగా బుచ్చిదాసు –

"యాదగిరీ హరి భజన మనసునా / యాదితో చేసే దెన్నదో

బాధలు బెట్టేటి గుణములనూ హరి/ ఛేదన చేసేదెన్నటికో

తల్లిదండ్రి గురు దైవమనుచు / నే దలచుచు మ్రొక్కెదెన్నటికో

యుల్లములో పరమాత్ముని భజన / చల్లగ జేసెదెన్నదో..." అంటూ ఆఖరిలో

"బుచ్చిదాసుపై రక్షకునీ కృప /వచ్చు భాగ్య మింకెన్నడో

నిశ్చయముగ నే పరమ పదవికీ / తక్షణ మెళ్ళేదెన్నడో"

అంటూ భక్తునిగా తన విన్నపాన్ని యాదగిరీశునికి సంకీర్తన మాధ్యమంగా వినిపిస్తాడు. ఈ కీర్తనలో రామదాసు చెప్పినవలేనే భక్తుని భక్తి, అతడి తత్త్వం బోధపడతాయి. హరిభజన చేస్తూ, సమస్త దుర్గుణాలను విడిచి తల్లిగా, తండ్రిగా, గురువుగా నరసింహుని ఆరాధించి, సాధించి అతడిని చేరాలనే తాపత్రయంలో సహజ భక్తుడి గుణాలు బుచ్చిదాసులో దర్శనమిస్తాయి. ఎన్నుకున్న కవులిద్దరు ఒకే బాణీ, తెలంగాణ జానపద తరుజును అనుకరిస్తూ తమలోని భావాలను వెల్లడి చేశారు.

"దినమే సుదినము సీతారామ స్మరణే పావనము

ప్రీతినై నా ప్రాణభీతి నైనా కలిమి / చేతనైనా మిమ్మే ఏ తీరుగ తలచిన

అర్థాపేక్షను దినము వ్యర్థము గాకుండ / సార్థకముగా మిమ్ము ప్రార్థన చేసిన ఆ

నిరతము మెరుగు బంగారు పుష్పముల రఘు / వరుని పదముల నమర పూజించిన ఆ..."

అంటూ రామదాసు రాసిన కీర్తన భగవంతుని కీర్తించుటకు, సేవించుటకు ప్రత్యేకమైన ముహూర్తాలేవీ అవసరం లేదని, తనలో కలిగిన మార్పు, సత్యం తెలుసుకున్న సమయం, దైవం వైపు వేసిన అడుగు అదే మంచి ముహూర్తమని చెబుతాడు. ప్రీతితో భజించినా, ప్రాణ భీతితో భజించినా, కలిగి వున్నవాడు, కలిమి లేనివాడు ఎవడు ఏ తీరుగ భజియించినా, స్మరియించినా రామయ్యకు ఆ దినమే ఇష్టమని అంటాడు. మనసా వాచా కర్మణా సమస్తం ఆయనకు సమర్పించి అన్యధా శరణం నాస్తి అని శరణువేడాలని భక్తితత్త్వాన్ని భక్తులకు బోధిస్తాడు. అదే తీరుగా బుచ్చిదాసు...

"దినము మంచీ దినము వినుమన్నా / హరిహరీయన్నది

దినము మంచీ దినము వినుమన్నా / దీని సరియు దినము లేదూ"... అనే సంకీర్తనలో

"ఆటలన్నీ జూట వినుమన్నా / నరసింహయని తన

నోట బలికిన మాట నిజవమన్నా / జూట సోపతులన్నీ విడిచి

మాటిమాటికి మనసునందు మేటి ప్రభువు లోకాంత రం

గుని మారువకున్న దె మంచి దినమూ..."


అంటూ రామదాసు భావనను సంకీర్తన కాలధారాప్రవాహంలో మళ్లీ ఒకసారి ప్రకటిస్తాడు. మాధవుడు, సర్వజాన ఉద్ధారకుడు, లోకాంతరంగుడు అయిన పరబ్రహ్మ నామ స్మరణకు, సంకీర్తనకు కాలమేది ఉండదని సర్వావస్థల సర్వకాలాదులలో ఆయనను స్మరించి తరించాలని సాధకతత్త్వం చెబుతాడు. కీర్తనలో భూలోకంలోని సమస్త ఐశ్వర్యాది, భోగభాగ్యాలు నశ్వరమని, మానవుడు ఆడే ఈ జీవన్నాటకం అబద్ధమని, కల్ల మాటలు, సోపతులు విడిచి నారసింహా యని ప్రహ్లాద వరదుని వేడాలంటాడు. ఈ లోకంలో తనను ఉద్ధరించడానికి ఎవ్వరూ రారని, ఇంద్రియ నిగ్రహంతో సంసార సాగరాన్ని దాటి జ్ఞప్తిలో సదా పరమాత్మను దిట్టముగ తలవాలని అప్పుడే భక్తుని భక్తికి పరాత్పర సిద్ధి లభిస్తుందని తనదైన రీతిలో భక్త, భక్తి, భగవంతుని తత్త్వాన్ని బోధిస్తాడు.

ఇట్లా సంకీర్తన పరంపరలో మొదటివాడైన రామదాసు భావనలు ఒక ధారగా భక్త సాధువుల మాధ్యమంగా బుచ్చిదాసు వరకు కొనసాగుతూ వచ్చిందని చెప్పవచ్చు. లౌకిక, అలౌకిక భావనల చిక్కు ముదులను విప్పుతూ ఇరువురు తమ భక్తి సంకీర్తన నావను నడిపించారు. ఈ భగవద్కార్యంలో ఈ భాగవతులిద్దరు సఫలీకృతులయ్యాయి లోకాకళ్యాణం చేశారు. ఇద్దరు కవులు శతకకారులు. ఇద్దరు తాము నమ్ముకున్న స్వామి పేరుమీద శతకాలను రాశారు. రామదాసు ధాశరథి శతకాన్ని రాస్తే బుచ్చిదాసు యాదగిరి నరహరి శతకం, యాదగిరి లక్ష్మీ నరసింహ శతకం ను రాసి తరించాడు. తెలంగాణ వాగ్గేయ చరిత్రలో చిరంజీవులైన ఈ ఇరువురు మహనీయులకు సాదర నమస్సులు.

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2025

# బతుకు మూలాలను మరువని కవిత్వం 'గూడశాట'

**డా. ఎస్. రఘు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఫోన్ : 9848208533




మట్టిలోంచి విత్తనం మొలకెత్తినట్టుగా కవి మదిలోంచి కవిత్వం మొలకెత్తుతుంది. విత్తనంలోంచి మేల్కొన్న లేత మొలక వృక్షంగా ఎదగడానికి కొద్దికాలం నిరీక్షించాలి. అదే కవితైతే పఠనకాలం పూర్తవుతుండగానే ఒక చెట్టు కళ్ళముందు ఆవిష్కృతమవుతుంది. ఆ చెట్టుకు అన్నీ పచ్చని జ్ఞాపకాల ఆకులు. అనుభూతుల పరిమళాలతో భావాల పూలు మత్తెక్కిస్తాయి. ఆలోచనలు శాఖోపశాఖలుగా విస్తరిస్తాయి. మన మూలాల వేళ్ళలోకి వెళ్లి అంతర్మథనానికి గురవుతాం. కొన్ని కన్నీటి చుక్కలు ఎండుటాకుల్లా రాలిపడతాయి. అయినా సరే ఆ కవితావృక్షనీడలో మనల్ని మనం అన్వేషించుకుంటూ కొత్త మొలకల కోసం పరిభ్రమిస్తుంటాం. బోల యాదయ్య 'గూడశాట' లో కవిత్వం అలాంటి చెట్టు నీడను అందిస్తుంది.

ఈ నేల మీది మట్టిని మట్టికదా అని తేలికగా తీసిపారేయ్యలేం. ప్రతి నేలకు ఒక చెదిరిపోని చరిత్ర ఉంది. ప్రతి మట్టి రేణువులోనూ అణువంత శక్తి దాగి ఉంది. ఇది నిజమని నిరూపించడానికి పాలమూరు మట్టిని పిడికిట్లోకి తీసుకొని చూడండి. తరతరాల గాథల సామాజిక, సాంస్కృతిక జీవన వైవిధ్యమంతా అరచేతిలో ప్రత్యక్ష మవుతుంది. గూడశాటలోని ఒక్కో కవిత ఒక మట్టి రేణువు. ప్రతి కవితా రేణువులో భిన్నమైన సంవేదనల సప్త స్వరాలు వినబడుతాయి. బోల యాదయ్య తను నడిసొచ్చిన దారిలో పాదాలకు అంటుకున్న ధూళికణాలలోంచి కవితాపాదాలను నిర్మించుకున్నాడు. ఉనికిని కోల్పోతున్న పాతకాలపు పల్లెలను తల్చుకుంటూ ఎక్కెక్కి ఏడుస్తున్న ఈ కవి **'పల్లె దోసిలినిండా దూపారని దుఃఖాన్ని'** మనకు తాపిస్తాడు. తీరని కవిత్వ దాహంతో ఈ కవి కవిత్వాన్ని ఒక బావిలా తవ్వుకుంటాం. ప్రతి కవిత ఒక్కో రుచిని అందిస్తూ మోదఖేదాల అభేదావస్థకు గురవుతాం.

ఈ మానవగోళమంతా అస్తిత్వం అనే సూర్యుడి చుట్టూ అలసిపోకుండా తిరుగుతుంది. ప్రతిమనసు అస్తిత్వ స్పృహతో రహస్య పోరాటం చేస్తుంది. ఈ కవిత్వంలోని ప్రతివాక్యం వైయక్తిక, సామాజిక అస్తిత్వ సంఘర్షణను వ్యక్తీకరిస్తుంది. **"నేను నడుస్తున్న చలన శీలినే/ కరుగుతున్న చమురు దీపాన్నే / నా దేహం కరిగేట్లనిండా కష్టాల నాట్లే కాలం నాటుతుంది / కాలంతోనే పోటీ / కన్నీళ్లతో నా రణం / భూమి భుజాలపై పుట్టుమచ్చను నేను"** అని బోల యాదయ్య తన అస్తిత్వ అంతర్మథనాన్ని అపురూపంగా ప్రకటిస్తాడు. తన జీవన స్థితిగతులనిండా అలుముకున్న ఆవేదనలకు గాఢమైన కవితా రూపాన్ని చిత్రించడంలో కవి కన్నీటి సిరాగా మారిపోతాడు. మనసు మూలలో, బతుకు మూలాల్లో పేరుకుపోయిన ప్రతి అనుభవాన్ని ఒడిసి పట్టుకుని కవిత్వంలో నిక్షిప్తం చేసుకుంటూ అస్తిత్వ సాంత్వన పొందుతాడు.

కవిత్వం మనసు మూలల్లోంచి ప్రవహించే జ్ఞాపకాల నది. ఆ నదీ ప్రవాహంలో పడి కొట్టుకపోయేలా చేసే పోటెత్తె అలల్లాంటివి ఆర్ద్రత నిండిన వాక్యాలు. బోల యాదయ్య తన కవిత్వంలో అనేక ఆటుపోట్లను సృష్టించాడు. అక్షరాలకున్న శక్తిని ఆవాహన చేసుకొని 'ప్రశ్నలను జ్వలింప జేస్తూ' ఇలా ధిక్కారస్వరమై నినదిస్తాడు.

**"అవి / అక్కడ తెగిపడ్డ /అక్షరాల తలలే**
**ఊపిరినిడ్వలేక / కాలంతో పోట్లాడుతునై**
**పారుతున్న రక్త నదిలో / ఆయువు తీరని అక్షరాలు**
**మునుగుతూ తేలుతూ /మునుం గట్టినయి / ప్రశ్నలను జ్వలింప జేస్తూ.."**

కవికి దృక్పథ స్పష్టత అనివార్యం. రాస్తున్న అక్షరం ఏ ఆశయాన్ని అందించాలి. ఎవరి పక్షంలో నిలబడాలనే లక్ష్యం తెలిసుండాలి. బోల యాదయ్యలో ఆ స్పష్టత ఉంది. అక్షర కంఠంలో మేకులు దించినా తన గొంతులోంచి ప్రశ్నలు వినిపిస్తూనే ఉంటాయని నిర్భయంగా పలుకుతాడు. ఖనిజసంపద కోసం నల్లమల అడవులను విధ్వంసం చేయాలనుకునే కార్పొరేట్ దుష్టశక్తుల కుతంత్రాలను తీవ్రంగా స్పందిస్తాడు.

**"మట్టిని పెకలిస్తే / మౌనం కూడ రహస్య ఆయుధమై**
**కుట్రలను కూల్చి / చెంచుల గుడిసెలపై జెండై ఎగురుతది**
**వనమల్ల తూట్లు పెడుతుంటే/ నల్లమల్ల పగిలిన అద్దమై**
**కాలిన పేగుల మీద / యుద్ధగీతిక రచిస్తుంది"**

ఈ కవిత నడుస్తున్న పోరాట చరిత్రను వ్యాఖ్యానిస్తుంది. విప్లవోద్యమాలను కడుపులో దాచుకుని కాపాడుకున్న అడవి తల్లి నేటి నిస్సహాయతను ప్రదర్శిస్తుంది. ప్రకృతి సంపదను పెట్టుబడి దారులకు దోచిపెట్టడానికి జరుగుతున్న విప్లవ వీరుల అణచివేతను, కూంబింగులను, ఎదురుకాల్పుల కట్టు కథలను

గుర్తుచేస్తుంది. అయినా కవులు తుదిశ్వాస దాకా ప్రజా యుద్ధగీతికలను గానం చేస్తూనే ఉంటారు. యాదయ్య కవిత్వంలో ఆ జనగానం వినబడుతుంది. 'ఆమె జనగీతమై' కవితలో ఈ గానం మరింత ఎరుపెక్కి పలకరిస్తుంది.

**"ఆమె / నిషిద్ధ నగరం నిండా / విప్లవాగుల వేగుచుక్క**
**ఆమె / ఎన్నో వాక్యాల నడుమ / తానొక జనగీతమై కదుల్తది**
**ప్రజా సాహిత్యమే / ఆమె గుండె గోడల మీద**
**రాస్తున్నది లేని చరిత్ర కాదు / వెలివాడల బతుకు గోస"**

కవిలోని ఆవేశం, ఆవేదన సమ్మేళితమై కొత్త బాటలోకి తీసుకెళు తుంది. విప్లవోద్యమ సిద్ధాంత తాత్వికతను నింపుకున్న ఈ కవిత సామాజిక చింతనాపరులను ఉద్వేగభరితుల్ని చేస్తుంది. మనకే తెలియని కొత్త పోరాటస్ఫూర్తిని అందిస్తుంది. మరోవైపు ఎన్నికల వేళ రాజకీయ నాయకుల వాగ్దానాల మాయాజాలంలో ఇరుక్క పోకుండా ఉండాలనీ జాగ్రుతపరుస్తాడు. నిర్భయంగా ఓటు వేయమంటాడు. ఓటు ద్వారానే మన రాజకీయ చైతన్యాన్ని ప్రకటించాలని సూచిస్తాడు. కవి ఆలోచనల్లోని పరిణతి, వర్తమాన పరిస్థితులను అర్థం చేసుకుంటున్న తీరుకు నిదర్శనాలు.

బోల యాదయ్య కవిత్వంలో బహుజన అస్తిత్వకాంక్ష కూడా కనిపిస్తుంది. పూలే ప్రవచించిన భావాల వెలుగులో నడుస్తున్నవాడు. బడుగు బతుకుల జీవితాల్లో జ్ఞానాన్ని నింపిన పూలేపై తన అభిమానాన్ని ప్రకటిస్తూ **'నువ్వు చూపిన తొవ్వలోనే నడిచి... నడిపిస్తున్నం'** అంటూ వృత్తి కులాలు, ఉత్పత్తి, సేవాకులాలకు అవసరమైన చైతన్యాన్ని అందించే ప్రయత్నం చేస్తాడు. అందులో భాగంగానే తన మత్స్యకార వృత్తి జీవనంలోని కష్టనష్టాలను, ఉపాధి లేని ఆకలి అనుభవాలను 'గూడశాట' కవితలో వర్ణిస్తాడు. చేపలు పట్టడానికి ఉపయోగించే ఒక సాధనమే గూడశాట. వలను నీళ్లలోకి విసురుతాం. ఈ గూడశాటను నీళ్ళలోకి ముంచి చేపల్ని ఒడిసిపట్టుకుంటారు. తన కవిత్వానికి గూడశాటను శీర్షికగా ఎంచుకోవడంలో కవి తన మూలాలను మరిచిపోలేదనేది నిర్ధారిత మవుతుంది.

**"తెగిన వల తెరపట్టుకు /తిమింగలాలకు ఎదురీదుతున్న / మత్స్యకారులం**

**ఏటికి బతుకులను ఎరగావేసి /కాటిలో కలిసే వరకు / కన్నీళ్ళతో కాపురాలు**

**నిలువనీరు లేని వృత్తిమాది / బతుకంతా నీళ్లలోనే, కన్నీళ్ళతోనే"**

అంటూ వృత్తి బతుకుల్లో అలుముకున్న దుఃఖాన్ని, అవమానాల్ని, దారిద్ర్యపు రోజులను పచ్చిపచ్చిగా తడితడిగా నెమరువేసుకుంటా ఏటికి ఎదురీదే చేపపిల్లలా తన గమ్యం పట్ల విశ్వాసాన్ని వ్యక్తపరుస్తాడు. ఒక సంక్షుభిత వాతావరణం, ప్రతిక్షణం బతుకులో చోటు చేసుకున్న తండ్లాటలు ఈ కవిత్వంలో అంతర్లీనంగా పలకరిస్తాయి.

**"అతనిప్పుడు దుఃఖానికి పూసిన పువ్వు**
**నీళ్లను మింగలేక / కన్నీళ్లను తాగి బతుకుతున్న**
**కాలం రెమ్మకు కాసిన వాడని పువ్వు**
**నేడో రేపో దుఃఖ వంతెన తెగి /బాధలన్నీ కొట్టుకపోతాయి"**

తన బతుకును పూలతో పోల్చుకోవడంలోనే ఒక జీవన పరిమళం తన పరిసరాలంతటా వ్యాపిస్తుంది. తన చుట్టూ ఆవరించిన దుఃఖం ఎప్పుడో ఒకప్పుడు తొలగిపోక తప్పదనే నమ్మకం తనవరకే పరిమితం చేసుకోకుండా లోకమంతటికి పంచడమే యాదయ్య కవిత్వంలోని విశేషం.

ఈ కవితా సంపుటిలో ఎక్కడ చూసినా అమ్మ ప్రేమ, ఆత్మీయస్పర్శ తగులుతుంది. కవి మాతృహృదయంగా మారిపోయి కవిత్వం రాసినట్లుగా అనిపిస్తుంది. ఈ సంపుటిలో దాదాపు పదకొండు కవితలు అమ్మమనసు చుట్టే తిరుగుతాయి. అమ్మ జ్ఞాపకాలు కవిని అనుక్షణం వెంటాడుతూనే ఉన్నాయి. **"నీ ఫోట్వ ముందు గూసొని / నా మన్నును పచ్చితువాలు జేసి పరిస్తే / అగరొత్తి బూడిదవై రాలి ఏద్చే దానివి"** అనే వాక్యాలకు పాఠకుడు సైతం అగరొత్తిలా నిశ్శబ్దంగా కాలి బూడిదలా రాలిపడుతూ అమ్మకు నివాళి అర్పిస్తాడు. కవిలోని సున్నిత మనస్కతకు ఆ అమ్మపైగల గాఢమైన ప్రేమే కారణమని అర్థమవుతుంది.

**"అమ్మ నీవు మట్టిని పిసికి / చెమటను తాగి సాకితివమ్మా**

**అమ్మ నిన్ను మరువనమ్మ /నిత్యం అక్షరాలతో పలకరిస్తూనే ఉంటా**

**నీవు రాళ్ళ మిషన్ కాడ / ఎత్తిన రాళ్ళ గంపలే**

**నా మదిలో నేడు / అక్షర నక్షత్రాలై పూసినయి**

**అమ్మ మళ్లీ జన్మంటూ ఉంటే /చిరిగిన నీ చీర కొంగులోనే ఊయలూగాలనుందమ్మా"** అనే మాటలు అందరి హృదయాలను కదిలించివేస్తాయి. మాతృస్మృతిలో వెలిగిపోయిన ఈ కవితలన్నీ ఒక దీర్ఘకావ్యానుభూతిని అందిస్తాయి.

బోల యాదయ్యలో అనంతమైన భావుకత పొంగిపొర్లిపోతూ ఉంది. అమ్మ ప్రేమకు దూరమైన ఈ కవి తన జీవన సహచరిపై గాఢమైన మమతానురాగాలు కురిపిస్తాడు.

**"మా అమ్మానాన్న అలిగి /ఆకాశతారలై వెళ్ళిపోతే**
**అన్ని తానై నాకు / కన్నీళ్ళ దీపమై వెలిగింది**
**ఆమె / పూట పూటకు పూలతీగై /**
**పలకరింపుల దండై అల్లుకుంటది**
**రెండు పొద్దుల నడుమ / తానొక నదీతీరమై /**
**నిత్యం నాకై ఎదురుచూస్తుంటది**
**ఆమెకు నేనేమివ్వగలను /గుప్పెడు గుండెలో పూసిన**

**పదాల పువ్వులను కోసివ్వడం తప్ప"**

గాఢమైన ప్రేమలోతుల్లో మునిగిపోయిన ప్రేమికుడి తొలిప్రేమ లేఖలా ఈ కవిత పారవశ్యానిస్తుంది. చలం, శేషేంద్ర కవితాభివ్యక్తుల స్థాయిని అందుకున్నాడు కవి. భగ్నహృదయంలోని వేదనే ప్రేమగీతంగా ఎదల్ని కాల్చేయడమే కాదు, సఫల ప్రేమను సైతం అంతే తీవ్రంగా గాయపరుస్తుందనడానికి **'ఆమెకు నేనేమీ ఇవ్వగలను'** కవిత తాజా నిరూపణ. వాడిపోని పదాల పూలతో కవితావాక్యాల మాలలల్లిన ఈ కవి మెడలో ఎన్ని పొగడపూలదండలు వేసి సత్కరించినా తక్కువే.

కవిత్వంలో వర్తమాన స్పృహ ప్రతిఫలించాలి. సామాజిక గమనంలో పరిణామాల్లోని ప్రతికూల అంశాలను పసిగట్టాలి. కవి తన భావుకతతో ప్రపంచంలోంచి బయటకు వచ్చి సమాజంలోకి ప్రవహించాలి. స్వీయ దుఃఖావరణం వెలుపల ఉన్న ప్రాపంచిక పరిణామాల్లోని విషాదాలకు స్పందించాలి. బోల యాదయ్య కవిత్వంలో ఈ స్వభావం ప్రతిబింబిస్తుంది. తక్కువ కులం అనే పేరుతో జరుగుతున్న క్రూరమైన పరువుహత్యలపై యాదయ్య తీవ్రంగా స్పందిస్తాడు. 'మనువు మాయ వేట కొడవలై ' చేస్తున్న హత్యాకాండ ను ఉద్దేశిస్తూ ఇలా అంటాడు.

**"కులనాగు కుట్రలు కుతంత్రాలు / కాటేసేందుకు కాపుగాస్తుంటే
ఇంకా ఎన్నాళ్లు దళిత పుష్పాలు నేలరాలాలి
ఎన్నిసార్లు పవిత్ర ప్రేమ అని / పానాలను మీ చేతుల్లో పెట్టి
రుజువు చేసుకోవాలి / మనువు మాయల మన్నువడ
దొరికింటే బాగుండు/కనిపిస్తే కాళ్ళు నరికైన ఖననం చేస్తుంటిమి"**

కవి అవసరమైన చోట ఆగ్రహాన్ని ప్రకటించాలి. అన్ని విధాలుగా అవమానాలకు, అణిచివేతలకు గురవుతున్న దళిత ప్రజల స్వప్నాల్ని కాపుగాసేందుకు కఠినస్వరమై మనువారసులపై అనాగరిక చర్యలను తీవ్రంగా నిరసిస్తాడు. కులదురహంకారంపై ఎదురుతిరగాలని పరుషమైన హెచ్చరికను జారీ చేస్తాడు.

ఈ కవిత్వం చదువుతుంటే మనింట్లో మనమే కలియ తిరుగు తునట్లుగా ఉంటుంది. మన స్థానీయ వాతావరణం, సాంస్కృతిక ప్రతీకలు, మట్టివాసన, నేలతో పేగుబంధం, బలమైన సెంటిమెంటు, తెలంగాణ వాడుకపదాల సహజ సౌందర్యంతో బోల యాదయ్య కవిత్వం మనల్ని మనకే మళ్ళీ పరిచయం చేసినట్లుగా, పలకరించి నట్లుగా ఉంటుంది. పేదరికంలో పనిలేక వలసపోయిన చెల్లెమ్మ కట్టే రాఖీకోసం కవి నిరీక్షణలో ఎవరైనా కరిగి నీరైపోవాల్సిందే.

**"గీ యాడాదన్న నా చేతి చెక్కిళ్లపై /చెదరని చుక్కలై పూస్తరని / గుమ్మం మెట్లముందు / చేతులకు కండ్లనిచ్చి / పేదరికాన్ని లోపలింట్ల తాళమేసి / చీర సారెతోన.../ మీకోసమే ఎదురుచూస్తున్న / తప్పక వస్తారు కదా"**

అనే వాక్యాలు గుండెను బరువెక్కిస్తాయి. అందరికీ తెలిసిన సహజసత్యాలను సైతం కవిత్వీకరిస్తూ **"మట్టి మరణాన్ని జయించిన రస పదార్థం / నేనైనా నువ్వైనా ఏనాడో ఒకనాడు / మట్టి ఒడిలో కునుకు తియాల్సిందే / ఎవరైనా మట్టితో బంధం పెనవేసుకో వాల్సిందే"** అంటూ మట్టిని తాత్వీకరిస్తాడు. **"నీకు చివరకు ఏమి మిగలదు / ఎట్లొచ్చినవో గట్లనే బోవాల్సిందే"** అంటూ సృష్టిలోని మార్మిక రహస్యాన్ని వాడుకయాసలో విప్పిజెపుతాడు. **'పాలమూరు పాటలతోట'** అంటూ గోరటి వెంకన్న సృజన స్వరాన్ని పొగుడుతూనే ఒక గొప్ప గాయకుడి నుండి ప్రజాహృదయం ఏం కోరుకుంటుందో, ఎలా చూడాలనుకుంటుందో సూచించడం కవి నిబద్ధతకు ప్రతీక.

బోల యాదయ్య కవిత్వరచనను వైయక్తిక ప్రచార కరపత్రంగా రూపొందించుకోలేదు. కవి అంటే ఎవరు, కవికి ఉన్న సామర్థ్యం ఎంత, కవి ఎందుకు రాయాలి, ఎవరి పక్షం వహించాలి. కవిత గొప్పదనం స్థాయి ఏంటి, ఏది మంచి కవిత, కవిత్వం ఏ ప్రయోజనాలను సాధించాలి, నేనెందుకు కవిత్వం రాస్తున్నాను అనే విషయాల మీద ఈ కవికి స్పష్టమైన దృక్పథం ఉంది. **'కలానికి అగ్గి స్పర్శ ఎట్లా ఉంటది'** అనే ప్రశ్నకు కవితాత్మక సమాధానాలను ఇస్తాడు. అందుకే ఈ సంపుటిలోని మూడు కవిత్వ కవితలు యాదయ్య కవితా మేనిఫెస్టోను వ్యాఖ్యానిస్తాయి.

**"ఇప్పుడు..... నా చిరునామా మారింది
నేనంటే....కవిత్వమే"** అని యాదయ్య సాధికారికంగా చెప్పుకోవడంలో అతిశయం ఏమి లేదు. ఈ గూడశాటను మనసుతో చదవండి. కవిస్పర్శ కన్నీటి తడిలా తగులుతుంది. భావోద్వేగ గాఢతతో ఒళ్ళు వెచ్చబడుతుంది. నిజమే, ఈ సంపుటితో యాదయ్య చిరునామా మారింది. వచన కవితావీధిలో శాశ్వత నివాసిగా స్థానం పొందాడు. ఇది అతని కవితాత్మక ఆధార కార్డ్. యాదయ్యంటేనే నిలువెల్లా కవిత్వ నిధి.

❖ ❖ ❖ ❖ ❖

**మూసీ**

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాసపత్రిక
మూసీ మాస పత్రిక సభ్యులుగా చేరండి
వెంటనే శాశ్వత చందాదారులు కండి.
సాహిత్య రంగంలో వెలువడుతున్న ఒకే ఒక పరిశోధనాత్మక వ్యాసాల మాస పత్రిక
యూజీసీ కేర్ లిస్ట్‌లో చేరిన తెలుగు పరిశోధనా పత్రిక
శాశ్వత సభ్యత్వం (10 సం॥లు)... 2500/-
సంప్రదించండి. మూసీ మాసపత్రిక... ఫోన్: 934 7971177

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక    సంపుటి -28 : సంచిక - 8    50    హైదరాబాద్    జూన్ : 2025

# నీతి శాస్త్రము – తాళపత్ర గ్రంథము

**డా. గంధ్ర లక్ష్మణ రావు,** విశ్రాంతాచార్యులు ఫోన్ : 98493 28036

**దానఖ్యాతికరం రిపుక్షయకరం పుంసస్యో భూషాకరం**
**విష్ణు ప్రీతికరం మనశ్శుచికరం పుత్రాది సంపత్కరం**
**ఆయుర్వృద్ధికం పరత్వ నియమాన్వర్గాది భోగావహం**
**తత్త్వం ప్రాహురనైక వైభవకర దానప్రభావం బుధా ॥ - 105**

**పద్యానువాదం :**

లోకయాత్రల జ్ఞాన వివేక మొకటి
పాపముల పట్ల భీతియు, పరుల పట్ల
దయయు, ధర్మము,శీలము నయిదు మంచి
గుణము లను గల్గువారితో కూడియుండు.

**అర్థం :** దానము వలననే శత్రు జయము. పురుషులు సమస్త భూషణలు గలవారు. విష్ణువుకుదానమే ప్రీతి సదా. పుత్ర పౌత్రుల సంపద దీర్ఘాయువు, వైకుంఠ ప్రాప్తి, స్వర్గ భోగాలు అనుభవించును. అనేక పురాణాలు విన్నవారు అనేక వైభవం దానమనే గుణాలకు యిన్ని విధాల భోగ మనుభవింతురనిన రీతి.

**ధర్మో మాతా పితంచైవ ధర్మో బంధునం సుహృస్తథా**
**ధర్మో భ్రాతృ సఖాచైవ ధర్మో స్వామి పరంతపః ॥ - 106**

పద్యానువాదం :

ధర్మమె తల్లియు తండ్రియు
ధర్మమె సోదరులు సఖులు ధర్మమె బంధుల్
ధర్మమె గురువును దైవము
ధర్మమె పరమాత్మవైపు దారిని జూపున్


**అర్థం :** ధర్మమె తల్లి, ధర్మమె తండ్రి, ధర్మము బంధువులు, ధర్మమే అన్నలు, ధర్మమే తమ్ములు,ధర్మమే శ్రీస్వామి, ధర్మమే వైకుంఠం. ధర్మమే తపస్సు కనుక నమ్మెద ధర్మమనిన రీతి.

**వనే రణే శత్రు జలాగ్ని మధ్యే,మహార్ణవే పర్వత మస్తకే వా**
**సుప్తం ప్రమత్తం విషమస్థితం వా, రక్షంతి పుణ్యాని పురాకృతాని॥**

పద్యానువాదం :

చం. **అడవులయందుఘోరమగు నగ్నులయందున నీటిలోపలన్**
**పెడుసగు వైరి పోరులను పెద్దసముద్రము మధ్యమందునన్**
**నిడుదగు కొండకొమ్మునను, నిద్రను, మత్తున,సంకటమ్ములన్**
**తడయక రక్షసేయునిక తానొనరించిన పూర్వపుణ్యమే**

అర్థం : అడవులయందు, యుద్ధమునను, శత్రువుల వలనపీడలు, మహానదులను నీళ్ళలో పర్వతములయందును, నిద్రలోనయినను, నిషాద్రవ్యముల వలన తెలివి దప్పినను, విషము వొకరు పెట్టినను రక్షించునది పురాకృత పుణ్యము గనుక దానము యామరవలదనిన రీతి.



**త్యాగినాం కిం విచారేణ దోషైరపి గుణైరపి**
**సమ వర్షంతి పర్జన్య సస్యాదపి తృణాదపి - 108**

పద్యానువాదం :

తే.గీ. **త్యాగమును చేయువానికి తర్కమేల**
**ఎవడుగుణవంతుడో కాడొ ఏల చింత**
**ఆకసమ్మున కమ్మిన యట్టి మబ్బు**
**కురియు పంటపొలాననో గరికపైనొ**

అర్థం : దానత్యాగ కాలమున పరచింతన, అతిథి దోషములు దుర్గుణములు విచారించక దానమిచ్చినదే మిక్కలి ఫలం, అదెట్లనిన మేఘం నవఖండ భూమిమీద వొక్క తీరే వానలుపడును, నవధాన్యములకు వొకతీరు, ఇతరములకు వొక వర్షం లేదు. కనుక దానం పొరయించక యిచ్చిన దానమనిన రీతి.

**నవిహాయ నధర్మాయ నబంధుభ్యో నవార్థికే**
**దుర్జనార్జితం విత్తం భుంజతే రాజ తస్కరైః ॥ - 109**

పద్యానువాదం :

**కం. ధనమును సంపాదించియు**
**తనకోసము వాడుకొనక దానంబిడకన్**
**తనబంధులకివ్వక, దా**
**చిన, నది దొంగలకొరాజు చెంతకొ చేరున్**

అర్థం : ధనము గల్గి తన దేహ సుఖము లేక, ధర్మము చేయక బంధువులను మన్నించక 108 తిరుపతులు సేవించక కూర్చేవాని ద్రవ్యం రాజులో చోరులో అనుభవింతురనిన రీతి.

**విద్వత్వంచ నృపత్వంచ నైవ తుల్యం కదాచన**
**స్వదేశే పూజ్యతే రాజన్ విద్వాన్ సర్వత్ర పూజ్యతే ॥ -110**

పద్యానువాదం :

**తే.గీ. విద్య గలవాడు రాజును వేరు వేరు**
**ఇరువురకు పోల్కి యెంతయు నరయరాదు**

**రాజు పూజింపబడు తన రాజ్యమందు**
**పండితుడుపూజలందు ప్రపంచమందు**

అర్థంా చదువు గల రాజు భూమి గల రాజు వీరికి ద్రవ్యం వుండి అఇకారమే , ద్రవ్యం లేకున్న అధికారులుగనుక ద్రవ్యం లేని రాజు తనదేశమున పూజింప బడును, పండితులు సర్వత్ర పూజ్యులనిన రీతి.

**నచోర హార్యం నచ రాజ హార్యం నచ భారావహా**
**నమిత్రువత్సర్వ ధన ప్రధానం విద్యాధనం సత్పురుషోభవతి॥**

పద్యానువాదం :

**తే.గీ. దొంగలెత్తుక పోలేరు, దొరలు దోచ**
**లేరు, దేశముల్ తిరిగిన లేదు బరువు**
**విద్య యే గొప్పధనమువివేకులకును**
**అదియు గల్గుట సుజన పురాకృతమ్ము**

అర్థం : విద్య ధనమనే దాన్ని దొంగలు దోచుకోలేరు. రాజులు తీసుకోలేరు. తోడబుట్టిన వారు తీసుకోలేరు. సమస్త దేశాలు తిరిగినా బరువు లేదు. మిత్రులకు శత్రులకు ధనం చేతనే మన్నన, ధనం వలననే శత్రుత్వం. సత్పురుషులకు విద్య గల్గుటె పుణ్యం పురాకృతం.

**సభాయాం యజ్ఞశాలాయాం దేవతావసతేషుచ**
**ప్రత్యేకం నమస్కుర్యాత్ హంతి పుణ్యం పురాకృతం ॥ - 112**

పద్యానువాదం :

**తే.గీ. సభలయందును యజ్ఞపు శాలలందు**
**దేవతలు నిల్చి యున్నట్టి కోవెలందు**
**పరులకునమస్కరింపగ పాడిగాదు**
**పూర్వ సుకృతంపు పుణ్యము పోవునింత**

అర్థం: విద్వత్సభలయందు,యజ్ఞయాగాది శాలలయందు, లక్ష్మీనారాయణ కోవెలలందు,యీ స్థలములయందు, ప్రత్యేకంగాను నమస్కారం జేసినను పూర్వజన్మలయందు జేసిన పుణ్యం తరుగుననిన రీతి.

**దూరస్థం జలమధ్యస్థం ధావంతం ధనగర్వితం**
**లోభక్రాంత మదక్రాంతం షడ్భిర్నానాభివాదయేత్ ॥ - 113**

పద్యానువాదం :

**తే.గీ. దూరమున నున్నవారికి, దుఃఖితులకు**
**కదలి నున్నవారికి ధన గర్వితులకు**
**కామమునుక్రోధ లోభముల్ గల్గువారి**
**ఇట్టి యార్గుర నెట్ల జయించవలయు**

అర్థం : దూరాన వున్న వానికి, నీళ్ళ నడుమ వున్నవానికిని, దావంతపడే వారికిన్ని, ధనం చేత గర్వించేవానికిన్ని, క్రోధలోభ కామ గుణాల వారికిని యీ ఆరు గుణాల వారిని వివాదులన జయించి వాని యొక్క ఉదంతమును వర్ణించెద మనిన రీతి.

**ఏకహస్త నమస్కృత్యా ఏకమేవ ప్రదక్షిణం**
**అదీపతాం దేవతాః దృష్ట్వా హంతి పుణ్యం పురాకృతం - 114**

పద్యానువాదం :

**తే.గీ. ఒక్క చేతనమస్కార మొక్క సారి**
**గుడి ప్రదక్షిణమును చేయ గడగెనేని,**
**దీపమేలేని గుడిలోని దేవతలను**
**చూసినను పురా సుకృతము పాసి పోవు**

అర్థం : ఒక్క చేత దండం, దేవునికి గురువునకు ఒక్క ప్రదక్షిణం చేసినను, దీపంలేని గుడిలో దేవతలను చూసినను పూర్వకర్మలలో చేసిన పుణ్యము పోవుననిన రీతి.

**అశ్వారూఢం యతిం దృష్ట్వా, ఖట్వారూఢం రజస్వలా**
**అంతరిక్షం శవం దృష్ట్వా స్నానమాచరేత్, హంతి పుణ్యం పురాకృతం॥**

పద్యానువాదం :

**తే.గీ. అశ్వమారోహణముచేయు యతిని జూచి**
**మంచమున రజస్వలయైన మహిళ జూచి**
**శవము గొనిపోవ జూచిన, స్నానములను**
**చేయకున్నచో పుణ్యము చెడును సుమ్ము (14 వ ఆకు )**

అర్థం : యతీశ్వరుడు గుర్రమెక్కి పోవజూచినను, ముట్టైన స్త్రీ మంచం మీద నుండ జూచినను, పీనుగను యెత్తుకొని పోగా జూచినను, ముట్టుడనుకొని తలస్నానం చేసి పెద్దలను సేవించేది.

**స్నానం రజకతీరేణ విధవా గృహభోజనం**
**నావకశ్చ గృహోక్షౌరం హంతి పుణ్యం పురాకృతం - 116**

పద్యానువాదం :

**తే.గీ. చాకలుల రేవులందున స్నానమున్ను**
**విధవయింటిలో భోజన విధినిజేయ**
**మంగలుల యింటనే క్షౌరమాచరింప**
**దోషమగుపూర్వ పుణ్యము తొలగి పోవు**

అర్థం : చాకలి రేవున స్నానం చేసిన, సంధ్య జేసిన, వొక్క విధవ వున్నయింటిలో భోజనం చేసినా, మంగలివానింట్లో క్షౌరం చేయించు కున్నను పూర్వ జన్మ పుణ్యం తరుగు ననిన రీతి.

**దీపం వినా దేవతమప్రశస్తం, రూపం వినా యవ్వన మప్రశస్తం**
**సూపం వినా భోజనమప్రశస్తం కూపం వినా మందిర మప్రశస్తం**

పద్యానువాదం :

**తే.గీ. దీపమేలేని గుడిలోనదేవుడేల**
**అందమేలేని యవ్వన మదియు నేల**
**పప్పులేనట్టి భోజనమొప్పదగునె**
**బావి లేనట్టి యిల్లును వ్యర్థమగును**

అర్థం: ధూపదీప నైవేద్యం లేని దేవుడున్ను, యవ్వనం వచ్చి రూపులేని స్త్రీయున్ను, పప్పుపులుసు లేని భోజనం, చేదబావి లేని యిల్లున్ను అప్రశస్తం, దేవతా ముఖ్యం కాదనినరీతి.

# గురజాడ తీర్చిన – స్త్రీ పాత్రల చైతన్యం

✍ **డా. లక్ష్మణ్,** సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి, ఫోన్ : 9133635714



సమాజ వికాసంలోని ప్రధాన మూలకాలైన, మనుషులు వారి చుట్టూ ఆవరించిన మానసిక, బౌద్ధిక, భౌతిక అంశాలు, వాని మధ్య సాగుతున్న విశేషాలు, అందులో మహిళా వికాస ప్రాధాన్యతనూ కాంక్షించి, సాహితీ సృజన చేశాడు గురజాడ అప్పారావు గారు. ఆయన ప్రజాస్వామిక దార్శనికత, పౌరుల జీవితాలను వికసింపజేస్తుంది. జీవితంలో ఉన్నతిని సాధించే సంకల్పానికి దారి చూపే తీరులో పాత్రలను క్రమోన్మీలనం చేసి చూపాడు. ప్రత్యేకించి, మహిళా పాత్రలను తీర్చడంలో ప్రజాస్వామ్య హృదయాలు స్పందించేలా చేశాడు. ఈ పాత్రలు జనహితమైన సమాజవికాసానికి దారి తీసేవిగా నిలుస్తాయి. సాహిత్యానికి సమాజానికి గల శాశ్వతమైన సంబంధాన్ని ఎరుక కలిగి నడుస్తాయి. గురజాడ స్త్రీ పాత్రలను తీర్చడంలోని అవగాహనను ఇలా పేర్కొన్నాడు. **"ఈ సమాజంలో స్త్రీ కన్నీటి గాథలకు కారణం నాకు తెలుసు, తిరిగి వివాహం ఆడకూడదనే నియమం, విడాకులకు హక్కు లేదనే కారణం, ఆర్థిక స్వాతంత్ర్యం లేకపోవడం లాంటివి స్త్రీల కన్నీటి గాథలకు హేతువులు"** అని వివరిస్తూ ఆధునిక మహిళలు భారతదేశపు చరిత్రను తిరగ రాస్తారు అన్నది ఆయన ఆశాభావం. అందుకు అనుగుణంగానే స్త్రీ పాత్రలను తీర్చాడు.

గత నూరేళ్ళ తెలుగు కథానిక సాహిత్యంలో మనకు కనిపించే, కొన్ని వేల మంది మధ్య తరగతి స్త్రీల చైతన్యానికి కమిలిని పాత్ర మార్గదర్శి. ఆధునిక మహిళ మానవ చరిత్రను తిరగరాస్తుందనే గురజాడ విశ్వాసానికి ఆరంభ ఆకరం కమిలిని పాత్ర. ఓ స్త్రీకి చదువు చెప్పించడం, మెదడు సక్రమంగా వున్న ఏ పురుషుడూ చేయరాని దస్సాహసం, ఎందువల్ల? **"చదువుకున్న భార్య ప్రియుల్ని ఆకర్షించదానికి వుత్తరాలు రాయదటో!"** అని నార్ల వెంకటేశ్వరరావు 19 శతాబ్ది నాటి స్త్రీల పట్ల, నాటి పురుష సమాజపు దృష్టి ఆలోచనలను దెప్పిచూపాడు.

చదువుకున్న స్త్రీలు ప్రియులకు కాదు ప్రియమైన భర్తలకు ఉత్తరాలు రాసి, సంసారం చక్కదిద్దు కుంటారనే నిదర్శనానికి దిద్దుబాటు కథానికలో కమిలిని పాత్రను గురజాడ సృష్టించాడు. **"ఆడవాళ్ళకు చదువెందుకు? ఉద్యోగాలు చేస్తారా? ఊళ్ళేలుతారా?"** అని అజ్ఞానంతో ప్రశ్నించే అప్పటి పురుష ప్రపంచానికి, జ్ఞానవిత్తనాన్ని తొలిగా గుర్తు చేసిన మహిళా కమిలిని. స్త్రీకి విద్య అవసరం, విద్య సర్వసమస్యలకు పరిష్కారిణిగా భావించాడు. ఆనాటి విజ్ఞాన సమాజం. అందుకే దిద్దుబాటు కథానికలో చదువుకొన్న ఒక స్త్రీ పాత్ర కమిలిని, అప మార్గం పడుతున్న తన భర్తను సంస్కరించుకొంది. స్త్రీ చదువుకుంటే ఇంటికే కాదు, మొత్తం జగత్తుకే వెలుగు నిస్తుందని నిరూపించింది.

దిద్దుబాటు కథానికలో కమిలిని భర్త గోపాలరావు చదువుకొన్న వాడు. సంస్కారిగా చలామణిలో ఉన్నాడు..., ఇతను ఒకేసారి రెండు పొరపాట్లు చేశాడు. ఒకటి భార్యతో అబద్దాలు చెప్పుతూ విశ్వసనీయత లేని భర్తగా తయారుకావటం. రెండు – సంఘ సంస్కర్తగా చెలామణి అవుతూ, కుహనా సంస్కర్తగా మారడం, ఇటు ఇంటికి, అటూ సమాజానికి చీడ పురుగు అయ్యాడు గోపాలరావు. కమిలిని తన భర్త గోపాలరావు తనను మోసం చేస్తున్నాడని, తెలిసికూడా **"నా ఖర్మ ఇంతే"** అని మౌనంగా ఉండిపోలేదు. రభస చేసి ఇంటి సమస్యను రచ్చకెక్కించలేదు. ఇక నీకూ నాకూ సంబంధం లేదని తేగేదాకా లాగలేదు. ఒక్క ఉత్తరం ముక్కతో, భర్త సమస్యను మార్చగల్గింది. ఇదొక నిశ్శబ్ద చైతన్యం.

**"మీచే దిన దినమున అసత్యమాడించుటకన్నా మీ త్రోవకు అడ్డుగ నుండకుండటయే పతి మేలు కోరిన పత్నికి కర్తవ్యం కదా? అందుకనే ఈ పుట్టింటి యాత్రా...."** ఈ మాటలతో పెనిమిటిలో మానవత్వాన్ని, ప్రజాస్వామ్య హృదిని మేల్కొల్పింది. కమిలిని, భర్త గోపాలరావు పాత్ర – తన మనస్సులో, నా సహచరి, గుణవతి, విద్యానిధి వినయ సంపన్నురాలు అని మెచ్చుకుంటూ పశ్చాత్తాపానికి లోనౌతాడు. ఈ పాత్రలో మెదిలిన, మెలిపెట్టిన ప్రజాస్వామిక నిరసన చైతన్యం, ఎదుటి హృదయాన్ని కరిగించి, క్షాళనతో (కెథార్సిస్) కడిగేసిన కమిలిని ప్రవర్తన గొప్ప చైతన్యశీలతను ప్రదర్శించింది. తన భర్త గోపాలరావును సామాజిక ఉద్యమాల్లోకి వెళ్ళడానికి సమ్మతించింది. అదే సమయంలో భర్తలు తప్పటడుగులు వేస్తే, సరిదిద్దుకోవాలనే సమయస్ఫూర్తిని ప్రదర్శించింది. ఈ పాత్రలోని మానసిక పరిపక్వత, బుద్ధికుశలత, (బౌద్ధిక ఆవరణ విశాలత), భౌతిక సమాజంతో సర్దుబాటు తత్వం (సమయస్ఫూర్తి) మూర్తీభవించి వెలిగిన చైతన్యకళిక కమిలిని పాత్ర, ఇది గురజాడ దిద్దుబాటు ఉపజ్ఞ.

మెటిల్డా :

**"భార్యా రూపవతీ శత్రుః"** చందంగా ముసలిపులి మానసిక ఆవరణంలో నింపుకొని బతుకీడుస్తున్నాడు. అసమ వివాహ వ్యవస్థలో నలిగిపోయిన ఒక యుక్త వయస్సు యువతి మెటిల్డా. కాని భర్తకు ఆమె శత్రువు కానే కాదు. భయస్థురాలు. కాని భర్త చేసిన దాష్టీకాలను ఓర్చుకుంటూ, గుట్టుగా మసలుకొన్న పాత్ర ఇది. సర్దుబాటు ఇల్లాలు, ఆలోచనలూ, అనుభూతులు అరికట్టబడిన స్త్రీ జీవితానికి నిదర్శనం మెటిల్డా. జీవితం గోరుచుట్టు మీద రోకటిపోటు అన్నట్లు, భర్త పీడనతో పాటు ఆడపడుచు చిలిపి జగడాలు జతకలిసి, నిలువుగా ఉండాల్సిన వ్యవస్థ తలకిందులై నిలిచిన జీవితం మెటిల్డాది. అసమ వివాహ వ్యవస్థలో చదువు, సమస్యను పరిష్కరించ లేదనేది బహిర్గతాంశం. కాని ముసలిపులి (భర్త) ఎంత హింసించినా, అవమానించినా పల్లెత్తి ఒక్క మాట అనలేదు. సరికదా ఏ మానసికావరణలోనూ, నిరసన లేదు. తనకు ఎదురైన అపరిచితుల అపరిపక్వమైన చేష్టలను మాన్పించుటకు తరుణోపాయంగా, విద్యానేర్పిన మానసిక సంస్కారంతో మెటిల్డా డిగ్రీ చదువుతున్న యువకులను ఉద్దేశించి ఉత్తరం ముక్క రాసి పంపింది. దాని సారాంశం. **"మీరు మీ నేస్తులూ నా కాపురం మన్ననివ్వరా? మీకు నేనేం అపకారం చేశాను. తలవంచుకు మీపాపాన మీరు పోతేనే బతుకుతాను. లేకపోతే నా ప్రారబ్ధం".**

ఈ ఉత్తరంలోని మాటలు ఉత్తమ సంస్కారులను, సహృదయులను మెలితిప్పుతాయి. మానవత్వాన్ని తట్టి నిలుపుతాయి. తోటి మనుషుల్లోని వ్యక్తి స్వేచ్ఛకు భంగం కల్గించరాదనే చైతన్యానికి అక్షరాలు పురుడు పోశాయి. హృదయాలను కదిలించగలిగే అక్షర చైతన్యం, (దైన్యస్థితి) మెటిల్డా మానసిక నవోన్మేషణకు ప్రతీకగా నిలుస్తుంది. మెటిల్డా పుట్టింటివారి మద్దతు ఎండమావి, అందున అసమ వివాహం, ముసలిపులిలో మానవత్వం మృగ్యం. తన మానసిక దౌర్బల్యాన్ని అధిగమించి, భౌతిక ఆవరణంలోని, మానవత్వపు ఛాయల్ని వెతుక్కొని, కొంతలో కొంత జీవితానికి ఆశాభావాన్ని కల్గించుకొని, నడుచుకొన్న పాత్రగా మెటిల్డా తీర్చబడింది. మెటిల్డా గడపదాటి వీధిలోకి వెళ్ళదు. వీధి అంటే లోకం, లోకమంటే అడవి. తనకు అక్కడ భద్రత లేదు. నోటికి చిక్కిన లేడి పిల్లలా మారింది. ఇది తెలిసిన పీడ, తెలియని పీడే భయంకరం. అది పరిసరాలలోనిది, అప్రేరితం.

మూషిక మార్జాల కథలో వలె, రాజును చుట్టి ముట్టిన శత్రువులో భేదోపాయం సృష్టించి, శత్రువును మిత్రున్ని చేసుకొని ఆపద నుంచి, తప్పించుకొన తీరున, మెటిల్డా పుట్టినింటి నిస్సహాయత, మెట్టినింటి దాష్టికమూ, ఆడపడుచుల దెప్పి పొడుపులు, ముసురుకొన్న ఆవరణంలో, విద్యార్థులనే మార్చే అవకాశం తటాలున తట్టింది. ఆలస్యం చేయకయే ఉత్తరం ద్వారా వారిలో మానవత్వాన్ని, ప్రజాస్వామిక భావాన్ని వారిలో పురికొల్పి, తన సమస్యకు పరిష్కారాన్ని వెతుక్కుంది. దీనిని స్వచేతనతో సాధించుకొంది. ఇది మెటిల్డాలో నిండుకొన్న అంతఃచేతనం. **"నా పెళ్ళాం బహు బుద్ధిమంతురాలు. ఇచ్చిన స్వేచ్ఛనైనా పుచ్చుకోలేదు."** నిజమే మెటిల్డాకు కావల్సింది స్వేచ్ఛకాదు. సంరక్షణ, తనకు వ్యక్తిత్వమే అక్కర్లేదు అన్నంత ఒరిగిపోయి కూర్చుంది. సంరక్షణే ఆమె అంతఃచేతనం. ఇది ఈ పాత్రలోని బౌద్ధిక చేతన, గురజాడ తీర్చిన అంత:గుణం.


నాంచారమ్మ :

**'మీ పేరేమిటి'** కథానికలోని పాత్ర మంచి జ్ఞానవంతురాలు. **"అంతట రావి చెట్టు మాను చాటున గప్పున ఒక వెలుతురు పుట్టించి భీతిల్లారు. నిషాలు దిగజారజొచ్చాయి. వెంటనే మాను వెనుక నుంచి ఒక చేత కరదీపము, రెండవచేత చురకత్తి పుట్టుకొని వుంగరాల జుత్తు గాలికి తూగులేదు. ఆ నిబ్బరంగా అడుగు లేసుకుంటూ వచ్చిన నాంచారమ్మ తన మామగారి పక్కకు నిలిచి, ఆయన రెక్కలు పట్టుకొని వున్న నాయల వంక బాకు మొనజేసి..... యీ పరమ పవిత్రమైన బ్రాహ్మణ్ణి వొదుల్తారా లేదా బాకుకు బలి యిచ్చేదా?"** అని దైవం పేరుతో మానవీయతను మరిచిన, వారి మానసికావరణలో దడ పుట్టించే భౌతిక రూపాన్నే దృశ్యమానం చేసిన నాంచారమ్మ, ధృతిని, బుద్ధికుశలతను వెల్లడి చేస్తుంది. ఈ వేషం. **"రాముడే కాదు ఏ దేవుడి మీదైనా పూర్తి నమ్మకం ఏడిస్తే, ఒక్క గుండమే కాదు, అన్ని కష్టాలు తొలిగిపోతాయి"** అంటూ దైవానికి కృతకత్వాన్ని ఆపాదించి, ఆధ్యాత్మిక పబ్బం గడుపుకొంటున్న ఛాందసులకు బుద్ధి చెప్పడానికి పొట్టివైన గట్టి ప్రశ్నలతో, ప్రతి సవాళ్ళతో మనవాళ్ళయ్యనూ, రామినాయుణ్ణి ఆటకట్టించింది. తద్వారా వాళ్ళ బండారాన్ని బయట పెట్టింది.

నేను (నాంచారమ్మ) మా మామ గారి పేరు స్మరిస్తూ, గుండం తొక్కుతాను. నా వెంట రాగలిగిన వైష్ణవులెవరైనా వుంటే రండి? అంటూ పలికిన ధైర్యవచనాలు ఆమెలోని వాస్తవికమైన స్వప్రయోగిత్వ చైతన్యాన్ని గుర్తుచేస్తాయి. పీరు సాహెబును పిలిచి, పీరు మహత్త్వం వర్ణించి, గుండం తొక్కే పనిని అప్పగించింది. త్రికరణ శుద్ధితో ఏ పనిచేసినా, దైవం అనుకూలిస్తుందనే సత్య చైతన్యాన్ని కల్గించింది. అక్కడి ఛాందసులకు కను విప్పును, సమాజానికి సత్యాన్ని బోధించే, ఆధో బౌద్ధిక జ్ఞాన చైతన్యం ఆమె చేతల్లో ద్విగుణీకృతమైంది.

కష్టసాధ్యాన్ని సరళతరం చేసిన సంతోషంతో నాంచారమ్మ కరదీపం తిరిగి చేతపూని, యింటికి విలాసంగా నడిచి వెళుతుండగా పెనిమిటి ఎదురైనప్పుడు ప్రేమ, వాత్సల్యపూరిత దృష్టిని చూపిందే తప్ప పరిహాస మాడలేదు. ఈ సన్నివేశం ఆమెలోని మానసికావరణ చైతన్యం ఆమెలోని స్థిత ప్రజ్ఞత్వాన్ని చాటుతాయి. **"కథాస్థలంలో ఒక మెరుపు మెరిసినంతసేపే నిలిచి ఉన్న ప్రతి క్షణమూ, హృదయ స్పందనను మరియు ద్రుతి కల్గించిన కార్యశూరురాలు నాంచారమ్మ"**

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8  హైదరాబాద్ జూన్ : 2025




అని కె.వి.రమణారెడ్డి ప్రశంసలు కురిపించాడు. (మహోదయం -355)

అప్పారావు సృష్టించిన స్త్రీ పాత్రలలో నాంచారమ్మ విశిష్టమైన స్థానానికి అర్హురాలు. అధ్యాత్మికతలోని మూఢభక్తిని ప్రశ్నించి, త్రికరణశుద్ధిని ఎరుక పరచిన పాత్ర నాంచారమ్మ. శుష్క మత వాదులు, సిద్ధాంతులు, కుహనా భక్తులను ఎదిరించి, మానవీయతను ఎరుకపరిచి, మత వైషమ్యాలను బట్ట బయలు చేసిన చైతన్య రూపిక నాంచారమ్మ పాత్ర.

**సరళ :**

ప్రాపంచిక జ్ఞానం మెండుగా నిలిచి వెలిగిన పాత్ర సరళ. అందాలరాసి, ఆమె మనో విగ్రహంలో ఏ క్రూరత్వం పొడసూపదు. ఉదారతా జనకమైన ఆమె సౌందర్యం నిర్మలానందమయం. ఆమె దస్తూరి ముత్యాల సరాలుగా ఉంటుంది. స్త్రీకి, అందునా భోగస్త్రీకి వివాహమే విముక్తి అనేది సంస్కర్తల ఆలోచన. వాస్తవికంగా స్త్రీకి కుటుంబ జీవనమే గిడస బారిపోయి, పురుషాధిపత్యంలో నలిగిపోతూంటే, కుటుంబ జీవితానికి దూరంగా ఉన్న స్త్రీకి పెళ్ళిని, పరిష్కారంగా ప్రతిపాదించడం లోని అనౌచిత్యాన్ని సరళ పాత్ర ప్రశ్నిస్తుంది. ఈ ప్రశ్నలోని ఆమె ప్రాంపంచిక జ్ఞాన చైతన్యం ద్విగుణీకృతమౌతుంది. సమస్యలకు, పరిష్కారాలకు పొంతన లేకుండా నడిచే ఉద్యమాల పట్ల గురజాడ చూపిన పాత్ర చైతన్యమే సరళ సృష్టి. వేశ్యా సమస్యను నీతి సమస్యగా చూస్తూ, దానికున్న సామాజిక మానవీయ పార్శ్వాలను విస్మరించిన, నాటి సంస్కర్తల వైఖర్లను ఖండించేవి సరళ ఆలోచనలు. సమాజంలోని మానసిక, భౌతిక, బౌద్ధిక ఆవరణల్లోని సమస్యలు, పరిష్కారాలను వాస్తవిక దృష్టితో చూసే చూపుగల పాత్రే సరళ.

గురజాడ కథానికల్లోని స్త్రీ పాత్రలు చదువుకొన్న మధ్యతరగతికి చెందిన వాళ్ళు. కమిలిని, నాంచారమ్మ, సరళ ఈ ముగ్గురూ తమదైన తీరులో పురుషస్వామ్య వ్యవస్థను ప్రశ్నించారు, నిలదీశారు. ఇటు కుటుంబమూ, ఆటు మతమూ పురుషుల పెత్తనంలోపడి ఆధిపత్య సంస్థలుగా మారిన దశలో కమిలిని -భర్తనూ, నాంచారమ్మ - మతపెద్దలనూ, సాత్వికంగానూ, వీరోచితంగాను ఎదురించారు. సరళ ఆసభ్యంగా మారిన పురుష ప్రపంచాన్ని తెలివిగా ప్రశ్నించి, నోరు మూయించింది. ఈ పాత్రలు అచ్చమైన సాంఘిక పాత్రలు. ఇవి పురాణ ప్రబంధ పాత్రలు కావు. చైతన్యశీలం గలవి. ఇవి సమాజ వికాసానికి దోహదకారులుగా నిలిచేవి. గురజాడ స్త్రీ పాత్రలు, కన్యాశుల్కం నాటకంలోని స్త్రీ పాత్రలు సచ్ఛీలం, అమాకత్వం గలవి. ఇవి రెండు రకాలుగా గోచరిస్తవి. అవి- ప్రత్యక్షమైనవిగా మధురవాణి, బుచ్చమ్మ, మీనాక్షి, వెంకమ్మ, పూటకూళ్ళమ్మలు కనిపిస్తారు. అప్రత్యక్షమైనదిగా 'సుబ్బమ్మ' గోచరిస్తుంది.

**మధురవాణి :**

మానవత్వం మూర్తి కట్టిన స్త్రీ పాత్ర- మధురవాణి. ఆమె వృత్తి నిబద్ధతకు, నీతి నిజాయితీకి నిలువెత్తు సాక్ష్యం. ఈ పాత్ర నాటకంలోకి ప్రవేశిస్తూనే రామప్పంతులుతో **"మొగవాడికయినా ఆడదానికయినా నీతి ఉండాలి..., సాని దానికి మాత్రం నీతి ఉండొద్దా.. ఆయన వైదికయితే నేమి, కిరస్తానం మనిషైతేనేమి పూటకూళమ్మని ఉంచుకుంటేనేమి, నన్ను యిన్నాళ్ళు ఆ మహారాజు పోషించారు కాదా? అని గిరీశం మీద తనకు నమ్మకం ఉండాలని పలికింది"** ఈ మాటలు ఆమె నీతి నిజాయితికి నిదర్శనాలు. కరటకశాస్త్రి.... **"నిన్ను సంతోష పెట్టడం నా విధి.."** అనగానే బాధపడుతూ.... **"ఆ మాట మీరు శెలవివ్వడం నాకు విచారంగా ఉంది. వృత్తి చేత వేశ్యను గనుక చెయ్యవలసిన చోట ద్రవ్యాకర్షణ చేస్తానుగాని, మధురవాణికి దయాదాక్షిణ్యాలు సున్న అని తలచారా? మీ తోబుట్టువుకు ప్రమాదం వచ్చినప్పుడు నేను డబ్బు ఆశిస్తానా?"** అనే మాటలలో ఆమె వృత్తి నిబద్ధత, మానవత్వపుచైతన్య హృదిమేలుకొంటుంది.

ఈ సంభాషణలు ప్రేక్షకుల హృదిని మిలితిప్పినట్లు రసోద్భవాన్ని కల్గిస్తాయి. ఇదే నిజమైన మానసికోద్రేక చైతన్యం.

మధురవాణి ఎప్పుడూ తలవంచుకునే పని చెయ్యదు. పూటకూళ్ళమ్మ గిరీశం కోసం వచ్చి ఎక్కడ దాచావేమిటి? అంటే.... మధురవాణి నాకు దాచడం ఖర్మవేమి? నా యింటికొచ్చేవాడు మహారాజులాగా పబ్లిగ్గా వస్తాడు అంటుంది. కరటకశాస్త్రితో..... **"నా దగ్గరకు వచ్చినవాడల్లా చెడిపోయినాడో?"**... అని సవాలు విసురుతుంది. రామప్పంతుల్ని వేలిమీద ఆడిస్తుంది. లొంగి చాకిరీ చేయదు. (మాటలు నేర్చిన శునకంగా ఈసడిస్తుంది)

మీనాక్షి విషయంలో రామప్పంతులతో.... **"ఏం కులం తక్కువా, రూపం తక్కువా, ఈమె బ్రతుకు భ్రష్టు చేయనే చేశావు...... పెళ్ళి చేసుకొంటే సరి!"** అని తీర్పు చెప్పగలిగింది. కన్యాశుల్కం నాటకంలోని ఆయాసన్నివేశాలు మధురవాణి పాత్ర ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవ చైతన్యాలను ప్రేక్షకుడి ముందు దృశ్యమానం చేస్తాయి. కార్యం చక్కబెట్టడానికి సౌజన్యరావును పురుషవేషంలో కలిసిన సన్నివేశాలు, మధురవాణి పాత్ర సత్ప్రవర్తనకు గీటురాయిగా నిలుస్తాయి. తన ఆలోచన, ఆదరణతో లుబ్ధావధాన్లను రక్షిస్తుంది.

సౌజన్యరావు పంతులు ఇంతకాలం రక్షించుకుంటూ వచ్చిన యాంటినాచ్ లక్షణాన్ని కాపాడుతూనే తన వృత్తి నిబద్ధతను తెలుతుంది. **"నువ్వు చాలా మంచిదానవు ఈ వృత్తి మానలేవో అంటాడు"** అనే సౌజన్యరావు మాటలు ఆ పాత్ర సచ్ఛీలమైన ప్రవర్తనను, పాఠకులలో స్ఫురింపచేస్తాయి. నీచపు వృత్తిలో కొనసాగి నప్పటికిని ప్రవృత్తిపరంగా, ప్రవర్తనపరంగా ప్రగతి వికాస భావాలు నిండుగా పరుచుకొన్న పాత్ర మధురవాణి.

**"మధురవాణిని డెవిల్ అంటివే, నీవే డెవిల్. ఆమె నీ అయోగ్యతను నొక్కి అడగిగితే గాని చెప్పిందికాదు. ఒక సత్యకాలపు బ్రాహ్మణుడిని కాపాడటమే గాక దుర్మార్గుడివైన నీచేతిలో పడకుండా బుచ్చమ్మను కాపాడింది. నాకు మహోపకారం చేసింది. కావున నా సంతోషాన్ని తెలుపుటకు (యాంటినాచ్ వివాదాన్ని పక్కకు నెట్టి) ఇదిగో ఆమెకు షేక్ హ్యాండ్ ఇస్తున్నాను"** అనే సౌజన్యరావు స్వగతపు మాటలు మధురవాణి సచ్ఛీలత చైతన్యాన్నికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తాయి. మానవత్వం మూర్తి కట్టిన స్త్రీ పాత్ర– మధురవాణి. ఈ పాత్రలో బహుముఖీనమైన చైతన్యం కలగలిసి వెలిగిన పాత్ర. రసజ్ఞతలోనూ నీతి, మంత్రాంగంలోనూ, వ్యవహార దక్షితలోనూ, మన్ననలోనూ, వ్యక్తి గౌరవం, మాటకారితనంలో మార్మికురాలు మధురవాణి. ఆత్మవిశ్వాసం, ఆత్మగౌరవం నిండుగా నిలుపుకొని మసులకొన్న మానవతావాది మధురవాణి సకల కార్యాలను చక్కదిద్దగల నిపుణత్వం ఈమెలో ప్రతిఫలిస్తుంది.

**వెంకమ్మ :**


పాపపుణ్యాలు ఎరగని అమాయకపు నిస్సహాయురాలు. భర్త నిరంకుశ స్వభావానికి లోబడి నలిగిపోయిన సామాన్య గృహిణి, బాల వితంతువై అఘోరిస్తూ ఉన్న తన పెద్దకుమార్తె బుచ్చమ్మ. అవస్థకు తల్లిడిల్లిపోతుంది. తన భర్త, రెండవ కుమార్తెకు వయస్సు మళ్ళిన వ్యక్తితో పెళ్ళికోసం శుల్కం స్వీకరించడాన్ని జీర్ణించు కోలేకపోతుంది.

వెంకమ్మ తన సోదరుడు కరటకశాస్త్రితో... **"అన్నయ్యా ! యీ సమ్మంధం చేస్తే, నేన్నుయ్యో గొయ్యో చూసుకుంటాను. ఆయనికి యెంత యీడొచ్చినా కష్టసుఖం వొ ళ్ళ నాటక, యీ దౌర్భాగ్యపు సమ్మంధం కల్పించుకొచ్చారు. నేను బతికే బాగుండాలంటే యీ సమ్మంధం తప్పించు"** అని బ్రతిమాలాడంలోని, హృదయ మార్ధవ చైతన్యం ఎరుకలోకి వస్తుంది. పసిపిల్లల్ని వయస్సు మీరిన వారికిచ్చి వివాహం చేయడం సముచితం కాదనే చైతన్యాన్ని కల్గించిన పాత్రగా వెంకమ్మ దర్శనమిస్తుంది.

కరటక శాస్త్రి సాగించిన మత్రాంగంలో లుబ్ధావధాన్ల ఏకరాత్రి పెళ్ళితతంగంలో, వెంకమ్మ వెలిగించిన చైతన్య తుది రూప ఫలితమే సుబ్బి పెళ్ళి నిలిచిపోయేలా చేసింది. వెంకమ్మ నిశ్శబ్ద చైతన్యం కరటక శాస్త్రి ద్వారా వికాస చైతన్యంగా ఫలిచింది. ఎంతటి నిరంకుశ కుటుంబ వాతావరణంలో ఇమిడినప్పటికిని తన సహజ చైతన్యాన్ని రగిలించుకొని, సమస్య పరిష్కారానికి ఇతర పురుష పాత్రల్ని ఉసిగొల్పి సమస్యను పరిష్కరించుకొన్న చైతన్యాన్ని ప్రదర్శించింది.

**బుచ్చమ్మ :**

తన వారికోసం ఏ విధమైన త్యాగము చేయడానికైనా సిద్ధమైన యువతి, బాల వితంతువు అమాయకపు జీవి బుచ్చమ్మ పాత్ర. **"ఇంత సింప్లిసిటీ ఎక్కడా కానలేదు. దీనికి లవ్ సిగ్నల్స్ రామ రామా ఏమి తెలియవు. చమత్కారం మాటలు అడిగే ఏమిన్న అర్థం చేసుకోలేక ఆ లేడికళ్ళతో తెల్లబోయి చూస్తుంది".** ఈ పాత్ర అమాయకత్వం ఈ గిరీశం మాటల్లో మనకు బోధపడుతుంది. డబ్బు ఆశతో, తన తండ్రి శు




ల్కంపుచ్చుకొని, తన చెల్లికి వయస్సు మల్లిన వాడికిచ్చి పెళ్లి చేయడాన్ని నిరసిస్తుంది. నాన్న తమ్ముడికి పెళ్ళి చేయాలంటే నా సొమ్ము పెట్టి చేయండి. కాని దీని కొంపముంచి లుబ్ధావదాన్లకు ఇవ్వొద్దని, నిరంకుశుడైన తండ్రికి సలహా ఇచ్చే చైతన్యాన్ని ప్రదర్శిస్తుంది. తన చెల్లి సుబ్బమ్మకు ముసలివాడితో పెళ్ళి చేయడం, ఇష్టం లేకపోవడంతో ఆ పెళ్ళిని నిలుపుదల చేయడం కోసం తను సమిధగా మారి సమస్యను పరిష్కరించే క్రతువులో పాలు పంచుకుంటుంది. ఈ పాత్రసృష్టిలో క్రమోన్మీలనం గోచరిస్తుంది. మొదట అతి అమాయకంగా కన్పించే బుచ్చమ్మ, క్రమంగా వికాసాన్ని పొందింది. చెల్లి పెళ్ళి తప్పించటమే లక్ష్యంగా కదిలింది. ఇది ఈ పాత్రలోని అనూహ్యమైన చైతన్య వీచిక.

**మీనాక్షి, పూటకుళ్ళమ్మ** పాత్రల సృజనలో నకారాత్మక ఛాయలు గోచరిస్తాయి. గురజాడకి సంఘ దురాచారాలు మీద ఉన్న ఏహ్యత్వం, దానికి బలైనపోయిన స్త్రీల మీద జాలి కలగలిసి ఈ రెండు పాత్రలు పురుడుపోసుకొన్నట్లు గోచరిస్తుంది. ఈ పాత్రలు అపసవ్యమార్గంలో పయనించడానికి వాళ్లు బాధ్యులుకాదు. సంఘంలోని కఠోరమైన ఆచారాలు, ప్రతిబద్ధకాలై, బలితీసుకొన్నవి. వాటిని రూపుమాపే ఉద్దేశ్యమే ఈ నకారాత్మక పాత్రల

సృష్టి. గురజాడ తీర్చిన పురుష పాత్రల కంటే స్త్రీ పాత్రల ఔన్నత్యం, వాటి చిత్రణలో గాఢత్వం కన్పిస్తుంది.

దిద్దుబాటు– కమిలిని, మెటిల్డా(నాయిక), సంస్కర్తహృదయం – సరళ, కన్యాశుల్కం – మధురవాణి, మీ పేరేమిటి– నాంచారమ్మ లాంటి స్త్రీ పాత్రలు సమాజం పట్ల, తమ సమస్యల పట్ల, మనిషి విద్యుక్త ధర్మాల పట్ల, వారికి ఉన్న అవగాహన, ఆత్మవిశ్వాసం అసామాన్యమైనది. చైతన్య పుంజితాలు. అవి ప్రజాస్వామిక స్పందనలు. సమాజ వికాస దోహదకారులుగా పాత్రలు నిలుస్తాయి.

సామాజిక కట్టుబాట్లలోను, కట్టుబాట్ల పేర సంకెళ్ళల్లో ఇరుక్కొన్న భారతీయ స్త్రీని, గురజాడ తన ఆధునిక దృక్పథంతో దర్శించి, సంకెళ్ళు తెంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేశాడు. స్త్రీ తను పోగొట్టుకున్న వ్యక్తిత్వాన్ని, ఆధునిక విద్యా ద్వారా పొందవచ్చునని కోరుకొన్నాడు. తద్వారా పరిపూర్ణమైన భారతీయ నారీమణిని కలగన్నాడు. స్త్రీ సమాజం పట్ల శాస్త్రీయ దృష్టిని ఏర్పర్చుకోవాలని పురుష సమాజానికి ప్రబోధించాడు. ఆయన ఆధునిక భారతీయ మహిళను తన సాహితీ సృజన ద్వారా రూపుకట్టించాడు. వారిలోకూడా చైతన్య పూరితమైన, జనహితమైన బౌద్ధిక, మానసిక, భౌతిక ఆవరణలుంటాయని సమాజానికి గుర్తు చేశాడు గురజాడ.

'ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు' అనే ఆభాణకాన్ని సార్థకం చేస్తూ, మహిళా పాత్రలను తీర్చి, ఆధునిక ప్రజాస్వామిక భావాలను వారి ద్వారా చైతన్య రూపంలో సమాజం ముందు నిలిపాడు. ప్రతిఫలంగా ఇల్లాలి చదువు ఇంటికి కాదు, జగతికి వెలుగు అన్నంత చైతన్యాన్ని ఆ స్త్రీ పాత్రలో నింపాడు గురజాడ.

స్త్రీల ఆత్మరక్షణకోసం ప్రతిఘటన స్ఫూర్తి కన్యక, సౌదామిని పాత్రలు.

మత మౌఢ్యాల ఖండన – దేవుడు చేసిన మనుషుల్లారా, మనుషుల చేసిన దేవుల్లారాలోని నాంచారమ్మ పాత్ర.

వేశ్యా వ్యామోహ ఎగతాళి. స్త్రీ విద్యకు ప్రోత్సాహం కమిలిని పాత్ర.

వేశ్యా వివాహ ప్రతిపాదన సరళ, మధురవాణి పాత్రలు.

వితంతు వివాహాలకు ప్రోత్సాహం బుచ్చమ్మ పార్వతి (కొండుభట్టీయం) పాత్రలు.

అసమ వివాహ నిరసన – పూర్ణమ్మ, మెటిల్డా పాత్రలు. నకారాత్మక ఛాయలున్న అంతఃచేతనం వీటి సొంతం.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ప్రగతిత్రయం – మాదిరాజు రంగారావు
2. తెలుగు సాహిత్యంలో చర్చనీయాంశాలు – జి.వి. సుబ్రహ్మణ్యం
3. స్త్రీవాద కళలు స్త్రీల జీవిత చిత్రణ – ఎ. సీతారత్నం.
4. తెలుగు సాహిత్యంలో మహిళాభ్యుదయం – తేళ్ళ సత్యవతి.
5. మహిళాభ్యుదయం – తెలుగు అకాడమి.
6. తెలుగులో కవితా విప్లవాలు – వెల్చేరు నారాయణరావు.
7. మహోదయం – కె.వి. రమణారెడ్డి.
8. మహాభారతం మానవ స్వభావ చిత్రణ –వెంకట సుబ్బారావు.
9. గురజాడ రచనలు – విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్.

❖ ❖ ❖ ❖ ❖

# బందీలు

**డా. ముత్యంపేట గంగాధర్**
**ఫోన్ : 97041 18352**

పురివిప్పిన నెమళ్ళు
నేటితో ముడుచుకొని
పేమెంట్ బస్సుల్లో
కన్నుల పుప్పొడి రాల్చుతూ
సంకెళ్ల సంగీత స్వరం వినిపిస్తాయి.

బంధ విముక్తులై స్వేచ్ఛగా
విహరించిన రోజులు
నేటితో సమాప్తం.
నరకం అనిపించినా
భవిష్యత్ స్వర్గ ద్వారాలకు
రేపటితో ఆరంభం.

చదువు బిడ్డలకు సంబరాలు
మందబుద్ధులకు బద్ధకాలు
అందర్నీ జోడించే ఒజ్జల పాట్లు.
ప్రైవేటోళ్లకు పాత వసూళ్ళు
గవర్నమెంటోళ్ళకు గస్తీలు.

సెల్ ఫోన్‌లో నిన్నటి దాకా
నాన్చిన ముఖ ప్రతిబింబాలు
వారికి ఈరోజు తో మళ్లీ
ప్రారంభించాలి అక్షర వనానికై
బోధన స్తంభాలు.

వసతి గృహాలకు...వసివాడని
ప్రేమ బంధాలను ఇనుపెట్టెల్లో మూటగట్టుకుని...
సకల కుశలాలు చెప్పుకుంటూ
కొత్త అనుబంధాల ఆరాటాలకై
బండెడు బాధతో కన్నవారలను,



తోబుట్టువులను వదిలి
పొంగి వస్తున్న దుఃఖాన్ని
హృదయపొరల్లో ఆపుకుంటూ
రేపటి నవోదయానికి
కదం తొక్కిన విద్యార్థులు..!


ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8 57 హైదరాబాద్ జూన్ : 2025

# తెలంగాణ పల్లె బతుకు ముఖచిత్రం 'బర్కతి' కథలు

బైరెడ్డి కృష్ణారెడ్డి

**'బర్కతి'** పేరున సాగర్ల సత్తయ్య వెలువరించిన కథలు ఆయన మెదడులో మెరిసిన ఊహాజనితాలు కావు. నేలవిడిచిన భ్రమల వీథుల్లో విహరింపజేసే కట్టుకథలూ కావు. కళ్ళముందు కదలాడుతున్న మనుషులు అనబడే నిర్జీవ స్వరూపాల సజీవ చిత్రలేఖనలు. తరాలు మారినా మారని తెలంగాణ గ్రామాల అణగారిన బతుకుల నిజ స్వరూపాలు. కడుపులో దేవినట్టె దగ్గరికి చేరదీసి కౌగిట చేర్చుకొని ఓదార్చుకోవాలెనని అనిపింపజేసే, ఎలుగెత్తి ఆక్రందిస్తున్న ఆర్త గొంతుకల వినబడని ధునులు. శాస్త్ర సాంకేతిక ప్రగతి ఆకాశపు అంచులు దాటి శరవేగంగా పరుగులు తీస్తున్న ఆధునిక యుగంలో కూడా సనాతన కాలపు మూఢనమ్మకాల వారసత్వానికి బలౌతున్న గ్రామీణ బతుకుల ముఖచిత్రాలు.

**బర్కతి**
డా. సాగర్ల సత్తయ్య
పేజీలు : 120
వెల : 135 రూ.
ప్రతులకు : రచయిత
7989117415




మూఢనమ్మకాలకు బలైన ఒక కుటుంబ దుస్థితే 'బర్కతి' అనే కథకు ప్రధాన భూమిక. గొర్ల కాసిన వీరయ్య ఒకరిద్దరికి కొలుపులు చెప్పడం మొదలుపెట్టి, పేరుమోసిన గుళ్ళకు సొంత కారు కట్టుకొని వెళ్ళడం, కొలుపులకు వంతపాడడానికి పదిమంది కిరాయి వంది మాగధుల్ని వెంటేసుకోవడం, కస్టమర్లకు విజిటింగ్ కార్డులు కూడా ఇచ్చే వరకు సునాయాసంగా ఎదగడం ఒక వైపు, కౌలుకు తీసుకుని చేసిన సేద్యం అప్పులపాలు చేస్తే ఎల్లమ్మ పండగ బర్కతిస్తదని, ఒగ్గోళ్ళతో కుమ్మక్కైన వీరయ్య ఉచ్చుల్ల చిక్కి మరో లక్ష రూపాయల అప్పుల పాలైన మల్లమ్మ మరొక వైపు, దగుల్బాజీతనాన్ని అమాయకత్వాన్ని బహిర్గతం చేసి అత్యంత సహజంగ నడిపిన కథనం **'బర్కతి'.**

**'తశ్వ'** అనే కథలో పాత్రలు, పాత్రధారులు, వేషధారణలు మారినాయే తప్ప, అదే అదే హిపోక్రసీ, అదే దగా. తప్ప తాగి దెబ్బలుకొడితే అమ్మగారింటికి పోయిన పెళ్ళాన్ని తిరిగి తెచ్చుకోడానికి పంచాయితీ ఊబిలోనికి దిగిన పరశురాములు బేలతనానికి, అతని సంచారజాతికే చెందిన పెద్దమనుషుల తినుడు తాగుడుకు ఖర్చుల కోసం ఇరువైపుల కుటుంబాల్ని అప్పుల పాల్జేసిన దాష్టీకానికి మధ్యన సాగే నీచ సంప్రదాయాల వాస్తవిక చిత్రణ ఇది.

రెండెడ్లను కొనుక్కొని పత్తి సాగుచేద్దామని అనుకున్న రైతు యాదగిరి, అతడిని తప్పుదారి పట్టించి దగ్గర తీసి అప్పులిచ్చి, తీరా పంట చేతికొచ్చినంక అడ్డికి పావుశేరు చొప్పున తూకమేసుకొని పోయిన రఘునాథంల కథ **'ఎన్నుగర్ర'** కూడ ఈ క్రమంలో రూపుదిద్దు కున్నదే. అడవిల తోడేళ్ళను తరిమి కొట్టినోన్ని, ఈ దళారీ తొడేళ్ళ నుంచి తప్పించుకోలేకపోతిని కదా! అని దుఃఖం పూడుకుపోతున్న గొంతులోనుంచి మాట పెకలని గొల్ల రాజమల్లు కథ **'తోడేళ్ళు.'**

కోడలు మరుగు మందు పెట్టిందని వేల రూపాయలు కుమ్మరించి కక్కబోయించడానికి పోతే, ఎప్పుడో పెద్దైనంక నెలెల్లక తోలగ అత్తగారింటికి పోయినప్పుడు, కొడుక్కి మాంసంల మందు కలిపి తినిపించినారని నమ్మబలికి, తాపించి, కక్కించిన వసరుల నాటువైద్యుడు దొంగచాటుగ మునగచెట్టు బంక ఉండల్ని కలిపించి మాంసం ముద్దలని నమ్మబలక చూపిన కథ **'మరుగు మందు'** ఇందుకు మరో ఉదాహరణ.

మాయగాల్ల చేతుల్ల దగా పడడానికి అమాయక జనం తమకు తాముగా ముందుగానే సిద్ధమై ఉంటరా, లేక హిపోక్రటిక్ మాయాజాలపు హిప్నాటిక్ ఎఫెక్ట్ ఉచ్చులో చిక్కుకున్న పిదపనే వాళ్ళ మంత్రదండపు మాయదారి బాటెంట మెడకు గొలుసు తగిలించిన కుక్కపిల్లలోలె వెంటపడి పోతరా? రచయిత తానుగా తలదూర్చి వ్యాఖ్యానించకుండానే చెప్పకనే చెబుతున్న ఈ ముడి విడివడని చిక్కు ప్రశ్నల అబ్బురానికి ఈ కథలు నిలువుటద్దాలు.

**"ఇదివరకంటె పెండ్లికైన, రతానికైన పిలిచేటోల్లు. గిప్పుడన్నీ బ్యాండులేనాయె. నన్ను ఎవలన్న గాంతుండ్రా. సస్తె సావుడప్పు. నా దగ్గెర చెప్పు కుట్టించుకుంటోడు కూడ లేకపాయె."** అంటూ మాదిగ చంద్రయ్య వాపోతడు. **"నా కుమ్మరాము ఎప్పుడో కూలిపోయె. ఇప్పుడు అవిరేండ్లు కూడ మోటైనై. తలగోరు కుండకు తప్ప నా దగ్గర్కొస్తోడే లేకపాయె. సారె మూలకేసి కూలినాలికి పోతున్న సూస్తలేరా."** ఇది కుమ్మరి మారయ్య గోదు. కులవృత్తుల మీద ఆధారపడిన బతుకుల దుస్థితికి మూలం పలు రంగాల్లో అనివార్యంగా చొచ్చుకు వొచ్చిన కడుపులుగొట్టే ముదనష్టపు ప్రగతి అని వేలెత్తి చూపుతూనే, అవి మన సంస్కృతి మూలాలను మట్టుపెడుతున్న వైనాన్ని అంతర్లీనంగా సూచిసున్న కథ **'ఊర బోనాలు'.**

ఊరి జనం కులాల పట్టింపు లేకుంట వరసలు పెట్టుకొని కలివిడిగ పిలుచుకునే పగిది చూడచక్కదనమే. మరి అవే దేవతలకు, అవే బోనాల తంతులకు మాలమాదిగలకు వేరే, ఇతర కులాలకు వేరే గుడులు ఎందుకని పదిహేనేళ్ళ పట్నం పిల్లవాని చేత అడిగించి, సమాధానంగా **"అది తరాలనుంచి వొస్తున్నది ఇయ్యాల కొత్తేమీ కాదు"** అని సరిపెట్టజూస్తున్న అమ్మమ్మ కప్పదాటు ముసుగును బట్టబయలుచేసి, ఆమూలాగ్రంగా తనను తాను సంస్కరించుకోలేక పోతున్న అగ్రకుల వ్యవస్థపైన రచయిత ఘాటైన ప్రశ్నొకటి గురిపెట్టడం ఈ కథ అసలు లక్ష్యం.

పురుషాహంకార సమాజంలో తన కాళ్ళ మీద తాను నిలబడడానికి ఎటువంటి కష్టాలను ఓర్చుకోనైనా ఆడపిల్లల్ని చదివించాల్సిన అవసరాన్ని ప్రబోధించే కనువిప్పు కథ **'పరిష్కారం'.** అప్పటికే ఉద్యోగం చేస్తూ ఉండి, పెళ్ళై, దాంపత్యం పొసగక భర్తల అహంభావాల్ని ఎదిరించి విడిపోతున్న స్త్రీల కథలు మామూలే. అర్థాంతరంగా చదువు మాన్పించి, బలవంతంగా ఒక దుర్మార్గునికి అంటగడితే గోప్యంగా చదువు కొనసాగిస్తూనే వానితో తెగతెంపులు చేసుకొని జీవితంలో స్థిరపడడానికి సమాయత్తమౌతున్న సరిత తిరుగుబాటు నేటి స్త్రీ జీవన ప్రవంతిలో ఒక యూటర్న్ విశేషం.

ఈ కథలన్నీ ఒక ఎత్తైతే **'గౌరీ'** ఒక భిన్నమైన ఇతివృత్తాన్ని, శిల్ప వైవిధ్యాన్ని సంతరించుకున్న కథ. ఊరవతల నిర్జన ప్రాంతంలో దొరికిన పసికందును ఏ పెద్ద మనసో పెంపకం చేసినా, వూరువూరంతటికి దత్తుగొన్న బిడ్డైపోయిన వైనం ఆధునికత అంటు సోకని మారుమూల గ్రామాల్లో చెక్కుచెదరని నిష్కళంక ప్రేమకు మచ్చుతునక. ఆ బిడ్డను ఒకయ్య చేతుల పెట్టి సాగనంపే తంతులో పుట్టెడు దుఃఖాన్ని దిగమింగుకొని ఊరువాడంతా తోరణాలతో ముస్తాబు చేసి ఒక పండగ వాతావరణాన్ని సృష్టించడం కళ్ళను చెమర్చే సందర్భం.

తరతరాల తెలంగాణా జీవన సంస్కృతికి ఆలవాలం అయ్యుండి నేడు కనుమరుగౌతున్న పదజాలాల్నీ, నుడికారాల్నీ, నానుడుల్నీ పునఃప్రతిష్టిస్తున్నాడు సాగర్ల. బక్కోబడుగో, దబ్బున, జగిట్ల, సుతలాయించుకొని, బర్కతి, పబ్బతి, గొడ్డుగోద, గొడ్డుకష్టం, తానికి, ఎతశిత, ఈగురం, అల్కగ, నకిరంబట్టి, అంబటాల్ల, అర్సుకున్నంక, బల్కరంగ, ఏగలేను, ఈతాప, ఎగేసుకొని, సర్సుడు, నలింపు జేసుడు, పెడసరం, అడ్డికి పావుశేరు, మొండిమొదలారింది, ఎగబడిపోత, అడిగాయ బుడిగాయ మాటలు, కానిపోని రోజులొచ్చినై, వైనం సొప్పున, రంది జొరవద్దది, మనకున్నది ఒక్క నలుసు, దిష్టి తాకిందంటే దిగదాగిందంటరు, పైసలు చెట్లకు గాస్తున్నయా, దూప అయినప్పుడే బాయి తవ్వుకున్నట్టు ఉంది, ముందల మురిసినమ్మ పండగ గుర్తెరుగదట, వంటి వ్యక్తీకరణలు ఈ కథల్లో కోకొల్లలు. ఇంకా, తెలంగాణా జీవన సౌందర్యపు సహజత్వానికి అద్దం పట్టే సున్నితమైన హాస్యోక్తులు ఈ సంపుటిలో విరివిగా కనిపిస్తాయి.

రచయిత తానే ముగింపు తేల్చేయకుండా పాఠకునికి వదిలేసినా సరే, ఎంచుకున్న వస్తువును ఒక క్లైమాక్స్ స్థాయికి తీసుకొనిపోయి గ్రాఫ్ గమనాన్ని ఒక సహేతుకమైన ముగింపుకు తేవడం కవితకైనా, కథకైనా, నవలకైనా పరమార్థం. క్లైమాక్స్, దాని కంక్లూజన్ మధ్యన పొంతన సాధించలేకపోవడాన్ని డైకాటమీ బిట్వీన్ క్రైసిస్ అండ్ రిజల్యూషన్ అంటాడు ప్రొఫెసర్ సత్యనారాయణ్ సింఘ్ భారతీయాంగ్ల రచయిత ఆర్కే నారాయణ్ రచన 'ద గైడ్' అనే ప్రసిద్ధ నవలను ఉటంకిస్తూ. ఈ సంపుటిలోని కొన్ని కథల్లో ఆ డైకాటమీ కనిపిస్తుంది.

సోషల్ మర్డర్ అనే కథలో కేన్సర్ వ్యాధికి గురైన ఒక తెలివైన విద్యార్థిని ప్రాణాల్ని కాపాడడానికి అదే గ్రామానికి చెందిన ఒక మానవీయ సామాజిక కార్యకర్త పూనుకున్న చర్య పాఠకున్ని కృతజ్ఞతాభావంతో కదిలిస్తుంది. తనవూరి మిత్రునితో ఫోన్లో మాట్లాడినప్పుడు, అమ్మాయి తండ్రితో గొప్ప సాన్నిహిత్యం ఉన్నా, సంభాషణలో అతను స్పందించిన తీరు, వాట్సాప్ చూసుకోడంలో తాత్సారం, నాలుగు రోజులకే అమ్మాయి చనిపోయిన వార్త కథావస్తు నిర్మితిలో కొంత అసహజతకు దారితీసినాయి. కథనంలో ఏదో మిస్సైనట్టు అనిపిస్తుంది. ఈ హడావిడి ముగింపు ప్రయతానికి పాల్పడకుండా ఉండి ఉంటే, కథ ఎత్తుగడ నుంచి క్లైమాక్స్ వరకూ సాగిన తీవ్రతని ముగింపులో కూడా కంటైన్ చేసి కథనంలో సాంద్రంగానూ, సహజతనూ సాదించగలిగే వాడు రచయిత. ఊపిరి సలపనీయనంత సహజ కథనంతో ఒక ఉచ్చస్థాయికి తీసుకుపోయి ఆత్రంగ ముగించినట్లనిపిస్తుంది.

**'ఊర బోనాలు'** కథలో కూడా మనవడి ప్రశ్నకు అమ్మమ్మ దాటవేతగా ఇచ్చిన సమాధానంలోని ఆంతర్యం బోధపడని మనవడు కేవలం ఒక అయోమయంలో నిద్రలోనికి జారిపోయినట్లు ముగిస్తే క్రైసిస్ మరియు రిసొల్యూషన్ మధ్య పొంతన కుదిరేది. అమ్మమ్మ సమాధానం **'అతనికి తృప్తినివ్వలేదు', 'ఈ వివక్ష ఎందుకు?'** లాంటివి ఆ పాత్ర స్థాయికి మించినవి. నిజానికి ఇక్కడ రచయిత కలగజేసుకుంటున్నడు. అమ్మమ్మ నసిగిన సమాధానం వద్దనే కథను ఆపేసి, ముగింపు డిస్క్రిప్షన్ పాఠకుడికి వదిలేస్తే కథకు నిండుదనం సంప్రాప్తమయ్యేది.

ఒకటీ అరా తప్ప అన్ని కథల్ని ఒక సంభాషణతో మొదలుపెట్టి, వెంటనే టెలిస్కోపిక్ వ్యూ పద్ధతిలో వెనక్కి తిరిగి అసలు కథ నేరేషన్ మొదలు పెట్టడం వల్ల, ఏ కథకాకథలో ఈ శిల్పం రక్తి కట్టించినా, కథలన్నిటిని కలిపి చూసినప్పుడు మూసలో నడుస్తున్నట్లనిపిస్తుంది. రచయిత కథనాల్లోనూ, పాత్రల సంభాషణల్లోనూ ఉట్టిపడిన స్థానిక నుడికారంలో అక్కడక్కడ గ్రాంథిక పదజాలపు తప్పటడుగులు పడకుండా జాగ్రత్తపడితె బాగుండేది. ఇతివృత్తాల్లో పాత్రలుగా తీసుకున్న ప్రతి విద్యార్థినీ క్లాస్ ఫస్ట్ అనడం కూడా కథన వైవిధ్యానికి అడ్డుతగులుతున్నట్టు తోస్తుంది. ఇటువంటివి సూక్ష్మమైన

విషయాలే కొంచెం మెలుకువతో సవరించుకుంటే శిల్పవైవిధ్యాన్ని మెరుగుపరుస్తాయి.

పరిశీలన కోసం ఇక్కడ ఉదహరించిన కథలు కేవలం మచ్చుకు మాత్రమే. నిజానికి ఏ కథకాకథను నిశితంగా చర్చించుకోవాలె. మరుగు మందు, బర్కతి, రాతిగుండెలు వంటి కథల్లో శిల్ప వైచిత్రి, వాక్య నిర్మాణాల్లో గ్రామీణ సొగసు, సంభాషణల్లో నేటివిటీ కనబరచి ఒక పరిణతిని సాధించినాడు సాగర్ల. పాత్రల్లోనికి మాత్రమే కాకుండా, ప్రతి సన్నివేశం లోనికి రచయిత పరకాయ ప్రవేశం చేసిన రీతి కోసం ఏ వాక్యానికావాక్యాన్ని వొలిచి సందర్శించాలె. 'బర్కతి' కథల్లో మరో విశేషం ఏ ఒక్క ఊరి పేరూ కల్పితం కాకపోవడం. అన్ని గ్రామాల్ని ఒకచోట చేర్చితే ఈ సంపుటి మొత్తానికి కథానాయికైనా, కథానాయకుడైనా తెలంగాణా గ్రామీణమే అనిపిస్తుంది. కథా రచయితగా, కవిగా, సాహిత్య విమర్శకుడిగా బహుముఖంగా కొనసాగుతున్న సాగర్ల వ్యాసంగం తెలంగాణా సాహితీ ముఖచిత్రానికి మున్ముందు సరికొత్త హంగుల్ని సమకూర్చుతుంది అనడం నిర్వివాదాంశం.

❖ ❖ ❖ ❖ ❖

# అధివాస్తవికత ఛాయలు కమ్ముకున్న 'రెండు ప్రేమల వాన' కవిత్వం

**బండారి రాజ్ కుమార్,** ఫోన్ : 891 955 6560

సాహిత్యంలో అధివాస్తవికత అనేది ఫ్రెంచ్ కవి, విమర్శకుడు ఆంద్రే బ్రెటన్ **'సర్రియలిస్ట్ మేనిఫెస్టో'** తో ప్రారంభమైనట్లుగా చెబుతారు. చిత్రకళలోనూ, సాహిత్యంలోనూ ఒక ప్రత్యేకతను సంతరించుకొని ఒక సాంస్కృతిక ఉద్యమంగా కొనసాగిన చరిత్ర ఉంది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రాంతం నుండి కవిత్వ సృజన చేస్తున్న 'పాకాల' కవుల్లో ఒకరైన కేతిరెడ్డి యాకూబ్ రెడ్డి **"కొన్ని కలలు, కొన్ని కన్నీళ్లు, ఒక సునామీ"** తో సాహిత్య ప్రపంచానికి సుపరిచితులు. ఇప్పుడు **'రెండు ప్రేమల వాన"** కవిత్వ సంపుటి తో కరచాలనం చేస్తున్నాడు.

యాకూబ్ రెడ్డి కవిత్వంలోని మార్మికత అధివాస్తవికతను (సర్రియలిజం) వాగ్దానం చేస్తోంది. దాదాపు 15 కవితల్లో ఈ ధోరణి కనిపిస్తుంది. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ మొదలుకొని వేగుంట మోహన ప్రసాద్ ఆ తర్వాత ఎమ్మెస్ నాయుడు **'క్రితం తర్వాత'** లోని (అఫ్సర్, ప్రసేన్, కృష్ణుడు, కె. నరసింహా చారి, నీలిమా గోపీచంద్, త్రిపురనేని శ్రీనివాస్) కవుల ప్రభావం యాకూబ్ రెడ్డి కవిత్వం పై ప్రసరించే ఉంటుంది.

**"గది గదంతా దీనంగా/ ఒక శూన్యం వ్యాపిస్తుంది/ చిక్కుబడిన ఆలోచనల దారాలు/ విప్పే ప్రయత్నంలో మరిన్ని ముడులు/ అకస్మాత్తుగా గాలానికి చిక్కుకొని/ విలవిలలాడుతున్న ఆలోచన"** (నీటి బుడగ చిట్లిన చప్పుడు)

ఇక్కడ ఏం చెప్తున్నాడనేది కాదు.. ఎలా చెప్తున్నాడు? అనేది ప్రధానమైనది. కేవలం చెప్పే విధానాన్ని బట్టి కవిత్వ వస్తువు యొక్క మానసిక స్థితిని అంచనా వేయగలం. రూప స్పష్టత ఎలాగూ ఉండదు కాబట్టి దొరక పట్టుకున్న శకలాలతో అల్లుకున్న కథలా ఆద్యంతం ఆసక్తికరంగానూ, సాహసోపేతంగానూ వుండి తీరుతుంది.

**"చీకటి ద్రావకాన్ని/ గొంతులోకి వొంపుకుంటూ/ దిగులు ధ్యానంలో రాత్రి/ చీకటి ద్రవమూ/ రింగులు చుట్టుకుంటూ/ పైకి లేస్తూ కాలుతున్న వేలు/ తమకంతో కాటేసుకుంటాయి"**(అపరిచయం)




ఇక్కడ కవి ఏం చెప్తున్నాడో అర్థం చేసుకోవడం కొంత కష్ట సాధ్యమైన విషయం. అధివాస్తవికత కవిత్వంలోని ప్రతి చిన్న అంశం నైరూప్యమైనదిగానూ ఒక వాక్యానికి మరో వాక్యానికి పొంతన లేనిది గానూ ఉంటూ మొత్తంగా దేన్నో ఘోషిస్తున్నట్టుగా, భ్రమపెట్టే విషయం గానే అర్థం అవుతుంటుంది.

**"ప్రమేయం/ లేకుండానే ప్రపంచం/ లో..నకి దాడి చేస్తుంది/ నా నీడని/ బలవంతంగా నేనే/ ఈడ్చుక పోక తప్పదు"** (కదలని నీడ)

ఫ్రాయిడ్ మనో విశ్లేషణ వాదానికి బలం చేకూర్చేదిగా అనిపిస్తుంటుంది. అచేతన స్థితిలోని అంశాలు (కలల ద్వారా వ్యక్తమయ్యేవి) ఒక ధారలా ప్రవహించినప్పుడు అధివాస్తవికతతో కూడిన కవిత్వం పుడుతుంది. పూర్తిగా మానసికమైనది కావచ్చు. ఎవరితోనూ పంచుకోనిదై ఉండొచ్చు. ఒక రహస్య నిధిలా దాచిపెట్టదగినదైనా అయి ఉండొచ్చు. మొత్తానికి లోతైన గాఢత దీని సొంతం.

**"ఎవరి ధ్యాసలో వాళ్లు మునిగిన ప్రేక్షకులు/ కరతాళ ధ్వనులు నిండిన మట్టికుండల్ని/ మార్మిక నిద్రలో భళ్ళున జారవిడుస్తారు/ ఆదీ అంతమూ లేని నాటకానికి/ అంత సూత్రం కనిపెట్టడానికి/ మెదళ్ల గడ్డాలు తెల్లబడతాయి"** (విలోమరాగం)

**"కవిత్వంలో మానసిక విశృంఖలత పనికిరాదు. కవిత్వం ఒక ఆర్గనైజ్డ్ ఆక్టివిటీ. కంట్రోల్ వదిలేస్తే కవిత్వం దెబ్బతింటుంది"** – ఇస్మాయిల్ (సతీష్ చందర్ కు ఇచ్చిన ఇంటర్వ్యూ నుండి, 18 జనవరి 1988 ఆంధ్రజ్యోతి)

**"చిమ్మ చీకటి వేళ్ల/ వెచ్చని వెలుతుర్ల కింద/ మాట పెగలని/ అనురాగం దగ్ధమవుతుంది/ ఊహల్ని అందుకోలేక /కాళ్లు చతికిలబడతాయి"** (చచ్చిన ఈగలు)

**"ఇక సరియలిజం, పోస్టుమాడ్రనిజం మొదలైన ఇజాలు ఆయా సిద్ధాంతాలు తెలిసిన వారికే – పాశ్చాత్య సాహిత్యంతో పరిచయం ఉన్న వారికే – పరిమితమైపోయాయి. సామాన్య పాఠకునికి అవి కొరకరాని కొయ్యలు"** ( తెలుగు కవిత – ప్రస్తుత పరిస్థితి , కరణం బాలసుబ్రమణ్యం పిళ్లై, 'ఈమాట' వెబ్ మ్యాగజైన్)

**"వేగం వళ్లో కూర్చుని /వెనక్కి వెళ్లే/ బతుకు పరిమళాల్ని/ ఎట్లా పట్టుకోగలం?/ కంటినిండా అల్లుక్కుపోయిన/ దృశ్యాన్ని ఎలా చిత్రిక పట్టగలం?"** ( నగ్న పాదాలతో)

**"సాధారణంగా అధివాస్తవిక కవులు వచన కవిత్వాన్నే రాస్తారు. కానీ దానిలో సారూప్యత లేని (asymmetric) ఛందస్సొగసులు లేని ఒడిదుడుకుల లయకే ప్రాధాన్యతనిస్తారు"** – జెసి జగన్మోహన్ చారి, కవిత్వం– గతితార్కికత –అధి భౌతిక వైయక్తికత, సృజన– జూన్ 1991)

**"నాలుగు గోడల మధ్య/ శత్రు దేశాలు రహస్య ఒప్పందం చేసుకుంటాయి/ అనాధ శవం/ ఒంటరి దుఃఖాన్ని మోస్తూ/ స్మశానానికి ప్రయాణం అవుతుంది"** (విరుగుతున్న ప్రయాణం)

కొన్నిసార్లు చాలా దగ్గరతనంగా అనిపించి దూరంగా ఉంటాయి. ఈ రకమైన కవిత్వంలో పదాల అర్థం వెతకడం కంటే అర్థం చేసుకోవడం ప్రధానమైన అంశం. ఎలా మరి? ఒక నిధిని వెతకడానికి ఇవ్వబడిన క్లూస్ లా కవిత ఉంటుంది. ఇక్కడ పాఠకుడి శ్రమే ఎక్కువగా ఉంటుందనేది అబద్ధం కాదు.

**"శిరస్సు మీద విఫల/ దుఃఖం ఒకటి వేలాడుతూ వుంటుంది/ దింపుకోవడం అసాధ్యమైన చోట ఏదో /దింపుడు కల్లం ఆశ ఒకటి మొలుస్తుంది/ సందిగ్ధ వలయాలు చుట్టుముట్టి తప్పించుకోలేని/ ఒంటరితనాన్ని ఎక్కువపెడతాయి/ శవం/ స్నానం చేసిన నీటి చారికల్లో/ జ్ఞాపకాలు ఇంకిపోతాయి"** (సందిగ్ధ చిత్రం)

ఈ రకమైన కవిత్వంలో ఏముంటుంది? బహుశా ఊహలు, కలలు, భయాలు ఏమైనా కావచ్చు. దేనికి సంబంధించినదైనా అయి ఉండొచ్చు. ఒకదానితో ఒకటి పొంతన లేని పదాలు, ఆలోచనల సాహచర్యం ఇందులో ఉంటుంది. ఒక్కోసారి గొలుసు కట్టు రచనలా కూడా అనిపిస్తుంటుంది.

**"బాధలు మునగవు /తేలి తలమీద తడిచిన పత్తి బస్తా అయి కూర్చుంటాయి/ నిలువునా ముంచేస్తాయి/ ఉండుండి జేబుల్లో చేరి ఎక్కి ఏడుస్తాయి"** (చీకటి పూవు)

అధివాస్తవికత నిండి ఉన్న కవిత్వాన్ని అర్థం చేసుకోవడానికి కవిత్వంలోని మెటఫర్స్ ని, ఇమేజెస్ ని దొరక పట్టుకున్నప్పుడు కొంతలో కొంత ఆ కవిత్వాన్ని అర్థం చేసుకునే స్థాయి మనకు దక్కుతుంది.

**"బహుశా అతనొచ్చినప్పుడు/ నాలో నేను తగలబడుతూ/ దుఃఖపు తలగడ మీద నిద్రిస్తున్నానేమో"** (అతనే నేను)

సాధారణంగా కవిత్వం అనేది తక్షణ ప్రతిస్పందనగా పుడుతుందని చెప్తుంటారు. అయితే అధివాస్తవికతలో తక్షణ స్పందన మాత్రమే కనిపిస్తుంది అది ఏ సంఘటనకు, ఏ ఇతివృత్తానికి, ఏ వస్తువుకు సంబంధించినదో చెప్పటం కష్టమవుతుంది. అంటే వస్తువు ఏంటో తెలియదు స్పందన మాత్రం ఉంటుంది. పాఠకుడు వస్తువును దొరక పట్టుకోవడానికి స్పందనలపైనే ఆధారపడాల్సి వస్తుంది. అందుకే అధివాస్తవికతలో భావం అర్థం కావడం కూడా కష్టం అనిపిస్తుంటుంది.

**"పనితనం ఎక్కడో కొంత లోపించి/ చీకటి మరింత చిక్కబడి పోయిందని/ మాడి నుసిగా మారి నిశ్శబ్దంగా/ రాలుతుందని మథన పడకు"** (ఆశల్లో అద్దుకొని)


**"అన్ని రంగుల్ని మేసిన చీకట్లు/ శబ్దాలన్నింటినీ నిద్రపుచ్చుతాయి/ అర్ధరాత్రి దాటాక/ నిశ్చలకొలనులో కప్ప ఒకటి దూకుతుంది/ కలత వలయాలు చుట్టుముట్టి దాడి చేస్తాయి"** (గాయపడని నిశ్శబ్దం)


క్షుణ్ణంగా పరిశీలించినప్పుడు రెండు దిగంతాల నడుమ సన్నని వెలుగు రేఖలా వస్తువు అదృశ్యంగా ఉండి, వాస్తవికతకు బహుదూరపు ప్రతిబింబమే అధివాస్తవిక కవితగా రూపుదిద్దుకుంటుందనేది సత్య దూరం కాదని అనిపిస్తుంది. తీవ్రమైన మానసిక సంక్షోభం, భౌతిక ప్రపంచంలోని వివిధ సమాజాల ఒత్తిడులు, స్వేచ్ఛగా ప్రకటించుకోలేని కోరికలు, అనుభూతులు, అనుభవాలు ఉపచేతన స్థితి నుంచో, అచేతన స్థితి నుంచో పెల్లుబికినప్పుడు వైయక్తికతలోని అంతస్సారం అధివాస్తవిక కవితగా బయటపడుతుందేమో అనిపిస్తుంది. తుఫాను తర్వాతి ప్రశాంతత ఏదో అధివాస్తవిక కవులకు దొరుకుతుందనేది నిర్వివాదాంశం. అది ఒక నిట్టూర్పు కావచ్చు.


యాకూబ్ రెడ్డిని అధివాస్తవిక కవిగా స్థిరీకరించడం కాదు కానీ ఈ సందర్భంలో, ఈ కవిత్వంలో ఆ ఛాయలు మెండుగా ఉన్నాయని చెప్పడమే ప్రధాన ఉద్దేశ్యం. 90 శాతం మేరకు పాఠకుల ఊహలకు రెక్కలు ఇచ్చే కవిత్వం యిందులో కొంత పరుచుకుని వుందని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను. కవిగా యాకూబ్ రెడ్డి మరిన్ని మైలురాళ్లు దాటగలడని విశ్వసిస్తూ అభినందనలు.

❖ ❖ ❖ ❖ ❖


# స్వ'కృతి'








**హరే శ్రీనివాస**
డా. కె.వి.రమణాచారి
వెల : 150
ప్రతులకు: ఎమెస్కో బుక్స్ ప్రై.లి.
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ - 500029




సాహిత్యంలో సమాజం (వ్యాస సంపుటి)
డా.ఎన్.ఈశ్వర రెడ్డి
వెల : 150
ప్రతులకు: రచయిత
39/449-47 ఫ్లాట్.నం.102, బ్లాక్ - బి,
ఆర్.ఆర్.స్వగృహ, రోడ్.నం.14,
ఓంశాంతి నగర్, కడప - 516001



**నాలో నువ్వు (ముఖీలు-మనీ కవిత్వం)**
డా.ఎన్.ఈశ్వర రెడ్డి
వెల : 150
ప్రతులకు: రచయిత
39/449-47 ఫ్లాట్.నం.102, బ్లాక్ - బి,
ఆర్.ఆర్.స్వగృహ, రోడ్.నం.14,
ఓంశాంతి నగర్, కడప - 516001



**ఆంధ్ర దేశాధీశ్వర, ఆంధ్ర సురత్రాణ ముసునూరి కాపయ్య (ఓరుగల్లు కమ్మ ప్రభువు)**
యద్లపల్లి అమర్‌నాథ్
వెల : 250
నవోదయ బుక్ హౌజ్
ఫోన్: 04024652387




**ఆంధ్ర భూమండలాధ్యక్ష, ముసునూరి ప్రోలయ్య (రేకపల్లి కమ్మ ప్రభువు)**
యద్లపల్లి అమర్‌నాథ్
వెల : 250
నవోదయ బుక్ హౌజ్
ఫోన్: 04024652387


## చిరునామా

**మూసీ రచయితలకు, చందాదారులకు విజ్ఞప్తి.**


**చందాలు, రచనలు పంపాల్సిన చిరునామా**
**సంపాదకుడు, మూసీ మాసపత్రిక,**
**ఇం.నెం. 2-2-1109/బికె-ఎల్.ఐ.జి.10,**
**బతుకమ్మకుంట, బాగ్అంబర్‌పేట,**
**హైదరాబాద్-500013.**
**చందాలకు ఆన్‌లైన్ అకౌంట్**
**స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నల్లకుంట, హైదరాబాద్.**
**అకౌంట్ నెం. 52019740642**
**IFS Code : SBIN0020083**
**editormusi@gmail.com**



**ధూర్జటి లింగరాజ కవి ప్రణీత శ్రీకాళహస్తిస్థల మాహాత్మ్యము అను పెద్దకాళహస్తి మహాత్మ్యము**
పరిష్కర్త : విద్వాన్ లగడపాటి భాస్కర్
వెల : 290
ప్రతులకు: విద్వాన్ అట్ల పురుషోత్తం గౌడ్
5-120, ముత్యాలమ్మ గుడివీధి,
శ్రీకాళహస్తి, తిరుపతి - 517644
ఫోన్: 9703062502



**నీరాజనం (బిరుదురాజు రామరాజు శతజయంత్యుత్సవ స్మారక సంచిక)**
సంపా: టి. ఉదయవర్లు, తిరునగరి దేవకీదేవి
వెల : 400
ప్రతులకు:
శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం
4-4-8, సుల్తాన్‌బజార్,
హైదరాబాద్- 500001
ఫోన్: 9885686415



**విజ్ఞాన సర్వస్వ రూపశిల్పి కొమర్రాజు లక్ష్మణరావు**
ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, డా. గుమ్మా సాంబశివరావు
వెల : 200
ప్రతులకు: ప్రొఫెసర్ కొమర్రాజు రవి, విశాఖపట్నం.సెల్ : 98493 16806

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక సంపుటి -28 : సంచిక - 8 62 హైదరాబాద్ జూన్ : 2025

# విజయమో! వీర స్వర్గమో..!

డా. గన్నోజు శ్రీనివాసాచార్య
ఫోన్ : 8555899493




భరతమాత ముద్దుబిడ్డ
నుదుటి బొట్టు నేలరాలిన
వేళ సింధూరమే
బందూకులై
దద్దరిల్లె ఉగ్రవాదుల
పైన విరుచుకు
పడకుంటుందా...

విజయమందెంత...
భరత సేనకు...?

ఎప్పుడు దొంగనాటకాలు
ఎందుకు మీకింత ఉగ్రవాద దోబూచులాటలు..?

ఓడిపోతామని తెలిసి
నేలవిడిచి సాముచేయనేల?
ప్రక్కదేశాల దౌత్యంతో
పారిపోవుటేల?




యుద్ధాలను ఏ దేశం
కోరుకోదు విజ్ఞతయే గొప్ప!
ఉగ్రవాదానికి ఊతమిచ్చి
బంకర్ లో దాగుటేల?

లేనిపోని నిందలేమో లెస్స
రణ రంగమందు పాక్ తుస్సా...
ఉగ్రవాదకొండ చిలువను
నిద్రలేపె మీ ప్రభుతను
మ్రింగకుంటుందా..?

విజయమో వీరస్వర్గమో
భరత సైనికుల మరణం
ఎంతమంది తల్లుల
కడుపుకోత..కన్నీటి గాథ!

ఒదువని ఉగ్రవాదానికి
చెల్లుచీటి జవాబివ్వగలదు
నా దేశం...
మానుకోండీ! మానుకోండీ!
దుష్కరులార!
దుర్మతులైన వేట!
లేకుంటే చస్తారు
చూస్తారు నరకాల బాట...!?

# SISTER NIVEDITA SCHOOL

Estd:1989

**THE PLAY SCHOOL**®

Kindergarten Wing of SNS

**Nursery, LKG & UKG**

## CBSE - Senior Secondary School

**Affiliation Code: 3630040**

## AMEERPET, HYDERABAD.



**We are known for:**

- Innovative teaching pedagogies.
  - Teachers as facilitators.
  - A good conducive classroom atmosphere.
  - Participation in all the interschool and cluster competitions.
- Well-equipped Laboratories for Physics, Biology, Chemistry, Math & Computer Science.
  - Equal emphasis on both scholastic and co-scholastic aspects of education.
- Imbibing core values & morals in the process of character building.
  - Sports – a prime focus of the school.
  - Field trip & picnics
- Interesting activities to make teaching-learning process joyful, and engaging.

**for classes I to XII**

36 GLORIOUS YEARS



**We have commenced with IIT/NEET coaching classes for class VI to class XII, going to be dealt by well trained teachers of the school.**



### COMMERCE STREAM

**Compulsory subjects**

**BEA, MEA & English**

**Additional Subjects:**

Marketing or PHE or NCC or Painting



### SCIENCE STREAM

**Compulsory subjects**

**MBiPC, MPC, BiPC & English**

**Additional Subjects:**

PHE or NCC or Painting

"Your Child Deserves
**The Best Education"**

***Learn, grow and thrive with caring educators***

- Nurtured by dedicated staff
- Play - Based learning
- Happy and joyful classes
- Creative corner
- Imbibe moral values
- Holistic development



**Contact Us for more Info:**

**80967 38855**

**VISIT OFFICE FOR ADMISSION**

***For your Child's Bright Future...***

**www.snschool.com**

Scanned with OKEN Scanner